1

కవిరాజ శ్రీ మహాకవి

మండపాక చిన జోగిరాజు విరచిత

శ్రీమదాంధ్ర మహాభారతము

శాంతి పర్వము



షష్ఠమ సంపుటము

కవిరాజ శ్రీ మహాకవి మండపాక చిన జోగిరాజు

విరచిత

శ్రీమదాంధ్ర మహాభారతము

శాంతి పర్వము



షష్ఠమ సంపుటము

శ్రీమదాంధ్ర మహాభారతము

శాంతి పర్వము

షష్ఠమ సంపుటము	:	సెప్టెంబర్ 2024
ప్రతులు	:	100
మూల్యం	:	రూ. 300

ISBN :

డి.టి.పి : యం. అచ్యుతాంబ

ప్రతులకు : **మండపాక చిన జోగిరాజు**
డోర్‌నెం. 3–33, గోపాలకృష్ణ అపార్ట్‌మెంట్స్,
కుకట్‌పల్లి, హైదరాబాద్ – 500072
సెల్ : 83746 31142 , 86885 53902
మెయిల్ : mcjraju@gmail.com

ముద్రణ :

విషయసూచిక

శాంతి పర్వ – ప్రధమాశ్వాసము

శాంతి పర్వ – ద్వితీయాశ్వాసము

శాంతి పర్వ – తృతీయాశ్వాసము

శాంతి పర్వ – చతుర్థాశ్వాసము

శాంతి పర్వ – పంచమాశ్వాసము

శాంతి పర్వ – షష్ఠాశ్వాసము

శ్రీమదాంధ్ర మహాభారతము

శాంతి పర్వ – ప్రధమాశ్వాసము

శ్రీ గిరి వాసా దేవా!

రాగద కృపతోడ మమ్ము రక్షించుటకై

మా గురు దైవము నీవే

వేగం దరి చేర్చు కొనుమ వేదోద్ధారా!

మహర్షులు పాండవులను చూడ వచ్చుట

వ. దేవా! వైశంపాయనముని జనమేజయునకిట్లను, అట్లు సకల జనంబులతోడను, మృతులైన వారల లెల్లరకు తిలోదక తర్పణల్చిన వెనుక పాండవులు తల్లికుంతి తోడను, ధృతరాష్ట్ర గాంధారీ పరివారపరివృతుడై ఒకపట కుటీరమ్మున మాసమాత్రమునకై విడియ నచటకు వ్యాస,దేవల, కణ్వ, నారదాది దేవమునులు శిష్యసమేతమ్ముగా ధర్మనందను ధర్శనార్థమురాగాంచి పాండు నందనులు ప్రత్యుస్థాన ప్రణామ కాలోచిత సత్కారముల పూజించిన వారలగుటయు, ప్రీతి నొందిన అమ్మహాత్ములు శ్రీకృష్ణపరమాత్మతో కూడియున్న ధర్మరాజాదులను బహువిధ ప్రియోక్తియుక్తమ్ముగా సంభాషించిన వారలగుటయు, నారదమహర్షి అక్కొంతేయాగ్రజుని తోడం అమ్మహా ద్విజులం గలయం కనుంగొని కుశల ప్రశ్నలగు మాటలం గారవించి అమ్మహీపతి ఆననం బాలోకించి–

తే. ఆదినుండియు గోవిందు డాప్తి జూప
అనిన భీముండు పార్థుడా ఆశ్వినులును
మొక్కమోవని నీవును ఉక్కు మిగిలి
కౌర వానీక బలగాల కాల రాచి

తే. భీష్మ ద్రోణాది కురువీరు భీష్ణ మడచి
కర్ణ సైంధవు శకునుల గర్వ ముడిపి
సర్వ సామ్రాజ్యముం గొంట్వి సమరభూమి
ధర్మ దేవత నీతోడ తరలి రావ

వ. అనిన వానికి కౌంతేయాగ్రజుండు యిట్లను, ఆది నుండియు మా బావ –

తే. వాసుదేవుని కృపయెప్డు వరదపార
బ్రహ్మవేత్తలు మీవంటి బ్రహ్మవిదుల
ఆదరభిమాన దీవెనల్ అభిమతార్థ
మిట్టులుంటిమి శుభులమై జెట్టులగుజు

వ. అయినను సర్వ జన క్షయమును మా పార్థ భీమానుజుల మించిన అనుంగుబిడ్డలు. వీర ఘుటోత్కచ అభిమన్యు ద్రౌపదేయులను తాత భీష్మని గురుద్రోణులను గోల్పోయిన వారమగ టయు అజేయమ్మనియే మనమున వ్యధ కన్పించుచున్న దనుట మరియు –

ఉ. వారణ జేయనా అనిన వాసవు నందను సర్వసేనలన్
కారణ జన్మ డీతడని కౌరవ నేతకు ఆప్తమిత్రుడున్
సూర్యుని అంశ కర్ణుడని సోదరుడాద్యుడు మాకు నంద్రకుం
నేరరు యెవ్వరీ నిజము నిక్కము. తర్పణలిందు అన్నకున్

వ. అని అమ్మ పల్కి ఆ రాధాసుతుడు కర్ణుడు తనకు ఎట్లు ఉద్భవించినదియు యెరిగించి ద్రోణ వధానంతరము తానాతనివద్దకు వెళ్లి నీవు నాతనయుండవేనని పల్కుటయును, దానికి ఆతండు కినిసి ఆత్మ వ్యధ నొందుచు యీసత్యమును తాను బ్రతికియున్నంత కాలము యెవ్వ రికిని యెట్టి పరిస్థితులలోను తెలుప వద్దనుటయు నీ పుత్రులు ఐదుగురే అని పల్కు మనుట యునుమరియు ఆతడు ఆ దుర్యోధనునకు ఆడితప్పిన కృతఘ్నుడ కాలేననియు, విధికృతము తప్పదనియు పల్కుటయును –

తే. తొల్లి దాచితి భీతనై తొలగ పాడి
దాచి యుంచితి నీ దన్క దలచి వాని
వినుప నైతిని పాపాన విధివశాన
యింత చేటగు నంచని యెంచనైతి

వ. అని మనసు విచ్చి మాటాడుటయును వినిపించి, జూద సమయమ్మున వారాడిన

మాటలు పాంచాలిపట్ల వా రాచరించిన అకృత్య ప్రతాపనా వ్యధయును, ఆదినుండియు కౌర వులు మాపట్ల వర్తించిన దోర్దర్ప దుర హంకార దుర్నీతి దుష్ట కృత్యముల వలన మేము వారి తో యీ యుద్ధమునకు సిద్ధపడితి మనియు, క్షాత్రవతు ఆడిన మాట నిలువరించుకొనుటకే మా వాయునందనుడు దుశ్శాసన దుర్యోధనుల ఆవిధముగా పరిభవించుటయులేకున్న ఇంత చేటు వాటిల్లి యుండెడిది కాదనుచు మునీంద్రా! తమకు దెలియరానిది లేదు. ఏకారణమున కర్ణుని రథ చక్రము నేల గ్రుంగుట జరిగినది తెలుపుడని వేడుకొనుటయు నారదుం డప్పుడా ధర్మరాజుతో–

నారదుడు కర్ణుని చరిత్రమును ధర్మరాజుతో పల్కుట

సీ. మునివర మంత్రణ మోదిత కుంతియ
 జలకమ్ము లాడుచు చపల చిత్త
మనమున మంత్రణ మాచరించియు నర్కు
 నిను బోలు గుణవంతు నిమ్ము నాకు
అనునంత భానుండు అగుపడి యెదుటన్
 యిదె గొను బిడ్డనిం యిచ్చి నగుచు
వదలకుమీ నట్టేట్పరువది కాపాడ్కొ
 కన్నియ కొక ఊహ గరపినంత

ఆ. మనసు రాయి జేస్కు మమతయు వీడియుం
నీట దేల నౌగ నిడియె బిడ్డ
రాధ తీసి బెంచె రాజిల్ల నెంతయుం
కవచ కుండ్ల ధారు కర్ణనాము

ఆ. గరచె విద్య లెన్నొ గారవమ్మున భక్తి
శస్త్రాస్త్ర యుద్ధ చతుర నీతి

రాచ బిడ్డతోడ రాజాజ్ఞ భీష్ముల

సూతపుత్రు డనగ శూరు డగుచు

తే. విద్య లన్నింట పెంపెక్కి వెల్గె చాల

కురుల సేనకు నేతయౌ కోర్కె తోడ

తగిన వీరుండు శూరుండు తానె యౌగ

పార్థు సరిరాగ మేటియై పరిఢవిల్ల

వ. పుడమి పాలించు రారాజు కులజులంచు మిమ్ము మీ విద్యా పాటవమ్ముల నెంచుచు, జనులెల్ల మిమ్ము పెద్దపల్కుటకు కినియుచు మనసు నందాసూతపుత్రుడు వగగొనుచునుండు, "విద్యా నైవ స్పర్థ యేవచ" అన్నట్లు మీయందు విద్యలతోపాటు స్పర్థ గూడ వహించి యున్న వాడతడు. కావున గురువులగు కుంభసంభవుల వద్దకేగి యేకాంతమ్మున తనకుబ్రహ్మాస్త్ర విద్య ను సాంగోపాంగముగా దెల్పవేడుటయును, సర్వ శిష్య సమానుండునైన ద్రోణుండు యిట్లనె-

క. నియత తపోధన నృపుడును

నయవిదుడౌ బ్రహ్మకులుడు నర్హులు అనుచున్

నయవిద సూతుని బిడ్డవు

నియమాతిక్రమణ గాదె నీకుం దెలుపన్

వ. తగదని పల్కిన యెట్లైనను బ్రహ్మాస్త్రవిద్యను బడయ నెంచినవాడై, మహేంద్ర మహీధర మ్మునకరిగి పరశురాముం గాంచి నమస్కరించి, బ్రాహ్మణుండ భృగువంశ జాతుండ ననిపల్కి, అస్త్ర విద్యాపేక్ష వచ్చినాడనని పల్కుటయు, వాని వినయవివేకమునకు ప్రీతుండై నమ్మి సమస్త అస్త్ర విద్యలం గరపుచుండుటయును, నొక్కెడ రాధేయుం డడవిని -

క. బాణ పరిశ్రమ జేయుడు

బాణం బొక్కటి ముని సుతు బాధిల జేయన్

పాణిం జలకము లిడుచును

రాణించదు నీదు విద్య రణవిధు లందున్

వ. అని శాపమ్మిచ్చిన కతమున, మరియు నొక సందర్భమున బడలికతో –

క. శిరమిడి యూరువు నందున
గురుడు పరుండ నొక కీట్కి కొరుకగ యూరున్
విరివిగ రక్తము గారిన
తిరముగ నున్నట్టి శిష్యు ధీరత యెంచిన్

క. బ్రాహ్మణుడ కావు నిజ మ
బ్రహ్మణ్యుడ వంచు కోప భరమున పలికెన్
బ్రహ్మణ్యుడ నంచు బలికి
బ్రహ్మత్వము నెరుగవైతి పాతకి వౌచున్

వ. నీ గరచిన అస్త్ర విద్య లన్నియు అవసరమునకు పనికిరాకుండ పోవుగాక అని శపించు టయును –

క. తరలియు నట దుర్యోధను
సరి సముడై మెలగు టదియ సహచరు డగుచున్
తిరముగ పార్థుని దలచుచు
అరివీరుడ నీదు సేన్ల నన్నిటి గూల్చిన్

క. విజయుని కెదురై పోరుచు
విజయము సాధించు వేడ్క విక్రము డగుచున్
నిజమది దాచిన వాడుగ
అజయుండై మడిసె ననిన అయ్యో విధులన్

వ. విప్ర జామదగ్నుల శాపముల వలనను అమరేంద్రునిచే వంచన బడికవచకుండలములు గోల్పోవుట వలనను మీయమ్మకు మాటయిచ్చిన కారణముగాను పార్థుసుతుని అన్యాయముగా వధించిన కారణముగా అర్జునునిబాణాలకు ఆహుతి యైన వాడని దెల్పుటయును, మరియు భూదేవి శాపము వలనను –

క. కాకున్న నరుడు నీవును
ఆకులపాటు వలె వాని అస్త్రాల్వరుసన్
ఏకం బైనను వాసవు
దిక్పాలుర తోడ గూడి తెర్లరె తృటిలోన్

వ. అని పల్క వెక్కస పడుచు నన్నరేంద్రుండు కంటతడిబెట్టుట జూచినకుంతియ తనుసత్యము జెప్పక దాచియుంచుటది నాతప్పిదమన, అమ్మమాటల కియ్యకొనక మనమ్మునఆగ్రహోదగ్రుడై-

స్త్రీలకు రహస్య గోపనశక్తి లేకుండ ధర్మరాజు శపియించుట

క. అమ్మరొ ఐనది యింతయు
నెమ్మది లేకుండ జేస్తి నేరము కాదో?
కొమ్మల నోటియ మాటలు
గ్రుమ్మరి వెలువడక యుంట కూడదు అనుచున్

వ. శపియించె నా ధర్మనందనుడు, నాయీమాట ముల్లోకముల జెల్లుననుచు, కుంతిచేసిన రహస్య గోపనమున యింత ప్రాణ నష్టము స్వజనకోటి మృతు లగుటయును నెంచి, అయ్యై వారలకు నెల్లరకును పితృలోక ప్రాప్తికై శాంతిక్రియలు నిర్వర్తిల్ల జేయించి తమ్ముల మొగంబై యిట్లను.

క. వలదీ రాజ్యము గీజ్యము
తలచిన మది దుఃఖ భాజ్న ధర్మం బనుచున్
అలనా యడవుల లోనన
వలనొప్పగ తపసులంటి పరహిత బుద్ధిన్

క. గడపుట లెస్సగు పని యని
విడమర్చియు రాజరికత వివశుం డగుచున్

కడు పాపుల మంచు పలికి

వడి యేగుదమంచు బల్క వసుధా ధిపుతోన్

వ. ఆ తమ్ములందరును ఒక్కమాటగా లేచి నిలువంబడి –

క. అన్నా! సన్నుతమూర్తీ!

ఎన్నడు నీ మాట దాటి యెరుగము కాదే?

ఎన్నో యిడుమల నోర్చుచు

మన్నించుటె మాకు నీకు మాధవు నాజ్ఞన్

అర్జునుండు ధర్మజునకు దుఃఖోపశమనమ్ముగా పల్కుట

క. రాజోచిత వీరావని

విజయము చేకూర్చు కిటుల విలపించుటయా!

భూజన పాలన రాజస

భాజనమై క్షత్రియులకు వరవిడి యగుటన్

సీ. ధర్మమ్ము దప్పకీ ధరణి బాలింపుమా!

దివిజేంద్రునకు సాటి దీప్తి వెలుగ

ధర్మమ్ము దప్పని ధర్మ యుద్ధము నందు

దుష్టత దునుమాడి పుష్టిగూర్చి

అడవుల బడ్డట్టి అగచాట్లు మదినెంచ్క

శుభ సౌమ్యతల్ యెంచి సురలు పొగడ

పాపంబు పోవిడ బ్రహ్మవేత్తల గూడి

యజ్ఞ యాగాల్సల్పి యలమి గూర్ప

తే. ధర్మపరు డంచు పల్కనా ధరణి జనులు

విజయ దుందుభు లెగయంగ వీర తొప్పి

పాలనం బది గొనుటయే భద్రగతుల
శాంతి గూర్చుకు మనుటయే సమ్మతమ్ము

తే. కలిమి చెలువము గూర్చుగా కాల గతుల
కలిమి జేకూర్చు జుట్టాల కామ్యకలన
కలిమి శౌర్యము ధైర్యము కలుగజేయు
కలిమి ధర్మార్థ కామాల కాకరమ్ము

వ. కలిమి పురుషునకు చతుర్విధపురుషార్థములను కలిగించును. పురుషుడు కలిమినార్జించుట పరమధర్మము. కలిమి లేనినాడు కారడవుల నుండుటయే ధర్మము.

తే. ధర్మ విదుడను పేరొందె ధర్మరాజు
సత్యధర్మాల పాలించు సత్వ గుణుడు
శాంతి దాంతులు నెలకొల్పు సాదువాది
అన్న పేరది నిల్పుమా అన్న కావ

వ. అంతియేకాని గతమునుస్మరించుచు శాంతివేదనం మనమ్మున మరలఅడవులకేగి ముక్కుమూసుకొని ముని వృత్తి నవలంబించమనుట నీయట్టి ధీరునకు ధర్మమూర్తికి తగదు. నీయట్టి ధర్మనందనుడు ధర్మముదప్పని రాజ్యపాలనము రామరాజ్యమై వర్ధిల్లగలదని ఇహజనములును పరదేవతలును ఆకాంక్షించుట వినవె.

తే. అనిన దానికి ధర్మజానుజు డపుడు
రాజ్యపాలన కిల్బిష రాజసమ్ము
ఉంఛ వృత్తిన జీవించు టుచిత మనుట
ధర్మ సమ్మతమౌనె యో ధర్మరాజ

వ. అనియు మరియు

తే. ఏటి పాపమ్ము నీ నోట యిట్లు వినుట
క్షాత్ర మేమయ్యె విక్రాంత క్షతియుండ

అన్ని పనులకు మేముండ అండగాను
యేల నిట్లాడ మది నెంతొ బేలవౌచు

వ. అనుటయు ఆతనికి తోడుగా అనిల సుతుండప్పుడన్న ధర్మరాజుతో యిట్లను.

ఉ. అడలుచు యేల నీవిటుల అందరు ముండగ రాజ్యభారముం
కడగొన బేలదౌదిటుల కార్యము దీర్పను కాదనంచిటుల్
చిడిముడి మాటలాడుటిది చంచలమానస భావనోద్ధతిం
దడగొని పారజూచుటిది ధార్మిక పద్ధతికాదు ధర్మజా!

క. నినుకాదని మమ్మిటనుం
డని చెప్పగ దలచువాడ వగుదో చెపుమా
మనుగడ మాకే వదలియు
మనుజాధిప ధర్మరాజ! మానుము యిటులన్

క. రాజుగ జూడం నిన్నున్
రాజులు దుర్యోధనాద్ల రణమున గెలిచిన్
రాజరికము నాకొద్దని
భూజనముల కెట్లు చెపుదు పోదల చెటకో

క. ఈనగను గాచి నక్కల
పీనుగు పాల్జేయ నగుట బీదల జనులన్
మానిత ధర్మాత్ము డవని
ఈనాటికి దెలియనగుచు యీగతి పలికిన్

క. పుట్టినదెల్ల లయంబగు
నెట్టుననుచు ఆ విధాత నేరడె బ్రతుకన్
అట్లే మనమును కాలము
నెట్టుకు గడతేర నవును నియతిన బతికిన్

క. అందరు అడవుల కేగిన
వందురు లగుచును ముక్తి మార్గులు అగుచున్
ఎందులకీ రాజ్యమ్ములు
బంధమ్ములు కావ్యకర్మ బహువిధ భవముల్

తే. వినవె వేదమ్ము పలికిన విధము దెలియ
ధరను బుట్టిన మనుజుండు ధర్మమెరిగి
ధర్మ మర్థమ్ము కామ్యమ్ము దగిలి బుద్ధి
మోక్ష మావల గొనగను మోదమలర

వ. అంతియేకాని సత్యధర్మ నిష్టాపరతంత్ర విభవులైన పాండుభూపాల తనయువై ధర్మబుద్ధిం దగు లుమాని యిప్పుడేవిధముగా మాట్లాడిన వంశమునకే తలవంపుగాదె. అడవులబడి కష్టము లనుభవిం చునాడు విభవము గూర్చుకు బ్రతికెదమంచు పల్కలేదె? మాకు నీ వడవుల కేగిన మేమిక్కడ నుండగ లమా? ఆలోచించి ధర్మమార్గ బద్ధుడవై దండమును బట్టి రాజ్యమ్ము యేలవలదె. మన వలెనే అనేక యిడుమలం బడి మరల రాజ్యములం బడసి తొల్లి హరిశ్చంద్రుడు, నలుడు మొదలగు వారనేకులు రాజ్యము లేలి ధర్మమ్మును పరిపాలింపలేదా మరియు నహషుడు నృగ దిలీపులాదులెంద రెందరు పా లనా భారమున కోర్చి ధర్మ పాలనము చేయలేదు. నీవును అట్లే రాజ్యవిభవుండవై ధర్మమును పాలిం పుము. ధర్మపాలన క్షత్రియధర్మము. శమదమాదులు అవనిసురుల ధర్మము. నీవెరుగని ధర్మమ లేదన.

తే. వినుము వేదము ధర్మమ్ము విముఖ మాని
గొనుము దండమ్ము ధర్మాన్కి గొడుగు పట్టి
ధర్మ రాజువు నీవౌచు ధరణి నేలు
శాంతి దాంతులు నిల్పుమా సర్వ జగతి

నకుల సహదేవులిర్వురును ధర్మరాజుతో పల్కిన పల్కులు

తే. అన్న లన్నది బాగుంది ననుచు బల్కి
నకుల సహదేవు లన్నతో ననిరి యిట్లు

రాజు రాజ్యమ్ము చేయుటే రక్ష జనికి
వేర అవినీతి ప్రజలు వినగ శ్రుతులు

తే. నెమ్మి గొనుమయ్య అన్నయ్య నియతు వగుచు
ధరణి పాలన చేబూను ధర్మ బుద్ధి
భారతావని కీర్తిల్ల బరగ నెంచి
మాకు హాయిని గూర్చుమా మానవేంద్ర

తే. నీకు దెల్పెడు వారమా నిజము దెలియు
ధర్మ బిడ్డవు మాతోడ ధరణి బుట్టి
సర్వ ధర్మజ్ఞ శాస్త్రార్థ సార విదుడ
నిన్ను గోరియు నున్నారు నిజము జనులు

వ. అగుచు తమ్ములందరు పలుకనా ధర్మవిదుడు మౌనియై ఆలించి మనసునందు పలుక కుండుట గమనించి పైట కొంగును సవరించ్కు పడతి ద్రుపద తనయ. అనురాగ ముట్టిపడ నాయెరింగినది దెల్పు దనుజ్ఞ యిండని అతని జూడ, సన్న గైకొన్న యావిభు సజ్జకేగి, నగు మొగమ్మున చంద్రుండు నాట్యమాడ.

ద్రుపదరాజ నందన ధర్మరాజుతో పల్కిన పల్కులు

తే. శూర వీరప్రతాపాగ్ని చూపకింత
జరుప నెంచిరి నీమాట జగతి పర్వ
ఆకలలములు దిన్ననా యడవు లందు
యెన్ని యిడుములు పడ్డామొ యెరిగి గూడ

తే. ఇప్పుడీ విది పలుకంగ యింద రిటుల
ఒక్క మాటైన పల్కిరా నిక్కమరయ
ధరణి రాజ్యమ్ము కాల్దన్ని తలగ వనికి
యింత కంటెను ధర్మమ్ము నెందునుండు

తే. ధర్మరాజన్న మాట నా తలకు వంపు
గూర్చ నుండన్నె యుండ నా గుండె మండ
తోడ నడచితి యిన్నాళ్లు దోసమనక
ఆలకింపుడు నా మాట ఆజ్ఞ గాగ

తే. మంచికాలమ్ము వచ్చునం బెంచి బల్కి
యిపుడు రాజ్యమ్ము వలదన్న యెట్టులగును
ముక్కు మూసుకు కూర్చున్న మోక్షమగునే
ఆలి ననుజుల విడనాడి అడవికేగ

తే. క్షాత్ర దర్మము పాటించి క్షత్రియుండు
అవని ధర్మమ్ము పాలింప నౌను శాంతి
వీర జన్మలు ముల్లోక వీరులనుజ
ఎన్నడైనను యెదురాడ నెరుగనైరె

వ. మాయందరి మనస్సులను దెల్సిన వారలు రాజ్యము వీరభోజ్యము. రాజ్యమును ధర్మ స్థితికి కాకుండ విడనాడుట క్షత్రియోచిత వీరధర్మముకాదు. వీరమున క్షాత్రమునగెల్చిన రాజ్యమును నిర్వీర్యము జేయుట పాడిగాదు. యేలిక ధర్మజ్ఞుడైన యెలమిగూరు అని వినయవినమితగాత్రమై విశద పలికి –

తే. తప్పు చేసిన దండింప దగును కాదె
నిప్పుని దలంచ్క దురితులై నీల్గనౌచు
మట్టి గలసిరి దుర్మార్గు అట్టి విధము
ఒప్పు కొందువ పాలింప నొప్ప ధరణి

వ. కావున తపోవనముల మాటమరచి దురిత దండమ్ముచే పట్టి ధర్మపాలన జేయ గడంగుమనుటయు –

తే. ధర్మ దండన విధిరాజు ధరణి నేల
సర్వ ప్రాణులు శాంతులై సమతవృత్తి
దుర్వినీతికి పోకుండ దోషమెరిగి?
మంచి నెంచుచు మదిలోన మసలగలరు

వ. నీయట్టి ధర్మపరుడు రాజై రాజ్యమ్ము చేయనైన. ప్రజలు –

తే. ఈతి బాధకు గురిగాక యిష్టలగుచు
పాడిపంటలు ప్రగతిమై పరిఢవిల్లి
శాంతి దాంతులు సమకూరి సర్వజనులు
వర్ణ సంకర్ణ గాకుండ వరలు ధాత్రి

వ. అనిన ఆ పాంచాలి మాటలకు మారు మాటాడక యున్న అన్న యా ధర్మనందనునకు మరల సురేంద్ర నందనుం డిట్లనియె.

తే. దక్షులగుచును నీయట్టి ధరణి పతులు
రాజ్యమేలక యున్న నరాజకంబె
వంచ్న జేతురు చెలరేగి బాధలొలయ
హింస లొన గూర్రు లిష్టార్థ మిష్టలగుచు

వ. వర్ణ వృత్తులు, వ్యాపార వాణిజ్య సంపదలు, ధర్మమును వీడి బీదసాదలయిక్కట్లు వృద్ది యగును. మంచి నెంచెడు వారు అరుదై ధర్మ మడుగంటును హింస రేగును. అహంకారులై జనులు హెచ్చు రేగుచుంద్రు. వర్ణ వ్యవస్థలు అడుగంటును. అవినీతి, అక్రమము, అసత్యము తాండవించును. ఇట్టి దుర్గతిని భూదేవి భరింపజాలదు మరల మరల యుద్ధములు వచ్చుచు నే యుండును.

క. ఒనగూడిన సామ్రాజ్యము
వినయంబున యేలవలయు విజ్ఞతతోడన్

జనములు యోహోయనగా

కనివిని దివిజనులు గూడ ఘనుడని పొగడన్

వ. రాజు ఐనవాడు మంత్రుల సాయమున ధనబలమును జనబలమును గూర్చుకొనుచు అందరకును యెక్కుడై –

క. ధనమును ఆర్జింపవలయు

జనముల బాధించకుండ జాగృతి పరతన్

ధనమది లేనట్టియపుడు

అనువౌచును దిరుగుబాటు లగుదురు జనముల్

వ. జనములవద్ద వారిజీవనమునకు వలయు ధనసంపదల కెక్కుడుగా ధనముండరాదు. అట్లుండిన నాడు రాజధిక్కారము, అవినీతి, అక్రమము వాటిల్లి సంక్షోభము వాటిల్లనగును.

క. ధనమధికము గాకుండగ

జన జీవన ముడుపనౌగ జాగృతి పరతన్

అనయము వీక్షించుకొనుచు

ధనగారము నింపుకొనుచు దానము విడుచున్

వ. జనముల పాలింపవలయు జాలగ దలచిన్.

క. శ్రమజీవుల గతు లరయుచు

మమ యనుచును వారి దిక్కు మనసున గనుచున్

గమనింపుచు దుర్మార్గుల

సమయముగని శిష్ట రక్ష సలుపగ వలయున్

వ. అనినవానికి ధర్మనందనుం డిట్లను –

క. ధనమద గర్వుల నణచను

మనవారల ననుచు వేర మత్సరబుద్ధిన్

మనసున సమతది లేకను

వినుమా యీరాజ్యమేల విముఖత వొడమెన్

క. వినుమా జనకుని విధమది

అనుదినమును ఉంఛ వృత్తి ఆత్మోన్నతుడై

మనమున దలచడె శ్రీహరి

తనుగా ముముక్షు వౌచు ధార్మిక వృత్తిన్

వ. అనిన ధర్మజునకు ఆ ఇంద్ర నందనుండు వినుమని ఆ జనకుడు –

జనక సతిపతీ సంవాదనము నెరింగించుట

సీ. సంసార వృత్తులు సకలంబు విడనాడి

ఉంఛవృత్తిన దాను ఉండుకతన

అతిథి అభ్యాగతుల్ ఆయింటి కాయంచు

మారు మాట్లాడక మసలునగుట

రారాజ మర్యాద రమ్యత విడనాడ్చు

జనులెల్ల జనకుని జడుడు అగుట

పేద సాదల కెల్ల పెన్నిధానుడు అన్న

మాట మాయంబగుట మనుజులందు

తే. కరము జూచెడు వారు నీ కడకు రాక

దాన మడిగెడు వారెల్ల తగల నగుట

దీన సంతర్పణావిధి స్థితు లడంగె

దేవ పితౄణ కార్యాలు దీన తొంద

వ. పతియొద్ద కేగి ఆ జనకుసతి మీ తల్లి గారి వేదన యేమని దెల్పను వినుండని –

క. సన్యాసి ఆయె సుతుడిది

అన్యాయము కాదొ రాజ్కు అనుచుం మదిలో

మున్యాశ్రమ మంటిన యీ
అన్యాయము నీది కాద అని నన్నడిగెన్

క. ఇది ధర్మ నిరోధము, విన
మది దలపం బాధపుట్టు మనువేర్పాట్కున్
గుది వీడెడు నంచెరుగుము
మది నెంచుమ కీడు వొడము మాన్పవె యనుటన్

వ. మీరు చేయుపనికి నా తప్పిదమేయని నిందగాపల్కుట భరించలేను. మరియు నాకాపు రమునకే చేటని అత్తగారు నా మంచినే గోరుచు పల్కెడు వారిట్లుపలుకుట నాకెంతోభయము గానున్నది. మరియును వేదములు సహితము స్త్రీ కేంద్రమైన గృహస్త్రాశమ వ్యవస్థకే యెక్కుడు ప్రాధాన్యమిచ్చుచున్నవి. గృహస్థులు లేని వ్యవస్థ సృష్టికే విరుద్ధము. గృహస్థుల వలననే వేదా ధ్యయన అగ్నిహెూత్రములు సజీవముగా యుండుచున్నవి. గృహస్థుడు అనాధలకును,సన్యాసు లకును ఆశ్రయ మీయగలడు. గృహస్థుడైన రాజే సర్వ ధర్మములకు ఆకరము. కావున మీరు మీ యీసన్యాసాశ్రమ ఉంఛవృత్తి విధానములకు తావీయకుండా క్షత్రియోచిత ధర్మబద్ధముగా ప్రజా పాలనము గావించుడని ప్రార్థించినది కదా? వినలేదాయని అర్జునుండు ధర్మరాజుతో సవినయముగా పల్కి ప్రార్థించుటయు ను –

క. శ్రుతి వినిపించును ధర్మము
అతి నిష్క్రియతయును ముక్తి కాదని దెలుపున్
మతిమంతులు నిష్క్రియులయి
ధృతి మీరుచు యెక్కుడైన దోసంబనుచున్

వ. పల్కిన వానికి ధర్మనందనుం డిట్లను–

క. శమదమ ధర్మార్జనములు
అమలంబని శాస్త్రవిదులు ఆద్యులు పలుకన్
మమయను ముక్తి పదార్థము

విమల త్యాగత్వ బుద్ధి వినమే పొందన్

వ. అనగా విని అట నున్న –

దేవస్థానుండనుముని అ ధర్మజునితో యిట్లను

క. ధనమది మూలము జగతికి

ధనంజయుని మాట వినుట తథ్యం బనుచున్

మనమున శంకలు బోవకు

మనపెద్దలు జనిన మార్గ మనుసంధించిన్

క. ఇహపర సాధన యుక్తులు

మహినేలిన రాజమార్గ మవలంబించన్

ఇహమున తుష్టిగ పుష్టిగ

అహమును వీడంగ జనిన అదియే (పరమౌ) ముక్తౌ

క. ధనమును రాజ్యము ధర్మా

ర్జన పరువై నేలుము భువి రణమున గెలిచిన్

వినుతింపం ముజ్జగనులు

అనునయ నీ అనుజుతోడ అభిమత సిద్ధిన్

క. చేసిన పాపము తొలగను

జేసియు బహుయాగయుక్త చేతో ముదమౌ

కాసులు దానము జేయుము

భాసిల్లను ముక్తి మార్గ భాజన పరులై

క. పురువును జేసెను వినుమా

పరహిత మౌ ముక్తి మార్గ బహువిధ క్రతువుల్

దురితము బాయను విధికృతి

హరియించెడు పాపజీవు లాయువు గొనుటన్

వ. వినుము ఒకనాటి కొలువున వివస్వతి అడిగిన దానికా దేవగురుడు బృహస్పతి యిట్ల నియె ననుచు –

క. అరిషడ్వర్గము లొందక
హరినామస్మరణ యుక్త అభిమత సిద్ధిన్
ధరయేలిన రారాజులు
అరిదౌ ఆ ముక్తి పథము అందుట వినమే

క. అనవిని మౌనత నున్నా
జననాథుతో అర్జునుండు చనువుం గొనుచున్
మునియా దేవస్థానుడు
అనుమాటలు యెంచ వలదె ఆదరు డౌటన్

క. సమరోద్ధాంతత మించుచు
సమరమ్మున శత్రు గెల్చి సామ్రాజ్యుడవై
అమలత నేలుము జనులను
సమబుద్ధిన నీతి మార్గ సద్గుణశీలా

వ. అనుచు పల్కునప్పట, మౌనముగా నున్నయా యుధిష్టరు మ్రోల కృష్ణ ద్వైపాయనుడు అవతరణుడై వానిచే ప్రత్యుస్థాన నమస్కృతు లొందినవాడై వినుడని –

సుద్యుమ్న చరిత్రమును యెరింగించుట

తే. తొల్లి సుద్యుమ్ను డనువాడు దుర్దమనుడు
దండనీతిని పాలించు ధార్మికుండు
మంచి చెడ్డలు యెరిగున్న మహిత కీర్తి
ధర్మ సంస్థాపనుండన్న ధరణిపాల్డు

వ. ప్రజారంజకముగా పాలించుచుండెను. ఆ రాజు ప్రజల నుండి–

తే. అరుత గొనియెడు ఆరవ పాలు అభిమతార్థ
పంట భూముల ప్రాప్తించు ఫలము నందు
సమత గూర్చుచు కైవల్య సత్య నిష్ట
ధర్మ మేర్చుచు నీతిమై తనదు బుద్ధి

వ. ఆ రాజు రాజ్యమ్మున శంఖ, లిఖితులను యిర్వురు అన్నదమ్ములు విప్రులుండిరి. వారు యెంతయుం ధర్మ తత్పరులు. లిఖితు డొకనాడు అన్నగారిని చూడ నేగినవాడై వారి ఆశ్రమ వాసమున కేగి, అటనున్న ఆరముగ్గిన పండ్లను కోసికొని భుజించుచుండ ఎక్కడివని అడుగుటయును ఇది నీ ఆశ్రమ తరువుల నుండి గ్రహించినవేయని పలుక, నా యనుమతి గొనక గ్రహించినవాడవు గావున ముచ్చు దోషుడవనుచు, రాజునొద్దకు గొనిపోవ, లిఖితుండు అనుమతి లేకుండ గ్రహించిన ముచ్చువుగాన, ముచ్చు దండన విధించి యమ గండన లేకుండా వేడుటయును, రాజు వాని ధర్మబుద్ధికి మెచ్చి యూరకున్న, అట్లుకాదు దండధారుణ కిల్బిషము లేకుండ దండన విధించమని లిఖితుండు పట్టుబట్ట చేయునది లేక ఆ బ్రాహ్మణుని చేతులు ఖండింపనగు దండన విధించుటయును, అట్లు ఖండింపబడిన బాహులతో నేగి లిఖితుండు అన్నగారికి తన చేతులు చూపి, సమ్యగ్దండితుడనై పాప విముక్తుండనైతినని అన్నగారితోబల్కుటయును శంఖుడు ప్రీతుండై –

తే. ధర్మదండన ముల్లంఘ్న దగదు కాన
నిష్కృతించెను సుద్యుమ్న నీతిపరుడు
కులము తెలసెను తద్ధర్మ కూర్మి వలన
తర్పణం బిడు బాహుదా తీర్థములను

వ. వినుము మరియు–

తే. గుడులు దోచుట గురుపత్ని గూడుటయును
కల్లు ద్రావుట కడజాతి కలసి దినుట

విప్రు జంపుట పొలావు విక్రయమ్ము
అఘము గూర్చును అనిపెద్ద లండ్రుగాదె

వ. యిట్టి పాపములు చేసినవాడు దండనకు అర్హుడు. రాజుచే దండింప బడినవాడు సుకృతి వడయునని పల్కి నీవు పుణ్యాత్ముడవు. పోయి సుఖింపుమన లిఖితుండు అన్నగారు చెప్పినట్లు –

తే. బాహుదా నది నీళ్లలో వరుస మునిగి
కరము మోడ్చను దేవతా కార్య విధుల
బాహువుల్రెండు బాగాయె భాగ్య వశత
విస్మయం బందిరా నదీ విభవ మంచు

వ. అన్నగారి వద్దకు వచ్చి తన చేతులంజూప అచ్చెరువందనేల. యిది నా తపో ఫలం బగు దైవ మహిమ. దీనివలన నీవును యీ సుద్యుమ్నుండునూ నిర్మలాత్ము లైరి. అట్లగుటం జేసి–

తే. వినుత విఖ్యాతి పరుడవౌ విభవ మంది
ఉద్ధరించుచు నేలుమా నుర్వి జనుల
ధర్మ దండము చేబట్టి ధరణి నేలి
పాప పంకిల మడచుమా భవ్య జనుడ

వ. అనుచు క్షత్రియ ధర్మ కర్తవ్యమును నెరపుచు నీ రాజ్య ప్రజారక్షకుడవుగమ్ము, లెమ్మన–

వ. సృష్టియందు సర్వమును కాలగర్భితములు కాకతప్పదు. అది కాలపురుషుని మహిమ. హానివృద్ధులు సహజ విషయములు సుఖ దుఃఖములు చీకటి వెలుగులు మరలమరల వచ్చు చుండును. సహజములు అనుటయు.

పారాశర్యుడు ధర్మజునకు నీతి వాక్యములు ఉపన్యసించుట

తే. ధరణి నేలుము ఆశ్రయ ధర్మ బుద్ధి
సరస సద్గుణ సమబుద్ధి సదయ హృదయ

దండ నీతుడ వగుచు నీ ధర్మ యుక్తి
జనుల ప్రీతువు కమ్ము ఆ జనకుభంగి

వ. పృథివీ పరిగ్రహణ పరిరక్షణము నీ కర్తవ్యమ్ము. నిన్ను కాదని నీ అనుజు లెప్పుడు నీ పని జేయనవరు. ధర్మరక్షణ నీ కుల ధర్మంబైన కర్తవ్యము కావున వివేకవంతుడవై అయిన దానికి వగవక సత్పురుషుండవై రాజ్యపాలనకియ్యకొనుమనుటయు అప్పుడ మ్మునీంద్రునకు మనుజేంద్రుం డిట్టులనియె.

తే. మరువ దగదయ్య మునినాధ మాకు నీకు
శాంతనవు ద్రోణ ద్రుపదుని సద్గుణాళు
ద్రౌపదేయుల నభిమన్యు ద్రుపద సూన్ల
కర్ణ మత్తు ్యని హైడింబు కడమ నృపుల

తే. పరశురాముని గెలిచిన వాడు యొకడు
పరశురాముని శిష్యనా భ్రాత యొకడు
పరమ పావన సుకుమార భరతవీర
వర కుమారుల మరువ నావశము అగునె

తే. అల్ప కాల భాగ్యగతి ననల్పభోగ
దివ్య ఆనంద సందీప్తి ధిక్కరించి
జడుడ నౌదునె మహనీయ జన్మనెత్తి
పౌర వంశోద్ధారుండ దివ్యాత్మపురుష

తే. ప్రాయ ఉపవాసమే నాకు పరమ పదము
ఆశ జనియింప మీరంద రనుట యిట్లు
మంచి చెడ్డయుం నామది నెంచలేను
అన్న మంచియు దెల్పగా నౌదు వీవు

తే. మరియు చలియించుచున్న నామదికి శాంతి
గూర బల్కుదు ధృతి నెంచి గొప్పనెంచి
సార సద్గుణ విస్తార సమత యోగ
బ్రహ్మ పద దివ్య సౌభాగ్య బ్రహ్మవిదుడ

వ. అన్న మీదుట ఆతని అనుమతంబున కృపాళుండైన కృష్ణుడు ధర్మజునితో –

షోడశ మహారాజుల చరిత్రలం దెల్పుట

సీ. ధరనేలి నట్టి యా దశరథ రాముండు
శశిబిందుడా పృథువు సాటి యెవరు
మరుత సుహోత్రులా మాంధాతృ శిబి గయు
అంబరీ ష్యయాతి అతుల కీర్తి
భరత భగీరదుల్ పరశురాముడు నృగు
రంతి దిలీపులీ రాజులంత
చొప్పడ వెలయు నా షోడశ రారాజ్లు
భారతావని నేల్రి భద్ర గతుల

తే. యెంత లెంతలు వీరైన యిలను గలరె
కథలు కథలుగా విననౌద్మ గత చరిత్ర
వినిన బల్కిన చదివిన వీను లలర
పొంద నగుదుము పుణ్యమ్ము పోవు నఘము

వ. వీరందరు మనకు ముందు యుగములలో భారతావని కీర్తి ప్రతిష్ఠలు సత్య నిష్ఠా గరిష్ఠ ధర్మ సౌశీల్యత వేదార్థ విజ్ఞానములం ప్రదీపింప జేసిన మహా మహిమాన్వితులు మహా రాజులు ఋషితుల్యులు ఆదర్శనీయులును.

సీ. వేవేల యాగాలు వెలయంగ జేసియు
దానంబు లొసగియు ధరణి సురకు

పంచ భక్ష్యాన్న ముల్ ప్రబలంగ కుడిపియుం

కోటి కోట్లకు పంచి గోధనమ్ము

రత్న కాంచన పట్టు రమణీయ వస్త్రాలు

ఆదరంబది జూపి అర్థి కిచ్చి

వేద మంత్రాన్వయ విజ్ఞాన విదుషలౌ

భూసురాశీశ్సులం బొంది యశము

తే. శాంతి దాంతులు నెలకొల్పి సత్య ధర్మ

నిష్ట సంస్కృతి వేలేంద్రు నిలచి యుండ

స్వార్థ చింతన లేనట్టి సాదువాద్లు

ధర్మ దండన నీతిజ్ఞ ధర్మ మయులు

వ. అని వారలీ నాటికి యేనాటికి యీపుడమి యున్నంత కాలము చిరంజీవులుగా నిలిచి యుందురు. కావున నీవును వారివలె యి పుడమి బాలించి చరితార్థుడవుకమ్మన, ఆ వసుదేవ నందనునకు ధర్మనందనుండిట్లను. సువర్ణష్ఠీవి విషయము వినవలతువన తరువాత నారదుని వలన వినగలవను**చు** –

శ్రీకృష్ణుడు పర్వత నారదుల వృత్తాంతము దెల్పుట

క. నారద పర్వతు లిర్వు రు

దారులు మామయును అల్లు తాపసు లెలమిన్

సారస సంగీత విదులు

భూ రమణులం జూడ వచ్చి భోజన ప్రియుడై

క. తమ తమ సమాన వృత్తులు

విమలత దాచకను యుండు విధముగ పల్కిన్

సమయజ్ఞత దాచినచో

తమలో దా శాప మొంద దలచిన వారై

వ. సంచారు లగుచు వచ్చి అవనిన యీ దేశమును యేలు –

క. సృంజయ నామాఖ్య వెలయు
కంజజు భక్త్యాగ్రగణ్య కమనీయుండై
భంజించుచు రారాజుల
వింజామర విప్పి ఆడు పించియ సముద్రై

వ. ఆనందాతిశయ రూపు రేఖా విలాసన రారాజ తీవిన యింద్రతుల్యుండో యన వినయ గర్వుండగువాని మందిరమున కేగ, వారలం గని నమస్కరించినవాడా సృంజయ భక్తి యుక్త ముగ పూజించిన వాడగుటయునుతమరాక మాకెంతయు సంతసం బన ఆ రాజుతో వారు నీ యింట కొన్ని దినమ్ము లుండ వచ్చిన వారమన విని సంతసించి–

క. ఆదరమున గొని లోనికి
సాదరమున కూతుబిల్చి సద్విధు వొచున్
మోదమునం సేవ లొలుపు
కాదనకం ప్రీతి తోడ కమలజు కులజుల్

వ. వీరని పల్కి నియోగించి వలయు వస్తు సంచయములు సమకూర్ప పనివారల కొప్పగించ –

తే. ఉచిత రీతుల ఫలభక్ష్య ఉదకమాది
వలయు నన్నింటి సమకూర్చి వడ్డనమ్ము
దగ్గరుండియు చూచుడుం తలిరుబోడి
ప్రీతు డగుచు, నారద ముని పెద్దగాను

క. నడకల చూపుల వనితా
నడుమును చెలువమును జూచి నారదు డామెన్
కడువేడుక జూచుటయును
బుడుగా పర్వతుడు జూచి పొంచియు పొంచిన్

క. ఇంచు క్రేమం బడెనీ
కుంచితుడౌ బ్రహ్మచారి కూటికి గాకన్
మంచిగ దలచుచును మదిన
యెంచియు నుద్వాహమాడ నెంచెను యేమో

క. నాతో బల్కక నుంటివి
చేతో మోదమ్ము గూర చేకొన కన్నెన్
చూతము గాకనుచు పలికె
కోతి మొగమ్మగుదు వీవు కోమలి గొన్నన్

వ. అన్న నాతనికి దేవలోక గమనము లేకుండ నగునని ప్రతిశాపంబీయ దానికేమిలే అని వెడలుటయును, వీని శాపమున కేమిలే యని, నారదుండు సృంజయుని వద్దకేగి పిల్లనిమ్మని యడిగి ఆమెచే నౌననిపించుకొని సలక్షణముగా వివాహంబగుటయును, వారలు మున్నను కొన్నట్లు శాపవశమ్మున–

క. కోతి మొగమ్మవ నారదు
డేతరుడై పర్వతునితో యేతేర్నగుచున్
నాతియ వంకకు రావన్
యీతం డెవడో మగడని యెంచియు మదిలోన్

వ. చింతించుచు చేరకున్న అమె వద్ద కేగి పర్వతుడు అత్తా!

క. ఈ కోతియె నీమగడని
తాకిన నిను పీకునంచు తాకకు మనుచున్
ఏకత వడి నవ్వుకొనగ
యీ కోతియ నాదు మగడు యెంతగు వింతో

వ. అని విస్తుపోవ, నప్పుడా పర్వతమౌని ఆమెం దీవించుచు తనకును తన మామ యీ

నారదునకును మధ్య మున్నుగా గల శాపానుకూలతకు గల సర్వ విషయములు విశదపరుప నా మహాసాధ్వి–

క. ఇదె నా భాగ్యం బనుచును
మది నూహల మోయిమోయి మార్దవ బుద్ధిన్
కుదురుగ కాలముగడుపను
పది కాలాల్గడవ నాయె భరమౌ మదితోన్

వ. కుదురుగ ఒకచో కాల్నిలువని యా దేవమునులు అట నుండి యేగదలచిన వారగుచు యీ సృంజయుని కేదేని మేల్చేయదలంచిన వారై యుండపర్వతుడు మామా! నీవిచ్చిన శాప మున నీతో దేవ భూమికి రాజాలను. శాపము నుపగ్రహింపు మనుటయు, నారదుండప్పుడు ముందు శాపమిడినవాడవు నీవు గాన నీవే ముందుగా నీ విచ్చిన శాప, ముపగ్రహింపు మన నట్లొండొరులు శాప విముక్తులై సంతోషాంత రంగులగుచు సృంజయ మహారాజు వద్దకునేగి నారదుండు యేదేని వరము కోరుకొమ్మిత్తునన రాజప్పుడు వానితో యిట్లను.మీరు శాపవిము క్తులై సంతోషమున నుండుటయే నాకును నా కూతురునకును మహదానందమని పల్క నార దుండు అట్లు కాదని పల్కి నీవు నీ మనమ్మున దివిజసన్నిభుల మించు తనయుడు కావలెనని కోరియుందువు కావున యిచ్చుచున్నాను. అట్టి పుత్రునిం బడయ గలదనుటయును, ఇంద్ర ప్రీతుండైన పర్వతుండు నీ కొడుకు “దీర్ఘాయు రుపేతుండుగాక యుండు” ననుటయు, అమ్మా నవతి వారలం జూచుచు మీ యట్టివారల అనుగ్రహములు యెంతటి అపురూపములో అగు నని భావించి యుంటినని ప్రార్థించిన ప్రసన్నుండై నారదుండు, పెరిగినంత కాలము పెంచు. విరిగి పడునప్పుడు నన్నుదలువు మరల్తుదాని ననుచుపల్కి, పర్వతుడప్పు డాతనితో నీకొడుకు నిజ నిష్ఠీవములు సువర్ణమయ మగుటం జేసి, సువర్ణష్ఠీవి యనుంబగుడు నన సంప్రీతుండై కొడుకునుం బడయుటను.

మృచ్చులచే మృతుండైన సువర్ణష్ఠీవి పునర్జీవితు డగుట

ఆ. పెరిగి పెరిగి వాడు పేరొందె నెంతయుం

ధనదు బిడ్డ కంటె ధనదు డయ్యె
మలము మూత్ర ముమ్మి మహనీయ స్వర్ణమై
స్వర్ణ మేనుడన్న నిర్ణయాన

తే. ఇరుగు పొరుగులు గూడను యెరుగకుండ
యెంత జాగ్రత్త పరుడౌచు యింత గూడ
సుంత సుంతయు మాత్రము సొంత పనిగ
ఇంటి వారలె జేయుచుం యెంగానొ

వ. తర్జనమున యెన్నియో జన్నము లాచరించుటయును.

తే. దుర్ణయాన వాని దొంగిలి దుష్టులు
పసిడి గొంద మంచు పాప బుద్ధి
కడుపు గోసి చూడ కాంచియు ప్రేవులు
పారవేసి నేగ్రి పాప మనక

వ. బాలుం గానక సృంజయ పరివారుల బంపి యూరిబయల చచ్చి పడియున్న బాలుని దెచ్చి రోదించుచు నుండ మంత్రి వర్యులు రాజుం జీరుచు మునివరు రాగోరుటయు నారద ముని వచ్చి సమంత్రణముగ బ్రహ్మను బూజించి ఆ బాలుని బ్రతికించి యిచ్చుటయును విని పించియు ధర్మజు నాలోకించి, నారద కృష్ణులు వినగా నీవును సృంజయు వలెనే జన్నము లాచరించుచు యశమును కీర్తియు నొందుదు వనుచు –

తే. సమత గూర్చుకు శాంతత సర్వ జనికి
రక్షజేయుమ పాలించు రాజువౌచు
అనగ నంతన ధర్మజుం డనియె వాన్కి
యేల ధర్మంబె చెప్పుమా యెట్టు లగుదు

వ. బంధుల స్వజనకోటుల కౌరవభ్రాతల పుణ్యుల గురుల పూజ్యుల పెద్దల నృపుల దండి

మగల నందరు జావజింపగ జేసిన వాడ నా వారల ఆలుబిడ్డలు కొడుకులు కోడండ్ర. మరుదులు బావలు మామలు చచ్చియేడు చున్న వారావనితల కెట్టి శాంతత జూపుదు. ధర్మవేత్తల దెలపనౌదు రేపగిది నంచన –

వ్యాసుడు ధర్మరాజునకు కొన్ని ధర్మాధర్మ విషయంబులు వివరించుట

క. ఆగమ మాచర కుండుట
తాగుట తన పనులు వీడి దయ మానుటయున్
మూగల దండించుటయును
లేగల గోవులను జంపి లేదను టెంతన్

క. పాపం బనెదరు పెద్దలు
దీపం బార్పుటయును పరదేశము నుంటన్
కోపంబున ఆలి దెగుట
ఆపం దగు మూగజీవ అపరాధములున్

వ. ఇక విశేషించి, నిషిద్ధ క్రియల నాచరించుట పరకాంతా సంగమము గురువుల కెదురాడుట, పెద్దలన దగువారలు వచ్చిన పూజింపకుండుట, వేద విక్రయము, అసత్యమునకు తోడ్పడుట గ్రంధ చౌర్యము, బ్రాహ్మణ హత్య దైవ విత్తాపహరణము, మిగుల పాప మనియెదరు పెద్దలు.

క. శరణాగత రక్షణమున్
గురువుల సంసేవనమ్ము గోపూజనమున్
పరహిత కార్యాచరణము
పురజనులకు మేలు సేత పుణ్య ప్రదముల్

వ. మరియునుం వినుము పాపమ్మునుం బోలు పాప రహితమ్ముల దెల్పెద–

క. దురమున కైదువు గొనిరా
నరకుడు ననుచును పల్క నరు డెవరైనన్

నరికిన దురితమ్మంటదు

తరతమ మెంచగను రా దధర్మం బనుచున్

వ. దేవ బ్రాహ్మణ ధనాపహరుణులం దెగ గొనినం, శిశు హత్యా పాతకుల జంపుట వలనను, ప్రాణ మాన విత్తా భంగమందు వైవాహిక కార్యములయందును అనృతదోషమంట దనుటయు, కులకాంతల జెరచు నీచకార్యుల దునుమం, కలలోనైనం పురుష ధాతు స్ఖలనం బయినను బ్రహ్మచర్యముచెడదు. గోవులకై యడవులదగుల బెట్టుటయును, యజ్ఞములయందు యాగ పశువు బలి యిచ్చుటయు, అపాత్రుండని తెలియక దానమిచ్చినను చెడ్డకాదనియును, యిక ప్రాయశ్చిత్త విషయికములు దెల్పెద వినుమని–

సాత్యవతేయుడు పాయశ్చిత్త విషయములు ధర్మజున కెరింగించుట

<u>బ్రహ్మ హత్యాపాతక ప్రాయశ్చి త్తము:</u>

అశ్వమేధయాగము చేయుటవలనగాని, దినమున కొకసారిదినుచు ఒక వత్సరకాలము నియతిగానుండుట వలనగాని, 3 అయనములు చాంద్రాయణ వ్రతము పాటించుట వలనగాని, బ్రహ్మచారియైన భిక్షాటన జేయుచు దెచ్చిన అన్నమును రోజుకొకసారి మాత్రమే దినుచు 12 వత్సరములు గడుపుట వలనగాని, గృహస్థుడైన 6 వత్సరముల కాలమట్లు బ్రతుకుటవలన గాని బాపుకొనవచ్చును. మరియు లక్ష పాడియావులనుగాని, నూరు మేలుజాతి గుఱ్ఱములను గాని దానమిచ్చుటవలనను కల్లుతాగిన పాపము పోవుటకు దానిని సలసలమరిగించి (ఎఱ్ఱనగువరకు) త్రాగుట వలనను, నూతబడికాని, అగ్నిబడికాని, చనిపోయినచో: బృహస్పతి యాగము చేయుట, పంట భూదానము వలనను–

<u>అనృత దోషము తొలగుటకు:</u> కీడు మూడినవారిని సంతృప్తిగా మాటాడి శాంతింప జేయుటవల నను, పరదారా సంగమదోషము తొలగుటకు 1 వత్సరకాలము నేలను పవ్వళించుచు నియతుడై వర్తించుట వలనను, బ్రాహ్మణ ధనము దొంగిలించిన దానికి అంతటి విలువగు బంగారమును వెచ్చించుట వలనను–

<u>వావి వరసగాని వారితో సంగమించుట:</u> 6 నెలలు తడి వస్త్రధారణమును, మట్టినేలను పండు

కొనుట వలనను పరపురుషునితో గూడిన స్త్రీ రసజ్వలయైన యంతనను, ఫలవంతమగు తరు, తిర్యగ్జాతుల వధియించినచో, గాలినే ఆహారముగాగొనుచు 3 దినములు తాజేసిన తప్పిదమును అందరితోడను పల్కుట వలనను–

<u>మతిలేని తనమునకు</u>: మితాహారుడై ఏకాంత స్థలమున సావిత్రీవ్రతము ఆచరించుటవలనను

<u>చేసిన పాపము:</u> చెప్పుకొనుట వలనను.పూర్వ సంచిత పాపములు తొలగుటకు పుణ్య కర్మ లాచరించుట, దాన ధర్మములు చేయుట, ఇవన్నియు ఆస్థికత్వులకు మాత్రమే అనియును, నాస్తి కులకుయే ప్రాయశ్చిత్తమును లేక కర్మానుభవ పరంపరల గుందుదు రనియునుందెల్పి, ధర్మజా!నీ కాస్థితిత్వము, సహజముగావచ్చినది కావున ప్రాయశ్చిత్తంబు లల్పంబులై యుండు. భారత యుద్ధ వధంబునకు దోషమ్ము లేదు. యుద్ధమున మరణించుట స్వర్గద్వారము మరియు క్షాత్ర కుల ధర్మము స్వకుల ధర్మ రక్షణము మోక్షదాయకము.

భోజ్యా భోజ్యముల దెల్పుట

క. గుబ్బము లొట్టియ (ఒంటె) ఖరములు
జబ్బున గురిసె ననిపాలు జనదుర తాగన్
జిబ్బని చీదరు వినుమా
కబ్బావుల పాలు యెంతొ కమ్మగ నుండున్

క. ధేనువు లీనిన తొల్లిటి
మానితమౌ ముబ్బు బాలు మానుము తాగన్
బానలి వండిన కూడును
వానకు ముక్కినవి వడ్ల వండకు కుడువన్

వ. మరియును ప్రేతాన్నము, సూత కాన్నము, తలవరి యన్నము, కులట యన్నము చాకిత కూడుం

క. కల్లుం గలియు పదార్థము
ఉల్లంబున మెచ్చ నట్టి ఉడకని అన్నం

బొల్లుకు పాచిన దేదియు
చల్లని కూరలు పులుసులు చప్పిడి మెతుకుల్

క. వెచ్చని వేడిమి కమ్మని
పచ్చళ్లను పిండివంట్లు పాలుం పెరుగుల్
మెచ్చిన పరమాన్నంబులు
నిచ్చల భక్తిం ఒసగిన నిఖిలాన్నంబుల్

వ. అతిథి అభ్యాగతుల తోడంగూడి గృహస్తు భుజింప వలయు నృపా!

కృష్ణద్వైపాయనుడు పాత్రాపాత్ర విషయము లెరింగించుట

క. సాదులు సంతాన్వంతులు
బీదలు సత్పాత్రు లంద్రు వేదోద్ధరణా
వాదులు భగవత్ ప్రార్థనె
నాదని మదినెంచువారు నయవిదు లరయన్

క. తాగెడు సాగెడు జోగులు
ఆగుము నేపల్కెదంచు అవియివి యేమో
వాగుడు పారు లనర్హులు
యీగికి సరిగానివారు యిద్ధ చరిత్రా!

క. అవిటీ కుంటీ గ్రుడ్డియు
జవసత్త్వము లుడిగినట్టి జనులరు పాత్రుల్
దివిజులు మెత్తురు దీనిం
భువి దానార్హులు దెలియుమ భూసురు లందున్

క. పాత్రతెరిగి యిచ్చుదానము
ధాత్రిం ద్విగుణీ ఫలంబు ధర్మం బనుచున్

సూత్రీకరించి పెద్దలు

ధాత్రీవర పాండుపుత్ర దానార్ధ విధిన్

వ. ఇట్లనేక తెరంగులగు మంచి విషయ విజ్ఞాన ప్రబోధము గావించిన, తెలివొంది ధర్మ రాజాతనితో నా కెంతయు సంతసముగా నున్నదిఅనుచు మహాత్మా! భవదీయ అనుగ్రహము న కొంత స్వస్థుడ నైతిననుచు, రాజ్య పాలనమునకును ధర్మ చర్యకును పరస్పర విరుద్ధముగా కాననగుట, యింకను నాతెలియందగు నీతివిషయములు యెరింగిపుమన మహర్షి ప్రమోదాం త రంగుడగుచు, నీకు కావలయు రాజకీయ విజ్ఞానమును ఆ భీష్ముడుపదేశించగలడనుచు పల్కిన నారదుం డిది లెస్స యనుటయును–

క. అగణిత విజ్ఞానుండును

భృగు మార్కండేయులాది బృందారకుచే

తగువిధు లెరిగిన వాడల

తగ దెల్పం రాజనీతి దండన విధులన్

వ. పారాశర్యుండు ఆ ధర్మతనయు నుద్దేశించి గంగా శంతన తనయుడు అమరేంద్ర సన్నిభ శరధారుడు భీష్మ శరుడు శపధ వర్తనుడు కాలానుజజన్మ కర్మ గడగుచు తానై –

క. తగు సమయం బగుడు మదిని

వగచుచు నీ కొరకు జూచు వానిం గనుమీ

మగధీరుడు యింత దనుక

నగు మోమున దివికి నేగ నగుటం జనుమీ

వ. అని పల్క నాతనికిని దివిజ మునులకును ప్రదక్షిణ నమస్కారము లిడుచువారల నుండి రాజ్యపాలానానుకూల అనుజ్ఞాశీర్వాదములు నడగిన వాడగుటయు దివ్య మునులు తమతమ లోకమ్ములకు జనుటయు, జనార్ధనానుమతంబున కురుపితామహు భీష్మునిం జూచు తలంపున త్వరితగతిన కరిపురంబున కేగ నగుట .

ధర్మజుని కరిపుర ప్రవేశము పట్టాభిషేకము

క. పరివృత సేనావాహిను
యిరుగడలం జేరి గొల్వ యింతియ తోడన్
ఉరుతర మణిమయ కాంచన
అరదమ్మున సోదర హరి అనుయాయులతోన్

వ. స బంధు బాంధవ యుతుడై ఆమంత్రణ పూజావిధులదీర్చి భూదేవాదుల తోడను నృప వరు లరుదెంచిన పురజనుల తోడ కురువంశాగ్రణి గాంధారీ,కుంతి కురుకుల యింతియల తోడ వరవారణ తురగ రథ స్యందనారూఢులై ఘోటక పరిజనుల తోడ–

క. సంద్రంబై చూపరులకు
యింద్రోన్నతి ధిక్కరించి యేతరు లగుచున్
యేంద్రాయీ లావు అనగ
సుంద్రాంగన తాళ మేళ సురుచిర గతులన్

వ. వందిమాగధ కైవారములు సేయ సుందర తరభట సందోహ ఆనంద కోలాహలము అంబర చుంబితముకాగ ఆ పాండునందనులు నాగనగరము ప్రవేశించి చెలువారు చిరు నగవు మొగమ్ముల తమ్ములు నల్వురుం కైదండకరము లండగా గొనుచు అరదమ్ము డిగ్గి అల్లనల్లన దారిపొడవు నా గల –

ద్వి. రంభా మనోహర రతనాల పందిళ్ల – రంగురంగుల ముగ్గులా రాజిల్లు నడకల
రంగేళి రమణుల రంగుపూజల్లులం – చలువ సౌరభ గంధ చప్పరాల్ గడచుచు
సామవాదన సుస్వర సామగానము వినా – స్వాంత మెగయనా స్వాగత గీతాలు
అతిమనోజ్ఞమ్ముగా ఆనంద ముపొప్పంగ – అడుగు మడవులు మెత్న హాయి గొల్పుచు నుండ
మంగళ మహనీయ మామిడి తోరణాల్ – కమ్మనై మనసున గ్రాలనౌచు

వ. పుర ప్రవేశము గావించి అభిషేక ముహూర్తము దగ్గరగుడు వాసుదేవాను మతమ్మున

సర్వజనామోద భరితమ్ముగా నేర్పరుఎ బడిన చలువ పందిళ్లల పెద్దలగు వారలకును ఆయా కుల మత వర్గమ్ముగా సముచిత ఆసన సత్కారములు గావించుటయు సమున్నత సభావేదికపె పూర్వాభి ముఖమ్ముగా బహు విధ రమణీయ రత్న మాణిక్య వజ్ర వైఢూర్య రచిత హేమమయ సింహాసనమున ధర్మ నందనుండు గూర్చొన నియమించి కట్టెదుర కాంచ నాంచిత పీఠమ్ముల సాత్యకీ సహిత కమల నాభుండును, భీమార్జును లిరుగడల నుండ వెనుక భాగమ్మున కుంతీ సహిత గాంధారీ మహారాణులకు యిరుపార్శ్వమ్ముల కవలును దామోదరు దక్షిణ భాగమ్మున ప్రస్ఫురిత పీఠమ్మున ధృతరాష్ట్ర మహారాజులును యుయుత్సుడును విదుర సంజయులును అధ్వరణ కర్తలుగా ధౌమ్య కృపాచార్యుండును వర్తింప –

ద్వి. స్ఫుర సువాసన లీను సౌందర్య మాలికా – రమణీయ గద్దెపై రతనాల వేదికన్
కాళ్లకు పారాణి కన్నుల కాటుకన్ – కమ్మనౌ నుదుటను కస్తూరి తిలకమ్ము
గోరింట యెరుపునై కొమరారు హస్తాలు – ప్రభవెల్గు లీనెడు పట్టు పుట్టము గట్టి
అలరార చెలువమ్ము ఆభరణ రతనాలు – మెడదాల్ప నెంతయుం మేల్మి పసిడి
నవ మన్మథుం బోలు నయగార కాంతుల – పెద్ద లందరు చూడ ముద్దులొౌదువ
సుదతు లందరు గూడి సుందరాంగుని సెజ్జ – చెలియ ద్రౌపది దెచ్చి చెలగ నెంతొ
ఆనంద ముప్పొంగ ఆశీనులం జేయ – మద్దెల దరువులా మంగళ వాద్యాలు
ముంగిళ్ల మోదమా పొంగారు జనములు – రమణీయ మెంతనా రారాజు బృందాలు
కొలువు దీరుచు రాగ కోకోటి ప్రభ లెగయ – పట్టాభిషేకనా ప్రఖ్యాత సభ యందు

తే. మధుర మంగళ శుభవేళ మాధ వాజ్ఞ
శంఖ నినదమ్ము జేసియుం శంభు దలచి
వేద మంత్రాక్షతల్ వేయ వేదవిదులు
మణిమయ కిరీట పట్టమ్ము మహిత నునుప

ద్వి. జయ జయ ధ్వానాలు జగమెల్లవినుతింప – అభిమతార్థులు వచ్చి ఆశీర్వదింపగా
కురురాజు చేగొంచు కూర్మి చెలగ – కర్పూర హారతుల్ ఘనముగా పచరింప

ముందుగా శ్రీహరికి మోదమలరగ మొక్కి – వినతులం వినిపించె విజ్ఞు లెంతయు మెచ్చ
సభకు మ్రొక్కియు చాల సంభ్రమం బెసగ – విజ్ఞాపనము చేసి వివిధోర్వి భూపతికి

తే. వేద విదులకు యెంతేని వేడు కొప్ప
పాడియావుల దూడలన్ పసిడి తోడ
వస్త్ర దానాది ధన దాన వరుస వరుస
భూసురాళుల మెప్పించె భూము లిడుచు

ద్వి. కమలాక్షు డర్పించె కాంచన పుట్టాల్తొ – బంగారు ఖడ్గమ్ము రంగైన పాగాయు
ఏన్గులు గుఱ్ఱాలు యెనలేని భూషణాల్ – రారాజు లర్పించ్రి రతనాల కానుకల్

తే. పుర జనుల కెల్ల పరమాన్న భోజనమ్ము
పిండి వంటల తోడనుం దండి మెసగ
వార్చి వడ్డించి రెంతయుం వాడనాడ
పప్పు దప్పళాల్ పచ్చళ్లు పాలుపెరుగు

వ. ఇట్లు వైభవోపేతమ్ముగా ధరణీ వల్లభ కిరీట ధారుడై ధర్మ నందనుడు తమ్ములందరి తోడను ఆనందాతిరేకమ్మున ఆ సభాసదుల నెల్లర నుద్దేశించి–

తే. నాదు భాగ్యమ్ము కాదొకో ననగ వలదె
తండ్రి లేనట్టి మమ్ములం దనియ బెంచె
మాదు పెద తండ్రి దీవెనల్ మాకు నుంట
మహిత మహనీయ మా బావ మాకు నుండ

వ. ఆది నుండియు మము జూచినట్లె యిపుడు గూడ మీరలందరు మాకునై మసలుటదియ. వీరి మాటయె మామాటగా యనగ నగుచు ఆలకించుచు వర్తింప వలయుననుచు–

తే. ధర్మ సమ్మత మని యెంచి ధర్మ బుద్ధి
పాడి పంటలు ప్రభవింప చాటవేయ

సాదు జనులకు బీదకుం సమత గూర్ప
ఆయ కట్టలు వెలయగా నాజ్ఞ లిడుచు

తే. వాసు దేవుడె మనకెల్ల వరదుడౌట
తల్లి దండ్రియు గురుడును తానె యౌచు
కులము వెలయంగ జేసెనీ కుంతి. పాండు
రాజు కీర్తికిం దగినట్లు రక్షయౌచు

వ. అని పల్కి అందర వీడ్కొల్పి వినయంబున గాంధారీ ధృతరాష్ట్రుల నగరిలోని కనిపి, నగర వాసులును జానపదులును నిజనివాసములకుం బోవంబనిచి, సబహుమాన పురస్సర ముగాధౌమ్య కృపాచార్యులయిండ్లకుసాగనంపి, యువరాజపట్టమ్మును భీమ సేనుని కొసంగి.

చ. సముచిత రీతి పాలనము చక్కగ దీర్పను అర్జునుండనిం
సమగతి రాజ్య తంత్రముల సద్విధి గూర్చను యెల్ల భంగులం
అమరిక జేయు కార్యగతు లందు వివేకుడు ధార్మికత్వతం
మమయను ఆర్యు డావిదుర మంత్రియునంచని వేడ్క పల్కియున్

వ. ఆయ వ్యయంబులు జూచుటనునది సంజయోత్తము భారమనియు క్రియాపూర్వక ముగా నియోగించి

క. పరిచారికా జనములకు
తరిగొని సమ దృష్టి జూచి దయగొను వాడై
సరి బత్తెము లిచ్చు పనిగ
మరియా నకులుం డనుచును మనసౌ వాడున్

వ. దర్పితుల మర్దించను పరగణముల నార్జించను నర్జును నిర్దేశించుచు, బ్రాహ్మణ కార్య ములకు శ్రౌత స్మార్త క్రియా వర్తనములు అనుష్ఠానములు జూచుట ధౌమ్యుల వారి కొప్పగిం చియు, సహదేవు జూచుచు మదీయ గోపన గో పరిపాలనా కార్యముల యందుండునట్లు

యెల్లెడల తన వద్దనే యుండునట్లుగా యుయుత్సుం పరిశీలించి విదురసంజయుల నాలోకించి రాణివాస రాచనగరు యోగక్షేమము లరయుచుండునదిగాను, మరియును పురజనుల కార్యక్రమము లాలోచించుచు, వారి యోగ క్షేమము లెరింగితగు విధముగా చూచునది గాను, తల్లి కుంతితో ద్రౌపదీ దేవిని అభ్యంతర మందిరమునకు బుచ్చి–

తే. దేవతా మందిరము లెల్ల దీప్తి గొనగ
ధూప దీపాది నైవేద్య తీర్థ విధికి
విదుర నియతుని నియమించె విన్నవించి
తగిన యేర్పాట్లు చేయించె ధర్మవిదుడు

వ. యుద్ధమునం జచ్చిన సకల నృప కోటి సేనానీక జీవకోటిం చింతించి, బ్రాహ్మణోత్తముల రావించి భూ గో సువర్ణ ధన వస్త్ర వస్తు దానంబులం ప్రీతుల జేయుచు యథాపూర్వకముగా పరలోక గతిక పారలౌకిక ప్రాయశ్చిత్త కార్యముల నాచరింప జేసి విశేషించి గురు కర్ణాభిమన్యు విరాట్ ద్రుపద బాంధవ కోటికి అంత కంటెను హెచ్చుగా దుర్యోధనాదులకు ధృతరాష్ట్ర డౌర్ధ్వ దైహిక క్రియ లాచరించు నట్లుగా నొనర్చి, పిండాన్నదానంబు లొనర్పం చేసి యనృణుండై సకల జనంబుల చేతను బొగడు వడి ప్రాప్త సామ్రాట్ అయిన పాండవాగ్రజుండు–

శ్రీకృష్ణుని సముచిత వచనంబుల స్తుతియించుట

తే. కృష్ణ పరమాత్మ సంస్తుత్య కృష్ణ బావ
అత్త బిడ్డల మంచు మమ్మాప్తి తోడ
ఆది నుండియు నీవు మమ్మాదు కొనుట
యింత వారలమయి యుంటి మిప్పు డిట్లు

తే. పితృ పితామహ రాజ్యమ్ము పితృ ధనము
వశము గావించు కీ నాట్కి వసుధ యేల

పగతు నెల్లర పరిమార్చి పాపమనక
ధర్మ యుద్ధాన గొనుట నీదయను గాదె

తే. ఆది పురుషుడ త్రైలోక్య ఆది గురుడ
దేవదేవుడ నీయుక్తి దెలియ తరమె
బ్రహ్మరుద్రులకు యింద్రాంది భార్గవులకు
మనుజ మాత్రుల మైనట్టి మాదు బోట్కి

తే. అసుర కోటుల బరిమార్చు ఆత్మ శక్తి
భక్తి భావమ్ము నెంచుచు భవ్య జనికి
ముక్తి మార్గము జూపించు యుక్తి పరుడ
రక్ష గూర్చుచు పాలించు రక్షకుండ

వ. భక్తి భావన చాంచల్య చిత్త జనుల పాలిటి చింతామణివి కావ? ఆర్తిమై మదినినిం దలచు ఆర్త జీవుల పాలించే ఆప్తమిత్ర. కోరి భజియించు వారల కొంగు బంగారమా! మాదు తప్పులు మన్నించు మాధవుండ. యిదియంతయు నీదెకాని నాదికాదు. సర్వమ్ము నీకెయర్పణ ము చేయువాడ ననుచు. శ్రీకృష్ణుని ఆలింగమును గావించు కొనుటయును, అప్పుడు వసు దేవనందనుం డాతనితో బావా! యీ మహాభారత రణరంగ మందు కార్య కర్తలు మీరలు, కర్మ ఫలంబునం ఆస్వాదించు నిమిత్త మాత్రుండనేనని, యీ భూభర్తవు నీవయే యనుచు పల్కుటయును, యీ ధర్మయుద్ధ ధర్మ నందను చరిత్రను విన్నను, రాజ్యప్రాప్తుండై సుఖించగల రనుటయును విని తరువాత కథను యెరింగింపుమని జనమేజయ మహారాజు వైశంపాయన మహామునిని అడుగుటయు, అనునిది.

శ్రీశ్రీ వాణీ వరప్రసాదలబ్ధ సుకవిజనప్రియ సాధుజన విధేయ శ్రీశ్రీ కవిత్రయ స్ఫూర్తి ఆర్వేల నియోగి బ్రాహ్మణ మండపాక వంశోద్భవ వీర్రాజు పౌత్ర సూర్యప్రకాశం సత్యనారాయణాంబా తనయ ప్రణీతంబైన –: శ్రీమదాంధ్ర మహాభారత శాంతి పర్వ ప్రధమాశ్వాసము :–

శ్రీమదాంధ్ర మహాభారతము
శాంతి పర్వ – ద్వితీయాశ్వాసము

శ్రీ మహనీయ గుణాకర
సామాన్యుల కరుణ జూచు సాహసవంతా
సామద గజరాజ వరద
సామాన్యుడ కీర్తివంత సద్గుణ పాలా!

ధర్మనందునుని ధర్మవర్తనము

వ. దేవా! జనమేజయునున కా వైశంపాయను డనినయట్లు ధర్మరాజు అన్నదమ్ములం గూడి మహాసామ్రాజ్య పట్ట విభవుండై ఆనందతరంగముల నోలలాడుచు సమస్తజనమ్ములను సంతృప్తుల గావించి ధృతరాష్ట్ర గాంధారీ విదురులకు రాజ్యమ్ము సమర్పించి మీ కంటె పెద్ద లెవ్వరు నాకు. మీ పనిచినపని చేసిపెట్టినయట్ల గుడిచియుండ గలవాడననిపల్కి వారలపూర్వ ప్రకారము కంటెను సంప్రీతులుగా గారవించుచు కృప సంజయ యుయుత్సులకును వినయంబు జూపుచు కుంతీదేవికి శుశ్రూష లాచరించుచు పాంచాలికి సౌమస్యం బాపాదించుచు తమ్ముల మనమ్ములను సరణీయమ్ములుగాగొనుచు దౌమ్యుల సగౌరవముగా ఆలించుచు దేవపితృపూజనములు చేయుచు దీనాన్నదానముల పరితృప్తులం గావించుచు అనాధల కాశ్రయుం డగుచు రాణివాసజనమ్ముల కేలోటును కానరాకుండ జూచుకొనుచు పరిపూర్ణ ప్రజాసేవనం బాచరించువాడునై యొక్క రేతకడకృష్ణుడు యున్న మందిరమున కేగి –

క. ఆనంద నిలయు నాశ్రితు
లానందో బ్రహ్మయంచు అభిమత సిద్ధిని
ఆనందింపను ఆత్మ ల
నూనంబై వెలుగ జేయు ఆత్మోద్ధరణా!

క. నారాయణ యని మనముల
పారాయణ జేయునెట్టి పాపుల నైనన్

కారుణ్యాలుడ వగుదువు
మా రాయిడి లన్ని దేర్చు మాధవ కృష్ణా!

వ. అని అనేక తెరుగుల అభినందిస్తూ –

శ్రీకృష్ణునితో ధర్మజుని సంభాషణము

క. త్రిభువన పాలా మాధవ
అభయంకర లోచనుండ ఆర్తుల గావన్
విభవోజ్జ్వల ధీ వైభవ
అభిమాన ధనుండవౌర హరిహర తేజా!

వ. అనుచుం దగ్గరగా డాయంబోయ చూచుడు అమ్మాధవుండు మారుపలక నేరని తదేక ధ్యానమ్మున బాహిర్ నిమీలితాంతఃకరణ నిమగ్నుం డగుటయును ఆందోళనము వెడము చిత్తమ్మున సర్వజగద్రక్షకా ఆర్త త్రాణపరాయణా ఆది దేవా!

ఆ. యేమి వింత గూడె యీ మూడు జగముల
మాటలాడ వైతి మనసు రాదొ
నిన్న కాదనంచు నేనేమి జేస్తినో
తెలియ కుంటినయ్య తేట పడగ

వ. అని, నివాత నిశ్చల దీపప్రకారమున నున్న యప్పరమ పురుషుని నిశ్చల చిత్తుండయి ప్రార్థించుటయును, నిశ్చలాత్మ చిత్తరంజనుండయిన శ్రీకృష్ణుండు ఆత్మ సంయమనుండై బహిః స్ఫురణుండయి కనులు దెరచి ధర్మనందనా లోకనుండయి–

క. గంగా శంతన తనయుడు
సాంగోపాంగ విధి వేద సంచయ విదితుం
డంగీరస శిష్యుడు తా
పొంగారెడు మనసు దలచె పొందిక నన్నున్

క. లగ్నం బైయుంటి నచట
భగ్నం బగుటిష్టపడక పలుకక యుంటిన్
మగ్నుని కాదన కతని ని
మగ్నత చెరుపంగ లేక మసలితి కొంతన్

వ. ఇది మదీయ ధ్యాన విధమ్ము. అమ్మహాత్ముండు సర్వకాల విదితుండు. అతడు అస్తమించిన తదధీనంబైన విజ్ఞాన మంతయు అనాశ్రయంబులైపోవం బోవు. కావున నీవతని పాలికిం జని తదర్థంబులం గొనుమనుటయు, ధర్మనందను డావైకుంఠున కిట్టులనియె.

ఉ. తెల్లము గావ నీదియగు దీన శరణ్యత నాకు వానికిన్
చెల్లెడు కాల మాఘమది చేరువ యయ్యెడు సంతసంబునన్
యెల్లరు వాని జూడనయి యేగనుయుండిరి వ్యాసు డాదిగా
ఉల్లము నందు నిన్గనిన యూరట కాదగ జూడ రమ్మనెన్

వ. దేవకీ నందనుం డపుడు దాపున నున్న సాత్యకిం జూచుచు తేరాయత్తముజేయ దారుకునికిం దెల్పుమన విని, భీమార్జున నకుల సహదేవ యుయుత్సు కృప సంజయులును వారి వెంట కురుక్షేత్రమున కేగ–

క. తమ తమ రథముల లోనన
విమల మనస్కు లల వేదవిదితుం భీష్మున్
అమలిన శరతల్ప శయుని
మమయనుచుం చూడనేగ్రి మసలక వేగన్

వ. ఆ సమయమున అక్కడ కేతెంచి యున్న వ్యాస నారద దేవలు లాదిగా అనేక దేవముని గణముల మధ్య తారకా మధ్య శరత్కాల చంద్రుని మాడ్కి తేజో విరాజితుండై శోభిల్లు వాని–

క. నిరత శయ నిమీలితుడౌ
పరమేశ్వరు కృష్ణు నాత్మ పదిలము చేసిన్

స్మరియించు వాని గనిరల
సురుచిర సామ్రాజ్య పదవి చూర్గొను వానిన్

భీష్ముడు శ్రీకృష్ణుని భక్తితో స్తుతియించుట

తే. ఆది పురుషుడ త్రైలోక్య ఆది గురుడ
పద్మనాభుడ శ్రీకృష్ణ పాపహరణ
నన్ను గాపాడ వచ్చిన నళిన నేత్ర
సన్నుతింతును సత్కృపా సదయ హృదయ

క. హరిహర రూపా పావన
దురితాప్హరణ విహార దురహంకారా
వరదుడ పాలన కరుణా
పరతంత్రుడ సాదువాద్న పాండవు శరణా

క. సృష్ఠి స్థితి లయకారణ
నిష్టా పరతంత్ర వేత్త నిఖిలాండపతీ
దుష్టుల ద్రుంచెడు వాడా
నిష్ఠుడ మత్స్య వతార నిగమో ద్ధారా!

క. సుర యసురు లమృతము కొరకు
వరదులు పాల్కడలి ద్రచ్చ భరమై మునుగన్
గిరినెత్తితి కమఠమవై
తరమా అది నీకు గాక తక్కుల కేర్కిన్

క. ధర నా హిరణ్యాక్షుడు
దురితుండై దాచనీట దుస్సహు వగుచున్
వరహావతార రూపా
ధరనెత్తితి పైకి కావ ధాత్రిం జనులున్

క. వరదుడు హిరణ్య కశిపుడు
హరియెక్కడ అనుచు అనుచు హరియింప నవన్
నరసింహాకృతి వెలసిన
వరదుడ హరిహరుడనీవ పాహి నృసింహా

క. వలనొప్ప మూడడుగు లని
బలినెత్తిన పాదముంచి పాతాళ్వనికిన్
బలియుతు నా బలి నణచగ
విలసిల్లిన వామనుడవు విశ్వము నిండిన్

క. ముయ్యేడు సార్లు రాజుల
దుయ్యుచు నీ పరశు తోడ దునిమిన వాడా
కయ్యమునను పరశువు సరి
వెయ్యగ వేరెవ్వరనగ వెలసిన రామా

క. దశరథ నందన రామా
దశకంఠుని తలలు దునిమి దయతో కావన్
నిశచరు లబ్బుర పోవను
విశితాస్త్ర యశోవిశాల విశ్వంభరణా

క. అల నా దేవకి కడుపున
తలకొని శిశుపాల కంసు తలలం ద్రుంపన్
బలరామ కృష్ణ లనగా
ఇల గావం బుట్టి నట్టి యెదుకుల దీపా

క. శుద్ధము బుద్ధము నీవే
బద్ధము యుద్ధం బనుచును పరహిత బుద్ధిన్

బద్ధాత్ముల చేయ జనుల
నిద్ధరణు అహింస జాతి యెలమిని గూర్పన్

క. కలికాల జనుల గావను
దులదుల గుఱ్ఱమును దూర్చు దుష్టుల దునిమిన్
కలియుదు కలిపురుషునిలో
కలి యంతిమ సమయమందు కదనము ద్రొక్కిన్

క. వెన్నల దొంగవు కావా
నన్నుం నీదరికి జేర్చు నయవిధి కావన్
ఉన్నా నీ తల్పమందు
నిన్నుం గొల్చుచును మదిని నిలకడ తోడన్

క. వేదవిదు వేద వేద్యుం
వేదాత్ముని సకల లోక వేద స్థుత్యున్
వేదోద్ధరణుం భరణుం
వేదాంతులు గొల్చు నట్టి వేద్యుని దలతున్

క. విశ్వాత్ముని విశ్వమయుని
నిశ్వ నవిశ్వం గొలుతును విశ్వేశ్వరునిన్
విశ్వంభర దురితాపహరణు
విశ్వావశు రుద్ర తేజు విజ్ఞత దలతున్

క. అన్నియు తానే యౌచును
సున్నితమౌ ఆత్మ యౌచు చూపుల కెడమై
తిన్నన మది గాంచ నగుచు
ఉన్నట్టియ భూతకోటి ఉద్ధార్ గొలుతున్

క. హరి అభవుం బరమాత్ముని
మురహరి దురితాపహారు మూర్తిత్రయునిన్
ధర రక్షణ దక్షునియా
పరదేవత గొల్తుమదిని వసుదేవ సుతున్

క. అని అత్యంతాత్మ మయుని
కన నౌచును భీష్మ కనులు కాయలు గాయన్
తనువెల్ల అక్షు లగుచును
పనిగట్టుకు జూచువాని పావన పురుషున్

క. జూచి తరించుటయును మరి
వీచిక నా చెవుల వినుట విజ్ఞత పలుకన్
ఆచరణాత్మక దురితము
వీచికలై దూలిపోవు విడుచుచు జీవున్

వ. అని వైశంపాయనుడు పలుకుటయును, అట దేవకీ నందనుండు–

క. గంగా సుతునిం గనుటకు
పొంగుచు ధర్మజుని తోడ పోవుచు దారిన్
వంగియు జూడుము అదిగో
రంగైనవి పంచతీర్థ రక్తపు మడుపుల్

వ. దీని యందున ఆ భార్గవ రాముడు నృపరాజ రక్తధారల పితృ తర్పణలొసంగె ననుచు పల్కె –

క. అదియే మొదెల్ప మనుటయు
తుది ముట్టను ఆది నుండి దుర్భర మైనన్
మది నెంచెద పుణ్య మనుచు
పది దిక్కుల వారు వినగ పరహిత బుద్ధిన్

వ. విని పింపు మనుటయును, అప్పుడు –

శ్రీకృష్ణుడు పరశురాముని వృత్తాంతమును ధర్మజున కెరిగించుట

తే. కలదు జహ్నుడనెడు రాజు ఘనుడు తొల్లి
కుశికు డాతని తనయుండు గుణుడు గొప్ప
గాధియను దాని పెండ్లాడె గణుతి కెక్క
కూతు సత్యాంబ పెండ్లాడె కోరి ఋచికు

వ. అంత నా మహితాత్మ ఋచిక మౌని సత్సంతాన సంకల్పితుండై–

తే. మహిత తపసుండు ఋచికుండు మౌన యోగి
పచన పాత్రలు సృజియించె వంట కనుచు
అత్త కొక్కటి మరి తన ఆలి కొకటి
దివ్య పాత్రలు రెండునుం దేవ మహిమ

వ. అని పల్కి తన ఆలి సత్యవతిం జూచి యిట్లను.

తే. దీన, దిను మీవు జనియించు దీప్తి యశుడు
బ్రహ్మ ఋషితుల్య సందీప్త బ్రహ్మ యనగ
దాన దినమను మీయమ్మ ధరణి పాల
రాజ రారాజ విధ్వంస రాజనుండు

తే. పుట్టు నంచును చెరియొక తట్టు చేర్చి
యిచ్చియుం యేగె నదికినై యాదులాడ
వచ్చి జూచుడు దిననైరి హెచ్చు వేడ్క
తల్లి పిల్లయు తార్మారు దొన్నె లందు

వ. జ్ఞాన నేత్రుడు ఋచికుండు తానెరింగెను యీ తార్మారు ఆత్మ మయుండు–

తే. ఆలి బిల్చియు బల్కెనా ఆత్మవిదుడు
అత్తమ్మ దొన్నెలో దింటి నీవనుచు, దాన

రాజు వంశాల విధ్వంస రాజసత్వ
రమ్యు డుదయించు నీకనె రమణి తోడ

వ. అప్పుడా మునిపత్ని సత్యవతి తన కడుపు, తన తండ్రి వంశమైన రాజవంశముల విధ్వంసకుం డుదయించుట ఇష్టపడక బ్రహ్మసత్తముడైన తనభర్త ఋచీకు పాదములపైబడి యేడ్చుచు, మహాత్మా!

తే. యెంత లెంతలు దప్పింప యెరుగు దీవు
బ్రహ్మ రాతయు దప్పింప ప్రాభవుండ
నాదు తప్పిద మిందేమి లేదు నిజము
అమ్మ జేసెను తార్మారు అనుచు బల్కె

వ. అంత అనుగ్రహాతిశయంబున అమ్మహాయోగిపుంగవుండు కరుణించి అవ్విశేషము నా పుత్రనందు కాక పౌత్రుని యందాదవహిల్లెడు, నీకెట్లు ప్రియంబట్ల కాగలయది యనియెనట్లు. ఆమె తపస్సంపన్నుడును శాంతి దాంతి సమన్వయండును యైన జమదగ్నిం గనియె. గాధిపత్ని బ్రహ్మఋషి సదృసుండగు విశ్వామిత్రునిం గనియె.

క. జమదగ్ని శాంతి దాంతుడు
అమలిన తేజో విభవుడు అగుటయు గాకన్
సమతుల్యుడు సర్వజ్ఞుడు
సముచితమౌ సాదువాది సద్విజ బుద్ధిన్

వ. అక్కాలమున హైహయ వంశ వర్ధనుండైన కార్తవీర్యుండైన అర్జున నామధేయుండు-

క. దుర్జయ విక్రమ దోష వి
వర్జిత దోర్బలుడు ధైర్య పవనో ధృతుడున్
అర్జున పరాక్రముండును
నిర్జరులం లెక్క గొనని నియమితు డగుటన్

క. ఊర్జిత బలుడా ఘన వీ
ర్యార్జునుడు సహస్ర బాహు రమణీయుడునై
ఆర్జించెను సప్తాటవి
దుర్జయ భూ వలయ మెల్ల దోర్బల యుక్తిన్

వ. అటుల ఆతని సహస్ర బాహు భుజ బల దర్ప గర్వంబుల మహాసామ్రాజ్య విభవులైన రారాజులు గూడను అడ్డు నిలువలేని వారగుటయును, యీ భూవలయము నాశ్రయించుకొని యున్న భూత పంచకముగూడను ఆతని యనుమతి లేనిదే వర్తింప కుండుటయును, ఆకలి కానౌట అగ్ని బట్టారకుండు కార్యవీర్యుని వద్ద కేగి–

క. ఓగిరము నిడుము ఆకలి
ఆగదని దహించి తినగ అడవుల వనముల్
లోగొన పర్ణా గృహముల
మాగియు యెండినవి యెల్ల మమయని పల్కిన్

వ. వేడిన యాతండట్లనేయని అనుమతించుటయును అగ్నియట్లు తన యాకలిం దీర్చు కొనుచు నొకపరి –

క. మిత్రావరణుం డనెడు సు
మిత్రుని ఆశ్రమము కేగి మెక్కుట తోడన్
మిత్రావరణుం డలిగియు
ధాత్రీవరు కార్తవీర్యు దలచుచు మదిలోన్

క. నీ కతమున యింత జరిగె
నాకుం ఆశ్రమము లేక అలమట జెందన్
నీ కౌ బాహుల ద్రుంచెడు
రాకులముల ద్రుంచు రామ్డు రాజా యనుచున్

క. శాపం బిచ్చుట తోడన

పాపము తొలగించు కొనగ పరహిత బుద్ధిన్

బాపని శాపం బనుచును

రే పవలును దాన ధర్మ రీతుల నెగడున్

వ. ఐనను ఆతని శాప కారణముగా ఆ కార్తవీర్యునకు అవార్యవీర్య పరాక్రమ శక్తి సంపన్ను లగు పెక్కుంద్రు తనయు లుద్భవించుటయును విక్రమించు వారు జామదగ్ని యాశ్రమ వాకిట నున్న హెూమ ధేనువును, లేగనుఎవ్వరెరుగ కుండ బంధించి దెచ్చుటయును.

క. అడవుల కేగిన జామ్దగ్ని

తడయక నది దెల్సి రూక్ష ధృతుడై వీర్యున్

వడిదాకుచు పెక్కు గతుల

కడికండల బాహుద్రుంచె కఠినుండగుచున్

వ. అది దెలిసిన ఆకార్తవీర్యుని సుతులు అభిమత వృత్తుల్ మునియాశ్రమమున కేగి ఏకాగ్ర తపసు నున్న జమదగ్ని శిరమును ఖండించి నేలవైచిపోవుటయును. అడవి నుండి సమిధ కుశ పర్ణ ఫలాదులతో యేతెంచువాడు రోదించుచు తల్లి రేణుక యొడినున్న తండ్రి శిరమును జూచుచు ఆమె వల్ల అంతయుం దెలిసి–

మ. అతి రుద్రాక్షుడు తీక్ష్ణతం సమయనై, ఆ హైహయోద్ధాంతులన్

ధృతి దూల్చెంతయు దున్మెతాపరశునం, దుర్వార సింహాకృతుం

డతి కోపోధృతి, అగ్నులం గురియుచుం, అన్యాయు లైయ్యైహ్యులన్

సతి పుత్రాదుల నెల్లరం దునిమె తా సత్యాగ్రహుం డెంతయున్

వ. జమదగ్నుండు అట్లు చింతాక్రాంత కృపావిష్ణుం డగుచు తపోవనంబులకు బోవుటయు చాలా కాలములైన పిమ్మట విశ్వామిత్ర పౌత్రుండు పరావసుడను రాజు దుర్వినీతుండగుచు భార్గవరాము నధిక్షేపించుచు, రాజులకు వెరచి అడవులం బట్టి తపస్సు ఆచరించుచున్నాడని తీసికట్టుగా అందరియెదుటను మాటాడుచు రోషమును కల్గించుట కతన–

క. అసిధారా వ్రతయుక్తుడు
కసిగొని ముయ్యేడుసార్లు కటువౌ పర్శు వ్రన్
ఉసిగొల్పుచు రాచకులము
మసిమాడ్చియు రాజ్యకాంక్ష మనమున వీడిన్

వ. అశ్వాసి, ధన, మొనరించి దక్షణగా తన రాజ్యమంతయును కశ్యపున కొసగి నిజ తపో మహిమంబున, గంధమాధన పర్వతమున వాయుభక్షణుండై యుండ నేగుటయును–

క. ముని యాకశ్యపు డప్పుడు
తనియుచు నాధరణి నెల్ల ధరణీసురకున్
అనుభవ యోగ్యం బొసగియు
తా నేగెను అడవు లంటి తాపసవృత్తిన్

వ. పదంపడి కాలవిధి క్రమగతి నా భూసుర సంతానములు పథముదప్పి మద్యపాన, పిసిత భక్షణ, అక్రమవ్యాపార దుష్టసాంగత్య, అంగనా సాంగత్య, అనృతభాషణ సాదుహింస, ముచ్చు వ్యాపార మున్నుగా అధర్మ వర్తను లగుచు, దేవపూజలు, పితృకార్యములందు నిర్మోహులగుచు దురహంకార, దుర్భాషా విషయముల దగుల్కొని, ధర్మము దప్పుట వలన భూ భారము పెరిగి పాతాళమునకు క్రుంగువడుటయు, అప్పుడు కశ్యపుడు తనయూరువు దాపుగా నిష్టు డవనిని పైకెత్తి ఉద్ధరించుటయును, దాన యుర్వినా పేరొందుటయు వినిపించుచు భూదేవి, రాచరికము లవారిచే పాలింపడునంత వరకు నాకే కొఱంతయును యుండదు కావున భార్గవ రాముని పాలబడక మిగిలి యున్ననూ, హైహయులు, పౌరవాన్వయులు, సౌదామి వంశజుడొక్కడును సర్వకర్ముండు శిబి మనుమడు గోమతి, దధివాహనుండు, బ్రుహద్రధబూరి యనువాడు, మరు త్సంతానులు ముివ్వురును ఉత్తమ వంశ సంజాతులనియు, వీరు పాలించినచో, నచలితనై యుందు. అట్లనుగ్రహింపమని కశ్యపు నడగుటుయును, వారలం బిలిచి కశ్యపుడు, ధాత్రింబంచి యిచ్చి పరిపాలింపుండనుటయు, వారి సంతానమ్ములే కడుగతిం బెరిగి పెరిగి యిమ్మహా భారత రణరంగమున ప్రవర్తిల్లి జచ్చిన వారలనియుం బల్కి యుధిష్టిరుని తోడంగూడి శాంతనవుండు

న్నయోఘవతీ తీరమ్మున కేగి రథమ్ములు డిగ్గి పాదచారులై భీష్ముంగాంచి, అటపరివేష్టించి యున్న పరాశర, నారదాది దేవ మునిగణంబుల వారికింమ్రొక్కి సముచిత భాషణముల అచ్యుతుండ మ్మహీపతి కిట్లని, యో మహాత్మా!

క. కలరే నీవలె ఒక్కరు
ఇలనేలక తండ్రి కొఱకు యిచ్ఛాపరతన్
బలహీనుల సవతి అనుజ
యిలపెంచియు రాజ్యమిచ్చు యీగులు గలరే

తే. వేదవేదాంత వేద్యుండ వేదవిదుడ
ధర్మ మార్గాన వర్తించు ధార్మికుండ
భంగ పరచియు యుద్ధాన పరశురాము
ధర్మమార్గాన నడవనై దలచినావు

క. వ్యాకుల మొందక మునువలె
నాకుం గానట్టులుంట్వి నయవిది భీష్మా
నీకుం జనకుని వరమా
కాకున్నను యిట్టు లుండ గలవే చక్కన్

క. గంగా శంతను పుత్రా
పొంగారెడు మనసువాడ భూమిం జయుడా!
వంగని శస్త్రాస్త్ర ధరుడ
నింగియె నీమోల వ్రాలు నీదగు బలిమిన్

క. సత్యము శాంతము దమముం
అత్యుత్తమ మంచు మదిని వయసున ముదిమిన్
ముత్యము బోలినవాడా
అత్యంతాప్తుడవు శుద్ధ ఆత్మా నాకున్

వ. అనిపల్కి ధర్మరాజుం కనుగొంచు చూపి యిట్లను.

ధర్మరాజుకు ధర్మములు దెల్పునదిగా భీష్ముని తోపల్కుట

చ. రణమున బంధులుం నృపులు రాజసతేజులు కౌరవానుజుల్
గుణ రహితాత్ములై కుపిత కోపులు సేనలు లక్షలక్షలుం
ఫణిపగ ఆయుధావళుల భండన భూమిన జావ జూచియున్
వణుకది పుట్టుటం మదిన వావిరి కుందుచు నున్న ధర్మజున్

ఉ. జాడుము ధర్మమార్గ పరిజోదును చేయుము ధర్మ నందనున్
రూఢి మనస్కుడై మనము రోయక రాజ్యము యేలనౌ విధిం
నేడిట నీకునై గొనుచు నేరుపుమీరగ తోడి దెస్తి నం
చాడియుజూపి ధర్మజుని అర్జునభీముల తమ్ములిద్దతోన్

వ. అనిన యా శౌరికి శంతన నందనుం డప్పుడు-

ఆ. సర్వ వేద విదుడ సర్వ ధర్ముడ వీవ
పలుక లేకనుంటి బడలి తనువు
నీవు ఉండపలుక నేనెంత దెల్పుమా
దేవ దేవ సర్వ దేవ గావ

వ. అని పల్కుటయును.

ఉ. వేదన నొందగా నవదు బీటలు వడ్డను నీదు దేహముం
నీదగు బుద్ధినం మనము నాయను తీరున దల్చుచుండుటన్
నీదగుధర్మ మార్గమున నిల్చియు నుండిరి పాండు సూన్లనన్
సాదర ధర్మ కోవిదుడు సత్కృపజూచుచు ధర్మనందనున్

క. ధర్మా ధర్మ వివేకుడ
నిర్మల చిత్తతను నీదు నేర్పరి తనతన్

ధర్మజ! ముని మనువాడిన
ధర్మము నెరిగింతు నడువ దలపుమ బుద్ధిన్

ఆ. మేలు తనకు గోర్కె మేది నీశుడు దొల్త
దేవ భూసురాళి దీప్తమౌగ
పూజ సేయవలయు పొసగంగ నెంతయు
ధరణి పాలనంబు దలచి జనుల

ఆ. ప్రజల మనసు దెలసి పాలించు రారాజు
సిరియు సౌఖ్య తొంది చెలగి మిగుల
శాంతి దాంతి ధర్మ సౌమనశ్యుండగు
యెదురు లేక ధరణి నేలగలడు

ఆ. దండనీతి పరత ధర్మార్థ పరుడౌచు
ధరణి సురుల బ్రోచు ధరణి పాల్డు
వినుతి కెక్కు మిగుల విజ్ఞానియౌ చెంతొ
మనువు దెల్పినట్టి మార్గవిధుల

వ. నీటనగ్ని, రాలనినుము, విప్రులందు రాజు లుద్భవించు తేజులగుట సత్యము. ఆయా యా తేజములు చెల్లినచో జగతికే చేటు గూరుటనుటయు సత్యమే.

క. ఇహ పర సాధన పరుడే
మహనీయుడు ధరణి నేలు మహిమాన్వితుడున్
ఇహనుద్యోగమె తనదని
మహిజనులకు సిద్ధి గూర్ప మాధవుడనుచున్

వ. తాను నిమిత్తమాత్రుడననుచు తలంచు రాజు దండమును గొనుటయు

విప్రులలో దండనార్హుని రూపణలివిగా పలుకుట

క. శాంతుడు కానట్టి జను, న
శాంతత నెగయగను జిమ్ము శస్త్రధరుని, వే
దాంతుం డనుచు దలంపక
అంతము గావింప వచ్చు ననరే బుధులర్

వ. మరియునుంవినుము. కృతఘ్నుని, బ్రూణహత్యాపాతకుని, బ్రహ్మద్వేషిని దేశబహిష్కారము విధింపవలయునేకాని చంపరాదు. మరియును బృహస్పతి చెప్పిన నీతియ వినుమని రాజు మెత్త నయినప్రజలు దుర్మార్గ లగుదురు. నెత్తిన కెక్కుదురు. తగినవిధముగా దండించుటయే రాజనీతి. ప్రజల మనో వృత్తులను చెడునుండి మరల్చునదిగా దండనము యుండనగు . అంతేకాని తన యిష్టము వచ్చినట్లు ఉండకూడదు. ప్రజానుకూలమగు పాలనము చేయుట ధర్మము. భృత్యుల యెడ అత్యంత హర్షుడుగా నుండవలయు. తగిన పారితోషికములు ముట్ట జెప్పుటయు అవసర ము. తప్పు కలిగిన ధరణీ పతులం మరియు బంధువని, పుత్రుడని, గురుడని యెంచ వలదు. తొల్లి సగరుడు తన కొడుకసమంజసుని బౌరబాలబాధకుండగువానిని ఉద్దాలకమునినిజతనయు శ్వేతకేతునిం విప్రుల యెడ మిధ్యాపచారము గావించుట, పరిత్యజించిరి కాదె. అట్లు జేసిన రాజు కీర్తి గౌరవ పాత్రుండగునని –

క. అనువగు యాజన నిధులను
తగుగా మున్నాచరించి ధరణిజ కెల్లన్
వినయోద్ధతి వేద విహిత
వినిమయ కార్యాచరణత విజ్ఞుల జేయన్

క. సకలార్థ ధర్మ రక్షయ
అకళంకిత వర్ణ దీక్ష అనుపమ భక్తిన్
సకల జనంబుల గాచుట
వికలత్వము గాక జూడ విజ్ఞత విభుకున్

క. సంధీ విగ్రహ కార్యము
సంధింపుచు పాల్న విధుల శాత్రవు నెరిగిన్
బంధుత్వము జూపనగుచు
రంధది కాకుండ జనుల రక్షించ నగున్

క. ధనమే ముఖ్యం బనుచును
పనిగొని ఆర్జించు లుబ్ధు పరుచే కంటెన్
తనజనిచే కీడు యొడము
మనమున జింతింప నగును మరువకు మనుచున్

వ. ఇంకను అనేకమగు బృహస్పతి మహేంద్ర భరద్వాజ ప్రముఖమగు రాజధర్మాను శాసను లు రాజత్వ మూలకారణము ప్రజారక్షణమని, యెవ్విదమునైనను శత్రువులనుండి ప్రజారాజ్య రక్ష ణమే ప్రభువుల ధ్యేయమ్ము కావలయుననియును తానెరిగిన రాజధర్మ ప్రకారము యెరింగించుట యునుం–

దండనీతి జన్మ ప్రకారమెరింగించుట

క. విను కృతయుగ కాలమునం
మనుజులు ధర్మానుపరత మసలుట కతనం
మనుజేశ్వర దండనియతి
అనుమాటకు తావు లేక అవనిన యెందున్

క. ఒండొరు రక్షకు లౌచును
యుండుచు మతిమంత నీతి మోదితు లగుటన్
దుండగత లేని దగుట
దండించెడు పనియులేదు ధరణీ పతికిన్

వ. కాని కాలగతిన క్రమక్రమముగా కామ, క్రోధ, లోభ మద మాత్సర్యంబులు ఒకదాని

ననుసరించుచు మరియొకటి తోడుగా పెరుగుట కతన, ధనాభావము మెండగుటయు, జనులు ధర్మాతి క్రమణులగుచు రావ, వేదనియమములు పాటింపక యజ్ఞ యాగాదుల నిరసించుచు, స్వధర్మ నిరతులగుట ధర్మము చెడుట యెరింగిన యింద్రాది సురవర పితృగణములుకమలాసను పాలికిం జన మునిగణమ్ముల తోడవచ్చిన వారలం జూచుచు వాక్పతి కారణం బడుగ–

క. భువి జనములు మితి మీరుచు
హవిసులు సరి దీర్పకుండ అతిశయు లగుటన్
తవ సన్నిధికిటు వస్తిమి
భువి జనముల దండనాజ్ఞ పొగరది యణగన్

వ. తగురీతిని రక్షింపు మనవారల భయపడవద్దని పల్కి, ప్రతి విధానమ్ము జేసెదనని మనం బునందలంచి, స్వాభిమానమానవీయ దోదుహ్యామానద్వైదీ భావ,అహంకార, మమకార,ప్రలోభ, సంధీవిగ్రహ, యోగాసన నానా వ్యవస్థలు గల్గు ధర్మార్థ కామ మోక్ష సాధకంబులగు నూరువేలు అధ్యాయముల నొప్ప అఖిలలోక హితార్థమ్ములగు శాస్త్రము రచియించి యిది లోకచరిత్ర నిర్మ లీకరించునది యగునని యనుగ్రహించిన, ఆతనిలలాటమ్మున అనాదినినధుండును,విశ్వకర్తయు సర్వభూతాత్మకుండును, సనాతనుండునగు విరూపాక్షుం డుద్భవించి యా గ్రంథం బధిగమించి దాని నభ్యసించుటకు మనుజుల కాయుర్ వృద్ధులు చాలవనియుమ్మలించి, అమ్మహనీయ గ్రంథ మును సంక్షిప్తముగా పదివేల అధ్యాయములుగా నిర్మించుటయును–

ఆ. హరుని గ్రంథ మదియ అమరేంద్రు వలనన
ఐదు వేలగ్రంథ మగుచు వెలసె
దేవగురుడొనర్చె, ద్వి సహస్ర కాధ్యాయ
రూపమగుచు మగుడభూమిపాల

వ. దానిని శుక్రుడు, సహస్రాధ్యాయ పరిమితముజేసె మరియు మనుజ శక్తియెరింగిన మునులు సంక్షిప్త గ్రంథములు జేసి నీతి శాస్త్ర ప్రకారములు గావించుటయును దాని నమలు

పరచువాని కొకని వైన్యుండను వానిని సృజియించినవాని వంశజులు దండనీతి పారగులగుచు, దేవ సంబంధ కలితమ్మగు గుణములవెలయించుచు, నాలుగు వర్ణధర్మముల పాలించుటయును.

భీష్ముడు ధర్మరాజుకు వర్ణాశ్రమ ధర్మము లుగ్గడించుట

క. సత్యాలాపము శాంతము
అత్యాశకు పోకయుంట అవనీ జనికిన్
నిత్యమ్మాచరణీయము
అత్యుత్తత ధీరతంద్రు ఆర్యులు పెద్దల్

క. తపమును సంధ్యయు ధర్మము
అపురూప గుణము లంద్రు అవనీ సురకున్
జప హోమ దాన తర్పణ
లెపుడుం ఆచరణ డగుట యెక్కుడు గుణముల్

క. ధర్మాచరణము నృపుల, క
ధర్మము ద్రుంప నగుట తగు విధులరసిన్
ధర్మము కాపాడ్చు జను ల
ధర్ములు కాకుండ జూచ్డు దండన విథులన్

క. అనుగుణ పాలన విధముల
జనులను రంజింప జేయు జనపథు డెలమిన్
వినయుండై పెంపుగొనుచు
చనుటది మహిమాన్వితమ్ము జగతీధవుకున్

క. ధనధాన్య వ్యవసాయము
అనుకూలత దానధర్మ అవసర వడ్డీ
పనిపాటుల రాచ నగరు
అనుసంధానతయు వైశ్యు లార్జన పరతన్

క. ప్రభునికి అనుకూలుడునై
విభవుండై యుండుటదియ వేవిధములుగాన్
అభిమాన ధనుండగుటయు
అభిమతుడై వైశ్య కులుడు ఆద్యుండగుటన్

క. నాల్గవ శూద్రానీకము
ఆలంబనులై తగువిధ అవసరపనులన్
కాలము దీర్చుచు సేవల
పాలకులకు బలము గూర్చు పదవులయందున్

క. తమతమ వృత్తుల నుండుట
సమతుల్యము ధర్మమంద్రు సద్విధులగుచన్
కమనీయత నొంది మనుట
తమకంబున పోకయుంట ధన్యంబనియున్

క. గురు శుశ్రూషయు ఆగమ
మరయుచును జితేంద్రియత్వ మభిమత సిద్ధిన్
సు రుచిర భైక్షా శనముం
మరువక నాబ్రహ్మచర్య మహనీయతయున్

క. పాతివ్రత్యత సమతం
నీతిన సతితో గృహస్తు నేర్పరి అగుచున్
ఏతరుడై ఆతిధ్యత
భూతాదుల ద్రుప్తి జేయ భోగత వెలయున్

క. తలకొని గృహస్తు డాలితొ
అలనేగియు ముక్తిపరత అభిమత సిద్ధిన్

వలనొప్పగ చరియించుట
అల నా వానప్రశస్థ ఆశ్రమ మనగాన్

క. గ్రాసము వాసము లేక, గృ
హస్తుల యిండ్ల కునుయేగి అడిగియు దిను స
న్యాసాశ్రమ మండ్రు బుధులు
ధీ సమయోగ్యత అనితర దీప్తిత బుద్ధిన్

వ. అనుచు, అన్ని వర్ణాశ్రమ ధర్మముల కంటెను రాజధర్మము ప్రసిద్ధంబగుటయుం దెల్పి యింకను ప్రజా పాలనకు వలయు –

రాష్ట్రప్రజల అర్థ ధర్మములు పలుకుట

క. ప్రజలు శిష్టుని రాజుం
నిజపాలకుగా నెరుగుచు నియమితు లగుటన్
సుజనులునునై యుండు టదియ
విజయము భూపాలుకెపుడు విబుధులు పలుకన్

క. "ఆరణి" యొసగం పాళులు
ఆరింట నొకటిగ పంట, నభిమత మిడనై
ధీరమణుం డాదిమనువు
కారుణ్యము తోడ బల్కె గౌరవ మెసగన్

తే. స్వర్ణ పంట మూడవ పాలు, సగము పాడి
ఆల పశుగణ వ్యాపార మర్ధ పాలు
లాభముండంగ సమతుల్య లవణ పంట
వేర వేర్వేర ఆరడుల్ విశద పరచె

వ. ఇట్లు ప్రజలనుండి ఆరణు(పన్ను) లంగొనుచు ప్రభుడు, ధర్మపాలనా పరుండగుటయు, దండ నియత పరతంత్రతల ప్రజలు ప్రభుని యెడ భయభక్తి వినయవిశ్వాస విధేయులగుచు

సుఖ జీవనములు జేయనగుటయుందెల్పి, ఆనంద మగ్నుండగుచు ధర్మనందనుడు భీష్ముని వలన ప్రభువు ప్రజాప్రతినిధియే కాక ప్రజకు దైవసమానుడనియు, మనునిర్దేశ ధర్మశాసనము లెరింగించుటయును –

బృహస్పతి వసుమనుండను రాజునకు దెల్పిన 'ధర్మ' ప్రకారములు

వ. రాజ రక్షణ లేనట్టి రాజ్యజనులు కంచెలేని చేనువలె సూర్యుడులేని పగటి రీతి చంద్రుడు లేని రాత్రిభాతి తల్లిలేని తనయులవలె శిఖరములేని కొండవలె నీరింకిన కొలని లోని మీనుల వలె నాధుడులేని అనాధపగిది వేడిలేని యెండవలె ఊతలేక నూతబడ్డ కోతిగతి మహిమ లేని మంత్రము వలె రుచిలేని చెఱకు వలె గట్టులేని వాగువలె అడ్డుఆపులేక విలవిల్లాడుదురు. పరులచే దోచుకోబడుదురు. అరాచకులై దీనస్థితులగుదురు. దురహంకారు లగుదురు. రాజరక్షితులు సంతోషోల్లాసములతో వికాస వంతులగుదురు.

క. కావున భగవానునిగా
సేవలు జేయుచును రాజ్కు సిస్తుల నిడుచున్
పావన మతులై జనములు
భూ వసతుల ననుభవించి పొందెదు శుభముల్

వ. రాజునకు ప్రజలే శరీరము. ప్రజకు ప్రభువు ఆత్మ. కావున యీరెండును అన్యోన్యములై రక్షార్చనా విధులు నిర్వర్తించు నగునని బృహస్పతి వసుమనుండను రాజునకు చెప్పిన విషయములు భీష్ముని వలన విని, యిధిష్ఠిరుండు పరిపాలనా శత్రుంజయుడగుటకు రాజు చేయందగు విషయము లెవ్వియని యడుగ, వేదవ్రతుం డిట్టులనియె.

క, శాత్రవు పై విజయము గొన
ఆత్రుత పడకుండ రాజు ఆత్మావను దే
మాత్రము తను దాన గెలువ
మిత్రుల శత్రువుల నెరింగి మెలగుట లెస్స

వ. శత్రువులు రెండు విధములు. తనలోని శత్రువులు, బయట శత్రువులు అరిషడ్వర్గమను, కామ క్రోధ లోభ మోహ మద మాత్సర్యములు. పగ, విరోధము, తెగింపు, పూనిక, దండెత్తుట, పశు, వస్తు బలము, యివి బహిఃశత్రువులు.అంతః శత్రువులను జయించుట అనగా జితేంద్రియుడగుట, జ్ఞానేంద్రియబుద్ధిని కర్మేంద్రియములు ప్రభావములను ప్రభావితము గాకుండ ఆత్మ సంయమనము పాటించుటయే అంతఃశత్రుజయము. అంతఃశత్రువుల జయించి ప్రజాబలమును గొన్న రాజు దేహబల సంపన్నుడై బహిఃశత్రువుల జయించి విజయుడగుట సులభము. మిత్రులు మనకు అండదండలుగా నిల్చువారు బహిర్మిత్రులు. ఆర్గురే బాంధవు ల్తనకు.సత్యమే తల్లి జ్ఞానమే జనకుడగును. ధర్మమే తోడబుట్టువు. దయయహితుడు. శాంతియేధర్మచారిణి. క్షమయ కొడుకు. ఈఆర్గురును మనలోని మిత్రులు. యిది దెలిసినరాజు జయసిద్ధినొందుట తధ్యము.మరియును–

క. తన బలము నెదిరి బలమును
మనమున జింతింప కరుల మర్ధించుటకై
గొనగొనిన వాని కొప్పమి
జనియించుట తప్పదండ్రు శకుని కైనన్

వ. శాత్రవుల యందలి దోషము లెరిగి మీది కురికి వర్తించిన జయముసిద్ధించును. ముందుగా నీవు నీ కోటను శక్తివంతముగా ఆరోగ్యవంతముగా బల సమృద్ధిగా చూచుకొనుట ఆవశ్యకము. జయవిధి కార్యమున సామదాన బేధ దండోపాయ విధాలు పాటించుట శ్రేయస్కరము.రాజునకు యంత్రాంగము కంటె తంత్రాంగము లెరిగిన మంత్రాంగము ముఖ్యము. అని పల్క సంతుష్టుండై ధర్మనందనుం డడిగిన దానికి మరల గంగా నందనుండు యిట్లను–

వాయుదేవుడు పురూరవునకుం దెల్పిన రాజనీతి విషయములు

వ. శాస్త్ర సమన్వయ విజ్ఞాన పరుండయిన పురోహితు డుండుట రాజ, రాజ్య శ్రేయోదాయకము. ఆతడెట్టివాడై యుండవలెనన–

క. హితుడును మహిమాన్వితుడు
మతి మంతుడు వాక్చతురుడు మాన్యుడు బుధుడున్

అతి బోవని మిత భాషియు

ధృతిమంతౌ బ్రాహ్మణుండు దోహద పరుడున్

వ. మరియు నిస్వార్థ, సర్వజన శ్రేయోభిలాషి గావలయు-

భాండాగారము నిండింపం నగు విషయములు

క. ధనపతి నృపు నెడ భక్తియు

వినయము భయముం గలిగియు పెద్దగు బుద్ధిన్

అనునయ నమ్మక మంతుడు

తనవాడుగ నుండవలయు ధనములు గూర్పన్

క. తగవు మెయిం పక్షుడవక

తగవు ధనంబులు కొలంది తనియం అరణుల్

వగ జెందక యుండు నటుల

సగపాలుకు మించకుండ సమయాసముడై

క. ధనపతి నిపుణుం డగుచును

ధనపేటులు నింప నగుట ధన్యత వెలయన్

అనువై యుండును రాజుకు

తనియంగా జనులు సర్వ ధర్మం బనగన్

వ. ఇంకను వినుము. రాజు ధర్మకార్యము లొనరించుచు ధన లోభుండుకాక ప్రజానీకమ్ములకు అన్యోన్య హితోక్తి దానధర్మ మొసంగుటతోపాటు మహోన్నదాన సంతర్పణలొనరించుచు దేవళమ్ముల దేవతా పూజా పర్వదినమ్ముల హితోధికముగా సర్వవర్ణ విద్యా వివేక పారితోషికము లొసంగు చుండవలయు. పేదల యెడ ప్రీతి మెలగ వలయు. స్త్రీలకపచారము చేసిన వారలను శిశువృద్ధుల పాడియావుల కపకారము చేసిన యెడలనుఅందరియెదుట దండించ వలయును. త్రాగునీరు, పాడి పంటలకవసరమగు చెరువులు, కట్టలు కట్టుదిట్టముగాఉండునట్లును కోట యందు భట సందోహము యెల్లప్పుడును అప్రమత్తులై మెలగునట్లును, ఆయుధాగారములు

నిండుగా యుండునట్లును ఆహారదినుసు గిడ్డంగులు పరిపూర్ణములై ఉండునట్లును, రక్షక విధు లు నిర్వర్తించువారు, ధర్మవర్తనులుగా యుండునట్లును, పుర ప్రముఖుల కానంద వినోద కార్య క్రమములు యేర్పరచుచు నుండనగుట ప్రభువుల కర్తవ్యములని వచించిన యింకముచెప్పుమన–

కుబేర ముచికుందుల సంవాదము

క. రాజుకు హృదయము మంత్రియ
రాజరికము మంత్ర యుతము రాజ్యము జనులున్
భాజనులై వర్తించుట
భూజన సంక్షేమ మంద్రు భోగోద్భవమున్

వ. ఆ మంత్రివర్యుడు చతురుడును నేర్పరియునై–

క. ఎంతయు శాంతుడు దాంతియ
మంత్రాంగ్వానయ నిపుణుడు మహనీయుండున్
తంత్రము లేనట్టి బుధ, ని
యంత్రుడు నిర్భీతి మయుడు యద్భుత శక్తిన్

వ. తన ప్రభువు యెడల ప్రజల యెడల అభిమానుండై నిరాశ్రయులైనవారికి–

క. ఆదుకొ నవిటీ కుంటీ
బీదా బిక్కీ అనాథ పేదల నెల్లన్
ఆదరతం గూర్చనగుచు
సాదరుడై అన్నపాన సద్విధి నెల్లన్

క. ధర్మమునకు ఆకరుడై
నిర్మల మానసుడు నగుచు నీతియ దలచిన్
మర్మజ్ఞుల కంట గనుచు
దుర్మార్గుల పీచ మడచి దుఃఖము లేకన్

సమరనీతి విధము

క. సమరము సరివారి నడుమ
సముచిత మని పెద్దలంద్రు శస్త్రాస్త్ర విధిన్
విముఖునితో బోర నవదు
తమకుండై మత్తుగొన్న దయనీయునితోన్

క. తలపడిపోరుట కలిగిన
కలనం బలవంతుడౌచు ఖడ్గము లేమిన్
చలమెచ్చియు చంపనవదు
బలమరి బలవంతునైన బలహీన్ తైనన్

క. సంకుల సమరం బైనను
అంకిలి పడు శస్త్రహీను అంజలి పడుచున్
గొంకుచు భీతిలు వానిని
నుంకించం జనదు చంప నూహల నైనన్

వ. మరియు వెనుజూపిన వానిని మతి చలించిన వానిని మార్కొనని వానిని నిశ్చలుడై నిలుచున్నవానిని ఎంతటిపగవానినైనను చంపుట ధర్మముగాదు. త్రుప్పుపట్టిన లేక విషాదులుపూసిన ఆయుధములు ప్రయోగించు టధర్మము. మిత్రుని,దన్ను గాపాడినవానిని ఆయుధముతోదునుమరాదు. శత్రుపురముపై దండెత్తియు పురజనులను హింసకు గురిచేయరాదు. యుద్ధమునకేగిశత్రువుల జంపలేకున్నను వెనుతిరిగి వచ్చుటకంటె పోరాడి జచ్చుటమేలు. రాజన్నవాడు మంచమున బడి చచ్చుట కంటె నీచత యుండదు.

క. శరణాగత రక్షణమది
దురితము దొలగంగ జేయు దుఃఖము బాపున్
మరణాంతకమైననువిను
శరణాగతు రక్ష రాజ్కు సత్కీర్తొసగున్

వ. మరియు వినుమని తొల్లి త్రేతాయుగమ్మున–

ఇంద్ర అంబరీష సంభాషణము

క. జనకుడు ప్రత్యర్ధునకు
తనకును జరిగిన రణమున తాత్త్విక బుద్ధిన్
విన నాకంబును నరకము
గనుడని యోధులకు దెల్పె దారవ మొప్పన్

క. రణముత్త మంద్రు నృపులకు
రణమున జచ్చుటయు జంప రక్తము జిమ్మన్
గణనీయత పోరుటదియ
గణుతింతురు రాచకులులు ఖడ్గము బట్టిన్

వ. మానవ ప్రయత్నమునకు దైవము తోడైన సంకల్పసిద్ధి. కార్యజయము యుద్ధ విజయము దానికదంతట ఒకదానికొకటి తోడై వచ్చునని పల్కుచుతొల్లి అనేకానేక యజ్ఞములు యాగములు క్రతువులు దానధర్మములు ప్రజారంజకముగా పాలనముచేసి ఇంద్రలోకమునకుం జనిన అంబరీషుడు మహేంద్రునితోయిట్లను. మహాత్మా! ఓ కొలువులో మహోన్నతస్థితిని సింహాసనస్థుడై సుర ముని సంసేవ్యమానుడై యున్న సుదేవుండను నా అనుచరుడు నా కంటెను మహోన్నతి స్థితిని విరాజిల్లుచున్నవాడు. దీనికి కారణము దెల్పుమని వేడుటయును, అప్పుడు మహేంద్రుడాతనితో మహనీయా! వినుము. ఈ సుదేవుండు యేయజ్ఞములు యాగాదులు చేయకున్నను, శతశృంగుండను దానవేంద్రునితనయులు పదముండును విదముండును దమనుండును అనువారలుముగ్వురును–

చ. మదబల గర్వులై చనుచు మత్సర మెంతన లోకకంటకుల్
అదయత మట్టు బెట్టనయి ఆయుధ గర్వులు సత్త్వదాంతులన్
కదిసియు రండురండనుచు కావర మెంతన యుద్ధ మేర్పడన్
పదుగుర కూర్చుకుం వెడలి భండన భూమిని నిల్చియుండియున్

చ. మనమున నిల్పియుం శివుని మర్మము లేకను భక్తి యుక్తుడై
దనుజుల తోడ బోరనయి దారియు తెన్నది గాన్కయుండి, తా
అనిమొన దల్చి శాంభవుని ఆయుధ మంటక కావుమా యనన్
తనువున దాక దొక్కటియు దానవు బాణములా సుదేవునిన్

వ. ఇటుల నా దానవులుబోరి యెంతయుం అలసిసొలసిరేకాని ఆ సుదేవునిం గెల్వనేర కుండుటయెరింగించి దైవమహిమము భక్తిభావ పూజనమునందలి శక్తియుదెల్పుచుమహేంద్రు డంబరీషునితో భగవత్కృపచే సమరనివర్తనము నందును జయసిద్ధి నొందనగుననిపల్కుటయు. అనునిది.

శ్రీశ్రీ వాణీ వరప్రసాదలబ్ధ సుకవిజనప్రియ సాధుజన విధేయ శ్రీశ్రీ కవిత్రయ స్ఫూర్తి ఆర్వేల నియోగి బ్రాహ్మణ మండపాక వంశోద్భవ వీర్రాజు పౌత్ర సూర్యప్రకాశం సత్యనారాయణాంబా తనయ ప్రణీతంబైన
-: శ్రీమదాంధ్ర మహాభారత శాంతి పర్వ ద్వితీయాశ్వాసము :-

శ్రీమదాంధ్ర మహాభారతము
శాంతి పర్వ – తృతీయాశ్వాసము

శ్రీవల్లభ శాంతాకర

పావన మహనీయ తేజ భవభయ హరణా

దేవాది దేవ దేవుడ

ధీవైభవ శాంతరూప దీనశరణ్యా

క. దేవా! జనమేజయ యని

వాగ్విభ వైశంపనుండు వాకొనినట్లా

పావన గంగా సూతు, డా

పావన ధర్మజునితోడ పలికెను యిటులన్

రణానుకూల విషయా విషయిక కాల నిరూపణలు

క. వానయు యెండయు శీతువు

కానట్టి సమయ సమోష్ట కాలము నందున్

మానుగ దండెత్తి ధృతులు

పూనిక శాత్రవుల పైకి పోతగు ననికిన్

క. తనకగు సేనా వైభవ

తనుకూలత ముందు వెన్క లాలోచించిన్

వినుచును శాత్రవు దెగుటది

మనుజాధిప జయము గూర్చు మహనీయగుణా

క. అరిసేనల బలమెరుగుచు

కరిహయ అరదాది యూధ గమనము లెరిగిన్

పరిపంధుల గుట్టు లెరిగి

గురు బలముల గూర్చు నడువ గూరును జయముల్

క. అలసియు సొలసిన వేళల
సుళువగు బలయుతు నణచన శూరత కొలదిన్
వలగని చుట్టుం జుట్టియు
కలబడి పై కురికి అరుల కడదేర్పనగున్

క. సమయము ఉనికియు జూచుకు
అమలిన గుణ శౌర్య ధైర్య ఆయుధ పటుతన్
సమయుజ్జీలగు సేనలు
మమయను జగజట్టి తోడ మసలిన జయమౌ

వ. ప్రాంతీయ గుణసార విశేషములాకర్ణింపును. సింధు గాంధార దేశముల సైంధవతేజంబును, సౌవీర కురువరులు ఖడ్గ చాలనంబునను, మాళవీయులు గజయూధ రణమ్మునను యవనులు కపటోపాయ యుద్ధతంత్రజ్ఞులుగను ప్రాచ్యులు రథసేనాస్త్రచాలనంబునను పటుతరులై యుందు రట్లు ఆయ్యెవారల సత్వసంగతు లెరిగినవారల నయ్యెయూధమ్ముల నడుపవలయు జయసిద్ధికినై.

శకున సూచకములు

క. భుజ బల గర్వము లెగయం
స్వజనా చతురంగ సేన సాహసు లగుటన్
గజ జృంహిత హయ హేషలు
విజయా సూచనము లండ్రు విబుధులు పెద్దల్

వ. స్వజన సైనిక రంగముల అమితమగు ఆనందమును మరియు–

క. ఉత్సాహము సంతోషము
మత్సరమది లేక యుంట మహనీయతయున్
వత్సము రంకేయుటయును
ఉత్సవ సూచకము దెలియు ఉద్ధతి మిగులన్

క. గద ఆయుధ పాణిధరులు
ఎదురై అని కేగునపుడు యెంతయు జయమౌ
ఎదనెంచుము ఘన తూర్యము
ఎదురేమియు లేక జయము యేర్పడు ననుచున్

శత్రువుల యెడ మెలగనగు విధము

క. వగనైనను పగనైనను
పగతుర మడియుంప నగును పట్టిన పట్టున్
తగు సేనల నెగ జేయుచు
మగధీరత జూపునప్పుడె మహనీయుండౌ

క. ప్రక్కల గల శాత్రవుతో
మక్కువ మాటాడు టొప్పు మంచిగ నెంతోన్
ఎక్కువ తక్కువ నెంచుచు
నొక్కుము సమయానుకూల్త నుద్ధతు వగుచున్

క. తనవారలు పొగడొందగ
తన గొప్పలు చెప్పు కొనగ ధరణీ జనముల్
వినశాత్రవు కించపరచి
అని వీగగ జేయుటొప్పు అవనీ పతికిన్

క. పగతురు బలదుండౌ నెడ
సగజచ్చియు భీకరాన చాలగ దలచిన్
తగు విధముగ మిత్రుని వలె
అగపడుచుం సమయమెంచి అణచుట లైస్సొ

వ. అనిదెల్పిన విని శంతన నందనునితో ధర్మనందనుండు వెండియు యిట్లను.

క. ఏ పురుషం డైనను తా
దీపమునం చమురు తగ్గి తేజము గొల్పో
నా పగి దొరయం సంపద
యే పథమున దేర నగును యింగిత పరుడై

వ. అనియడుగ వినుమని, మున్ను క్షేమదర్శియను కోసలపతి రాజ్యంబుగోల్పోయి వనంబుల కేగి వగలబొందుచున్న వానికి కాలక వృష్ఠియుడను మునివరుండు దెల్పిన విధంబుగా యిట్లను. అర్ధసంపదలు శాశ్వతముకావని యెరింగిననాడు యెవ్వడును వగపు జెందదు. బుద్ధిమంతుడు కలిమిలేముల రెంటను ఉబ్బు నీరసములు ఒరయక సమతుల్యత స్థితచిత్తుండై యుండు.ధీరుడు కష్ట సుఖముల రెంటను ఒకేవిధముగా నుండును. వేసవికెండిన చెరువులు తిరిగి వర్షాకాలమున నిండినట్లు–నష్ట సమయముల సిరి తొలగిపో దైవగతి వలన సుఖసంపదలు తమకు తాముగా నింగి నుండి వానగురియునట్లు యింటగురియును. నిండును. ఆపదల కోర్చి ధైర్యమును చేకొని బలముల గూర్చికొని, రెట్టించి శాత్రవుల జయింపవలయు. సయమాను కూలముగా సంధి కొడ బడుటయు రాజనీతి.

జన గణముల పాలనా విధము

క. జనగణ పాలన విధములు
జనవరు డెరుగంగ వలయు జాగృతి తోడన్
జనగణ పెద్దల ధనముల
తనవారుగ నుండునట్లు దయగన వలయున్

క. తనజనులకు వలయునటుల
జనవరు డెల్లపుడు గూడ చాతురి తోడన్
అనతగు కార్యము లొలయుచు
మను నట్లుగ ధనములీయ మన్నన లొదవున్

ధర్మ సూక్ష్మములు

క. తల్లియు దండ్రియు గురుడును
ఉల్లమునం దైవసములు ఊర్జిత భక్తిన్
తల్లిని ఎక్కుడు జేయుచు
చెల్లించుట ధర్మమండ్రు చెప్పిన యట్టుల్

వ. దీని వలన మానవుడు ఐహికాముష్మికములు రెండును పొందనగును. లోకాగ దేవతాగ్ని సూక్త క్రమమున సత్యధర్మము సర్వ శ్రేష్టము.అనృతము పాపము. ప్రాణ మాన ధనాపహరణుల పట్ల మంచిపల్కుట పాపము. అట్టి దుర్మార్గులయెడల కఠినముగానుండి వారల నరికట్టుటపరమ ధర్మము. సర్వ భూత హిత వర్తనమున బొంకు పాపము కాదు. దుష్టశిక్షణ విధానము ధర్మసమ్మ తము. భూత పాతక సంకలి తన్యాయ నిత్య కృత్యములు మహాపాపము.

పాప నిస్తరణ ప్రకారము

క. దైవము నెంచుచు మదిలో
ఏ వడువున ధీరు ధర్మమేర్పడునను, నా
భావమ్మున జనెడు
తావలమై యుండు సర్వ ధర్మార్థులకున్

క. శాంతము శౌచ మహిం స
త్యంతము తానాచరించు అధిపుడు యెపుడున్
దాంతి క్షమాదు లందు ని
రంతర సద్గోష్ఠ్యడగుచు నిరతుం డగుచున్

క. కడుమైత్రిని దేమోత్తమ
నడిసన్నుల మెలగుచుండ్రు సద్విధ బుద్ధిన్
చెడు నిస్తరణము గావిం
చెడు పురుషోత్తము డౌచు చెలగెడు భువిలోన్

వ. అట్టివారే పాప నిరస్తరణు లగుచు దైవ సాన్నిధ్యమున కర్హులు కాగలరండని మరియు నిట్టివారల చరితలువిన్న, పాపములుతొలగి పుణ్యవంతులగుదురు జనులనిపల్కుటయు నప్పుడు ధర్మరాజు, తాతా!

క. వంచన చేయుచు జనముల
మంచిగ కన్పట్టు వారు మనలో నున్నా
మంచీ చెడ్డల రెంటిని
యెంచనగు విధమ్మదెట్లొ యేర్పడ జెపుమా!

వ. అని అడుగుటయును తద్విధము తేటపడునట్లు–

వ్యాఘ్ర – గోమాయు (గుంటనక్క) సంవాదము

వ. తొల్లి తనపూర్వజన్మ దుష్కృతములు దెల్సిన నొకగోమాయువు యీజన్మమ్మున సద్వ్రతయై మాంసాహార విసర్జితయై శాంతచిత్త ఫలాహారముల దినుచు నైష్ఠిక క్రియ నుండుటయును తోటి జంబుకములు దాని దగ్గరకుం జని, యిదేటి ఖర్మ నీకు. మా తోడ బుట్టిన దానవు మేము దెచ్చి చ్చుఫలముల దినుచుండుమన అది అట్లుకాదని తన నియతియై వర్తిల్లుటయును.బెబ్బులియొకం డు దానం జీలి జీవించిన తనను దుష్టు యనరని దలంచి చెలిమిగోరుటయును, దానిం జెరుప నెంచిన తోటి వ్యాఘ్రతండము ఎట్లైనం వీరికి విరోధము పుట్టింపనెంచిన వారలుగావున, తాము తినగా మిగిలిన యెములకల నెల్ల నా నక్క గూటిన జేర్చి ఆ నక్కపై కొండెములు చెప్పుటయును, విరోధించిన పుండరీకము, ఆగుంట నక్కను వధింపుడని తన తోడి వ్యాఘ్ర కులజులతో పల్కుట యును ఆ మాటవిన్న ఆ పులి తల్లి, తనతనయుడైన వ్యాఘ్రరాజు వద్దకు వచ్చి నీవిన్న మాటల యందలి మంచి చెడ్డల నెంచక తొందరపడి మంచిదైన ఆ ముసలి నక్కను చంపనగు ననుట పాడిగాదు. అది నీకు మేలుగాదని నుడువ నప్పుడు అది ఆలోచించి విషయములు గ్రహించి ఆ జంబుకమును మన్నించుటయును అటులనే రాజునకు సహాయ సంపన్నత ఆవశ్యకంబని దెల్పు టకు వినుమని యిట్లు చెప్ప దొడంగె.

క. తనమెడ పొడవును పొగడుకు
వెనుకొక ఉష్ట్రమ్ము మదిని వీరుడ ననుచున్
మనగం జొచ్చెను యొంటిగ
తనవారిని జేరకుండ దౌదవ్వులుగాన్

వ. తానొక్కతయే సంచరించుచుండ నొకప్పుడు పెద్దగాలి వాన సంభవించుటయు ఆ లొట్టియ తన ఉత్తమాంగమును ఒక చిన్న గుహయందు తడియకుండ దాచి నాకేమని నిద్రించిన దాని యొంటరితనముం గ్రహించి–

క. నక్క ద్వయ మొక్కటి యా
బొక్కం గలయా ఒడారి యోడం గనుచున్
చక్కగ దినగం నెంచియు
నిక్కమ యామెడను కొరికి నీల్గడ జేసెన్

వ. అని పల్కి రాజును వాడెంతటి వాడైనను యొంటరిగా నెప్పుడును సంచరించ దగదని పల్కుటయును, మరియు శత్రువు నీకంటె బలసంపదుడైనపట్టున గాలివానకు తలయొగ్గిన గడ్డి మొక్కలవలె అణగి మరల తలయెత్తికొని నిలుచుటయును, వీలైన కొండవలె చలింపక నిలబడి యుండవలయుననుటయును పల్కి మరియును తనవెనుక నంటిదిరుగు భృత్యకోటి గుణముల నెఱుగక ఉద్ధతి పదగతుల నియమించరాదనియును, తగిన గుణవంతులగు పెద్ద చేసి యుద్ధతి గావింప నగుననియు దెల్పెడి, యితి హాస కథలను దెల్పుటయును–

దండనీతి ప్రభావ మెరిగించుట

వ. దండనీతి నియతివలన (మహావిష్ణు చేతిదండము) సర్వలోక ప్రాణికోటులు శుభులైమెలగు చున్నారు. ఈ దండము నిరంతరము కాలగతుల ననుసరించి అనేకానేక రూపములుగ పేర్లు వహించి సర్వ ధర్మ సమస్థితి పరమై రాజుచే రక్షింపబడుచు ప్రజారక్షణము చేయుచుండును.

వసు హెూముడు మాంధాతృనకు జెప్పిన దండ ఉత్పత్తి క్రమము

వ. ఈ దండము సాక్షాద్విష్ణుదేవుండని తెలియనగు. తొల్లి కమలజుండు క్రతువొనరింప నెంచి

ఆత్మసంభవు క్షుతుని ఋత్విక్కుగానొనర్చి యజనం బొనర్చుచుండ సర్వజన రక్షకంబైన ఆ దండం బు అంతర్ధాన మొందుటయును దాన అజుడు పుండరీకాక్షు కడకుంజనుటయు ఆతండు కమల సంభవుతోడన పరమేష్ఠి మహాదేవు కడకుంగొంపోవ విషయము వివరింప పరమేశ్వరుడు నిజ ప్రభావమును దండంబుగా నొనర్చి జగత్రయ హితముగాబరగు వేద విద్యాదులతో సమానమై యొప్పు నీ దండనీతి విద్య యొకటని పల్కిన, శ్రీ మహావిష్ణువు ఆదండనీతి శాస్త్రమును అంగీర సునకు నీయ, ఆతం డింద్ర మరీచులకును మరీచి భృగువునకు భృగువు అనేకమునులకు నిచ్చె. ఇట్లీ దండనీతి విద్య జగంబులం బ్రవర్తిల్లె. కపర్ధి శంకరుడు. రుద్రుడు భవుడు స్థాణుండు ఉమా పతి అనుపేర్లం బరగు నద్దండదేవుని అతుల ధర్మంబున వర్తించు భూపాలు డైహికాముష్మికము లొంది సుఖించు.

భీష్ముడు ధర్మరాజునకు ధర్మార్థ కామముల నెరిగించుట

క. కాముకు డెరుగడు సుగుణము
కాముకు జేరంగ బోరు గణనీయ జనుల్
కాముకు డనర్ధ హేతువు
కామాతురుడైన నాడు కార్యము జెడనౌ

క. అర్థము ధర్మము చెడగా
వ్యర్థుండగు కాముకుండు పరమార్థములన్
స్పర్థయు యీర్ష్యయును పెరిగి
స్వార్థుండై చెడును రాజు సద్గతి లేకన్

వ. కావున భూభర్త కాముకుడు గాక ఉతితానుచితజ్ఞుండై జనరంజకుడుగా ధర్మార్థ పర తంత్రుడై మంచి పనులొనరించుచు ఉన్నత స్థితి బొందనగునని దెల్పి రాజనువాడు–

క. గుణశీలాదుల యందున
రణయుజ్వల విద్య లందు రమణీయుండై

గణుతిం బొందగ మెలగి, ధ
రణీపతి స్వాభిమాన రంజిత పరుడౌ

వ. అని పల్కుచు గుణ శీలవంతులు సర్వ సంపదలకు కాణాచులగుట నీవెరుగనిది కాదు. ఒరుసంపదల కోర్వక నసహ్యపడువాడు హీనబుద్ధిన చెడుననియును అందులకు నీ పెదతండ్రి పెద్ద కొడకు దుర్యోధనునే చెప్పుకొన వలయునని పల్కి, ఉత్తమ ధర్మము సత్యమని సత్యవంతుని శీలపరుని లక్ష్మియు సంపదలు తమంత తాముగా వరించి రాగలవనియిను, ఆలస్యమున విషాదము నొందవలసి వచ్చుననియు రాజను వాడు తన పనులయందు ఆలసింపక ముందునకు నడచుట మంచిదని పల్కెను. శీలమన యెట్టి దనిన వినుమని. సర్వభూతముల యందును సమ దృష్టి గల్గి వర్తించుట, మనో వాక్కాయ కర్మంబుల ద్రోహచింత లేకుండుట, సత్య ధర్మాను నిష్ఠ, పాపభీతి కల్గి యుండుటనియు, ఆశయుండునగును గాని దురాశ పనికి రాదనియును, దురాశ వలన దుఃఖముకల్గుననియును, సుమిత్రుండను రాజు చరిత్రముం జెప్పిన ధర్మనందనుండెంతయు సంతసించి దృప్తిదనక ఇంకను ధర్మ ప్రకారమ్ములు తెల్పుమని అడుగుటయును ధర్మసమ్మతమైన.

క. కలిమియు బలిమియు గల పతి
కలకాలము మన గలండు గర్వోన్నతిమై
కలిమియు బలిమియు చెడుచో
అలుసౌ స్వజనికిని గూడ ఆప్తియు తొలగున్

వ. అని కావ్యో పాఖ్యానమును దెల్పుట.

క. కావ్యుండను ఆటవికుడు
సవ్యంబగు బుద్ధితోడ సచివుల తోడన్
అవ్యయ సుఖ సంపదలతో
దివ్యుండై చెలగుచుండె దీప్తికి యెక్కిన్

వ. అటులతండు అందరి మన్ననలంబొందుచు నిస్వార్థుడై అనేక మంచిపనులను జేయుచు తన ధన సంపదను గోల్పోవుటచే, అది గ్రహించిన కొందరు స్వజన స్వార్థపరులు పరులతో

గూడి యుద్ధమునం ఆతని జయించి తరిమి కొట్టిరని వివరించిన కథనుదెల్పెను. కావున రాజు యెప్పుడు తన ధనాగారము నిండియుండునట్లు జాగరూకుడై ధనార్జనాపరుడుగా మెలగవలయు నని పల్కె. వెండియు యిట్లను. కాలగతుల నెరుగుచు ముందు వెనుకల నూహించు కొనుచు యుండనగునని–

మూడు చేపల యితివృత్తము నెరింగించుట

క. ఆప్తత నుండిరి ముప్పురు
దీప్తియ నా దీర్ఘదర్శి తిరమగు నీటన్
ప్రాప్తత నెంచు నొకండును
లుప్తమతియనా నతండు లోనగు మత్స్యల్

క. మారెడు కాలక్రమమున
పారెడు ఆ మధువు నీరు పారుట తగ్గన్
వారల జూచుచు అనెనా
ధీరమణుడు దీర్ఘదర్శి తిరమగు బుద్ధిన్

క. దూరము దలచుడు మదిలో
నీరము లింకుచును వచ్చె నిజమది గనుడీ
తీరదు యిటనుంట మనకు
వేరొక మడువునకు బోవ వీలది గనుడీ

క. అనుటయు నా ప్రాప్తజ్ఞుడు
జననేటికి శీఘ్రగతిని చాలగ గలరీ
వనమీ తటమున యింకం
మనమేటికి పోవనగుట మానుండనగాన్

వ. దీర్ఘదర్శి తాదలచినయట్లు–

క. చిన్నగ పారెడు నీటను
సన్నగ ఘన తటము జేరె సమయం బరసిన్
మన్నింపనివారి విడిచి
ఎన్నడు లేదనుచు భయము యేర్పడు మదితోన్

క. అంతట శీతువురాగా
వింతగు జాలములు పన్న వీలుగ వలలన్
సంతస మందుచు జాలరు
లెంతెంతన వచ్చి పడగ యేతరు లగుచున్

వ. ప్రాప్తజ్ఞుడు వారలం జూచుడు, ఆ వచ్చిన బెస్తలు వడిజని–

క. కాళ్లా వేళ్లా నీళుల
మళ్ళించుచు మీను బట్టి దొప్పల నిండా
మళ్లీ మళ్లీ యనుచును
నీళ్ళందున దూకి దూకి నిశ్చయు లెంతన్

క. చిక్కిన మత్స్యము లందాన
చిక్కిన ఆ ప్రాప్తకాల చేపయు బుద్ధిన్
నక్కియు యుండెను తక్కుచు
నిక్కము తా జారుకొనగ నేర్పరి యగుటన్

వ. మత్స్యకారులు తాబట్టిన బురద చేపల గొప్పల నెల్ల నొక పెద్ద జలాశయము నొద్దకు గొని పోయి చచ్చిన చేపల శుభ్రపరుప నెంచిన వారలగుటంగని ప్రాప్తకాలుం డల్లన చచ్చినట్లు పడి యుండుట యెరుంగ ఆ మత్స్యకారులు అద్దాన్ని చచ్చిన దానిగానెంచి ఆ జలములం పడవైచి కడుగుడు సమయమ్మున –

తే. ఎరుక లేకుండ ఆ మీను యేకతంబ
జారు కొని యేగె వేగమా జలము లందు

ప్రాప్త మై యుంట ప్రాణమ్ము బాయకుండ
ఆశ వెలుగొంద మదిలోన అహహ యనుచు

క. పట్టు పడె లుప్త బుద్ధియ
అట్టిట్టుగ జనియు గూడ ఆ జాలరుచే
ఎట్టును జన లేకుండగ
యిట్టిదె గద నీతి దెలియు యిద్ధ చరిత్రా!

వ. ఇంకను వినుమని స్పర్ధావైరులతో స్నేహ సహకారము చేయవచ్చు గాని, నమ్మరాదని–

పలిత రోమసులను ఎలుకా పిల్లుల సంవాదము

క. పలితుడు రోమసు లనియెడు
యెలుకయు పిల్లియును రెండు ఏకత నొకటన్
వలనుగ తరుమూల కలుగు
వలనుగ తరు కోటరాన పట్టుల నుండన్

క. ఆటవిక బోయజాతుడు
దీటగు ఉరువలల పన్ని దినమును యెరలన్
మాటుగ నునిచియు మరుసటి
పూటల మాటుల గలట్టి పులుగుల గొనుచున్

క. కాలము గడుపను ఎటులో
కాలవశత పడియె పిల్లి కాళ్లా ఉరులన్
వాలము తోడను మెడయుం
ఏలాయని పిల్లి వగచి యేడ్చుచు నుండన్

క. ఏలా వచ్చెనొ ఎలుకా
మూలుగు విని పిల్లి కడకు ముందుకు వచ్చిన్

ఏలా వగచెదు మిత్రమ
లీలగ దప్పింతు చూడు లెమ్మని పలుకన్

క. ఎంతో సంబర మగుటది
సంతోషించుచును పల్కె సత్వర మనుచున్
సుంతయు ఆగు మనెలుక
యెంతయు నాదాని గావ ఎరుగవె మదిలోన్

వ. అని విన నాకై ఒనగాసి యున్నది. క్రిందను ముంగియు మీదను గూబ యు, నిను జూచి కదల కున్నది లేకున్న యీ పాటికి నాపై కురుక కున్నెయనవుడు నా మార్జాల మా మూషికము తో నిట్లను.

క. నిను గాచుట నా ధర్మము
నను గావగ వచ్చినాడ నాదగు చెలిమిన్
అనుమానము వీడి కొరుకు
తునియలుగా జేయు మురుల తొలగం జేయన్

క. నాకుం భయపడి ముందుకు
రాకుండెడు గూబ ముంగి రాత్రిం బవలున్
నీ కేటికి నేనుండగ
సాకెద నా బిడ్డలాగ సమ్మతి తోడన్

వ. అనుచు ఉరులు కొరుక త్వరపెట్టుటయును, నకులము నులూకములా మూషిక మార్జాల సన్నిహిత సంభాషణములు విని, తమకిక యిటనుండుట తగదని పిల్లి వచ్చి మనలం వెంటాడి వేటాడునని భయపడి తమతమదారులం జనుటయు, పలితుండు ఒరుతారుల తెగ గొరుగ క ఆలసింప చూచుచుండుటయు నెరుంగుచు రోమసుండా పలితునితో యిట్లను. మిత్రమా!

క. నను నమ్మిన గా దోపదు
నిను జూచెద బిడ్డలాగ నిజమిది యనుటన్

విను. వైరుల నమ్మ దగదు
అని పెద్దల మాట గాదె అని యెలుకనుచున్

క. నిను గాచెద నామాటగ
గనుమా సునకమ్ము బోయ గమనపు జోరున్
అనియా యురులను కొరికెం
జనియెం ఆరోమసుండు చయ్యన యెగసిన్

వ. పలితుండును తన కలుగునందూరి సుఖంబుగ నుండె. విను మీ తెరంగున శత్రు మిత్రత్వం బు లొక్కెడ జేయ సమంబయ్యును. తిరమతి యోజచేసి చేయందగు టెంతయుంవలయు. అట్లని వైరి విరోధ భావ జనితుల పట్ల విశ్వసించి దూరము విచారించి చెలిమి చేయందగునని పల్కిన గంగాసుతునితో ధర్మనందనుండు, అవిశ్వాస విశ్వాస విషయము లెరింగింపుమని పల్కిన దానికి తగినది యీ యితిహాసము. తెరంగెరుంగుమని –

బ్రహ్మదత్త భూజనిక సంవాదము

వ. బ్రహ్మదత్తుండను వాని రాజ్యంబున భూజనికయనునది శారికపిల్లం బెంచి మంచిఫలాదులం దెచ్చి యిచ్చుచుండు. అది అందలి మంచిని యెంచి ఆరాజ కుమారునికి కిచ్చుచుండె. ఒకనాడా రాకొమరుండు దానిచెంతన లేకుండగం జూచి చారికపిల్ల మెడనులిపి చంపుటయును, దానిం దెలిసి భూజనిక తన మనంబున–

క. రాజులు రాజస వృత్తులు
రాజుల సఖ్యంబు తగదు, రాచిలుకలకున్
రాజులు హింసాపరులని
రాజుల మానసము యెట్లో రాదుగ దెలియన్

వ. అని పగ దీర్చినవిగా శారిక తన–

క. పదనఖ చెంచూ విలసన
మదయా విజృంభమాన మానస యగుచున్

ఎద పొక్కుచు నా రాసుతు
వదనాక్షుల కించపరచి పరవశ యగుచున్

వ. ఆకన వీధుల కెగసియు బ్రహ్మదత్తునితో యిట్లను–

క. చేసిన తప్పుకు తనుగా
రాసుత శిక్షింప బడియె రాజా అనుచున్
దోసము యెంచకు నాపై
నీ సుత నా శిశువు ఒకటని నిజమూహింప్మా!

వ. అనుటయుం బ్రహ్మదత్తుండు సమతా భావుండగుటం జేసి–

క. ఎటు కాదందును నిన్నుం
కటుమతి ఆ జేసినట్టి కార్యము పట్లన్
కటువని పల్కుట తగుదే
కుటిలాత్మా కుర్ర చేష్ట క్రూరత నెంచన్

వ. అనిన ఆతని కా శారిక మరల నిట్లనియె.

క. నెయ్యము చెడినం మదిలో
తియ్యదనము గోలుపోయి తెర్లుం స్పర్ధన్
ఎయ్యెడ పొసగదు సఖ్యత
సయ్యాటల చెలగు చుండు చావోరేవో

తే. మంచి మనసు కాని మర్మజ్ఞు తోడను
సఖ్య తెంచ లేము సమత గూర్ప
ఎంచరాదు మంచి యేర్పడ నొప్పదు
ఎంత వారికైన యెందు గూడ

క. స్త్రీర్థ ధరాపాల్న గతి
స్పర్ధయు కార్పణ్య గతుల సతమత మౌదున్

నిర్ధన సౌఖ్యులు అగుచుం
వ్యర్ధులుగా పొగులుచుంద్రు పాపపు జనముల్

తే. ద్వేష భావ మెదను తేజరిల్లుచు నుండ
చేటుగాదె చెలిమి చేయనగుట
మనసు నందు రగిలి మండుచు నుండవా
దారు నందు శిఖలు దొరయునట్లు

వ. కావున పగయు ద్వేషము గలతావుల సఖ్యతగా నుండ జనుట చేటు దెచ్చునదిగా యెరుంగ మనుటయును–

గణికుడు శత్రుంజయున కుపదేశించిన హితవాక్యములు

క. జనపతి వినుచును జనముల
అనయము విశ్వాస రూఢి అలవడు పగిదిన్
అనువుగ మెలగుచు తీయగ
తనకౌ విధి పనుల గొనుచు ధర్మార్థములన్

క. జ్ఞాతుల నమ్మగ వలవదు
భూతాదుల పాదుకొల్పి భోగుల జేయన్
ఏమరుడై మెలగవలయు
గోతిన దోయంగ జూత్రు కోయగ తలలన్

క. ఎప్పుడు గానీ చెయ్యకు
తప్పుడు జనములతొ జెలిమి దయనీయుడవై
సర్పంబు పడగ నీడను
కప్పది వసియించినట్లు గడవకు మదిలోన్

క. మురిపమ్ముగ మాటాడుచు
సరివారలతో చెలిమి సమగూడ దగిన్

తరి జూచి చరచు టాదిగ
అరిమూకల నెల్లవేళ్ల అణగార్చ నగున్

క. తన కార్యము నెరవేరను
అసువుగ మాటాడ దగును ఆప్తిన నృపుడున్
వినియూ వినకం యుండుట
తనకా నట్టియ జనులను తలపక మదిలోన్

క. ఒల్లని కార్యము లందున
మెల్లని మాటల వరుసన మెలగం దగుగా
యెల్లియు రేపని మాపని
మళ్ళీ మళ్ళీ యనుచును మాటాడ నగున్

క. బహుళార్ధ కార్య సంగతి
అహహా యని అడ్డదవులు అహితుల నెల్లన్
మహితోద్ధతి దెగుట సబబు
సహనాభావమ్ము వీడి సత్వర పడుచున్

క. అనలం బప్పును పగయును
కని యార్పం దీర్ప దెగక గర్విత మతియై
తనకేమని యూర కునికి
ఒనగూడదె ప్రాణహాని ఒప్పరు నిపుణుల్

క. గద్దింపక మర్దింపక
ఒద్దిక బాలురు ఖరమును యుద్ధతి గొనకన్
పెదద్దై బుద్ధికి దవ్వై
తద్దయు దన్నుం వెనుకన తరిమిన కొలదిన్

వ. అనవిని అయ్యజాత శత్రుండు వక్ర గ్రహగతిన దురితమ్ములు దొరగి కాలము దుర్భర

మైనపట్టున ద్విజాతు డెబ్బంగి బ్రతుకవలయునని అడుగుటయు, ఆపగా(దేవగంగ) తనయుండు నీయడిగిన దానికి సమాధాన మిదియని –

విశ్వామిత్ర చండాల సంవాదము నెరింగించుట

క. ఆదిన చినుకది లేకను
ఐదారేడులు ఒకటన ఔరాయనగా
ఊదర గొట్టుచు యెండలు
తాదిన దాగుటకు లేక తల్లడ పడగాన్

క. చెరువుల దొరువుల యందున
కరవౌచును నీటి చుక్క కనరాదనగా
భర మగుటయు జీవన గతి
మరణమె శరణం బగుటయు మానవ తతికిన్

క. పది యామడ దవ్వరిగిన
మది కానగరాదు నీరు మనసది రగులన్
పదపడి వడి పరుగు లిడిన
ఉదయాన్తమ గిరుల మధ్య ఊరూర్దిరుగన్

వ. అట్టియెడ దురితాపపు టెండవేడిమి భరింప శక్యము గాకుండుటయు–

క. ముదమది లేకను భువిపై
యెదియుం దోచక కటకట యేర్పడ జనముల్
ఉదకము కరవై సంధ్యకు
ఎద భీతిన మునులుగూడ యేకత గుందన్

వ. భూజనములు దయార్ధ హృదయులయ్యును పంటలు లేక ధాన్యమ్ములుకరవై గృహస్థ ధర్మముల కంతరాయము వాటిల్లి అతిథి మర్యాదలు కరవౌటయును తపనీయ ధనుండయిన విశ్వామిత్ర మునీంద్రుండు ఆకటి దప్పుల కోర్వరామి యేవెరవుం గానరాక ప్రాణమ్ము లెట్టు

నిల్పుకొందునా అనుకొనుచు-

తే. ముక్కు రంధ్రమ్ము లొరయంగ మూసి కొనుచు
తిత్తులూడ్డీసి తడియార నెత్తళించి
మాంసచయములు ప్రేవులుం మాలగాగ
పల్లవమ్ముల గదియించు నిండ్ల జేరి

తే. మాల మాదిగ పల్లెగా మదిని యెంచి
అక్కడక్కడ కాననౌ డొక్క యెముక
ముట్టె పుఱ్ఱెలు కొమ్ములం గుట్ట లరసి
ఆకలెంతయు దేవ్రించ అలమటింప

తే. అన్ని తపముల కంటెను ఆత్మ రక్ష
మిన్న యనిగాదె వేదమ్ము విన్నవించె
తనువు ప్రాణమ్ము లుండిన తపము చెల్లు
తప్పదినగ నీపలలమ్ము త్రాణబాప

తే. ప్రొద్దు పోవను చండాలు నిద్రబోవ
అవదొ పాపమ్ము దొంగిలు టవదె గొనగ
ఎట్టు లంచును చేగొన నెవడ వీవు
బనుచు తొట్టియి మాటలం అడగె నొకడు

తే. వినగ విశ్వామిత్రు దనంద్రు విమల చరిత
అనగ వినుచును చండాలు డదరి పడుచు
ఒరిగి ప్రణమిల్లి లేచియుం ఒదిగి నిలిచి
మ్రుచ్చలించితె మాంసమ్ము నిచ్చు దినగ

వ. అని వేడి కోలుగా పల్కినపుడా వాచమ్యయ విశ్వామిత్రు డాతనితో-

క. ఆకలి కోర్వని దగుటయు
నీకీగదె సత్యసంధ నాదిన యనుటన్
నీకీయన పాప మగుడు
ఆకలియది జీవకోటి కందరికొకటే

వ. మహాత్ములు మీరెరుగని ధర్మము లెందునులేవు. ఐనను యీ పీనుగునం జుళ్ళ దిననంటి నీ ధర్మమ్ము దొలగుదయ్యా అన్న మీదట ఆ ముని అనియెనిట్లు.

తే. ప్రాణహానియ పాపమ్ము పాతకమ్ము
నిర్మలంబైన దేహాత్మ కర్మ లెపుడు
పాప పంకిల మవ్వదు దీపమట్లు
మండి వెలుగును దీప్తిమై పండితుండు

వే. పరహితార్ధము జనునెడ పాపమవదు
అరుణ తాపాన నది నీరు ఆవిరగుచు
మరల గురుపడే వానలం వరుణ యగుచు
అన్ని విద్యల గరుపడే యెన్న గురుడు

వ. తొల్లి అగస్త్యుండు దైత్యు మాంసముం దిన లేదా మునులరక్షించు కొరకు వాని పాప మంటకపోగా, పరోపకారార్ధ పుణ్యము లభించలేదా?

క. అన విని యాచండాలుడు
మునివర నీ యిచ్చ గొనుము మోదము జెందన్
మనువులె ధర్మంబను నెడ
జనుమీ నాకేల పాప జాడ్యత పలుకన్

వ. అనిన ఆ చండాలుని సూక్ష్మ ధర్మబుద్ధికిని, వేదవిహిత, మనుధర్మ పరవర్తనా బుద్ధికిని ఆకలిదీరుట సర్వ జీవకోటి సమంజసమనియు ఆత్మ రక్షణవిధి విధానము లందు పాప పుణ్య ప్రసక్తి లేకయుండుటయు, దేటపడ, దిక్పాలకాధిపతియైన యింద్రుండు సమదృష్టి నాలోచించి వర్ష

ధారలు గురిపింప వరుణునాజ్ఞాపించుటయు వృష్టి సమన్వితయై భూమాత సర్వ సస్యసమృద్ధం బగుటయు, వినిపించి ధర్మసూక్ష్మము లిట్టివియని గ్రహింపనగునదిగా భీష్ముడు ధర్మరాజున కెరిం గించుటయును మరియు–

శరణాగత రక్షణ సుకృతము నెరింగించుట

మత్త. వానజిక్కిన బోయ ఒక్కడు వల్లమాలిన భీతితో
అన్న పానము లెవ్విలేకను ఆకలొందుచు నెంతయుం
వాన తగ్గక పొద్దు వాలగ పారజూచుచు దిక్కులం
ప్రాణ హానిని ఆలుబిడ్డల భావమందున నెంచుచున్

ఆ. శిలయె సెజ్జగాగ శీతార్తుడైనవాడు
మఱ్ఱి వటము క్రింద మారుమూల
ఒదిగి మనసదెంతొ ఉగ్రూతలూగనై
చాలదలచె నాలి సమత లేక

వ. ఆ వనదేవతల నవలోకించి ప్రకటన స్వరమ్మున భక్తి యుక్తుడై ఆ బోయ–

ఉ. గావగ రారెనను కాచియు వెచ్చన ఆకలార్చనై
యీావన మందు చిక్కువడి యింతగ కుందెదు ఆర్తిగాచనై
పావన జీవనా సరళి బంధువు రీతిగ నెంచుచున్మదిన్
దీవన లిత్రు దేవతలు దీనుని గాంచిన పుణ్య చేతకున్

వ. అనిమనోగత చింతనుడై నిదురరాక వడవడ వడంకుచు ఆ లుబ్ధకుండు ఆ మఱ్ఱి తొఱ్ఱ యందు వసియించు కపోత మొకడు తన పెంటి రాకకై ఎదురుచూచునది శోకించుమదిం–

క. నను బాసియు యింత తడవు
వనచయముల దిరుగదెపుడు వానకుదడిసిన్
ననుజుట్టియు జుట్టి దిరుగు
జన నేరదు దూరతీర జాగగు తావుల్

క. నా ప్రాణము నా స్నేహము
యే ప్రొద్దును యింత తడవు యేలనొ దెలియన్
యీ ప్రాణములున్నంతకు
యేప్రాణికి చెడ్డ గూర్చి యెరుగదు యెపుడున్

క. ఎటనీ జడిబడి వణుకుచు
ఎటనున్నదొ కట్టువడియు యేకత నాకై
చటులోద్ధతి తొట్రు వడుచు
వటవృక్షము తెలియరాక వానకు లోనై

క. సన్నుత మూర్తియ కాదే
యెన్నడు తా దినియు గూడ నెవ్వగ జెందున్
నన్నుం జూడక యున్నం
మన్నింపదు యేరినైన మసలదు సరిగా

ఆ. దాని జూడ కున్న తానిక యేలను
తనువు ధారబోతు దానికనుచు
ఒంటిగానె బతుకు రెంటను దాకదు
జాతిపక్షి దెలియ జగతియందు

వ. అనుచు పెంటిందలచి పొక్కెదు ఆ కపోతము నాలించి, ఆ బోయ వలలందు చిక్కుపడి యున్న పెంటి పావురము, పతి అనురాగ బంధ సుఖ సంపదల కెక్కిన సతిగా తన్ను తానెంత యునూహించి గొప్ప సంతోష మెసగ మనుజ భాషణమ్ముల యిట్లను.

క. ఉంటిని బోయని వలలో
కంటిం తడి పెట్టవద్దు కారణ గతికిన్
జంటగ నుంటిమి ఒకటిగ
ఒంటరి బతుకేల నంచు ఓడకు మదిలోన్

క. శాశ్వత మగునా? తనువులు
విశ్వాసము తోడగూడి విముఖత లేకన్
ఆశ్వాసించుము ఆర్తుల
శశ్వత్కీర్తుల వడయుము శమదమ పరతన్

క. శరణాగతు డీతడు మన
తరుమూలను ఆకలంచు తల్లడు డగుటన్
మరియుం చలిచే దడిసియు
ఒరుచే రక్షణము గొనగ ఓయని వగచెన్

వ. నేనీతని యురుల జిక్కువడి యుంటిని. యీతని ఆకటి చలుల ఆక్రందన వినినదానవు.

క. విన నీతని ఆక్రందన
నను గానని వాడవగుట నతలాకులతన్
విని గాదనవన వెప్పుడు
జనుమా నా మాట చొప్పు జయమౌ అనగాన్

అన విని ఆ గువ్వ యపుడు మహిమాన్విత మనుజ భాషల

క. అనురాగము ఉట్టిపడగ
తన పెంటియు బోయ వినగ దయగొను మదితో
వనజాతుడ వానదడిసి
కనవైతివి అతిథి వౌచు కళవళ పడనై

వ. అని, అప్పటి కప్పుడు ప్రక్క పల్లియ కెగసి ముక్కునం ఎండు చితుకుల నొక్క టొక్కటిగ గ్రక్కునం యేర్చి దెచ్చి అగ్ని సంగతంబైన నొకచిన్నకొరివి పుడకంగూడ కొనివచ్చి అందుజేర్చి రెక్క లల్లార్చి రగిలించి వోయన్న ఈ మంట చలిగాచు కొమ్మని అతని యాకలి బాపందెర వూహించు చుండు గానక–

క. ఖగమృగ జాతికి దాచను
అగతా నాగతము కొఱకు ఆకలి బాపన్
వగపేటికి తను విత్తును
తగ కాల్చుకు దినుమ నాదు ధర్మం బనుచున్

వ. ఆ మంటలం బడుటయు ఆ లుబ్ధకు డప్పుడు విశుద్ధాంతకుడై దానిఉదారబుద్ధి పరత్వము నకును ఆర్త రక్షా పరత్వ సిద్ధికిని అతిథిసత్కార విశిష్టతకును వెరగందుచు దయార్ధహృదయుండై తన ఉరుల నున్న పులుగుల నెల్ల విహరింప విహంగ మార్గముల బో విడచుటయు అట్లు వెలికి వచ్చిన పెంటి పావురము, ఆ బోయనితో యిట్లను.

క. నీకై మంటల బడియెం
నాకౌ నాపుంజు జావ నా తనువేలా?
నాకుం విడువక దినుమా
నీకై నా తనువు గూడ నిజమతి నిత్తున్

వ. అనుచు ఆ మంటలం బడి సహగమన యగుటయు, నా బోయండును–

క. పక్షుల జూచుకొలది
సాపేక్షత వొడము చుండె చత్తును నేనుం
ఆపేక్షత తొలగ తనువు
ఈ పక్షులె గురువు లంచు యిహపర గతులన్

వ. అని తానును ఆ అగ్నిం బడి దగ్ధం బగుటయు ఆపేక్షతో అంబర వీధులవిహరించు ఆ పార్వతీ పరమేశ్వరులు ఆ జీవుల పరోపకార పారీణతలనుఆత్మసిద్ధికిని ఆస్రిత రక్షాదక్షతలను అనంత అభిమాన భక్తి ప్రపత్తులకునుసంతసించిన వారై ఆ మూడు ప్రాణులకుం కైవల్య ప్రాప్తి గూర్చుటయుందెల్పి అతిథి ఆర్త రక్షా దక్షతలంగల మహిమయూ ఉగ్గడించుటయును, ధర్మరాజు సంతుష్టాంతరంగుడై తాత భీష్ములవారికి ప్రణమిల్లుటయును.

క. వినుమని మరియును పాపము
తనుదెల్సియు దెలియకున్న దరిగొని రావన్
జనపరు డెవ్విధి మసలిన
తన పాపము తొలగ నగునె తాతా అనుటన్

క. వినుమని గంగాసుతుడనె
మనమున పాపం బనునది మానగ వలయున్
తన జనముల కేది వలయొ
జనవరు డెరుగుచును జేయ జయమౌ జగతిన్

క. తన జేసిన ఘన కార్యము
మనముల బొగడంగ వలయు మాన్యులు జనముల్
వినుతింపను మంచిదనగ
తనకైనను చెడ్డకొంత దలపక విభుడున్

సీ. శ్రీమంతుడై గూడ చెలగి యుజ్వలు డౌచు
మంచి యెర్గుచు చాల మనుజ విభుడు
దయ గొను మది తోడ ధర్మంబు దలచుచు
జనుల మంచికి యౌచు చనవిభుండు
యజన యాగాదులా యధ్వరుం డగుచును
బీద సాదల గావ ప్రీతి జూచ్చు
తీర్థ యాత్రవిధుల దీప్తిమంతుం డౌచు
పాపమ్ము దొలగనౌ ప్రాజ్ఞు డగుచు

తే. అన్ని విధముల మదినెంచి అవని జనికి
హెచ్చు గూర్చుచు జీవనం బెచ్చు గతుల

పుణ్యకార్యాలు ఒనరింప పూతుడగును
ధర్మ సమ్మత మొందనౌ నిర్మలుండు

తే. మదిని యెరిగెడు పాపమ్ము మరల మరల
జేయకుండిన అది చాలు చెడ్డ బాయు
ఒంటి నంటిని పాపమ్ము యూడి పోవు
దీప శిఖయంట ధూపమౌ తీరు గనుమ

వ. అని పల్కుచు యిట్లు తొల్లి తన కంటికొనిన బ్రహ్మహత్యా పాతకము దొలంగ పరీక్షి త్తన యుండైన జనమేజయుండు మునులవలన దెల్సినవిషయంబగుటయును యశ్వమేధం బొనరించి పూతాత్మ చరితుండై యుజ్వల మహీరాజ్యమును మరల బాలించెననియు నుడువుటయును వెం డియు–

గృధ్ర జంబుకోపాఖ్యానము దెల్పుట

క. విధిశా పట్టణ మొకటన
ముదితాత్ముల బిడ్డ డొకడుమృతుడౌటయునున్
మది గుందుచు బంధు జనము
పదిమందియు రుద్ర భూమ్కి పాడిని దేవన్

వ. అందొక వటమందున వసియించుచు నున్న గ్రద్ద యొకడు వారల దరికిం జని యేడ్చి విలపించు వారలం గని యిది యేమి–

తే. ఎంత యేడ్చిన బ్రతుకునే యింత దనుక
చచ్చి బ్రతికిన వారున్నె చాలు చాలు
వెఱ్ఱి జనములు కారొకో వింత యగుడు
యేడ్వ నేటికి మరలనై యింటి కేగ్డు

క. ఇనుడదె పొద్దది క్రుంగెడు
జన దీవిధమునను పొక్క జాగగు దనుకన్

అన గూడదు దెయ్యంబులు
చనుదేరగ వచ్చు నిజము చయ్యన జనుడీ

వ. అనుటయు నా గృధ్రము మాటలాలించి వారు పోవం బోయి లేవగడంగుటయును వారలం జూచుచు బొరియ నుండి లేచి వచ్చిన యా–

క. పీనుగుల పీకి దినియెడు
జాణగు ఒక జంబుకమ్ము జని వారలతో
మానుడు పోవం బోకుడు
యేనాడును చూడనిట్లు యేగెడు వారిన్

తే. గ్రద్ద మాటకు భీతులై కరుణ లేక
ముద్దు లొలికెడు యీ బాలు మోముగనక
పాడి వదలియు పోబోవ పాడిగాదు
కరుణ బ్రోచెడు కాలుండు కాలవశత

తే. దయయు గొంచును కాపాడ దలచి యున్న
నేమి చెప్పుదు ప్రాణాలు నిలుపు నేమొ
యేడ్వ కెవ్వరు మీరంద రిట్టులుండ
యెవ్వడును రాడు కాపాడ డెరిగి మిమ్ము

వ. కావున ప్రొద్దున్నదనుక వారు–

తే. ఆశ బుట్టుడు మదిలోన అంద రొగిని
శవము జేరువ గూర్చుండి సజల నేత్ర
ధార లొలుకంగ యేడ్వనై తరల నౌత
మరలి వచ్చియు నా గ్రద్ధ మగుడ ననియె

తే. ఏడ్వనౌతని మీరిట్లు యేమనందు
వన్నె తగ్గియు కొరదునై వాసనొచ్చె

చీము నెత్తురు నీరౌచు ఝూము అయ్యె
తనువు పాడైన ప్రాణాలు గొనుట కల్ల

తే. అసువు వీడిన శవముకై ఆశ లేల
సుగతి దానాలు చేయడొ సుందరాంగు
ఆత్మ శాంతికి గానౌచు అభిమతార్థ
కర్మ కాండల విధమునై కదలు డనగ

వ. విన విని వారల దెసగని యీ చీకు ముసలి గ్రద్ధ మూటల కేమిలెండనుచు అపుడా వృకమ్ము యిట్లను.

తే. మీకు వదలక పోవను లేక నుంట
సాకుకు గాదిటు పల్కుటల్ నాకు గూడ
ఆకలగుటయు నేనిచట ఆగ దగదు
ప్రొద్దు పోవుట గనుడదే పోవ ననుడు

వ. అనుచు బల్కిన ఆ వృకము వంకను వారల వంకను జూచుచు ఆ చీకు విహంగము ఆగి వినుండని–

తే. చచ్చి బ్రతికిన వారలుం వచ్చుటదియి
దెలియనౌ గాదె గురు పుత్రు దేడె కృష్ణ
ఆత్మ భావన పరికించి అభిమతాన
సృంజయాత్ముని బ్రతికించె సుర మునీంద్ర

తే. అనుట వినినంత వారంత అచట గూడి
శవము జేరియు బతుకాశ చావ నవక
దుఃఖ మెంతన మదిలోన దుర్భరాన
యేడ్చుచుండంగ నంతలో నినుడు క్రుంగె

వ. అయినను వారచట ఏకాగ్రచిత్తులై ఆ భక్తవ శంకరు నా బాలు బ్రతికింపవేడుకొను

చుండ, చేయునదిలేకచీకుగ్రదయు, వృద్ధ జంబుకమును, తమకనువగునట్లు వారా శవనమును వీడి బోవునట్లును, ప్రొద్దు పోకకు చింతించుచు నక్కయు–

క. గెలువం జూచెద గాగని
నిలువున బోడై విరుచుకు నెనరగు ఆకుల్
తొలగం కొమ్మలు రెమ్మలు
చలమెంతయు ఉడిగియుంట చావిది యనుచున్

క. వచ్చెం వాయువు బూరుగ
నిచ్చలతం నిలచి యుంట నీ చల బలముల్
అచ్చరు వందగ దెలిపితి
విచ్చలు పలుకకను యుండు యిహ మీదైనన్

క. అనుచుం ఉల్లం బాడియు
తనదారిన యెగసి పైకి తనకౌ గతులన్
వనవీచిక కాల విధుల
మనసౌ తావులకు జనుచు మామక జగతిన్

వ. మరియు వినుమని, పాపములకెల్ల అధిష్ఠానము లోభమనియు లోభమువలన కామ క్రోధ మోహ మద మత్సరములు సన్నిహితములగుచు వచ్చుననియు, మరియు పరధన దారా వాంఛలు రేకెత్తి, మానప్రాణాంతక నీచవృత్తుల పాల్పడజేయునని, కావున ధర్మాచరణపరుండగు పాలకుండు యెయ్యెయ్యెడలం లోభ మోహములం బుద్ధి దవులక దూరగతుల నుండువారల నియమించు కొనుచు తానును లోభగుణ దూరుండగుట కావలయుననియు, అటులుండి నాడు సుఖ సౌఖ్యములొందగలడని నుడువుటయును, సత్యధర్మ నిష్టాపరుండగుచ, శమదమాది సద్గుణ సంభరితుడైన రాజును ప్రజలును ధర్మసమ్మతులై ఇహపర సాధనాపరులుగా సుఖ సంపదలతో అలరార గలరనుటయు–

తపః ప్రభావము దెల్పుట

తే. తపము వలనను గల్గను ధర్మ నిష్ఠ
దాని వలన యింద్రియ తాల్మి వెలయు
తాల్మి దెలివొంద క్షమయు నుదాత్త మగును
క్షమన పెంపొందు ధర్మార్థ కార్యసిద్ధి

వ. అదియునుంగాక, తపము వలన సమస్థ పాపములును పటాపంచలగును సత్య శౌచము లలవడును, శాంతము అహింసాబుద్ధియు కల్గును. దేవ పిత్రు గణసేవనంబును, భూసుర ప్రశంసలును దొరకును.

సత్య స్వరూప విషయము లెరింగించుట

క. సత్యము శాంతము అనునివి
నిత్యా చరణుం డగుటను నియతోద్ధతిమై
నిత్యానందం బొటను
అత్యంతము గూరు ఆత్మ అభిమత సిద్ధుల్

వ. సమతా క్షమలును హ్రీయు తితిక్షయు ధృతియును దాన అహింసలును సత్య స్వరూపములు. వీని యాచరణయే భగవదుద్యోగము. యోగి వీనిని ధరించి యుండును.

క. సత్యమె మూలము జగతికి
సత్యమె మూలంబు ధర్మ సద్గతు లొందన్
సత్యమె యోగము సిద్ధియ
సత్యమె ధర్మార్థ బుద్ధి సర్వాత్మలకున్

వ. అసత్య మాడుట కంటే వేరు పాపమ్ములు మరి లేవు. వినుము వేయి అశ్వ మేధములైనను సత్యమునకు సాటిరావు అని పల్కుచు–

అరిషడ్వర్గము లన నేమియో యెరింగించుట

క. దుర్మద విద్యా బుద్ధులు
మర్మము మత్సరపు మోహమను నవి పెరిగిన్
ధర్మము చెడి లోభ వశత
దుర్మార్గపు కామ జనక దుర్నయి లగుచున్

వ. అజ్ఞానము వలన మానవుల యందలి కామ క్రోధ లోభ మోహ మద మత్సరములను అంతర్గత శత్రువులు అరిషడ్వర్గములు ఒకదాని కొకటి తోడుగా అనర్ధ దాయకములై సద్గుణ సాదు సాంగత్యముల కెడయై, మంచిని గననీయక తుదకు సర్వ నాశన మొందించును.

క. దీనం జెడి రా కౌరవు
లే నాడును మంచి వినక యెందరు పలుకన్
ధీనుత యీ జూద్యమ్ముల
రానీయకు మనసు నందు రంజన పరువై

వ. దుష్కర శ్వేచ్ఛావిహారి అరిషడ్వర్గుని కంటెను కీడొనరించు. అందరి మంచింగనుచు కుడువ నగువా డే లోకమ్ముల నైనను సుఖించును. కరువు కాటకములు సంభవించిననాడు రాజు ప్రజా క్షేమమరయుచు అన్నదానాది విధు లొనర్చుచు యజ్ఞ యాగాదు లొనర్పవలయు. తపదాన ధర్మ ముల వలన పాపము శమించును. అనృతము పాపం బైనను వినితా పెండిలి విత్త మాన ప్రాణ భంగముల దోషము యెంచ దగదు. చెడుగా పల్కుట కాపురుష లక్షణము. చెడు ఆపాదించుట తగనిపని, పాపము గూడను. తల్లిదండ్రుల దెస గననివాడు పతితు డగును. కుజనుల కాశ్రయ మిచ్చుట వలన కీడు గల్గు.

క. అను నా తాతకు నకులుడు
వినయత వందనము లిడుచు విజ్ఞుడ వరయన్
వినుపవె శస్త్రాస్త్ర విదుడ
ధనువుల ఖడ్గముల రెంట తరతమ గతులన్

నకులునకు ధను, ఖడ్గముల ప్రభావ ముగ్గడించుట

క. పరమేష్ఠియ సృష్టి బరపి
సురముని దనుజాది నరుల సృజియించి దగన్
నిరుపమ తేజో నిధులుగ
నిరతిక్రము లగుచు వెలయ నిర్ధారింపన్

క. భుజ బల వీర్యులు దనుజులు
అజయుల జేయుచును సురుల అలమట బెట్టన్
అజు చొప్పడు యజ్ఞ శిఖల
అజేయ భూతమ్ము ఖడ్గ అస్త్రం బనుటన్

క. ఆ ప్రజ్వలి తాకృతి నన
దిక్ప్రజ్వలితార్థ దీప్తి దివిటీ అయ్యెన్
అప్రతి హత హతులై భూ
విప్రోత్తమ జన చయమ్ము విభ్రమ మొందెన్

వ. ఇదినా కృతమే యనుచు నపుడు-

క. సుర వరుల రక్షణార్థము
ధరణీ దిక్పాల తతికి దర్శితు డగుచున్
వెరవం వలదంచు అజుడు
దురితాపోద్రవ నివారి దోర్బల యుక్తిన్

వ. అనుచు మరియు మాయా రాక్షస సంహారమునకును లోకోత్పాతమ్ముల నణంచి లోకుల రక్షించుటకును యీఖడ్గ అస్త్రముల కల్పించితిననుటయు.

క. తన చేతన ఖడ్గాస్త్రులు
మనసోల్లాసతను జూప మన్మథ దహకున్

వనజాక్షున కత డిచ్చెను
జన చేతను వెల్ల బొగడ చర్చిత గతులన్

వ. అతండా దుష్ట శిక్షణాన్విత ఖడ్గాస్త్రములు రక్షణకై మరీచుని కొసగ క్రమగతిన్ అయ్యివి, భృగు భార్గవ మునివర యింద్రులకును, యింద్రుడు లోకపాల దిక్పతులకు, వారి వలన మను ప్రభృతి మానవేంద్రులు వడసిరి. అట్లొ కులజులవలనన క్రమగతి ఖడ్గాయుధ సాంప్రదాయము. బ్రాహ్మణ ముని జనములగు క్షత్రియ ప్రవరులచే ధర్మ రక్షణార్థము ధరియింబడుటయు విశేషించి సూర్య చంద్ర క్షత్రియ కులజుల సాంప్రదాయకమై యుద్ధాదుల ఆయుధ తతులుగా ప్రవృద్ధం బగుచు నుండె.

క. మహితాస్త్ర ఖడ్గగాధల
సహితోక్తుల పలికి విన్న సమ్మతి దనరన్
మహిమాన్విత శక్తిదనరి
విహరించను మనసు బుట్టు పెద్దగ నెంతోన్

క. అను నీ దుర్వ్యధ నిర్మా
లన ఖడ్గాస్త్ర అవతరణ లాలిత కధలన్
మనమున దలచుచు కుంతీ
తనయులు విని భీష్ముని వలన తద్దయు వేడ్కన్

వ. సముచిత గౌరవ రీతుల వీడ్కొని యోగ్య వర్తనము లాచరించి, మందిరమ్ములకుం జని, వినోద గోష్టుల సమయమ్మున అందరు విదురాదుల నుపలక్షించి ధర్మార్థ కామంబుల ఉత్తమ మధ్యమాధమము నిరూపణము సేయ వేడుటయును, విదురుండు–

ధర్మార్థ కామంబుల తర తమ గతుల నిరూపణము వివరించుట

క. సత్యము వలన ధర్మము
అత్యంతము గూరుగాన అర్థము దానం

ప్రత్యుత్పన కామ్య మగుడు
అత్యంతోత్తమము సత్యమనరె బుధులిలన్

వ. సత్య ధర్మార్థ కామ్యముల యందు.

క. సత్యము ధర్మం బొకటే
నిత్యము కావవె ధనమది నియతోద్ధతిమై
ప్రత్యామ్నాయ కామ్య కలన
సత్యము తరువాతి వగును సద్ధర్మాదుల్

వ. అనుటయు–

క. విన నర్జును డనె అర్థము
జన జగతికి మూల మంద్రు చాలగ దలపన్
వనముల నున్నా కావలె
మునివరులకు గూడ ధనము యొక్కొక యెడలన్

వ. అని ధనమె ప్రధాన మగుటయును, విన వాయునందనుం డపుడు–

తే. కామ కామ్యమ్ము లొదువని కనక మేల
ఏమనందును నామది యెరుగు విధము
కామితార్థుడు కాకున్న ఘనత యేమి
కామ రసజ్ఞులే ప్రథమమౌ కడమ కంటె

వ. అనుట వినిన మాద్రీనందను యిట్లని రొకట

తే. సరి సమానము కామ్యార్థ సంవిధాన
సమ రసజ్ఞత యెంచనౌ సమయ ఫక్కి
ఉత్తమము కాదు యిది యంచు నూహజేయ
ధర్మ సమ్మత మౌనె సద్ధర్మ యోజ్న

వ. అనిన వారందరిం విని ధర్మ తనయుం డప్పుడు యిట్లను.

తే. అనఘ ధర్మార్థ కామ్యమ్ము లందు నొకటి
గొను టధమ వృత్తి రెండుగా గొనుట మధ్య
ముత్తమంబౌను గొనుటయా మూటి నొకట
సత్య ధర్మార్థ కామనా సముడు నౌచు

వ. అని వచించిన యాధర్మరాజు మాటలకు విదురుండు పల్కిన మాటకే సమ్మతియగుడు. అన్నగారితోపాటు విదురుని గూడను అభినందించినవారలై నిజాంతఃపుర మందిరముల కేగిన వారలు మరునాడు గంగాసందను యొద్దకుం జని ధర్మ నందనుండు. తాతా! యనుచుం–

క. పని పాటల నుద్యోగము
లొన గూర్చను ఎట్టివారి ఒప్పక యుండన్
మనమున చింతింప వలయు
జననాయక నాయకుండ చాలగ దలపన్

వ. అని వినయంబున అర్థించుటయును, అప్పుడు శాంతనవుం డాతనితో–

క. విను సత్కీర్తికి నెగడెడు
వినయ వివేకతయు నేర్పు విజ్ఞత వెలయన్
మన దెస భక్తి భయమ్ముల
తనదౌ ప్రాణుల నొడ్డు తాల్ముల మరియున్

శా. ధర్మా ధర్మ వివేకవంతులును సద్ధర్మార్థ నీతిజ్ఞులున్
మర్మం బింతయు లేని యుద్ధగతిం రమ్మాయంచు ఢీకొట్టుచుం
మార్మోగం అని అస్త్రశస్త్ర విధులం, మత్తేభ యూథమ్ములన్
దుర్మోహంబున దుర్వినీతి జనకం దోర్దర్పులౌ వారలన్

క. నుంచుము పనులను జయమౌ
అంచితమౌ ధర్మ మేర్చు అభిమాన్ధనులన్

కొంచెపు వారల నెంచకు
కుంచిత బుద్ధుల వలనన కూడదు దెలియన్

క. జేరన్నీయకు కుజనుల
నేరము లెంచుచును నీతి నెరుగని వారిన్
క్రూర మనస్కుల వలనను
కూరును కీడే దెలియుమ గోముఖ మెకముల్

క. అవగుణ కృతఘ్న శుంఠల
అవహిత దుర్గుణ మతిమద అపగత వాద్నా
జవసత్వము లేని జనుల
భవదీయుల నైనగాని వదలుము గొనకన్

క. మందల మత్సర బుద్ధుల
పందల నిర్వీర్య పరుల పాపాత్మకులన్
నిందుల యవినీతిపరుల
యెందును కొరగాని వార్ల నేరకు పనులన్

క. ఒప్పని వారల తమకత
చెప్పుడు మాటల వరుసన చెలగెడు వారిన్
కప్పము గట్టని వారల
నెప్పుడు నీ దరికి జేర నీయకు చెడుగౌ

వ. దీనికి తార్కాణముగా నీకొక యితిహాసము దెల్పు దాకర్ణింపుమని–

నాడీర్ఘుంగుని చరిత్రమును దెల్పుట

క. ధరణీ సుర వరు డొక్కడు
తరుణీ మణి బోయకాంత తగులము జిక్కిన్

కరకు కిరాతకు వేటల
జరియించుచు మాంసహార చరితుం డగుటన్

క. ధన కాంక్షా జనితుండయి
మనమున జింతించి చాల మగువతొ ననియెన్
కనుమదె వణిజుల తోడన
జనియెద కాకంచు బల్కి చనియెం గూడిన్

వ. అట్లేగగ గహనాంతర గిరి తరు వన సీమల విడియం. అట వనగజమ్ము వారల దరుమం తలకొక వారలు యెట నెటనో భీతి బార నీపారుడు ఉత్తర దిక్కునకు బారిపోవం బోవం.

క. కొండల కోనల నడుమన
దండిగ నొక ఆకు జొంప దగ్గర కేగన్
మెండుగ గుబురైన వటము
నుండం యా దెసకు నేగ నూడల మధ్యన్

క. అందము లొలుకుచు యెంతో
సుందర తర గూడు గూర్చు సొబగుల మూటిం
ఇందీవర పద్మభవుల
డెందమ్ముల కెక్కు బకము డిగ్గన వచ్చిన్

తే. స్వాగతించుచు వచ్చెనా సద్గుణాళి
అతిథిలై రావె యీ గూట్కి ఆప్తి గనగ
ఆప్త మిత్రమ నాకునై తృప్తి దీర
కుడిచి కూర్చొనుమా హాయి గూటి యందు

క. చూడం జూడం వత్తురు
యేడేడు జగాలవారు యిక్కడ నన్నున్

నాడీ ఝుంగం డందురు

ఆడుచు పాడుచును రారె నాకగు వారల్

వ. అని పనివారల నియమించి అతిథి మర్యాదల నాదరింప యెంతో ఆదర పూర్వకముగా ఆ బకము, ఆ పారుడు తృప్తిగొని విశ్రాంతి గొనువేళ దగ్గరగా యేగి ఆప్యాయ తుట్టిపడ–

క. ఎవ్వడ వెందుల పనిగా

యివ్వన తరు మారుమూల యేకత నన్నే

సవ్వడి విని వచ్చితిటకు

గువ్వల గలగలల మధ్య గూటిన గనగాన్

వ. అని యడిగిన అపారుండా బకోత్తమ నాడీఝుంగునితో వినుమని, తానొక బ్రాహ్మణ సంజాతుండననియు, గౌతమముని తనయుండనియు, బాల్యమున గారాబు వశమ్మున ఆడినదాటగా పాడినది పాటగా వేద ధ్యయనాది విద్యలందు విధివశమ్మున శ్రద్ధ లేక ఆటవిక బోయ జాతి వారలంగూడి వేట విద్యలందవిలి వారితోడిదే సాంగత్యముగా ఒక బోయవనితంగూడి మాంసారినై చలించుచు ఒక చో బేహార తండమ్మును జూచి ధనార్జనా పరిచింతనుండనై వారితోడంగూడిరా. ఒక యేనుగు వలన మాతండము చెల్లాచెదరై పారుటయు, నేనీగతి పోవం బోవంరా ఆదైవాను గ్రహమువలన నీయంతటి వారి యింట అతిథి నగుటయు అని పల్కిన–

క. భూసుర వగవకు మదిలో

నే సమకూర్చెద ధనములు నీకై యెంతన్

భాసురులా బ్రహ్మేంద్రులు

నా సఖు లింకేట్కి భయము నమ్ముము అనుచున్

వ. పని జనములు కొని వచ్చిన రుచికర మందాకినీ సలిల మీన వంటకములను మృదు మధుర పక్వ వన్య ఫలములను దిన ఆహారవిధి యొనర్చిచిగురుటాకు నెత్తమ్ముల నునుమెత్తని మంగళకర పూపరిమళ ద్రవ్యంబుల బాన్పున విశ్రమింపజేయ–

క. సుఖతను నిద్రించి యతడు
ముఖ మార్జన చేసి వచ్చి మోదిత హృదుడై
సఖుడా నీదగు భాగ్య
మ్ము ఖగ చర వాసులకు గాక మూడునె యొరుకున్

వ. విని సంతసించిన యానాడీర్ఘుంగ బకుండు తన అతిథితో యిట్లను–

క. విను, బుద్ధియు మిత్రుండును
కనకము అను నవియ మూడు కారక గతులీ
జనవరు దారిద్ర్య ముడుప
అనువౌనవి యంద్రు బుధులు అన్నిట నాకున్

క. మిత్రత యెక్కుడు కావున
మిత్రత పాటించి నీకు మేలగు తెరవౌ
పాత్ర విధి ననుష్ఠింతును
ఆత్రము పడకుండ జనుము అభిమత మీడేర్

వ. అనుచు పల్కి, విరూపాక్షుండను దైత్య భర్త నాసఖుండు, ఆతని కడకేగినామాటగా వచ్చిన వాడ ననుము. ఆతం డిచ్చు ధనమ్ములు పెల్లుగ నీకున్.

క. అని పంచిన జని యాతడు
వినిపించెను తనదు రాక విభువర దైత్యా
ధన మర్థిత పని వచ్చితి
అన విని మనమున గనుచును అధముం డగుటన్

క. వలనుగ నాతని చరితము
కులగోత్రము లాది తుదల కూరిమి వినియున్
వలదీ అపాత్ర దానము
తులువ తనుండగుచు మదిని దుర్నయు డగుచున్

వ. నిర్భయుడయ్యును బ్రహ్మేంద్రాదుల ఆదరణీయ బక ఝుంగుని సఖ్యతపరతం పాత్రత గొన యెంచి మదిని అతిథి మర్యాదల నాదరించి చీని చీనాంబర ఝరీ దుకూల మణిమయ సర్వాభరణ భూషితుగావించి లోనగళుల మాననీయ పసిండి పళ్లెరమున పంచభక్ష్య పరమాన్నం బులు గుడిపి (కార్తీక పౌర్ణమీ పర్వ భూసుర సహస్ర భోజన పంక్తిన) ప్రమదానందపారవశ్యము లు మునుగ కనకరాశి సంచియు నొకటి దక్షిణగా నొసంగికుడిచిన పళ్లెరమునుగూడ శుభ్రపరచి గొనిపోనిచ్చిన –

క. దెచ్చిన భూసురు గనుచును
మచ్చిక మాటాడి దాన్వ మహితుని బొగడిన్
వచ్చిన పని ఐనది కద
సచ్చరితా నిద్రలేచి చనగావలదో

వ. అనుచును ఆ నాడీఝంగుడు–

క. అలసట దీరం సుఖతర
జలధారల మేను దుడిచి చాలగ దనిపిన్
అల తా రెక్కల వీచియు
తలగడ తిరుగడల గూర్చి దానును నిద్రన్

నాడీఝంగుడు చచ్చియు మరల బ్రతుకుట

క. ఒరిగిన దగుటయు నిద్రకు
మరుసటి దినమున దినుట కమానుష వృత్తిన్
తెరవని చంపియు పారుడు
కొరకొర గాకాల్చి బకుని గొనియుట నేగన్

వ. అంత నా కృతఘ్నుని బట్టి దైత్యరాజు యీ పాపాత్ముని చంపి దినుండనుటయును ఆ తలారులందులకియ్య కొనక, కరకు కత్తుల కుత్తుక గోసి రక్త మోడ కుక్కల కుం నక్కలకుం దిన పారవైచిన జూచి పరుగిడి వచ్చిన ఆకుక్కలును వాని కృతఘ్నుతను పసిగట్టి ముట్టక చీదరించు

కొని యేగుటయును, దనుజ వలభుండు ఆ ఝుంగునిగుణ మెంచి అగ్ని సంస్కారము గావించి జనుటయును, ఆ మరునాడా చితాభస్మపు టెముకలపై ఒక ధేనువు పాలం గురియుటయును, దానన నాడీఝంగుడు పునర్జీవితుండగుటయును బ్రహ్మేంద్రులు వానిని ఆశీర్వదించి పంపుట యును దెల్పి శంతన నందనుండు దీనిని కృతఘ్నత యెంత నీచమో దెలిసె గదా యనుచు, వినుము. స్వామి ద్రోహము అంతకంటెను మహాపాపమని యెరుంగ నగునది యని, కృతఘ్నుల స్వామి ద్రోహుల ముఖమైనను చూడరాదనుట దెల్పిన, ధర్మనందనుం డెంతయు సంతసించి అతనికి దండ ప్రణామము లాచరించుటయును. అనునిది.

శ్రీశ్రీ వాణీ వరప్రసాదలబ్ధ సుకవిజనప్రియ సాధుజన విధేయ శ్రీశ్రీ కవిత్రయ స్ఫూర్తి ఆర్వేల నియోగి బ్రాహ్మణ మండపాక వంశోద్భవ వీర్రాజు పౌత్ర సూర్యప్రకాశం సత్యనారాయణాంబా తనయ ప్రణీతంబైన –: శ్రీమదాంధ్ర మహాభారత శాంతి పర్వ తృతీయాశ్వాసము :–

శ్రీమదాంధ్ర మహాభారతము

శాంతి పర్వ – చతుర్ధాశ్వాసము

శ్రీరమ వామాంక కలన
దారాధర సర్వలోక ధర్మోద్ధరణా
భూరమ సృష్టి స్థితి లయ
కారక శక్త్యాత్మ కుండ కరుణా లీలా!

ధర్మజునకు సర్వోత్తమ ధర్మములు దెల్పుట

క. దేవా! జనమేజయ విభు
ఆవేదన దీరునట్లు ఆప్తిని గనుచున్
ఆ వైశంపాయన ముని
ధీ విభవుడు పల్కినట్లు దీప్తిత మతియై

క. భూ రమణుడు ధర్మ తనయ
ఆరని ధర్మార్థ దృష్టి అభిమత సిద్ధిన్
గూర్చెడు విషయా విషయముల
లీ రీతిని శాంతనౌడు యెరిగించుటయున్

క. కరుణాకర ధర్మతనయ
తరతమ ధర్మమ్ము నెంచ తద్ధర్మములన్
ధరజను సకలార్థములం
పరమార్థమె పరమ ధర్మ పాలన యనుచున్

క. ధర్మా ధర్మ వివేకత
ధర్మమనేక గతులందు ధార్మిక బుద్ధిన్
నిర్మల మోక్ష ప్రదమౌ
కర్మ ఫలాపేక్ష లేని కార్యం బననౌ

క. నిష్ఫల ధర్మము లేదీ
దుష్కర సమయజ్ఞ పాల్న దుస్తర మగుడున్
పుష్పము లందలి తేనియ
దుష్కృతము కాక గొనుట దూరము దలపన్

క. ప్రియమును అప్రియ మనకం
సయోద్ధతిం గొనుచు సత్త్వసద్గుణు డౌచున్
నయవిదుడౌ వాడె ఘనుడు
నియతుండై నీతిపరత నిర్గుణు డగుచున్

క. ఇయ్యర్థము గొని దెల్పను
అయ్యరో యితిహాస మిదియ అందలి గుణమున్
నెయ్యమునం గొను నీతిన
తియ్యని బుద్ధినను జనగ ధీధుడ వగుటన్

క. పింగళ యను వేశ్య యొకతె
అంగాంగ రుచిర రమణీయ ఆత్మీయంబౌ
పొంగులు వారెడు యౌవ్వన
భంగుల భోగించు భోగ బంధీ కృతయై

క. జవ్వని మన్మథ దురితన
నివ్వటిలు నిరీక్ష తనదు చెయ్యుని కొరకై
అవ్వనితామణి చూచుచు
పువ్వులు రువ్వియును దొరిగిపోవ కినుకన్

క. మనసౌ తన సౌధమినవ
తను వాకిటులన్ని మూసి తమియది విరియన్

పని వినుచుకు పందు కొనియె
మనసున గల మాంద్య మొలిపి మానిని యగుటన్

క. అలచొప్పడు వాని పతిగ
అలవరుచుకు చిత్తశుద్ధి అన్యులగోర్కన్
వల నొప్పెడు సుఖ శాంతుల
చలమెంతన జీవితార్థ సంభరితాత్మన్

క. ఆశయ యింద్రియ జయములు
నాశన మొనరించు దుఃఖ నరకపు బాధల్
ఆశా పాశము మానవ
పాశంబులు కానరాని భవ భయదమ్ముల్

వ. అని నిశ్చయించుకొన్నదియై, యింద్రియ లోలత్వములను చీకటి యాశల వైదొలంగి, అంతర్గత తోజో సుఖ సంపన్న జ్ఞానమును వడసి సిద్ధిపొందెనని దెల్పుటయును సంతసించిన ధర్మరాజు వెండియు, నాదేవవ్రతుతో కాలక్రమగతుల భూతసంపత్తి లయంబగు కాలమాసన్న క్రియాసమయమ్ముల జనసంచయ కర్తవ్యంబు లెరింగింప వేడుటయును భీష్ముండు వినుమని.

మేధావి యను బ్రాహ్మణ కుమారుడు తండ్రితో జేసిన సంవాదము

క. కల డొక విప్ర కుమారుడు
కలతొందని సత్యమేధ కామితమొప్పన్
చరితమ్మొ కాలగతుల
చెలితమ్మది లేని తెరగు చెప్పవె తండ్రీ!

వ. అనిన వానికా తండ్రి యిట్లనియె.

క. కాలగతి పుట్టు గిట్టుపు
లీలం యొనగూడు జీవు లే యడ నొకటన్

లాలితమౌ కర్మ గతుల
మేలౌ సత్కృతిన గాదె మేలొందు తుదిన్

వ. కాలవిధి దప్పింప నెవరి తరమును కాదు. కావున పురుషుండు పురుషార్థ సంపత్తి పడసి, శమ దమాది యోగ విద్యల ననుష్ఠించి ముక్తి మార్గముల జనుట యుత్తమ మనిన ఆ తండ్రిమాటలకు మేధావి యిట్లను, తండ్రీ!

క. పుట్టువు గిట్టువు లను నివి
కట్టికుడుపు చుంటెరిగియు కలకాలంబుల్
ఎట్లను దెలియవు గూడను
పుట్టువు గిట్టువులులేని పూజిత పురుషన్

వ. తానయై యీ జగమ్ముల అండపిండ బ్రహ్మాండమ్ములు నిండి వెలుగొందు పరమాత్మ సన్నిభమైన జీవులు, మాతృగర్భములం బడినది మొదలు, ఆ జగజ్జీవుల గొనిపోవ మృత్యువు వెన్నంటి యుండు. కావున పునఃపునః జనన మరణ కార్యకారణమైన సంసార సంపర్కములేక నిస్సంగ మోక్షప్రద యోగ విద్య నవలంబింప ననుజ్ఞ యిండనుటయును.

క. అరిషడ్వర్గమ్ముల విడి
పరిశుద్ధాంతర్ముఖుడయి పోరాడు సుతునిన్
మరిమరిగా మెచ్చుకొనుచు
హరిచింతన పరుడునౌచు అడవుల కేగిన్

క. తాపస ముని జనసేవన
పాప నివర్తనపు దోవ పరహిత బుద్ధిన్
పాప నిబోధన వెల్గుల
దీపంబై వెల్గి మదిని దివ్యుండయ్యెన్

క. జనుమీ దోవం నీవును
అని పల్కెను శాంతనవుడు ఆ ధర్మజుతోన్

మునివర సేవల నెగడుచు
మను మని ఆపేక్ష తోడ మరిమరి పలుకన్

క. మరియును కలిమిని లేమిని
సరి తూచక మొగ్గె ముల్లు జరుగుచు మీద్కిన్
సరిరాదు కలిమి లేమికి
తిరమగు సద్గుణము నెంచ ధీధిత బుద్ధిన్

వ. కలిమి గలనాడు మనుజుడు మంచి చెడ్డల సరిగా నెంచలేక మదమున జిక్కి యిదియే శాశ్వత మనుకొనుచు ఆ కలిమిని కాపాడుకొనుటే ధ్యేయముగా చోరాగ్ని దుష్కర రాజసవృత్తులకు లోనగుచు మృత్యువునకు భీతిలి సుఖ శాంతులకు దూరుం దగుచు నుండు.

క. అధనుం డెప్పుడు సజ్జన
పథముల విహరించుచుండు బాధల కెడమై
అధికుండా భీతి జనక
నిధి నిక్షేపాల కొఱకు నీతిని విడకన్

క. అందరి మంచిని దలచుచు
సందడిగొని మసలుచుండు సద్విధ బుద్ధిన్
పొందికతో కార్యగతుల
తొందర పడనీయ డెపుడు దూరము గనుచున్

క. కామము సర్వారిష్టము
కామమే మూలమ్ము చెడుకు కారణమగుచున్
కామమునం నీతి చెడును
కామము వీడిన జయమగు కామ్యము దీరున్

వ. అని యెంచుచు మంకి యను నామధేయ పేద విప్రుడొకడు సద్గతి బొందె. మరియు వినుమని, శమ దమాది సద్గుణ విధానంబైన–

అజగర వ్రత విధానమును యెరింగించుట

క. అజగరు డనియెడు బాపడు
విజయుండై విషయవాంఛ విముఖుం డగుచున్
నిజమూహించుచు మనమున
అజగర విధి నిర్ణయాత్మ అభిమత సిద్ధిన్

తే. కలదు లేదను మాటయే దలప డెపుడు
దేవిరింపక నుండు తా దినగ దాచ
ఆత్మ తృప్తిని జీవించు అభిమతాన
అందినదియె తనకు నంచు ఆప్త గొనుచు

తే. శమ దమాదిగ సద్గుణాచారు డగుచు
శాంత చిత్తత సౌమ్యతల్సంతరించు్కు
నీతినియమాల జరియింప నిర్గుణాన
ఆదియె అజగర వ్రతమంద్రు ఆర్య కులులు

వ. అని తొల్లి ప్రహ్లాద కుమారునకు అజగరుండు దెల్పిన దానిని, తాత భీష్ముండు తన మనుమడు ధర్మరాజునకు అంపశయ్యా గతుండయ్యును దెల్పుటయును, వెండియు–

తే. ప్రజ్ఞ దనరిన వాడెపో ప్రాజ్ఞు డరయ
ప్రజ్ఞన వలనన గాదె యింద్రాజ్ఞ పరత
ము జ్జగమ్ముల వెలయనౌ మోద మలర
ప్రజ్ఞ గానట్టి జనుమాట పారదెందు

వ. అనవిని యాతని తోడ, దాన తప యజ్ఞ గురు శుశ్రూషాదుల వలనకల్గు పరిణితు లెట్టి వనుటయు, సుర నదీ తనయుండప్పుడు చేసిన పను లూరకపోవునే కాలగతుల మంచియు చెడుగున్, పూసిన పూవులు పిందె కాయ ఫలవిధి పరిణితి కాకం యనుచు–

తే. తెల్సికొన లే రమాయక దేశ జనులు

గాలి నెగిరెడు పక్షులాకాశ గతుల

నీట దెలియునే చేపల కెటుల బోవ

మంచి చెడుగుల దోవల మనసు లేక

వ. అనవిని ఆ ధర్మరాజు, తాతా! నీవు సర్వజ్ఞుండవు. నీదెలియని విషయములు లేవు. యీ పృధివి భూతోత్పత్తి క్రమం బెరిగింపుమన–

భూతోత్పత్తి క్రమము

వ. వినుమ. ఆది మధ్యాంత రాహిత్య అవ్యయుం దధ్యాత్మ తత్త్వవిదుడు ఆనారాయణుం డనంత శక్తిమయుడు ఆనందతేజోమయ సర్వాత్మకుండు ఆత్మాభివ్యక్తపరత ఆత్మసంయమనుం డైన ఆత్మయందు–

తే. పద్మ మొకటి బుట్టెను అందు బ్రహ్మ బుట్టె

అతని తలపుల ఆకాశ మగ్ని జలము

వాయువును భూమి. యీ యైదు వరుస వరుస

భూత పంచక మనగ నుద్భూతమయ్యె

వ. అట్టి యా పరబ్రహ్మ సర్వభూతాత్మ కుండెట్లన, శైలంబు లస్తులు, మేదిని మేరో మాంసమంబులు సముద్రము లుధిర, మాకాశం బుదరమ్ము, పవనుండు శ్వాస, మగ్ని తేజమ్ము, సరిత్తులు సిరలు, రవిచంద్రులక్షిద్వయము.ఊర్ధ్వలోకమ్ము శిరము. పాదములు పాతాళము. దిశలు బాహులుగా అనంత శక్తిమయ భూతాదుల శక్తు లక్షయ అప్రమాణ విదితమ్ములు. అనంతములును. దేవతలకు సహితము కొలత నెట్టరానివి. సర్వేసర్వత్ర నిబిడీ కృతములై యుండు నీ విశ్వమ్ము. అందుచేతనే విష్ణువునకనంతుడను పేరు సార్ధ కము అతడే జగస్వరూపుడు. మాయాతీతుడు. అన్నిమున్నుభృగువు భారద్వాజునకు కైలాస శిఖరమ్మున పలికె ననుటయు –

క. ఈ ఐదింటను కాదే

ఏదైనను పుట్టుచుండు యీ జగమందున్

జీవైక జాతి వర్ధిల్లు
భూ వైభవ మినుమడింప భోగింపంగన్

క. స్థావర జంగమ మాదిగ
జీవన వృక్షాది మనుజ జీవులు సమ్యక్
వ్యావృతము లౌచు వృద్ధిల
పావన వర్ణాశ్రమగతి భాసిల్లు గతిన్

క. బ్రాహ్మణ క్షత్రియ వైశ్య
బ్రాహ్మణ మననగు నాల్గు భాసిలు వర్ణాల్
బ్రహ్మోదిన సృష్టించెం
బ్రాహ్మీ తేజంబు మిగుల ప్రాభవ మెసగన్

వ. వేదవిద కర్మాచరణుండై సర్వజనశ్రేయోదాయకముగా బ్రహ్మజ్ఞాన యజ్ఞముల జనువాడే బ్రాహ్మణుడు. బ్రాహ్మణ ప్రగతికిని, ధర్మార్థ కామ్యవృత్తుల రక్షించుచు ధర్మక్షితి కాకుండ నెగడు వాడే క్షత్రియుడు. బ్రాహ్మణ క్షత్రియులకు అండదండలుగా జనజీవన వృతివ్యాపారముల అం కామ్యముల నెరపువాడే వైశ్యుడు. పై మూడు వర్ణముల వారికిని తన కామ్య వలన అండదం డలుగూర్చుచు పాడిపంటల ప్రగతికై శ్రమించుటయేనాల్గవజాతి కర్తవ్యము.శ్రేయోదాయకము. జీవికి జరామరణాది వ్యాధులు తప్పవు. ఆదివ్యాధులు రెండు రకములు. శారీరకములు, మా నసికములు. సుఖదుఃఖములు. స్వర్గ నరకములు. జీవుల కర్మానుగతిని అనుభవించ వలయు. సుఖ దుఃఖముల నేడ ద్రోచి శాంతి చిత్తుండై జీవించు వాడు సుఖియై ఆనందమును పొంద గలడు. నిష్కామ్యుడై వర్తించుచు తుదకు అమృత స్థితి నందుకోగలడు. గృహస్త మానవుడు తన వర్ణాశ్రమ వృత్తుల కెడగాక అతిథి అభ్యాగతుల నాదరపూర్వకముగా జూజువాడును, గురు భక్తి గల్గి సత్యధర్మములవర్తించుట ఇహపర సాధనముకాగలదు. బ్రాహ్మణుడు దేవతారా ధన మానకుండుట శ్రేయస్సు. జీవహింస ప్రాణహాని గొనువాడు పాపాత్ముడు. నరకప్రాప్తుడు పరోపకారుడు ప్రాణదాత స్వర్గప్రాప్తులు. ఆకలి గొన్న అన్నమిడుట జీవధర్మము. అనృతము,

ఆత్మ పరిత్యాగము మహాపాపములు. అహింస ఆత్మరక్షణ ఉత్తమ ధర్మము. ఆత్మ వంచన దైవ దూషణ మహాపాతకములు.

ఆచార విధు లెరింగించుట

తే. నడుచు దోవల జను లెల్ల చూడ నవగ
రచ్చ కూర్చొన వచ్చువా రాగు చోట
రాజ మార్గాల కిరుగడ రమణు లున్న
మూత్ర మొలుపంగ వలవదు మోహనాంగ

క. వద్దు సుమీ సంధ్య సమయ
నిద్దుర. ఆకలియ లే కనిష్టత దినుటల్
వద్దని కుడుచుటయు మరల
ఒద్దిక లేనట్టి మాట ఒప్పదు పలుకన్

క. పిలువని తావుల కేగం
వలవదు. వారెంతలైన పావను లైనన్
చెలిమియు బలిమియు నెరుగని
కులజుల సఖ్యంబు తగదు కూడదు బుద్ధిన్

క. మహాత్ముల బుద్ధి జనిన
దేహాత్మల యింపు సొంపు తేజము లెగయన్
స్నేహము సఖ్యత జూపర
దోహదపడు నిహ పరాలు తోడుగ నీడై

వ. అభ్యంగన స్నాన మారోగ్యకరము. చన్నీటి స్నానమ్ము సత్తువనిచ్చు. మంచి గాలి మొదటిమందెట్టి వ్యాధికిన్. సంతోషము సగము బలము. ఫల భక్షణము వ్యాధి వారింప జేయు. పక్షోపవాసముల్ వ్యాధుల మాన్పు. ఆత్మాభిమానమ్ము అన్నిటికి మిన్న.

క. సురతయు మంత్రము గోప్యత
జరుపుట మహనీయతౌను జాగృత మెంచన్
గురుజన సేవల మహిమల
తిరముగ జేరంగ నొడ్డు తీరది గనుమీ

వ. అనవిని యదిష్ఠిరుండు అధ్యాత్మ విద్య వినవలతు నన, దేవవ్రతుం డాతనితో నిట్లను దేహి తన యందలి ఆత్మాభి భోగ భాగ్యమ్ములైన విషయేంద్రియ సౌఖ్యమ్ములు సముద్రతరంగ ముల వలె అవిరామముగా యెగయు చుండు. మరియు వెనుకకు మరలి ఆ తరంగముల యందే కలసి తేలియాడుచుండు. అందు జిక్కిన దేహాత్మకు యెన్నటికిని నిశ్చలత్వము ఒన గూడదు. విషయేంద్రియి వాసనా భోగభాగ్య స్ఫురణ వీడిన జీవుడు మాత్రమే యింద్రియ వ్యాపారముల లయింప జేసుకొని నిష్కామ్య వృత్తిన (నీరు ఆవిరి అయినట్లు) పరమహంస క్రియాయోగ సిద్ధి నొందగలడు. అదే మోక్షముఅనన్య అనిర్వచనీయ ఆనంద తేజోమయ పర తత్వమేపరబ్రహ్మము. అనిఅధ్యాత్మన తత్త్వ విద్యనుసూక్ష్మముగా యెరిగించుటయును.

యమకాల మృత్యు భూ పరేక్ష్వాకుల సంవాదము

వ. తొల్లి కాలాల నిరతిశయ జప తప స్వాధ్యాయ నిరతియై కౌశికుండను మౌనిపుంగవుడు వేలవేల యేళ్లు తపో నిష్ఠా పరుండగుటయు, దానికి సంతసించిన "సావిత్రి" నిజ రూపమ్ము న ప్రత్యక్షమై–

తే. సంతతాధ్యాయ నిరతుండ సాదువాద
వేద వేదాంగ తత్త్వజ్ఞ వేత్త వగుట
తపము ఫలియించె మదిలోన దయయు గదుర
అడుగు మిచ్చెద నీ యిచ్చ అభిమతార్థ

తే. అన్న దానికి నాతండు అమ్మా నేను
కామితార్థమ్ముల నన్నియు కడకు దోస్తి
అమృతానంద పదమిమ్ము అభిమతార్థ

ధర్మ తత్పర పరమార్ధ దర్శనీయ

వ. అనిన ఆతని ధర్మగుణమునకు మెచ్చి ఆ ధర్మదేవత నీకు పుణ్యలోకములు ప్రాప్తించు గాక యనుచు–

క. నిష్కామ్య కర్మఫలము
లక్షయ పరమాత్మ పదము లందగ జేయున్
నిష్కృతి లే దనృతునకు
దుష్కర్మల వెంటనంటి దుఃఖింతు డగుగాన్

వ. నీ తపోధ్యాయన ధర్మమే నిన్ను రక్షించుననుచు, యముడు కాలుండు మృత్యువు నీ కడకు రాగలరు. వాదు సంభవమగు. సత్యవంతుడ వగుము. అని అంతర్థానమగుటయు కౌశికుండు తపో వనమున కరుగుటయును.

క. తోతెంచు యముడు కాలుడు
మృత్యువు కౌశికుని వెంట మాటల వరుసన్
ఆతిధ్యుల మంచు పలికి
మతిమంతుడ సత్యసంధ మమ్మెరుగు మయా

వ. అని తమ్మెరిగించుకొనుచు యముండు నీ తపమ్ము ఫలించెననియు, కాలుడు కాలం బైనం దోచితి ననియు, మృత్యువు కాలోచితనై నిన్ను గొనిపోవచ్చితి ననియు పల్కు నవసరం బున, తీర్థయాత్రాపరుండైన యిక్ష్వాకుండటకు వచ్చి, మునితో నున్న ఆముువ్వురం జూచి ప్రణ తుండై నిలచిన అతిథిగా నిరూపించి, కౌశికుండాదర భరితుండై–

కౌశిక – యిక్ష్వాకుల సంవాదము

క. ఇచ్చెద వేడుం డిష్టత
సచ్చరితా నాకొలంది సమ్మతి ననగా
యిచ్చుటయే గాని నృపులు
పుచ్చుకొనగ నౌదె రిలను భూసురుల కడన్

వ. అనిన యా విభున కా విప్రుండు–

క. వదిలితి మనమున కోరిక
యెద బల్కితి నిత్తు ననుచు యేర్పడ నీకున్
విదితము బల్కిన వాడను
యెది కావలె కోరుకొనుము యేర్పడ మదిలోన్

వ. పూజిత పూజారూపమ్మున యిచ్చిన యది యతిథి గొనుట యెగ్గ కాదనుటయు, అమ్మనుజపతి ఆతనితో నీవిచ్చువాడవని యేని నీ జప ఫలంబంతయును నిమ్మనిన, అట్లనే యిచ్చెదగొనుమన, నీ జప ఫలమెయ్యెది దెల్పుమన ఆ విభుండు–

క. నిరపేక్షకుడ నౌటను నే
నెరుగను నా జప ఫలమ్ము నిదియని పలుకన్
తరియగు సమయాన దెలియు
ధరణీ సురనేత ధర్మ తత్త్వజ్ఞులచేన్

వ. కావున ధర్మజ్ఞ వినుము నామాట–

క. అడిగితి నీ విచ్చితి నే
అడుగడుగున సందియమ్ము అనృత మవదే
ఉడుగుము వాదము, సత్యా
న్కెడమై జనుచో అఘమది యెంతయు దెలియన్

వ. అనిన మాట కొడంబడకుండు టసత్యమగును. ధర్మమును కాదు. వినుము. యీ భూమాత యెట్టి పాపుల నైన భరింతును కాని అసత్యవాదుల అనృత దోషుల భరియించలేనని తొల్లి పల్కినదట ఆ బ్రహ్మతో, అని అనుటయు, ధర్మదేవత ప్రత్యక్షంబై వారల సత్య నిష్ఠా జప తత్వతకు, ధర్మవర్తనకును మెచ్చి కైవల్య ప్రాప్తి నొంద గలరనుటయును, యమ కాలమృత్యువులు సత్య పరీక్షలో యిరువురును సరిసాటిగా నెగ్గిన వారనియు పల్కినంత దేవతలు వారిపై పుష్పవృష్టి గురియుటయును.

కౌశిక యిక్ష్వాకులు బ్రహ్మపద ప్రాప్తులగుట

క. గొని రా పుష్పక మింద్రుడు
తనియంగా బ్రహ్మపదము దారిన కెగయన్
ముని తన హంస లనేకత
మనమున దలచుచును బ్రహ్మమయుడై చనియెన్

క. ఆతని వెనుకన యిక్ష్వా
క్ష్వేతరుడై నడువ బ్రహ్మ మేర్చిన సుగతిన్
యేతన్మాత్రుం డరిగెను
పాతకములు లేని చోట్కి పరమాత్మ కృపన్

క. దేవత లచ్చెరు పడు చా
దేవుల నుతియించి రెంతొ దీప్తిన బొగడిన్
భావించుచు జపతపముల
గావింపం బడు సుగమ్య కామ్యత ఫలముల్

మను – బృహస్పతి (జ్ఞాన యోగ విషయ) సంవాదము

క. జ్ఞానము యోగాలన్నిట
యెన్న దగిన యోగమంద్రు యెరిగిన్ విబుధుల్
మానిత సత్కర్మ ఫలము
ధీనుత విజ్ఞాన దృష్టి తెలియం దగుటన్

వ. సృష్టి సంకల్ప నా పరమాత్మ తత్వము నుండి వెలువడిన శబ్ద బ్రహ్మము (ఓం). దాని నుండి క్రమముగా సముద్భూతములైన పంచభూత తత్త్వములైన, రస, రూప, గంధ, ఘ్రాణ స్పర్శాదుల కతీతంబై యింద్రియములకు వశము గాకయుండు. దానికి స్త్రీ పుం నృపుంసక బేధము లేక దేహాత్మబోధకం బగుచు నుండు. మరియును–

క. వల గాల యురుల చేతన
అలవడు గా పక్షి ఝషము అటవీ మృగముల్
చలముడిగియు పట్టుబడును
అల యోగము జ్ఞాన సిద్ధు లగుటను దెలియన్

వ. దీపపు వెలు గితరము ద్యోతింప జేయు నటుల సత్య దీపన యోగము మనసేంద్రియ అజ్ఞానము అపనయింప బడుననియు, తరచక పాలకుండనుండి వెన్నయు, ఖడ్దాదులచే తరువుల నుండి అగ్నియు పుట్టకుండు నటుల మనసేంద్రియముల ఆగమోక్త విధాన మధించక పరతత్వ జ్ఞానము సిద్ధింప నేరదనియు–

క. పామెరుగు పాము కాళుల
సామెతగా పలుక నగును సద్విద గతులన్
నీమం బనుయోగ విదిత
ధీమంతుం డెరుగు జ్ఞాన ధీదిత తెరవుల్

వ. గ్రహగతుల సూర్యచంద్రుల కాభాసము అప్పుడప్పు డొదవినను, స్వప్రభా ప్రసిద్ధమగు తేజోమయ కాంత్యమృత తత్త్వములకు లోటు లేనటుల జ్ఞానయోగికి అభాసము లడ్డురావు. తెలి నీటి బింబము ప్రకాశమగునటుల ప్రసన్న మానసముల జ్ఞానయోగము ప్రస్ఫుటమగుచు నుండు. పాప క్షయముల దుడిచిన అద్దమునందువలె మనమున పురుషుడు విశుద్ధ క్రియ తనుదాన గాంచగల సిద్ధినిబడయున్. సూర్యకాంతి తమమునుబాపినటుల ధ్యానముయింద్రియ గుణముల నణంచి, అంతఃశాంతుల జ్ఞాన దృక్షుల వికసింప జేయు ననుటయును.

బృహస్పతి మనువున కుపదేశించిన మాయాప్రకారము

క. మాయా మయమౌ కాలము
మాయా మయుడౌ పురుషుడు మనలో నుండీ
మాయా మయమై కంటికి
మాయా జనితమ్ము నగుచు మసలుచు నుండున్

వ. సత్త్వరజో తమోగుణ సముద్భవమునై పురుష మనముల కామ్యముల ప్రభవింప జేయుచుండు. ఇంద్రజాలముకంటెను గొప్పది. భ్రమింపజేయుట దీని గుణము. కంటికి మైపొరయి గ్రమ్మిన విధము, వైరాగ్యము బుద్ధ్యాయుధముచే విచ్ఛేదన మగునది.

క. కనకాది వివిధ మృణ్మణి
మనసిజమౌ సూత్రమట్లు మరుగున నున్నా
తను పూసల నడుమను గల
అనువుగు ఆ పురుషు నెరుగ ఆధ్య త కాదే

వ. మాయామోహ మనోభావ బుద్ధ్యహంకారసమన్వయ సద్గుణుండాతడు. మాయాతీతుడు నిర్గుణుడు నిరంకారుడు నిశ్చలుడ, నిత్యుడుసత్యుడు. అనవిని, మనువు సంతుష్టుండగుటయు విన్న పాండవాగ్రజుండు పితామహుం బ్రశంసించి, కృష్ణుని మహత్యంబు దెలియం జెప్పుమ భీష్ముండు మున్ను తా నా నారద, మార్కండేయాగస్య జామదగ్ని వ్యాస మునీంద్రులు చెప్ప వినినది యెరింగింతు వినుమని–

క. కృష్ణుడు సాక్షాద్విష్ణువు
విష్ణువు మాయా ప్రవిష్ణ వేదార్థం డా
కృష్ణుండె మద్గురుండగు
విష్ణుని యెరుగంగ వేద వేత్తవు అగుటే

వ. విష్ణువు తన మాయా వినోద ఆనంద లీలాతృష్ణం గల్పించే, తన దివ్య విభూతిన నాదిన్.

క. కల్పించెం బ్రహ్మ నతడు
కల్పించెం పంచ భూత ఖగ భూగోళాల్
అల్పము గానట్టి బహుళ
కల్పనముల జీవకోటి కల్పావధులన్

వ. బుట్టునట్లుగ సప్త మహర్షి గణములం సృజియించె, వారే మరీచియు, అత్రియు, అంగిర

సుండును, పులస్త్యుండును, బులహుండును, క్రతువును దక్షుండును అనువారలందు మరీ చికికశ్యప ప్రజాపతి జనించె. అతని వలన సురాసుర గరుడ గంధర్వ నాగ యక్షాది ప్రజాపతి గణమ్ములుద్భవించె. సూర్యుండును, అత్రి కిశోముండును ఉదయించి, సూర్య సోమాన్వయరాజ వంశములు విలసిల్లి ప్రవృద్ధమ్ములగుటయు, కాలగతుల పరస్పర విరోధ బాధా జనితమ్ము లగు టయును, విష్ణుండు, జగద్రక్షణార్థుండు గావున నిమిత్త మాత్రుండుగా అనేకానేకావతారముల నెత్తుటయు, తన లీలా విభూతు లొనరించుచుండుటయును, ఆ దేవదేవ భూతేశ్వరునిలోకులు సామాన్య మానవునిగా దలంచుటయును, తనను నమ్మి, తెల్సియుండెలియకయుఆరాధించిన వారి నెల్లర గరుణామయ దృష్టి కాచి వడబోసి తనయందు లయింప జేసికొనుటయును దెల్ప, విని ప్రీతుండై తాతకు బ్రణమిల్లిన నాతనికి భీష్ముండు మరల–

విష్ణుమాయా మహిమోన్నతుల దెల్పుట

క. విష్ణువు మాయాప్రభ వో
జిష్ణువు వేదైక వేద్య జేగీయుండౌ
విష్ణువు ఆత్మావన భా
జిష్ణువు ఆనందమయుడు జేజేపరుడున్

క. అతని మహిమలు దెలుపం
నాతరమా బ్రహ్మతరమ నాయని దెలువన్
ఏతరుడై నిండు వెలుగు
పోతరి సత్కీర్తిమయుడు భూషింప దగన్

క. అన్నిట నుండియు తానై
ఎన్నగ దెలియంగ బడుచు యెడమై మరుగై
మన్నింపుచు సర్వజ్ఞుల
తన్నమ్మినవారి తోడు తానై కనుచున్

క. లీలామానుష విగ్రహ
కాలోచిత లోకపాల కామిత ప్రదుడౌ
మేలెంచుచు కామ్యగతుల
ఆలోచనుడౌచు జనుల నాడించి తుదిన్

క. లోనడచుచు జగతిజనుల
ఏనాటికి తన్ను దెలియొ యేవిధి నైనన్
కానగ నౌచును యెల్లెడ
తానౌచును దెలియ బడడు తానుగ దెలియన్

క. ఆదియు మధ్యాంత రహిత
ఆద్యుం డఖిలాండ కోటి కాధారుండున్
నాదను వారల తోడుగ
యేదియు లేదనెడు వార్ల నేమరి యుండున్

క. రక్షకు డాతడు అఖిలము
రక్షింపను తనదు పనిగ రాజిలు చుండున్
శిక్షణ పరనైక జగ
ద్రక్షకుడై చెలగు వాడు ధర్మోద్ధరణన్

క. మనసిచ్చెను తనను గనగ
మనుజుల కెల్లరకు గూడ మమ జీవాత్మన్
మనుజులు తన్నెరుగ నగుడ
తనుదానముగ నెంచుకొనను తనువుల నున్నా

క. పరకీయుడు పాపహరుడు
పరమాత్ముడు జగతి జీవభరణుం డెరుగున్

వరదుం డిహపర గతులం
తరియింపగ జేయజాలు ధర్మాత్ముండున్

క. అక్షయ సత్త్వుడు విష్ణువు
అక్షయ సర్వాత్మకుండు అభిమత సిద్ధం
దక్షయ భూత సమన్వయ
కుక్షిం–భర భారకుండు కౌస్తుభ ధరుడున్

క. ఎవ్వడు సర్వము తానే
యెవ్వడు యీ జగములనేల నేర్పడ జేసెన్
ఎవ్వడు మిథ్యారూపకు
డెవ్వడు సుబ్రహ్మమయు డమేయుం డిలలోన్

క. దివ్యుడు దివ్యుల రక్షా
భవ్యుడు ముల్లోకవాస భారణ వహుడున్
అవ్యయ రూపాధర ధర
దేవ్యోత్తమ దేవదేవ దీప్తిత కరుడున్

ఆ. ప్రళయాంతర కాలగతిన
జలమయమౌ అవ్యయాన జను జీవనుడై
అలనా వట పత్రమ్మున
మిళమిళ జూచుచును నిద్ర మేల్కొని యుండున్

క. అంటీ అంటని భావను
డింటం బయటలను గూడ యిష్టత కొలదిన్
వెంటం దరుముచు జీవుల
కంటికి కనబడక యుండు ఘటికుం డెన్నన్

క. యోగా తీతు డనంతుడు
యోగోద్భవ మానసుం డయోగ్యుల యెదలన్
రాగోద్భవ కారకుడా
యోగిం పరమాత్మ యోగ యోనీ యోగ్యున్

క. ఇదియని కాదని దెలుపను
విదితంబౌ ఆత్మ విదుడు విశ్వేశ్వరునిన్
మదినెంతును సర్వమయుని
ఎదనిండిన భక్తి భావ యేకాత్మకునిన్

క. సత్యము తానై జగముల
నిత్యుడు ధర్మార్థ నిష్ఠ నియతుం డగునా
నిత్యుని సత్యుని అంటెద
అత్యుత్తమ యోగ యోగ్య ఆధ్యుం పరమున్

తే. అవ్యయానంద గోవింద హరి ముకుంద
ఆప్త పరమాప్త పరమేశ ఆప్త రక్ష
సాదు సంసేవనాసక్త సదయ హృదయ
దీనబాంధవ లోకేశ దీన రక్ష

క. కేశవ నారాయణ లో
కాశ్రిత భక్తాగ్రగణ్య కామిత వరదా
ఆశావహ ముక్తివరద
ఈశానుడ దనుజనాశ ఇహపర తేజా

క. శ్రీధర మాధవ రమణీ
ఆధారుడ సర్వలోక ఆశ్రిత వరదా

ఈధరణీ కాంతా భర
బాధిత కరుణావతంస భాసుర యశుడా

క. సనకస మునినాథ వినుత
అనుపమ సత్కీర్తి వరద ఆశ్రిత రక్షా
వనవాసన పాండుసుతుల
అను నిత్యము కాచినాడ అభయంకరుణా!

క. జీవాత్మకు పరమాత్ముడు
తావలమౌ తనదు యునికి తథ్యము దెలియన్
కావాలని కనగ నగునా
జీవుడు తెలియంగ నైన జేజేపరుడౌ

క. యోగాయోగ్యత ధృతి సం
యోగము దైవానురక్తి యోహెూయనగా
యోగించును జగతి జనికి
యోగము పరమాస్పదమ్ము యోగుల కెల్లన్

వ. అని తానా దేవముని నారదుండు పల్కిన విధమ్ముగా నెరింగించుటయు నువిని ధర్మనందనుండు పరమానంద భరితుండగుచు మనమ్మున తానును ఆ విష్ణుని కృష్ణుని కంజిలించుచు అనియెనిట్లు-

భీష్ముడు ధర్మజున కధ్యాత్మ తత్త్వము నెరింగించుట

క. బ్రహ్మము సర్వాత్మకమది
బ్రహ్మజ్ఞుల కెరుక యగుచు పరమై వెలుగున్
బ్రహ్మము వేదోద్భోధము
బ్రహ్మము నిర్ద్వందనీయ పశుపతి విష్ణుల్

క. కాలము తానై బరగుచు
కాలవిధుల అప్రమత్త కాలాంతకుడున్
కాలోద్భవ భూత మయుడు
కాలుడు యముడుం తగు విధకార్యము నెరుపన్

క. సర్వము తానై వెల్గుచు
ఉర్వీజన జీవులందు నుండుచు మరుగై
గర్వంబనునది యెరుగడు
నిర్వ్యాపక నిశ్చలుండు నిర్మల గుణుడున్

క. భూతాశ్రయ భూతాత్మకు
డేతరుడై సకలజీవు లేర్పడ జేసిన్
వాతోద్ధూత వికారత
పోతరుడై చెలగు దిశల పూర్వోత్తరుడై

క. తానే ప్రకృతి వికృతి
తానే అన్నిటను పొడము తానే తానే
తానే అచరా చలముల్
తానే కార్యము నకార్య తత్త్వ ము తానే

క. తానే సూర్యుడు చంద్రుడు
తానే వెన్నెలయు కాంతి తానే ఖగమున్
తానే పృధ్వియు జలమున్
తానేయీ సర్వజగతి తనయం దిముడున్

క. అన్నిటతానే అందరు
తన్నే ఉర్వీ జనముల ఊరట అనగాన్

కన్నుల కగ పడకున్నది
తన్నే కామిత వరదుడు తానే తానౌ

క. వేదము అక్షర విదితము
వేదము ఈశ్వరుడు బ్రహ్మవేద్యులు దెలియన్
వేదము ఓంకారమయము
వేదము భూజనులకెల్ల వేదన దీర్చున్

క. అనుభవయోగమె బ్రహ్మము
అనుభవమైనట్టి జనుడు అభిమత సిద్ధం
దనునది సత్యము యెడలన్
అనుమానము ఉన్నదేవు దగపడ కుండున్

వ. అని పల్కి వెండియు, భీష్ముండు –

కాల చక్ర ప్రభావము దెల్పుట

క. కాలము మారుచు నుండును
కాలము సర్వేశ్వరాంశ కాలమె యముడున్
కాలము సుఖ దుఃఖ మయము
కాలమె కష్టాల నొలుపు కారణ గతులన్

క. ప్రకృతీ పురుషుల యోగమె
సుకృతమ్మీ జగతి వెలుగ శోభస్కరమై
సకలము లీలామయమౌ
ప్రకృతీ పరమాత్మ జనక భాజను లగుటన్

క. పంచ భూతాత్మ పరతత్త్వ భాజనమ్ము
చిత్తచాంచల్య జీవాత్మ చింతజేయ

ఆత్మ తత్త్వజ్ఞ పురుషుండు అభిమతార్థ
సిద్ధిపొందించు ఆత్మైక్య సిద్ధిబొందు

క. కాలము చీకటి వెలుగుల
ఆలంబన రేయి పగలు అగునొక దినమై
చాలనమా సూర్య గమన
వీలుగ నన ఘడియ విఘడియ అనుచున్

క. అలనా దినములు యేడు
వలనొప్పగ గ్రహాల పేర్ల వారం బగుడున్
అల నాలుగు వారమ్ములు
వెలయంగా మాసమగుడు పేర్కొన నగుచున్

వ. అటుల వసంత గ్రీష్మ వర్ష శరత్ హేమంత శిశిరము(6 ఋతువులు) 12 మాసముల కాలమొక వత్సరమగును. సంవత్సరమునకు 2అయనములుగను (2 మాసములు ఒక ఋతువుగను) ఉత్తరాయణ దక్షిణాయణముమూడుకాలములు ఎండకాలము, వానాకాలము, శీతాకాలములుగను ఒకసంవత్సరమునకు 360 దినములు. యుగము. వేల వత్సరముల కాలము ఒక్కొక్క యుగ పరిమితి. కృత త్రేతా ద్వాపర కలి. అట్టి నాల్గు యుగములు కలిసి ఒక మహా యుగము. అట్టి మహాయుగములు కొన్ని కలసి మన్వంతరము. అట్టి మన్వంతరములు కొన్ని గలసిన బ్రహ్మ పగలు. దీనికి సరియగు కాలము బ్రహ్మ రాత్రి. ఇట్టి బ్రహ్మరాత్రిందివములు బ్రహ్మకు దినము. ఒక బ్రహ్మకు నూరు వత్సరముల ఆయు ప్రమాణము. అది ఒక కల్పము. ఈ కల్పకాలము యింతయని మానవ గణన కతీతము. అప్రమేయము. అనగా ఊహింప అవసరము లేనిది.

స్వప్నాద్య వ్యవస్థల నెరింగించుట

వ. స్వప్నం బనునది జీవుని సుషుప్తా వ్యవస్థల బుద్ధేంద్రియ విలయ వృత్తి. మనమున అనుభవపూర్వకముగ దోచు. మేల్కొన్న తరి భ్రాంతిదొలగి వాస్తవ స్థితగతుడగు నాజీవుడు

తత్స్వప్నము మిథ్యాసంస్కార రూపమగుటదేహి తాసాక్షీ భూతుండగమిగులున్. కలలనునవి మిథ్యామూలకములైనను ఒక్కొక్క యెడ భావి శుభాశుభ సూచకములునై వర్తిల దోచుచుండు. మరియును పురుషాంతర్గత దివ్య ప్రబోధక మగుడున్. తెలివి కల నిద్రలను అవస్థలకు చిక్క ని విజ్ఞుడు నిర్మలానంద స్వభావుడైవెలుంగు. బోధము వ్యక్తావ్యక్తములను రెండు విధములు దె లియన్, మృత్యువు సువ్యక్తము సకల జీవులయెడలన్ అవ్యక్తి మమృతత్త్వమును సాయుజ్యసిద్ధి కిమూలమునగు బుద్ధి దలంపన్.

క. అని వివరించెను భీష్ముడు
వినుమని ఆ నారాయణుండు వినవా మునులర్
తనియంగా దీప్తు డగుచు
జనవరుడా ధర్మసుతుడు సమ్మతి వినియున్

క. మిధిలా పురాధిప జనకు
అధియాత్మకు డెట్టులయ్యె ఆత్మోన్నతు డే
పథమున నెగడెం, దెల్పా
పథమున జని గొందు వరము పాపము దొలగిన్

వ. అని అడుగుటయు గంగాసుతుడా ధర్మనందనుతో యిట్లను.

క. పంచశిఖ నామధేయు
డంచితుడా జనక పురికి అరుదెంచుటయున్
సంచిత ఫలమని మనమున
యెంచుచు నా జనక విభుడు యెదురేగి గొనన్

వ. తన పట్టణమున నున్న భూసురాస్థాన మంటపమున వారలకుం బరిచయము గావిం చి గారవింప నాతండును అయ్యె భూసురాస్థాన పండితులకు సవినయుండై పల్క సంభా షణా వసరమ్ముల, వాదోపవాద విషయ విజ్ఞానమ్ముల తనవద్దనున్న నూర్వురు పండితులను పూర్వ పక్షకుంజేయు చుండుటయుం దెల్సి యాతడు పండితుడే కాక, మహావేదాంత విజ్ఞాని

యనియు నిరహంకారుండునుగా నెఱింగి జనకుండాతని వలన పరమార్థ తత్త్వోపదేశమును గొన ప్రార్థించుటయు, నాకపిలేయుండు (కపిల నామాభిదానయగు గుర ుకుటుంబిని చను గుడిచి పెరిగినవాడు గావున) ఆతని కిట్టులనియె.

కాపిలేయ (పంచశిఖుడు) – జనక సంవాదము

క. అజ్ఞాన మవిద్యయ యుం
విజ్ఞానమున కవరోధ విషయము లగుటన్
సుజ్ఞానుల బోధవలన
అజ్ఞా నంధత్వ మొలుప నగుటది లెస్సొ

క. అజ్ఞుడు యింద్రియ లోలత
సుజ్ఞానుల దెసకు బోక సుప్తుండగుచున్
విజ్ఞానమునకు నోచ, క
వజ్ఞుడుగా బాధ లొందు పామర బుద్ధిన్

వ. విషయేంద్రియ లోకజ్ఞుడు మంచి చెడ్డ లరయనేరని కర్మజీవి పునర్జన్మలకు లోనగుచు నుండు నంద్రు తత్త్వ వేత్తలయిన మునులు–

క. రాగము భోగము జాడ్యము
దోగాడుచు తను సుఖముల దుర్బల తొందిన్
మాగియు దాగిన రోగము
లోగొను నాకర్మ జీవి లోలత కొలదిన్

క. ఆత్మమయశాంతి దాంతులు
ఆత్మీయత కొలది మనుజు నభిమత మేర్చిన్
ఆత్మోన్నతి గూర్చి చెలగి
నీత్మయుగా తీర్చి దిద్దు నిశ్చల బుద్ధిన్

వ. జ్ఞానియైన ఆత్మజ్ఞుడు అశాశ్వతమైన ఐహిక సుఖముల కాశింపక పరమాత్మ తత్త్వజ్ఞ

సత్య ధర్మ నిష్ఠాపరుండై నిత్యానందమయుండగు. కావునమానవులు అజ్ఞానము తొలగం జేసుకొని ప్రజ్ఞామయుండై పరమ పద దృష్టి కల్గి విశుద్ధ కర్మల నాచరించుచుండ నగును. మరియు వైరాగ్యవంతుడు కావలయును. సాత్వికాహారుడుగా నుండుట మంచిది. కోప తాప ముల దెస మనమును పోనీరాదు. సత్యమునను ధర్మమునను అనురక్తుడుకావలయు. కామ వాంఛలకు లోనవరాదు. నియమబద్ధ శుద్ధాచారుడుగా మెలగవలయు. రాగ ద్వేష వర్జితుడు గా నుండవలెను. మనోనిగ్రహుడై యుండవలెను. యింద్రియముల లో నణచ వలెను. పరో పకార పారాయణుడై మితాహార నిద్రలు పాటించవలెను. ధ్యాన, యోగ మార్గములనవ లంబించవలయును. అట్టివారలు సుఖశాంతి సౌఖ్యములొంది సుభప్రదులుగాగలరని, తత్త్వ బోధచేయుటయును, దెల్ప వినియా ధర్మనందనుండు దేవవ్రతునితో–

క. వినుమా వ్రతస్థ లొకపరి
దినుటయు కలదనెడుమాట దీన దోషం
బన వలదో తేట పడగ
ననుటయు ధర్మజుని తోడ ననె భీష్ముడు తా

వ. వినుమా తద్ధర్మ విప్ర కామ్యార్థ వేదోక్త ప్రకార భోజనముల దోషహానియు లే దదెట్లన విను, సదోపవాసియు, సదా బ్రహ్మచారియు, అమాంసభోజనము, పంక్తి సమ గుడుచువాడు ను, అమృతాశియు, అస్వప్నుడుం గావలయు తత్స్వరూపమ్ము లెట్టివన–

సీ. దినమున కొక పరి దినుచు నియమితుడై
యుండు నాతండు, సదోపవాసి
సతి కోర్కె ఋతుకాల సంభోగ భోగ్యుండు
భవ్య శీలుడు సదా బ్రహ్మచారి
దేవ పితృ పూజాధి విధులందు యిడి మరి
మరి కుడువని వాడు అమాంస భోజి
అతిధుల గూడియు ఆదర మొప్ప స

ధ్భక్తిన గుడుచు నా పంక్తి మయుడు

తే. అర్థి కిడి ముందు తానుగా ఆఖరు దిను
ఆత్మ భాజన జీవుండు అమ్మృతాసి
సంధ్య పగళుల నిద్రింప దస్వప్న మయుడు
వీరి కంటదు దోషమ్ము వేద విధము

వ. అని దెల్పిన మన మానందిత మౌటను, మరియును కర్మల వలన గల్గు శుభా శుభ మ్ములు పురుషుడు నొందుచు నుండు కాని పురుషుండు కర్త తానగుటయు కాకుండుటయు దేటపడ నెరిగింపు మనం శాంతనవుండు,నీయర్థము దేటపడు యీ యింద్ర ప్రహ్లాద సంవాద నంబున వినుమిది యనన్.

ఇంద్ర – ప్రహ్లాద సంవాదము

క శమ దమ తత్త్వజ్ఞ వినుత
అమలుం డనహంకరుడు అమృతాత్ముండున్
సమతా ప్రహ్లాద వినుత
సమయా సమయజ్ఞ ధీరు సద్గుణశీలున్

క. అనుపమ తేజోదానవు
మన మెరుగను అంతరంగ ఆత్మోన్నతునిన్
జనవర యెగ్గది పొడమిన
కననేరవు కోపతాప కరుణా హృదయా

క. దరి జేరియు ప్రహ్లాదుని
మురిపమ్మున యింద్రుండెంతో ముచ్చట లాడ్చున్
వరదా నారాయణు నిను
దురితాత్ములు యేమనినను దుర్నయ మనకన్

క. హరిహర నారాయణ యని
మరి మరి దలచెదవు కాని మాటాడవ దే
తెరవో యూహింప నవదు
హరిహర పాదారవింద అమితోత్సాహా

వ. అనిన విని హిరణ్య కశిప నందనుం డిట్లను.

క. మంచియు చెడులుం మనుజుల
సంచిత భావముల దోచు సహవాసమునన్
ఎంచం ధనాది లేముల
నుంచి గణింపగను రాదు నూహింపంగన్

ఆ. ఏను గర్త నంచు యెరుగంగ లేమిని
గర్త యౌచు మదిని గాంచ లేని
భావమందు దలప బడకుండు నాతడు
కర్త గాడు దెలియ కార్య గతుల

తే. విధి విధానము కార్యమ్ము వెడల నడచి
తనదు మదినెంచి వర్తించు ధార్మికుండు
తనకు గాదని పనిజేయం తత్త్వవేత్త
కర్త ఎటులౌను కార్యనిర్ వర్తనుండు

తే. ఇహ మశాశ్వతమ్మని మదిం యెంచువాడ
భ్రాంతి మంతువు గాకుండ బతుకువాడ
సంతతానంద మయరూప సర్వసాక్షి
యెంచి జీవించువాడ నే కించలేక

తే. మంచి నడవిక జీవన మెంచి రాడ
సర్వ శుభముల నొడ గూర్చి సమత గూర్చు

సిరియు శ్రీహరి నామది చెలగుచుండ
అన్య చింతన మదియేల ఆత్మవిదుడ

క. అనవిని విస్మయ మందుచు
తను దానుగ మనసు నందు ధన్యుండీ తం
డని అభినందించుచు నా
వన జాక్షుని భక్త పాలు భావను డగుచున్

వ. సురపతి నిజనివాన గతి నేగుటయు, అటనుండి గార్ధభ రూపుడైన బలికడకును, సముచీనామ దానవ శ్రేష్ఠు కడకునుం జని–

క. విభవా సక్తులు మీరలు
విభవము గోల్పోయి యిట్లు వీధుల దినుచున్
అభయా సక్త యవస్థల
రభసమ్మున చూడ నవుత రాదగ దనుచున్

క. మీరిటు పోడిమి దొలగియు
ఆరాటం బుడిగి మనుట ఆశ్చర్యంబౌ
నేరని వారలు ముందెటు
దూరము గాంచంగ లేక దురపిల్లుటయున్

క. అన ఉమ్మలి యాడం విని
కనరాదేరికి విధి కృత గారడి జగతిన్
తనుదాముగ గొప్పదలచ
అనగూడదు దురభిమాన అహమని పించున్

క. మానవ దానవులొకటన
కానున్నది కాక పోదు కాదన గలమా

ఆనా డీనా డేనా
దేనిం దైవానుగతుల దీరును కర్మల్

క. ధృతి దూలగ జనదు యెవడు
మతిమంతుడు కాడు కాల మహిమదిదెలియన్
అతిపోవగ రాదుమనను
మతిమంతత దెలియ దగును మత్సర ముడిగిన్

క. సర్వము దైవాధీనము
నిర్వహణ మననది సుమ్ము నిశ్చయబుద్ధిన్
గర్వించక మది నెప్పుడు
సర్వేశ్వరు మది దలంచి సద్గుణశీలా!

క. ధృతి ధైర్యము ఆరోగ్యము
ధృతిమంతుడు కీర్తిమయుడు ధృతిగారవమున్
ధృతి పెంపుల కాకర మగు
ధృతి సర్వాభీష్టసిద్ధి ధాత్రీ జనికిన్

క. పగవారల లేవడిగతి
వగ మానము పెంపుగదుర వాసవ మదిలో
సగ జచ్చిన వాడవగుట
తగనా, దనుజోద్ధతాన తలపవె తొల్లిన్

క. కష్టము సుఖముం గూడును
ఇష్టగతుల యిహపరాల యీప్సిత్ బుద్ధిన్
దుష్టత కాకూడ దెపుడు
ఇష్టుడు వై జనుట మిన్న యిద్ధ చరిత్రా!

క. దైవమునెంచుచు మదిలో
పావనమౌ కార్యగతుల భద్రులు అగుచున్
కావర మెంచక యొక గతి
జీవించుట శుభ కరమ్ము జీవుల కెల్లన్

వ. అనిన విని పాక శాసనుండు అవ్వార లవివేక పాకమ్ముల కబ్బురపడుచు అభినందిం చుచు నిట్లనియె.

క. ఇద్ధ వివేకుడ యెంతటి
క్రుద్ధాత్ముడ నైతి నెంచ కుంచిత బుద్ధిన్
సిద్ధాత్ముడ నైతిటు నీ
సిద్ధాం త్యున్నతిని వినుడ శీలా భరణా

క. కృతకృత్యుడ నైతి దనుజ
మతిమంతుడ నీతి కరుణ మార్గాచరణా
అతి దాంతుడ సర్వసముడ
స్థిత కీర్తిన వినుత దాత సేవిత చరణా!

వ. అని పల్కి అనృత భాషణుడు కాక, దనుజారి–

క. తనుదాన అమృతమయుడౌ
దనుజు వచనామృతముల దలచుచు మదిలో
అనుమమ దాతను కీర్తిని
వినుతింపుచు యేగె దివికి వినువీధులలోన్

వ. అని యిట్లు ధర్మనందనునకు కురువంశోద్భవ భీష్ముడు పునరావృతి గావించి యా బలేంద్రాదుల సంవాద గుణ విశేషమ్ము లెరిగింప, గుణపాఠములుగా విని, తదుపరి వృత్తాంతము లెరిగింపమని ప్రార్థించుటయును.

అనునిది.

శ్రీశ్రీ వాణీ వరప్రసాదలబ్ధ సుకవి జనప్రియ సాధుజన విధేయ శ్రీశ్రీ కవిత్రయ స్ఫూర్తి ఆర్వేల నియోగి బ్రాహ్మణ మండపాక వంశోద్భవ వీర్రాజు పౌత్ర సూర్యప్రకాశం సత్యనారాయణాంబా తనయు ప్రణీతంబైన

-: శ్రీమదాంధ్ర మహాభారత శాంతి పర్వ చతుర్థాశ్వాసము :-

శ్రీ మదాంధ్ర మహాభారతము

శాంతిపర్వ – పంచమాశ్వాసము

శ్రీహరి మాయా రూపక
ఊహా జనకమ్ము సృష్టి ఊహాతీతం
చే హితమును గూర్చి దెలియ
దూహింపం లేరు జనులు యుద్భవలీలా

క. ఏమిట యీ రూపకలన
యేమిట యీ పూర్ణ నాత్మ యేకోద్భవమై
ఏమీ సృష్టి స్థితి లయ
యేమీ జనన మరణగతు లెరుగం జెపుమా

క. ఏమీ పురుష స్త్రీ యో
గ, మ్మేమీ హంకృత కృతి యేమోయేమో
యేమీ మాయా నాటక
యేమీ సంయోగ మహిమ యేర్పడ జెపుమా

శ్రీ శక్ర సంవాదము

వ. అని అడుగుటయును ఆ యుధిష్ఠిరునితో దేవవ్రతుండు యిట్టులనియె ఈ విషయమ్మున శ్రీ శక్ర సంవాదమను నొక యితిహాసమ్ము గలదు. వినిపించెద వినుమని, తొల్లి దేవసత్తముడైన నారదముని నిజేశ్చం జనువాడెందును యొకనాడు తానును మందాకినీ నదిం కృతస్నానుడై నియతి నున్నా శక్రు కడ కేగి సల్లాపానందము నొందుచున్న తరి ఆకాశ మార్గమ్మున–

క. రాకం గని రొక తేజో
రాకేందు ముఖీలలనను, రాజితమూర్తిన్
ఏకతయై దీనానత
నాకపతీ నారదులకు నతులిడు దానిన్

క. దీనాననయౌ మూర్తిని
ఆ నాకపతీంద్రు డపుడు ఆప్తత నెంచిన్
జాణపు యేకత వస్తివి
మానిత నీవేమి కతన మాకడ కొస్త్యో

క. అనవిని యా వనితామణి
నను సిరియని, లక్ష్మియనియు అనుచుందురనిన్
దనుజుల మెచ్చితి మును, వా
రనీతులవ, నీకడ కిటు అరుదెంచితనన్

క. విన సద్గుణ దాన గుణులు
మును, మిప్పు డవన్ని మరచి మూర్ఖులునై దు
ర్జను లగుటనే విముఖినై
జనుదెంచితి నీ కడ కిటు జాగృతి పరుడా

వ. సత్య ధర్మపరుండ వగుట నీ పాల వసింప రుచిపుట్టి వచ్చితి ననియు వెండియు యిట్లనె.

క. శ్రద్ధయు నీతియ ధర్మము
బుద్ధియ శాంతమును ధృతియు పూజిత గుణముల్
ఉద్ధృతి శాంతియ నున్నతి
వృద్ధిలు ననునవి మదీయ భాసుర గుణముల్

క. కష్టాత్మకులా దనుజుల
కష్టమి యను దేవతగని ఆ కడ విడచిన్
యిష్టత వచ్చిన దానను
పుష్టిం దనుపుమ సురేంద్ర పూజితచరణా

క. సంతస మెసగన్ సురపతి
అంతట పూవృష్టి గురియ నాడిరి దివిజుల్
వింతగ వీచెను పవనుడు
యెంతయు నా సిరియు వెలుగ ముదమున్

క. యీ యితిహాసము వినినం
ఆయత పఠితమ్ము నైన ఆశయ సిద్ధిన్
ఆయువు వృద్ధియు చేకురు
ధీయుత సమకూరు లక్ష్మి తేకువ తోడన్

దేవల జైగీషవ్య సంవాదము

వ. అని దెల్పి ఆ శాంతనవుండు వెండియు ధర్మనందనునితో–

క. మును నీవడిగిన ఆచా
రక విద్యాశీల్ను ముక్తి రహియొనగూడ్నో
విను దెల్పె దేవలున కా
ముని జైగీషవ్యు డమిత మోదము దనరన్

వ. యెవ్వడు శాంతము, సౌమ్యము, నిరతిశయపరుడై యుండునో, యెవ్వడు నిందాస్తుత్య ముల మరియు ప్రియాప్రియమ్ములు లేక సర్వ సముడై మెలగగడో యెవ్వడు తన మన పర భావమ్ము లెయ్యెడ నొందని అనుభవ్యుడు కాగలడో,యెవ్వడు జితేంద్రియాత్మగతిం నిర్వికార నిరంజనుడగునో, అట్టి విద్యా సంపదశీల ఆచార గుణవంతునకు దొరకొను దివ్యముక్తి పథ మా దేవతలకునుగూడ అరిదియై యుండునన, యెట్టివాడు జనప్రియుడగునని మరలయడుగ–

ఉగ్రసేన శ్రీకృష్ణ సంవాదము

క. సత్యము ధర్మము తప్పని
నిత్యానందమయ తృప్త నిరతిశయాత్మా
సత్యజ్ఞాన వివేచను
డద్యంత జనప్రియుండు అగుటది వినుమా

వ. అని పల్కుటయును ధర్మతనయుం డప్పుడు కాలవధి సృష్టి ప్రకారము లెరిగింపవే యన, యీ నీ ప్రశ్నకు సరియగు నర్థము తొల్లి వేదవ్యాసుడు శుకునకు దెల్పిన విధ మిదియని–

పరాశరాత్మజుడు శుకునకు దెల్పిన కాలావధి సృష్టి ప్రకారము

క. కాలగణన వివిధములగు
యేలన ఆ సూర్యచంద్రు లేగిన గతులన్
చాలగ గణియించ నగుజు
వీలుగ సవరించి రార్య వేద్యులు పెద్దల్

వ. కాలము ఆద్యంతముగా గణియింపనగు. నా పరబ్రహ్మ సృష్టికి సమానమని భావించనగు ను. దేశ కాలమాన పరిస్థితుల కనుగుణ సమానమగు నట్లే కాల గణనము తెలుపబడుచున్న దీ క్రింది విధముగా–

వివిధ దినాంశ ప్రమాణములు

అర్ఘగణన ప్రకారం జ్యోతిష శాస్త్ర ప్రకారము		పాశ్చాత్య పద్ధతిన
6 క్షణములు = 1తృటి	4 లిఘడియలు = 1 మిఘడియ	60 సెకనులు = 1 నిముషం
16 తృటులు = 1 కళ	6 విఘడియలు = 1 విఘడియ	60 నిమిషాలు = 1 గంట
30 కళలు = 1 ముహూర్తకాలం	60విఘడియు = 1ఘడియ	24గంటలు = 1 దినము
30ముహూర్తాలు = 1 అహోరాత్రం	60ఘడియలు = 1 రాత్రింబవలు	
6x16x30x30 = 86,400	**4x16x60x60 = 86,400**	**60x60x24 = 86,400**

దిన ప్రమాణ మన్నింటను సమానమే.

- ఒక క్షణము అనగా 1 లిఘడియ / 1 సెకను
- విఘడియ అనగా 24 లిఘడియలు / 24 సెకనులు
- ఒక కళ అనగా 4 విఘడియలు / 96 సెకనులు
- ఒక ముహూర్తకాలము అనగా 48 నిమిషముల కాలము / 30 కళలు
- ఒక ముహూర్తమునందు రాశులవారీగా 12 శుభ ముహూర్తములు లేదా సుముహూర్తము. ఒక సుముహూర్తము 4 నిమిషముల కాలము.

ఇది జ్యోతిష శాస్త్ర విధానము.

క. ముప్పది దినములు ఒక నెల
లొప్పిదముగ పదియు రెండు నొక వత్సరమౌ
చొప్పడు ఋతువులు ఆరల
నొప్పును రెండైన అయనాలొక వత్సరమై

వ. మరియును ప్రతి నెల యందును శుక్ల, బహుళ అను పక్షములు చంద్రగతిన యేర్పడు. ఒక్కొక్క పక్షమున 15 దినములుండు. 7 దినము లొకవారము. శుద్ధపాడ్యమి మొదలుకొని పౌర్ణమివరకు శుక్లపక్షము, బహుళపాడ్యమి మొదలుకొని అమావాస్య వరకును బహుళపక్షముగాను వ్యవహరింప బడును.

క. మానవ నెలలును వత్సర
మును పితృలోక సురలోకముల నొక దినమై
జనుటది దెలియుమ కర్మల
మనుజాధిప లోకపాల మహనీయగుణా

వ. కాలగతి యుగ యుగ ప్రమాణములు. దేవ సంధ్యలు. మానవ సంధ్యలు

వ.

దేవ వత్సములు	**మానవ వత్సములు**	**యుగములు**	**దేవ సంధ్య వత్సములు**	**మానవ సంధ్య వత్సములు**
4800	1728000	కృత	400	14400
3600	1296000	త్రేత	300	108000
2400	864000	ద్వాపర	200	72000
1200	432000	కలి	100	36000

కృత, త్రేతా, ద్వాపర, కలి అను నాలుగు యుగములు కలిసిన మహాయుగమగు= 43,20,000 సం॥. ఇట్టి మహాయుగములు (1000) వేయి అయిన కాలము బ్రహ్మకు ఒక పగలు (వృద్ధి కల్పము) ఇంతియేకాలము (1000) మహాయుగములు) బ్రహ్మకు ఒకరాత్రి– (క్షయ/లయ కల్పము).ఈ రెండు కల్పముల కాలము బ్రహ్మకు 1దినము.ఇట్టి 360దినములు అనగా 864కోట్లు ×30×12=3,11,040 కోట్ల మానవ సంవత్సరములు బ్రహ్మకొక వత్సరము. ఇట్టి 100 వత్సరములు అనగా 3,11,04000 కోట్ల వత్సరములు బ్రహ్మాయుర్దాయము లేక సృష్టి కాలగతి. సంఖ్యామానములో 3,11,04000 0000000 సంవత్సరములు. మూడు కోట్ల పదునొకండు లక్షల నాలుగు వేల కోట్ల సంవత్సరములు.

క. యుగయుగ వరుస క్రమగతి
తగువిధ తప, దైవ, యాగ ధర్మాచరణన్
సుగుణాన్వితుడౌను మనుజ
జగతీ సంరక్షణేచ్ఛ జరిగెడు కతనన్

క. ఆయువు ధర్మం బలమును
ఆయాయా కాలగతుల అన్నియు తరగున్
మాయోపాయము పెరుగుచు
సాయుధ భయ భీతి గతుల జత్తురు జనముల్

వ. బ్రహ్మము తేజోమయము. అందుండి ఓంకారము అందుండి క్రమగతిన గగన పవన అనల సలిల అవనియు, అందుండి వరస క్రమాగతిగ, శబ్ద స్పర్శ రూప రస గంధ భావము లుదయించుటయును.

క. పురుష బ్రహ్మము నిండుచు
సురసంయమి గరుడ యక్ష సోదర గణముల్
నరవానర జంతు చయము
తరుగిరి పక్ష్యాది కీట్క తతి విస్తరిలున్

వ. లోకమ్మున యీ జీవతతులు తమతమ కార్యగతుల–

క. ఫలము ప్రాపించు మహిమ
దెలియుమ ఆ దేవుడిచ్చి తీరును సుమ్మా!
కలినా ఫలముల నిచ్చుట
నిలనాభూత స్వభావ నియమం బనుచున్

వ. కర్మ సిద్ధాంతులు పలుక, సత్త్వ సమన్వయులు సమదర్శనులైయుందురు. పరబ్రహ్మము భూతోత్కటముల సృజియించి పెంచు నింక వినుము. లయించు విధానమ్మిదియ నంచు–

క. విలయత నొందుం క్రమగతి
చలముడిగియు జీవతతులు జలమున నగ్నిన్
జలవాయువు లాకసమున
ఇలధూళిగ యెగసి కలియు యేకముకానై

క. తనయందె సర్వభూతము
లనుకూలత యొదిగి యొదిగి అణగార్నగుచున్
మనుకాలము దీరుదనుక
తమ భావము పుట్టు మరల తమమది బాయన్

వ. ఇటుల మరలమరల బ్రహ్మమయ సంక్రీడనము జరుగుచుండు ననియు యా పరాశరాత్మజుండు శుకునకు వినిపించి బ్రహ్మకుల జనితుండైనవాడు–

క. గురు శిష్టాచార విదితు
డరయుచు వేదార్ధ సార మాచార్యునిచే
తరిగొను గార్హ స్యమ్మది
గురుతరమౌ నాశ్రమాల కోవిద బుద్ధిన్

వ. ఇహపర సాధనానుకూలమును, సర్వార్ధ కామ్య ఫలప్రదమును, సన్యాసాది యితర ఆశ్రమ స్థూలకాలంబు జనకము నగుచు–

క. తర తరములు పైకెగయగ
పరమార్థము లోదలంచి పరహితబుద్ధిన్
సరిజేయుచు దానయజన
సురుచిర సత్కీర్తులొందు చూర్గొను యశమున్

దానగుణము సర్వజనవర్ణ సామాన్యముగా నిరూపించుట

క. దానము సామాన్యుత్తమ
మానవతా ధర్మమరయ మహిమాన్వితమున్
దానము సద్గతి మూలము
దానం చేకూరు పుణ్య ధార్మిక గుణముల్

వ. దానత్వ గుణమమేయము అమృతమును అభిమత సిద్ధియునగు భగవత్ దృష్టియందు సమస్థ వస్తువులును దానార్హములే. మహనీయులు వస్తుజాలములనే కాదు తమ మాన ప్రాణ ములను గూడ దానధర్మములుగా భావింతురు. బలి శిబి మాంధాత్రు మొదలగు దాతలను విందుము. మానవులే కాదు సత్య నిష్టా పరతనెంచెడుగోపు పులికి ఆహారముగా తనువునే యీయ గడంగుట వేదాంతార్థ భారత కథనమున వినబదు. అటులనే తన పతిఅనుసరణీయ యగు కపోతి తన తను ప్రాణములను లెక్కింపగ ఒక బోయనికి ఆహారముగా అగ్ని దూకెంగద. ధర్మ నిష్టాపరతంత్రులై మహనీయ తపోధనముల ధారబోసిన మునీశ్వర త్యాగపలముగా ధర్మై శ్వర్య సమన్వయమై అనాదిగా యీ ధారుణి వెలుగొందుచున్నది. కడుపాకలిని దీర్చి ఆత్మను తృప్తి పరచు అన్న దానమును మించిన దానము మరి లేదనియే కదా. మన యీ ఆర్ష ధర్మా వని సమస్థ తీర్ధ శభాశుభ కార్య సంగతుల అన్నదాన సంతర్పణము విధులు ఆచారముగా భావించుట, ప్రతిఫలాపేక్ష లేని యీగియె దానమగును.

క. భూత స్థావర జంగమ
జాతుల యందునను లెస్స జంగము లందున్
లేతియ యా పక్షి మృగము
లేతద్విధ మాన్వ జన్మమెంతయు మేలౌ

వ. మానవుల యందు జాతి ధర్మోద్ధారకు లెక్కుడు. అందు జ్ఞాన ప్రాభవ విప్రులు యెక్కువ యందున వేదవిదులుదాత్తులందు ప్రవచనాశీలు రధికులందాత్మ విచారులు మిక్కిలి యెక్కుడు. ధర్మ విధులు. అందు సత్య సంకల్పులుమిన్న. అట్టి వారల దైవసమానులుగానెంతురు. దేవతలు మునులు గూడ వారల నాధారముగా జగములు వర్తిలు. ననుచుం, బ్రాహ్మణునకు-

క. నిర్మల ధర్మాచరణము
మర్మము లేనట్టిబుద్ధి మాధవ సేవా
కర్మలు మేలుకొలుకునై
ధర్మార్థముగా జరుపుట తగునది అనుచున్

బ్రహ్మ ప్రాప్తి సాధన ప్రకారము

వ. పరబ్రహ్మమును అద్వైత (జ్ఞాన) సమార్జనముననొ, అధ్వర ప్రజ్ఞా విషయముననొ, యోగాచరణముల వలననొ, సాంఖ్య సమాదరణ స్ఫురణముననొ, అరిషడ్వర్గ జితేంద్రియ స్థిత ప్రజ్ఞాదులవలననొ, సమతుల్య మానస పండితులు పూర్వ పరతత్త్వ బేధమెరుగని, నిస్సంగ రంజన, నిర్వికార పరబ్రహ్మమయుని పొందవచ్చు తత్త్వజ్ఞ నిధీ. భూతపంచక స్థిత నవద్వార పుర అంతఃపుర అంతరాంతర కోశవాసియాపరబ్రహ్మమును ఆత్మ స్థిత వైరాగ్య సిద్ధిబుద్ధి గతిమంబున హంసావాసన యోగ సత్క్రియాభ్యాసులును, ఆత్మతత్త్వజ్ఞాన విధులును యెరుంగగలరు.పంచ భూత్మాక పంచేంద్రియ విషయ వాసన లైదింటిని నుడుగ నడచుటవలనను, అచంచల అవధాన వృత్తి నవలంబించి ఆత్మయందు దృష్టి నిగుడించుటవలనను

క. ఆకలి నిద్రయు దప్పుల
సాకల్యత వీడనగుచు సద్గురు దోవన్
తేకువ నడువం బ్రహ్మము
నేకత్త్వత బొంద గలదు నిలకడమీదన్

వ. బుద్ధి జ్ఞాన వైరాగ్యమ్ముల నింద్రియ వికారమ్ముల, లోలత్వము జెందనీక లోగొన్నగుటం, సిద్ధింజను యాత్మ దృష్టి అన్నిటగను రాజీవాక్షున్. కనులు మూసి యేకాగ్రత భృకుటిలోన దృష్టి కేంద్రీకించం ఇళ పింగళు లేకమునై సమతుల్యత ఆత్మమయుడు దృగ్గోచరుడౌ. సమతా దృష్టిం జీవుండెరిగిన అజరామర ఆత్మమయు నంతర్యామిం గననౌ. అహవర్జిత ఆత్మ విదిత అకామ్య కర్మాచరణుండు పరబ్రహ్మము గననౌ.

బ్రహ్మముం దెలియు బ్రహ్మచర్యా శ్రమ విధి విధాన వైశిష్ట్యము

క. చతురాశ్రమ కాలగతుల
అతి ముఖ్యము బ్రహ్మచర్య ఆశ్రమ మగుటన్
ధృతి మంతుడు దీని గొనుచు
మతిమంతత ముక్తి పథము మానుగ పొందున్

వ. బ్రహ్మకుల సంజాతుండైనవాడు, చౌలోపనయన మాత్రుండునై బ్రహ్మోపదేశమును

బొంది బ్రహ్మచర్యాశ్రమ స్వీకృతుండునై శ్రద్ధాసమన్వయ భక్తియుక్తుండై-

క. మున్యాశ్రమ సహజీవన
అన్యోన్యత భిక్ష దినుచు అక్షయ విద్యల్
అన్యత లేకం మనమున
ధన్యత నాచార్యు ముఖత దయ గొన నగుచున్

వ. వేదవిద్యా విచారుండై, స్నాన పాన జపతప నిష్ఠాపరుండై సజ్జన సాంగత్య సుసంస్కార సంస్కృతి వడయుచు, ఆచార్యుండు దిని పరుండనగు నుపచారవిధుల నిర్వహించి తాను భుజించుచు బ్రహ్మచారి, తన ఆయువు నందు నాల్గవపాలు కాలము సక్రమ వర్తనుండై,చతు రాశ్రమ విధి విధాయక సద్గతి పరంపరా ఆచారక్రమముల సంపూర్ణముగా నెరుంగు.

తే. బ్రహ్మ విద్యా వివేకుడై బ్రాహ్మణుండు
గురుని పూజించి దక్షిణ కూర్మి కుడిపి
ఉద్వ హుండయి భార్యతో ఊగులాడి
కామితార్థత పెంపెక్కి కామ్య కలన
వాన ప్రస్తుండు గానౌచు వనములంటి
ఆ కలలములు దుంపలుం ఆరగిస్తు
వేదవేదాంగ భాష్యాలు వేడ్క వినుచు
సమత గూర్చెడు శాస్త్రార్థ సారమెరిగి
పరమ పూరుషు కథ నాలు భక్తి గదుర
ఆడిపాడుచు వెలుగొంద ఆత్మశుద్ధి
కామ వర్జిత సందీప్త కామ్య కలన
పండబారిన వయనునం పార మార్థ
చింత వైరాగ్య కాషాయ చీరగట్టి
సర్వసంగత త్యాగుడై సమత వృత్తి
వృక్ష ఛాయల వసియించి ఫలము గొనుచు
ఆత్మ సంయోగనుుండయి అలరనెంతొ

తే. భూత హితుడౌచు సన్యాసి పూత చరిత
నిద్రహారాలు మదినెంచ్క నియతుడగుచు

ఆత్మ పరమాత్మ సంయోగ ఆత్మవిదుడు
బ్రహ్మ పదమును చూర్గొను బ్రహ్మచారి

వ. అని బ్రహ్మచర్యాశ్రమ విశిష్టతను గొనియాడుచు నాపరాశరాత్మజుండు వెండియు ఆ ధర్మజునితో నిట్టులను.

అంతర్యాగ ప్రకారము

తే. ఆది మద్యాంత రాహిత్య అధ్వరణుడు
అంతరాత్మన యాగాన ఆధ్యపరత
హృదయ మందాత్మ సుక్షేత్ర ముదితు డగుచు
మారు జన్మంబు లేకుండు మహిత శక్తి

తే. ఆధ్యహంకార మమకార ముంటనీక
ప్రాణ సమిధలు వెలిగించి పాపహరణ
జన్మ కారణ బీజాల జరిపి యవల
వీత కర్ముడు తా వెల్గు విశ్వ శక్తి

వ. ఆత్మ తీర్థసంసేవనాసక్తి ఆత్మవిదుడు, అన్యక్షేత్ర సంకుచిత సేవనా జనకుడగుట వినము. గర్భస్థ నరకమంటదతని.

తే. కాలగతులకు లోన్గాడు కాలు దెసగ
భవ్య జన్ముడు పరమాత్మ పదమునంటి
అంతరాత్మన యాగాన ఆత్మ తత్త్వ
పరమ పావను క్షేత్రాన పరవశించు

తే. ఇంద్రియమ్ముల లోగొను నిశ్చలాత్మ
యోగయాగన దీప్తుండు భోగయశుడు
పాప హరణుండు శుద్ధాత్మ భావనుండు
దీపదీప్తిన వెలుగొంది తేజరిల్లు

తే. సర్వ సంకల్ప రహితుడా నిర్వికల్ప
సమ సమాధిత జీవుండు సత్త్వశాంత
దాంతి వేదాంత వేద్యుండు తాత్మ్య మొందు
అన్య మెరుగని చిత్తుండు ఆత్మ విదుడు

వ. ఆత్మజ్ఞుడు సర్వసంగ పరిత్యాగుడై నిశ్చలత్వ సత్తముడు సత్తమును నివాసదీపకళిక వలె

తేజోవంతము గావించి కాలము గడుపుచు తదాత్మ్యమునశాశ్వత అమృతత్త్వముబడయు,సకల వేదాంత సారమిదియసుమ్ము. ఈవేదా సాగర మథన సారాంశ అమృతమును సమాదరవృత్తి నీ వానరించి,నీవును నిన్నాశ్రయించిన మహనీయ గుణాత్ముని కొసంగ నగునని యింకను యెయ్యది వినవలయవన–

తే. ఇంత కంటెను మదాత్మ కేమివలయు
దీనిం దేర్పరుపుమ నాకు ధీవిశాల
సర్వమెరిగిన వాడవీ యుర్వి యందు
నీదుమాటను మదినెంతు నియత బుద్ధి

వ. అనగ విను భూతాత్ముడు సర్వజీవుల యందునుండి తనవిభూతులు వెలయించుచుండు. కావున భూతసంజాతుడైన జీవుడు భూతహరణమును గావించి నిజద్యోతనుడగుట అభూతక దుర్దశ భూతతతులగు భూతాత్ముండు కూర్మమ్ము మాడ్కి వర్తనములు సంకోచ వ్యాకోచన వృత్తుల నవలంబించ నగుచు నుండు. విషయ జ్ఞానేంద్రియములు మనస్సు బుద్ధియును భవ్యక్షేత్రములందుండి మనోగతతలంపులను నిశ్చయగతబుద్ధినియంత్రించి సాక్షీభూతముగావెలుంగుచుండు. గావున అంతరాత్ముడు బుద్ధిన్ఆత్మ స్వస్థ తస్వస స్థిత జడత్వ గతుల సత్వ రజస్తమోగుణములై బొడజూపుట బుద్ధి విశేషము.

క. కనుగన్నె విను జెవియా
గొని రుచి జింహ్వా మనమున కోర్కె ముక్కున్
మునుకొను బుద్ధిన యోచిం
న్ద నువా స్పర్శనను మాత్ర తస్మై తొందన్

క. ప్రీతిం జెందును సంతస
మాతురుడై చెలగు బాధ అన్నిట తానై
నీటిం దనరెడు గతులను
చేతల చెడుగైన పట్ల జింతులు నాత్మన్

తే. ఆత్మ తాత్మ్యమ్ము నొందుచు నణగి మణగి
నింద్రియ వ్యాపార మెంచక నిద్రయందు
సిద్ధ చైతన్య మూర్తియై చెలగుచుండు
అప్రమత్తత జీవుండు ఆత్మయందు

తే. విషయ వాసన లందున వివశు డగుచు
యించు కేనియు చెడదాత్మ యెంచు కొనుము
నీటి బొట్టది తామ్రాకు నంటనట్టు
ఆత్మ శుద్ధము కర్మంబు లంట వెపుడు

వ. యింకను వినుము. నాల్గు వర్ణ జాతుల యందునను–

తే. శమ దమాదుల బ్రహ్మణ్య సమ్మతమ్ము
రాజ్య పాలన ధర్మమ్ము రాచకులులకు
వైశ్యవరులకు వ్యాపార వర్తనమ్ము
శూద్రజాతులు చెన్నొందు శూరయశత

తే. వర్ణసాధిత కర్మల వసుధ జనము
స్వస్థ తెంతన తనజాతి సత్త్వవృత్తి
మోక్షసాధన పరులౌచు మోదమలర
సర్వసాక్షుడు చెన్నొంద స్వస్థిగూరు

తే. ఆత్మ జిజ్ఞాస అన్నింటి కాకరమ్ము
సత్య ధర్మము లన్నింట సమత గూర్చు
ప్రాణ కర్మము యోగార్ధ పరవశింప
ఆత్మ జీవుడు తా జేరు అంతరాత్మ

ఇంద్రియ నిగ్రహముత్తమ గుణమని దెల్పుట

తే. పంచ భూతాత్మ్న సంయోగ పరతగాదె
పరవశింపంగ జగమందు పరమపురుష
తానె అదియౌచు నదియయుం దానెగాగ
జగము నెల్లను సృజియించె చలన గతుల

తే. జీవ ప్రకృతి తనదైన జడము విడచి
ఆత్మ సంయోగ్న గతులందు అలరి, యింద్ర్య
నిగ్రహానిగ్రహనుడుగా నిలువవలయు
మోహపరతను విడనాడి మోక్షమొంద

వ. మ్రాకు తనదైన పూవులు కాయ ఫలము లగుట దెలియనట్లు పరమాత్మ తత్త్వజ్ఞుడై జీవుడు తనదైన నైష్ఠికకార్యకలాపగతులనెరుంగడు. మరియును జీవునిజీవగతి పాపపుణ్యములు

పాము తనదైన కుబుసమును వర్జించుటన్లు విసర్జించును. అటులనే మానవుడు యింద్రియ నిగ్రహుండై, సంసార సాగర మగ్నుడై తరంగిత కాలుష్యముల నంటని చేపవలె తేలియాడు చుండనగు. పురుషుడు పరమ శాంతత్వత సత్య ధర్మ ప్రవర్తనుడుగా భయభ్రాంతములకు లోనుగాక కామక్రోధాది లోభ ప్రలోభుడు గాకనుండుటకు యింద్రియ నిగ్రహణుడు గావల యు. నప్పుడు జగదోద్ధారణ మాన తేజో విరాజిత సూర్యసమభాసితుడై ప్రభవిల్లు. విషయేంద్రి యములచే బొందు పాప దుఃఖమ్ములు దొలుగు. తరణి చేత తమము విరిగినట్లు–

తే. కలదు లేదను భావమ్ము దొలగ జేస్కు
తృప్త మానస సమత సంతృప్తు డగుట
వేద వేదాంగ పరతత్త్వవేత్తయగుట
బ్రహ్మ పదమును గొననగు బ్రాహ్మణుండు

క. పరతత్త్వ మహిమ వెలిగెడు
పురుషాధిపు కర్మగతులు పొరి గొను టరుదౌ
సురలకు సరిసాటగుటయు
జర మృత్యువు చేరబోదు గుణ భాసురలన్

వ. మరియు ధర్మముల కెల్ల పరమౌనది “అహింసాపరమోధర్మః” అని పలుకుటయును, అనుమానము లేక వినుము. తెలి నీటను జనవరులకు దోచు కంకిరణు రీతి పరతత్త్వ భావను లకు పరమాత్ముడు దోచు మదిని తేజ స్ఫురణన్.

క. అనవిని అప్పాండవు డనె
వినిపించితి వాత్మ తత్త్వ వివరణలెన్నో
అని జచ్చిరి మృతుల రగుచు
వినిపింపవె మృత్యురీతి వివరము గాగన్

వ. అని అడుగుటయు నక్కురుకుల పితామహుండు వినుమా కుంతీ పుత్రాయని–

మృత్యువు తెరగెరింగించుట

క. అనుకంపను డను రాజేం
ద్రను జన్ముడు జావ దుఃఖ మాగక యేడ్వన్
ముని నారదు డరు దెంచియు
మనుజేంద్రుని యేడ్పు బాప మనమున దలచిన్

క. ఒక యితిహాసము దెలిపెం
సకలమ్మును దేటపడగ సమ్మతి వినుమా
అకలంకుండబ్జ భవుడు
సకలోర్వీ సృష్టి జేసి సంబరపడగాన్

క. నర జంతూ పక్షి చయము
తరుగుల్మ లతాదు లెల్ల ధరణియ భరమై
చిరకాలము మనుచుండుట
చరమాంకము లేకనుంటి సంహారక్రమతన్

క. సాలోచన పరుడౌటం
ఆలోచన రూపు దాల్చె అంతము గూర్పన్
నీలా కారపు కనులతో
కాలోచిత మృత్యువగుట కామిత మొప్పన్

క. కన్నుల బడుటయు ధాతయు
నిన్నీ తీరున బిలిచితి నీదగు పనిగా
తిన్నగ జూడుమ జంపను
మన్నన బడి జీవకోటి మనుగడ దీర్పన్

వ. అనుటయు నాయింతి కట కట కన్నీరొలుక నేడ్చుచు నీకుం బుట్టి యీ క్రూర కర్మంబు యెట్లు చేయుదు నన్నాగ్రహింపకు మన–

తే. విధి విధానమ్ము మారదు వినుము నాదు
మనసు బుట్టిన దానగా మసలు టొప్పు
తప్పు గాదగ దీ సృష్టి తప్ప తెగువ
కారణం బౌచు నీ కెల్ల కార్య సరణి

వ. ఇవిగొ పట్టి యుంచితి ప్రభవింప నీ కన్నీటి బిందువెల్ల చిలుకరింతునుజూడు. నా మాట నీకుం దోడుపడ నానా వ్యాధిరూపముల నీవు నిమిత్త మాత్రుడౌదువని వరంబిచ్చిన విధాత పలుకమృత్రముగా భావించిన మృత్యువు –

క. స్త్రీ పురుష నపుంసకయయి
యేపాపము అంటకుండ యేర్పడి మృత్యు

వ్యాపారము చేయు టదియ
ఆపక పో జేయు జీవు నాత్మోద్ధరణన్

వ. మృత్యు ప్రాణి కోటి దేహముంబాసి కృత కర్మఫల భావమ్ముల పునర్జీవమ్ము లొందుచుండు.

తే. అంతరాత్ముడు జీవుల ఆత్మమయుడు
సృష్టి కొడయుండు పరమాత్మ సర్వద్రష్ట
ప్రీతి జీవులు ప్రభవింప బెంప చంప
బ్రహ్మ విష్ణువు లయకారి భవ్య తేజ

వ. అనవిని సంతుష్టాంతరంగుండై కుంతీ తనయుండు సభక్తి పురస్సరంబుగా గంగా తనయునకు మ్రొక్కి మగుడ ధర్మమన నెట్టిదియో దెల్పుమనతాత మనుమని కిట్టులను.

క. ధర్మము పరమార్థమ్మది
నిర్మల మానస విదితము నీతియ దెలియన్
దుర్మతులకు వీలుపడని
కర్మల గతి కాస్పదమ్ము కార్యాచరణన్

వ. మరియు వినుము ధర్మము. వేదము మనుస్మృతి సమ్యగ్యాచారము బుద్ధిమతము అను చతుర్విధ విదితము. ఆడి తప్పి పలికి బొంకి ధనార్జనము చేయు టధర్మము. పరధనముల కాశ పడకుండుటయది ఉత్తమ ధర్మము. వినుమిటు ఒక్కమాటలో దెల్పెద–

క. ఒరులేయవి యొనరించిన
నరవర తన క ప్రియమగు నా అప్రియముల్
ఒరులకు తాజేయకునికి
పరమ పథమ్మదియ ధర్మపథముల కెల్లన్

వ. ఉత్తమాచారంబన యేమోదెల్పుమని యడుగుటయును పెద్దలు వేదవిజ్ఞులు మనపూర్వులునడచిన దెల్పినది యే ఉత్తమాచారమిదియని–

జాజలి – తులాధారుని సంవాదము

తే. శాంత చిత్తుడు జాజలి సన్మునీంద్ర
తప జపాదుల ఉన్నతిం దలచు వాడు
అచల దీక్షాపరు డధికు డవని మునుల
నిశ్చ లత్త్వత తానుండ నిచ్చతపము

తే. కేశ సంపద పెంపెక్కి గుబురు బార
గూడు గట్టియు పిచ్చుకల్ గ్రుడ్ల నీన
చిట్లి పిల్ల పిచ్చుక లందు చెలగు చుండె
ధర్మ తత్పర మెంచనా తపసి మదిని

తే. గర్వ మించుక పొడ జూప ఖగపు వాణి
ధర్మదేవత కొనియాడ తలచి పల్కె
యించు కంతయు దలచెనా యిట్టి విధము
మనసు నందున తులధార మానధనుడు

వ. అని వినం బడుటయు జాజలిమౌని ఆ తులాధారుంజూడనెంచి యేడున్నాడోయని అను కొనుచునుండ మరల వినువీధిన "వారాణసీపురంబున నున్నా"డని వినంబడుటయును, మత్సర భరితుండగుచు అప్పురంబునకుం జని జన సంసేవనా సంపూజ్య వాణిజ్యమునం బ్రవర్తిల్లునమ్మ హనీయుం గాంచిన యతడా మౌని పుంగవునకు సముచిత సత్కారములాచరించి యిట్లనియె.

తే. మాన నీయుడ మహనీయ మౌని వర్య
పిచుక గూండ్లయి నీ తల పెంపుగూర
చిత్త వికృతియ లేకుండ చేతు తపము
ఎంత భాగ్యము నీ గర్వ మెంచి చూడ

వ. అనిన యాతని ఆత్మ బోధనమునకు విస్మయము గదుర మౌని వర్యుండొక్కింత మనసు నందు ధర్మ మర్మ మెరుగ యెవ్విధమ్మున యివ్విషయ విజ్ఞానంబు గలిగె. ననపుడాతని కనియె నిట్లులా తులాధరుండు–

తే. కొనుట అమ్ముట స్వధర్మ కోర్కెమీర
తృప్తి నొందెడు యేకొద్ది తృణమునైన
దైవ మిచ్చిన భాగ్యాన దేవు రించ్క
ధర్మ ఆర్జన పరునౌచు నిర్మలాత్మ

తే. హాని వృద్ధల సమముగా నభినయిస్తు
నీచ తెంచక మనమున నెలమి గూర్తు
దాన ధర్మమ్ము చేయనా దలతు మదిని
ఆడి తప్పను యేమైన అగును గాక

తే. చేరవచ్చిన వారల చేరదీతు
ఆకలని వచ్చు వారల కన్న మిడుదు.
అడగ నెప్పుడు నెవ్వరి ఆప్త తెరిగి
ఉన్నదే దైన గొనిపోవ నుత్సహిస్తు

తే. కాలగతు లెల్ల గాంతును కనుల యందు
లోక వృత్తము లన్నియు లోన జూతు
చూర గొందును విషయాలు సూక్ష్మరవళి
వింత వింత నెరగనౌ దింత వరకు

తే. ఎంత జేసిన మేలైన యెంచ మదిని
గర్వ మిది యని నామది కలుగనీను
శాంత చిత్తత మనసు ప్రశాంతమొంద
చెలగు చుందును నా వల్న చెడ్డలేక

తే. మిధ్యా వాదన జీవన మిట్టి దంచు
తామ రాకున నీరంచు తనియుచుందు
అనిన దానికి ముని వరు డనియె నిట్లు
తప జపాదుల మాటయే దలప వెపుడు
ఎటుల గొందువు పరమాత్మ నిట్టి తెరగు
అనగ వణిజుండు అనియె తా నతని తోడ

ఆ. నిత్య సత్యుల యెడ నేడేదు జగముల
పాపమంటబోదు పరము దలప
ధర్మమార్గ మొంచి దయతోడ వర్తింప
పరమ పదముగాదె పరవశింప

క. శ్రద్ధయు సాత్విక బుద్ధియు
యిద్ధర యాగోద్ధరణము యిహపర గతికిన్
అధ్వర యాగాస్పద దు
స్సాధ్యం బెందునను లేదు. సంయమి వర్యా!

క. అమరులు మెత్తురు యాగా
విమలోద్ధతి కార్యగతుల విభవముగూరున్

సమతా వాదులు యెందును
అమలినులై దీప్తిగొంద్రభిమత సిద్ధుల్

తులాధారుడు చెప్పిన బ్రహ్మ గీతలు

వ. శ్రద్ధా సమన్వయము కాని తపస్సు నిష్ఫలము. దాన గుణము అన్ని గుణముల కన్నమిన్న. శ్రద్ధ లేకున్న వానికి దాన గుణము మలవడదు. శ్రద్ధ లేనివాడు నిస్సారపు చవిటి నేలతో సమానము. శ్రద్ధ గలవాని కడకు మత్సరాది దురహంకార గుణములు జననేరవు. తమ స్థితిగతుల కనుగుణ్య దాన ధర్మము లొనర్చుట మేలుమిహపర సాధకు డగును. శ్రద్ధ గలవాని కడ చేతి అన్నము అమృత భోజ్యము. శ్రద్ధ శుచిర్భూత యాగ యోగములు వేదసమానములు. వడ్డీలకు వడ్డీలు గణించి యితరులకు పెట్టకతాను దినక యేదాన ధర్మకార్యములు ఒనర్పని వాడులోభి. ఇది బ్రహ్మవాక్యము. కావున శ్రద్ధామతివై యాగాది సత్కర్మల నొనర్చి, శుచిర్భూతుండవై శాంత చిత్తత నిర్వేదనుం డునుటయు విని జాజలి వణిక్ ప్రవర్యుని సంస్థుతించి చనుటయు, తులా ధారుండును సమ స్థితు డగుటయును.

క. అని సురఝరి తాత్మజు డన
విని యా పాండ్వాగ్రజుండు విస్మయ పరుడై
అనుసరణీయము బ్రహ్మము
అని మనమున సంస్థుతించె అభపుం ధాతన్

వ. మరియును కార్య సమీక్ష యందెట్లు మెలగునది యని అడుగుటయును తొందరపడి ఆలోచింపక, యేపని చేయరాదని పల్కుచు.

చిరకారి యను మునికుమారుని చరితమును దెల్పుట

క. కలడొక ముని బాలుండల
తులనాత్మక బుద్ధితోడ దూరపు బుద్ధిన్
వలనొప్పుగ జేయు పనులు
ఇల జనములు పొగడనొగ యింగిత పరుడై

క. తను మన జననీ జనకము
అనుగుణ సంధాన మహిమ మాకృతి గొనుచున్
జననంబొందును బిడ్డగ
తను మూలము నందు ఆత్మ తానుగ బెరుగున్

క. చిరకారి యనెడు పేరది
సరియగు నామమ్ము అనిరి సద్భవ పెద్దల్
సురుచిర మాలోచించెడు
నెరి తనమది గల్గుటదియ నిజమది బుద్ధిన్

వ. తల్లి పావని తండ్రి మేధాతిథి. వీరికి లేక లేక పుట్టిన సంతానము చిరకారి. బుద్ధిశాలి నీతిమంతుడు తల్లిదండ్రులను దైవ సమానముగా భావించువాడు.

క. కోపించి పత్ని పై పతి
వాపోవుచు తనయు జూచి వధియింపు మనిన్
తాపోయెను వన సీమల
యే పాపము యెరుగ నట్టి యింతియ నొకటన్

తే. తండ్రి మాటను తలదాల్చి తల్లి జంప
ధర్మ సమ్మతమౌ గాదొ తనయు నెడల
బుద్ధి పోవదు ముంద్వెన్క సిద్ధ పడగ
తల్లి తనువీయ తేజంబు తండ్రియగుట

తే. తల్లి జంపుట పాపమ్ము ధరణి సుతకు
తండ్రి మాటను కాదన్న తనయుడేల?
మిన్న కుండుట పాడియా మీరి జనకు
నీతి మాలిన పనియండ్రు నిజము విబుధ

తే. జనకుడె తానై బుట్టిన
జనుడీ తనయుండు కాదె జగతిన జనముల్
జనకుల మాటది నెరపుచు
జనుటది వేద విదితమ్ము జగతీ సుతకున్

క. జనకుడె దైవము సర్వము
అన నేటికి జనకు మాట అనుసరణీయం
బనుటది పెద్దల వచనము
అనుమానం బేల మదిని అమ్మను జంపన్

వ. అని వితర్కించియు తనదు తల్లిం దలంచి

క. కడుపున మోసియు కన్నది
అడుగడుగున పాలనిచ్చి ఆత్మీయతతో
కుడుపియు తా దినియు దినక
ఒడయనిగా జేసె నన్ను ఓహోయనగాన్

వ. ఏ జీవియును పుట్టిన దానిగా దెలియునది మాతృమూర్తినే కాని తండ్రిం కాదు. తండ్రి ప్రాణ దాతయే అయినను–

క. తల్లియె దైవము బిడ్డకు
యిల్లాలికి భర్త యండ్రు యింతుల పట్లన్
కల్లా కపటము నెంచని
తల్లిని జంప జనుటదియ తనయున కగునే?

క. మది యోచన జేయు టదియ
పదిమందియు ఔననంగ భాసుర ఫణితిన్
ముదమారెడు పని జేయుట
చదువరు లెల్లరును మెచ్చ సద్విధ బుద్ధిన్

క. తనయునెడ తల్లి మనసది
జనజీవన కారకుండు జనకున కగునే
అనయము సుతుకై వగచును
తనకెన్నడు వేదనంచు తలచదు వేర్గాన్

తే. తలప నెంతేని పాపమ్ము తల్లి జంప
జన్మ జన్మాల పుణ్యమ్ము జనని గాదె
అమ్మ యగు మాట విన్నంత ఆత్మ పొంగు
అట్టి అమ్మను జంప నా కెట్టు లగును

క. వధయును ధర్మాచరణము
అధముల వధియింపకున్న అవనికి చెడుగౌ
బుధజన మాటయు శిక్షా
విధాన వేదోక్త విదిత విషయం బనఘా।

వ. అని పెక్కు భంగుల నూహించు వాడగుట నా చిరకారి ఆత్మ యోచన జేయ వాడెంత తడవు తెలియ రాకుండ మది యోజ నుండగుటయు తదీయ జనకుడు–

తే. తనదు తల్లిని జంపగ తనయు పనిగ
పల్కి వచ్చిన పాపుండ భావ్యమగునె
జనకు మాటను తలదాల్చి జనని జంప
దలచి జంపునె తనయుండు తనదు పేర్మి

వ. త్వరపడి అట్లు జేసిన ఆ పాపమ్ము నాది కాని వానిది కాదు. అని కన్నీరుగార యేడ్చుచు వాడుల్లమ్మున యూర్పు దొరంగం వెక్కి వెక్కి వచ్చువాడు తన మనమ్మున–

క. చిరకారి సార్థ కత్వత
సురుచిర సంయోజనుండు సూకృతి కరణని
తరుగడు ఆ తల్లి మెడను
కరుణామయ చింతనుండు ఘన కీర్తనుడున్

వ. ఆత్మనందను నుద్దేశించి–

తే. నింద రాకుండ చేయడా నిజతనూజ
తపము ఫలియింప జేయునా తనయుడగుట
పాపకూపాన బడకుండ భవము చెడక
మంచి కాగను తనదెస యెంచి మిగుల

వ. వచ్చి జూచుడు గృహమ్ము జొచ్చివచ్చు వానిం నిజజనకు మేధాతిధుం జూచుచు తల్లి కంఠమ్ము దెగగొన నిజ కరమ్మున బట్టి నుంకించు ఖడ్గ సాధనమావలబారవైచి బావురని యేడ్చి కౌగిట గారవింప చరణమ్ములపైవ్రాలి ప్రణామమ్ము గావింప, పత్ని యనుచు ముందుకు వచ్చి గ్రుచ్చి కౌగలించ, అనురాగ వల్లి అల్లుకొనె చరణమ్ముల కమ్మోని పుంగవుండును నయ్యిరువుర నెత్తి శోక భాష్పమ్ము లానంద మయముగాగ, తనయు మూర్ధా ఘ్రాణము గావించి దీవించి అభినందించి యిట్లను–

క. కార్యము లెడ యోచించుట
ఆర్యాశ్రమ సమ్మతమ్ము అవనిన యెపుడున్
కారుణ్యము శాంతి దయయు
ధీరో దాత్తసద్గుణమ్ము దీధిత బుద్ధిన్

వ. తొందరపడి చేసిన అకార్యముల పట్ల పశ్చాత్తాపము జెందనగును. కావున యేపని యందైనను ఆలోచన మంచిదనిపల్కుటయు ధర్మనందనుడు ప్రజలశిక్షించునెడ వెరవెట్టిదనియడుగ–

క. శిక్షలు కరుణాయుతమై
మోక్షక్రియ కడ్డురాని మోదితమౌగా
కక్షయ దక్షముకానిది
లక్షింపుచు నీతి మార్గ లక్ష్యము చెడకన్

వ. యుండ నగుననియును, వధయు నియత ధర్మంబనియును, అహింసావిధి వధయుందు పాటించనగు సత్సాంప్రదాయ మనియు శిక్షలు తప్పుదనమును సరిజేయు నట్లుగా నుండవల యుననియును–

క. శిక్షించుట బహు సులభము
రక్షించుట కష్టతరము రాక్షస వధయున్
లక్షించి మెలగు టొప్పగు
శిక్షాస్మృతి రాజనీతి సేమం బరయన్

కపిల – గో సంవాదము

వ. గార్హ స్త్యము మరియు పరిత్యాగము యేది ఆచరణీయంబో దెల్పుమని అడుగటయును వినుమని, తొల్లి కపిలుండను యుత్తమ ముని, మంచి అందమును నిర్భీతమును సౌమ్యంబును యైన ఒక ఆవును గాంచి నీవు వేదస్వరూపమవు గావే? అని అడుగుటయును, ఆ మాట కాద రినున్న స్యూమరశ్మి అనుముని ఆతనిని వేద సమాదరణములేని వానిగా భావించి, ఆతనితత్త్వ మును దెలియనెంచి సూక్ష్మరూపమున ఆ గోవునందావహించి కపిలునితో నిట్లను–

<u>స్యూమరశ్మి:</u>

వేదములు మంత్రములు దాంబికత్వ సూచకములని యతులుపల్కుదురు.అవి సర్వ త్రా ఆదరణీ యములు కావా? మీకును అవి ఆదరణీయములు కావా? అనుటయు–

కపిలుడు:

గోవు నందావహించి యున్న స్యూమరశ్మి తో వేదములయెడ నాకు సమాదరణమేకాని ఆదరణ ము, అనాదరణము అను భావములు యెుండులేవు.నాదెల్పినంత వరకు దేవహితములైన చతు ర్విధ ఆశ్రమములు బ్రహ్మచర్య గార్హ స్త్య–వానప్రస్థ పరివ్రాజకములు. మానవులకు ఆచరణీయ యోగ్యములు. వేదవిదాచారమును పాటించుట మనుధర్మ మాననీయము. ఇతరాచారములన్ని యు అయోగ్య అనాచారములేకాక హింసాచారములే. ఐనను అయ్యవి మేలో కీడో నేనెరుగ నివి అనుటయు–

స్యూమరశ్మి:

బ్రహ్మ యజ్ఞ యాగాదులయుందు వాడనగు పదార్థములుగా ధాన్యములను పశువులను సృజియించెను. కాని తానా యజ్ఞ యాగాదులొనర్పలేదు.అజ్ఞుడు విజ్ఞుడు అను బేధము లేకుండ అందరును కొనునది దివ్య సుఖము. మోక్షము. ఇది యజ్ఞయాగాదుల వలనకాక వేరకలుగదా? గృహస్థులు నిర్వహించు దైవత అకల్మష ధర్మోపేత యజ్ఞ యాగాదుల యందు బలు లొసంగుట హింస కానేరదా? అనుటయు–

కపిలుడు:

ఆత్మైక సుఖ పరాయణులైనవారు మోక్షమును తప్ప యితర సుఖములనుకోరరు. అట్టి మౌని పుంగవులు సమస్థ గృహస్థ ధర్మములను విడనాడవలయును కదా?

స్యూమరశ్మి:

తల్లివంటి గృహస్థాశ్రమము మిగతా అన్ని ఆశ్రమములకును ఆశ్రయసిద్ధినొసంగునగు మార్గము కదా? అయ్యది దివ్యౌషధము.మోక్షము గార్హ స్థ్యమున సిద్ధించదని యెవ్వరేని యెక్కడేని యెప్పుడేనా చెప్పియుండలేదుకదా? గృహము సర్వా శ్రమవాసులకును పెన్నిధి అని వేదవాక్కు.మతిహీన, ధనహీన, అలసత్వ అబలురు విధివిహిత కర్మాచరణములను విడనాడుటయనునది అజ్ఞానమేకాదు. మరియు పాపగతులకు హేతువు.

కపిలుడు:

అనునంతట కపిలుడు, బుద్ధిమంతులును విజ్ఞులును వేదవిధ విహితాచారములను అమృత తుల్యముగా భావించుచూ దేవ సమ్మత మొందుపనులు చేయుచుందురు. పురుషాం పురుషుండన బడువాడు తనకై ఒరులను చెయిజాపడు. దేహయాత్రకై తగు మాత్రముదినుచుండును. స్త్రీ సంగమవ్యాపారముల జనడు. ఎట్టి స్థితి యందైనను అనృతము పలుకడు. చెడు మాటాడడు. ఇట్టి వేదవిహితుండైన బ్రాహ్మణ్యునకు యజ్ఞ యాగాదులపనియేమి? అద్వైత స్థితునకు సదాచార సంపన్నునకు సంతృప్తానందమయునకు శాంతునకుపొందరాని సుఖములంట యుండునా? అహింసోపరమోధర్మః అని పెద్దలు యూరకనే అనలేదు. మరియును ఫలాపేక్ష పరతంత్ర కామ్యకరులకు భవబంధములు తప్ప భవ్య బంధనము చేకూరదు. అని నొక్కి పల్కుటయును.

స్యూమరశ్మి:

మహాత్మా! మీ వంటి పెద్దల సాంగత్య బోధనముల వినికిడి లేనట్టి వాడనగుట అని తన్ను దానెరిగించుకొనుచు ధర్మ నిర్ణయ మెరుగనయి, గో విలీనుడనై యిటు మీకడ తెలిసినవాడనైతిని. వేదము ప్రమాణంబని గ్రహించితి.మీ శిష్యుండనైచరింతు. విహితాచార తెరంగులెల్ల సువ్యక్తము

లు గావింప వేడుచున్నానన, సంప్రీతుండై కపిలుండు–

స్యూమరశ్మికి వేద ప్రమాణమును దెల్పుట

క. శబ్దము రెండవ బ్రహ్మము
శబ్దమునం బుట్టు గాదె సద్విధ జగముల్
శబ్దము భూతాద్యుద్భవ
శబ్దము నందిమిది యుండె సర్వం బౌకటన్

క. వినికిడి కాదే శబ్దము
అననేటికి వేదచయము లనునవి శ్రుత్వా
అనుసరణీయత నొందెం
జనజీవన గతులు విరియ జగదోద్ధరణన్

వ. కావున ఆ బ్రహ్మమయమైన వేదచయము సర్వులకును జగదోద్ధారణ క్రమమునకును ప్రమాణములు. వేద విదితములగు ఆశ్రమ ధర్మములు సమస్థజనములకును ఆచరణీయములును ఆరాధ్యములును కాగలవు. వేదము సర్వధర్మ సమ్మేళనము. వేదానుచరుడు ధర్మపరుడు. వేదమును విశ్వసించని వాడు అధముడు. అప్రాచ్యుడు.

క. భూతాదులు తుష్టి దనర
యేతరుడై మెలగువాడు యెవ్వం డైనన్
చేతో మోదితు డగుచును
సంతోషము తోడ సర్వ సంపద లొందున్

వ. వేదప్రమాణముగా పురుషుడు పుట్టిన తదుపరి బాల్యమును వీడి (తల్లియొడి వీడి) చౌలోపనయన సంస్కారుడై గురుశుశ్రూష జేయుచుబ్రహ్మచారిగా వేద విద్యాబుద్ధులం బడసి ఆచార్యానుమతంబున యౌవ్వన ప్రాయమ్ము రాగానే వివాహితులై గృహస్థాశ్రమము స్వీకరించి, సర్వ భూత హిత వర్తనముగా సృష్టి దర్మానురక్తుండనై సత్సంతాన సౌభాగ్య సంభరితుండుగా యితరాశ్రమస్థులకు సహాయకుడుగా ఆశ్రయుండుగా ఆదర్శపాత్రుడుగా వెలుగొందుటయును, సంతానము పెరిగి పెద్దదైన స్థితియుండు వాన ప్రస్థుడుగా గృహ బాధ్యతానురక్తుల విడనాడి, ఆలి అండగా అరిషడ్వర్గములను విడనాడి మితాహార నిద్రలం వడసి, పురాణ పురుష సాంగత్య సంకీర్తనా భాజనుడగుచు మనశ్శాంతి వడసి తదుపరి నాల్గవ ఆశ్రమమున సర్వాపేక్షా వివర్జితుండై ఆత్మారామసంసేవగా యే కొద్దిగానోఫలపానీయ సేవనము జేయుచు నిర్మలానందమయ ద్యాన యోగ నిష్ఠా పరతంత్రుడై ముముక్షుత పరమపదమును గొనునది పురుషార్థ సారముగా దెల్పు

టయును మరియు–

కుండ ధారుండను దేవానుచరుని వృత్తాంతము

క. ఆదిం భాసుర భూసురు
డాదర యజ్ఞంబు సేయ అర్థార్థము రా
సాదరతం కుండధరుడు
ఆదరమున స్వాగతించి అభిమత సిద్ధిన్

క. ధనపతి దేవాసక్తత
తన వాడీతం డనుచును తన మది దలపన్
మనుజా భావ మెరుంగుచు
ధనదుం డటు కాదనంచు తపమూహకు రాన్

క. తపమున ముక్తియు దొరుకును
తపమున సర్వార్థ సిద్ధి తథ్యంబగుటన్
ఆ పనిచను ధన భావము
జపియించెను భూసురాత్మ జాగృతి పరుపన్

క. అత్తరి ఆ అవనీసురు
చిత్తము జపతపములందు చెలగుట కతనన్
విత్తము నాకేల ననుచు
మిత్తియ యీ తనువు లందు మేధాపటిమన్

వ. ఆలోచనా మగ్నుం డగుటయు ఫలముల పత్రములం దినుచు తపంబాచరించుచు క్రమ గతి జలవాయు భక్షణుండగుచు మహిమోన్నత సిద్ధిం మహానుభావుం డగుటయు, అతిభక్తిం దేవానుచర కుండధారుం మదిదలంప నతడురా, భూసురోత్తముడు నిజానుభావజనిత గంధ పుష్పమ్ములనాతని పూజించుటయును.

క. అభిమత సిద్ధిం బొగడియు
అభివాదన లందు కొనియు ఆత్మోన్నతియై
శుభమని సంస్తుత పాత్రుని
విభవోన్నతి పొందనౌగ వినిచియు నేగన్

వ. విప్రకుమారుండు మునిజన పూజిత పూజనీయుం డగుచు ఖేచర గతుల విహరించ నేగె. విభవుం డాత్మగత అప్రతిహతు డగుచున్–

నారద ప్రవర్తిత యితిహాసము

క. వేదకుల సంభవుం డొక
సాధారణ యజ్ఞ కార్య సాధిత చరణన్
బాధాకర బరివర్జిత
సాధనపర నారికేళ సంహార్విధులన్

వ. హోమాదిక హవిస్తంత్రము నడుప నుత్సహించుటయును, హవిర్భాగమ్ము గొన ఇంద్రాది దేవతా పితృ గణమ్ములు రాకడం గనమి, హోమాగ్నియు యెగయ కుండుటంగని, సోమిదమ్మ తన భర్త సోమయాజులం జూచుచు,బలివిధానము గాకుండుటయు, విధివిధానము కాకుండుట యెరింగియు,పతి అనుసరణీయ గావున చెంతనుండియు మిన్నకుండుటయును, ఆ సమీపమున కు వచ్చి ఆయాజ్ఞకుని ఆ సోమిదమ్మను కనుంగొని మానుష భాషణమ్ముల–

క. నడయాడెడు హరిణమ్మనె
గడగుము నాయీ తనువును ఖండించి వడిన్
ఉడుపుము యజ్ఞము దివిజులు
కుడువం రా సంతసాన కోర్కెలు యీయన్

వ. అని పల్కుటయును, ఆ హరిణుండట్లు చేయనని వెనుకాడుటయును,మగిడి యా కృష్ణ జింక వానితో నా యిచ్చు దివ్య దృష్టింగను, నా చెప్పినట్ల జేయుదేని నిన్నభినందింప వచ్చిన వారల్లదే దివ్యప్సరాగణ గంధర్వ కాంతలు విమాన మార్గమ్మున ఆకస వీధులంజూచు వారన, నవ్విప్రుడు విలోకించి, దివ్యత్వ సిద్ధికై దానిం జూచువాడగుటయు, దానం అతని తపోవ్రతమున కు విఘాతంబగుడు, ఉత్పాదమ్ము బట్టుటయును, వేణమృగరూపధారియగు ధర్మ దేవత వాని సన్నిధికేగి నీ యహింసామతమునకునుయాగదీక్షకును సంతసించితిననియును, బలి విధానము యాగాదుల నిర్వర్తించుట వేదసమ్మత ధర్మాచరణమేకాని, వేరు కాదని ధర్మ నిరూపణ చేసి పల్కుటయును, దేవతలు వర ప్రదాతలగుటయును, అను నియ్యితిహాసము అభిమత సిద్ధియు నారద ప్రవర్తిత శుభ ప్రదమ్మును అని భీష్మపితామహుండు ధర్మరాజున కెరింగించుటయును విని ముక్తి మార్గ ముపదేశించ మనుటయును.

భీష్ముడు ధర్మరాజునకు ముక్తి మార్గ ముపదేశించుట

క. కర్మాచరణము తప్పదు
నిర్మల మతి కర్మజీవ, నీకుం నాకున్
నిర్మోహము సన్మార్గము

ధర్మోద్ధారణమె ముక్తిదాయక మగుటన్

క. పాపాచరణ మధర్మము
కాపురుషుల కర్మగతులు కాముక గుణముల్
రాపాడించును మనముల
రూపించుచు రాక్షసత్వ రోషావేస్తన్

వ. అధర్మ మహంకారములు మోహ లోభ గుణమ్ములు. దురాశ దుర్నయబుద్ధుల వలన ఆత్మ సంక్షోభితమగును. పాపవర్తనముల పాల్పడజేయునుఅరిషడ్వర్గముల జోలికి బోక పెద్దల సుసాంగత్యము వలనను భగవద్భక్తి వలనను మంచి తెలియును. విషయ వాసన నశింప జేసి కొని సుగతి బాట నడచుచు శాంతి శౌచముల పునీతుడగును. సత్య ధర్మాచరణము అలవర్చు కొనగలడు. అహము నశించుటవలన పరతత్త్వ దృక్పథముదొక్కును.సత్కర్మ లాచరించనగును. అంతియే కాదు. మానవుడు ధర్మబుద్ధిన–

క. ఆత్మానందము తృప్తియ
ఆత్మీయత సత్యభాష్ణ లాదర బుద్ధిన్
నీత్మయ ధర్మాచరణము
ఆత్మజ్ఞానంబు పెంపు అదియే ముక్తౌ

జనకరాజ – మాండవ్య మహామునుల సంవాదము

వ. తొల్లి మహనీయ వేదాంత వేద్యుండైన మిథిలాపురాధీశ జనక మహారాజునొద్దకు మహా తపస్సంపన్నుండైన మాండవ్య మహాముని లరుదెంచి,మహాత్మా! నీకడ నిరపేక్షణీయ శిక్షణ మభ్యసింప వచ్చితినని దెల్ప వేడుటయును, మహదానంద భరిత మానసుండగుచు నా జనకుం డాతనితో–

క. తృష్ణయు అర్థాపేక్షయు
విష్ణ్మయ భాజనము యెన్న వేదన భరమే
తృష్ణది తొలగిన మనసు స
మోష్ణత భాసించి వెల్గు మోదముగూర్చున్

వ. నాది నావాడు అనుభావన సర్వ అనర్థములకును మూలము. నా యను మమతానురాగ వివర్జితుడు భాజనములన ంండి విముక్తు డగును. సమతాసమ్యక్ భావనము హాయి నిచ్చును. వినుము.

క. దిగు లనునది లేదు మదిని

సగకాలిన మిథిలజూడ సమ్యక్ దృష్టిన్
పొగలను సంతోషించను
పొగలవి నా జుట్టుం కమ్మ, పొందను రాగం

క. ఉన్నది లేదను భావము
యెన్నడు మదినొందబోను యెటు లేమైనన్
కన్నుల సంతోషించను
మిన్నది నా మీద పడ్డ మెదలక నుందున్

వ. అన్నిటిని సమాన దృష్టితో జూచుటవలనను ఆశానిరాశలకు తావీయకుండుటయు, సమతాభావము వహించుటయును, నిమిత్త మాత్రుగా మెలగుటయు అనునవి ప్రస్తుతింపనగు విషయములు. ప్రశాంత మనస్కుం డెల్లెడల సుఖమని యెంచును–

క. అన విని యా మునిపుంగవ
దనియుచు నాజనకు జూచి ధన్యుడ వనుచున్
మన ముపొప్పంగగ పలుకుచు
మనుజాధిప పూజనీయ మాన్యుడవనియెన్

పిత – సుత సంవాదము

వ. మేధావియను బ్రాహ్మణ బాలుడు తండ్రితో యిట్లను. ఆయువున్నంత వరకు పురుషుడు తన విహిత కర్మాచరణము జేయక తప్పదు. యేదియేమైనను కాలగతి మనలను మృత్యుముఖముల కోడ్వక తప్పదు. కావున నీ చేయందగు మంచిని సత్వర గతింజేయుట యొప్పు. మంచి చెడు అనునవి మనలోనే నున్నవి. సత్య మెరుగుట మంచి. మోహమందుట చెడుగు. హింస పాప హేతువు. అహింస పుణ్య ప్రదము. శాంతి సర్వ సమాహితము. కావున శాంతి యజ్ఞకుడ నగు దానన. దానికి తండ్రి యిట్లను–

క. యోగము జప తపము పరి
త్యాగము అనునవియు గాక తక్కిన ఆయా
రాగము భోగము దుఃఖము
త్యాగమునం గలదు సుఖము ధర్మోత్కరమున్

వ. కావున రాగద్వేష భోగభాగ్యమ్ములం దాశవిడిచి నిర్మల మనస్కుండవై నిర్మోహనా శాంతి కాముడవై ఆత్మ దృష్టిగల్గి యింద్రియముల జయించి అవ్యయానంద వదనమునకై పాకులాడుము. అప్పుడు మోక్షము నీకరతలామలకము. తంగేటి జున్ను.

హరీతుండను యతి, విద్వజ్జనంబుల కుపదేశించిన తత్త్వ ప్రకారము

క. యతి తా కోర్కు లడంచియు
మిత ఆహారమును గొనుచు మిత్రత నెంచిన్
సతమత మవకను నిద్రకు
అతి కరుణయు దయ గల్గి ఆత్మోన్నతుడై

క. నిందాస్తుతులం బొరయక
అందరు తనవార లంచు ఆదర ఫణితిన్
తొందర పడకం శాంతత
ముందుండును యతి విరాగి మోక్షా పరతన్

తే. యోగ పరతంత్ర యోధుండు యోగి యతియ
విషయ వాంఛల దలపదో విముఖ వృత్తి
నిగ్రహాదుల పెంపెక్క నీతి దనరి
ఆత్మ శాంతిన దీప్తమై అలరుచుండు

చ. అమలిన జీవనాసరళి ఆదిన నేర్చియు వేద విద్యలన్
మమయని యింటి వాడునయి మక్కువ దీర్పును శాస్త్ర ధర్మమున్
అమరి మునీంద్రు సన్నిధిన ఆత్మన విద్యల భవ్య దీప్తు డై
క్రమగతి నొందగా దగను కామ్యత మొప్పగ మోక్షమార్గమున్

వృ త్ర గీత

వ. వృత్రుండోడి పడియున్న అవసరమ్మున యసురగురుండైన శుక్రుండాతని మనంబెరుగ–

క. ఏమిది నిర్వేదనువై
యేమియు బట్టకను యుంటి వీవిధి దనుజా!
కామన వీడియు సుముఖత
ఆ మనసేమయ్యె నిపుడు అవనిజ పాలా

క. కాలగతి విధి విధానము
ఆలంబన మగుచు నుండు అభిమత సిద్ధుల్
మేలుం కీడులు క్రమగతి
లీల గదా దైవమాయ కెందును దెలియన్

వ. కలిమి లేము లస్థిరములు. దానికినై వగవ నవదు ఉబ్బును సబ్బియు–

క. అనుచును మీ కరుణను నే
మను యీ ముజ్జగాలు మోదం బలరన్
గొనలేదా పాలింపను
జనియెను ఆ కాలగతులు జననుత మౌచున్

క. లేదే యొక దుష్కృతమల
కాదన గలమా తలపను గర్వం దెంచం
వేదన లేదీ మనమున
యేదైనను సమ్మతాన యెంతును సమతన్

చ. అనిమిష నాథు తోడి అనినాడల గంటిని దివ్యధామునిం
అనుపమ లీలలీ జగతి నచ్యుతు మాధవు ఆత్మ నాభవుం
వినతులు జేయనా మనము విశ్వ వినోదుని దివ్య లీలలుం
జనములు సమ్మతింపదగ జాగృతి నిద్ర సుషుప్తు లందునన్

వ. ఆ దివ్యధాముని ధామముం జేరు తెరంగెరింగింపవే.

చ. అనుటయు నట్లుగాదు వినుమంచును నంత, సనత్కుమారు డ
ల్లన యట రాగ దెంచగని నయ్యసురేంద్ర గురుండనె వినం
దనుజు డనంతు నచ్యుతుని ధామము గోరెడు మానసంబునం
జననుత వీనులం దనుప జాలుదు నీవయ దివ్య ఆత్మనా

వ. అయ్యసురేంద్రుడు జేయు పూజలందు కొన్నవాడయి విశ్వ వినోద నచ్యుతు విష్ణుని మహాత్మ్యల నిదమిద్ధమ్మని యెరిగి జెప్పనౌనె. ఐనను నాదెలియందగు విషయమ్ము లెరింగింతు నని యిట్లను–

<u>రేఖా వలంబితము.</u> అభవు డవ్యయు డనంతు డాది నారాయణుడు
ఆది మధ్యాంత రాహిత్య అండ పిండాత్మ నిలయుండు
దేవ దేవుండు దేదీప్యమాన తేజోమయుండు
నీల మేఘచ్ఛాయ బోలు దేహము వాడు నేర్పరుండు
శంఖ చక్ర పద్మ గదాది దీప్తమౌ దివ్యాయుధుండు
దుర్నిరీక్ష్ణ తేజుండు దీప్తుండు దుష్ట శిక్షకుండు
కాంచ నాంచిత రుచిరమ్య రత్నాభరణ కౌస్తుభుండు
పాపహరణుండు పుంభావనా పావనుండు

సత్య ధర్ముండు శాంతుండు సద్గురుండు
వేద వేదాంత వేద్యుండు వేదాత్మకుండు
రాముండు కృష్ణుండు రీతిరమ్య రమణీయ నేత్రుండు
ధర్మ సమ్మత గణనీయ గుణ దయాపరుండు
అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుండు
సూర్యచంద్ర నయనుండు శోభనుండు
అమృతాంశుడు అక్షయా నందనుండు
జగజ్జేగీయ తేజుండు జగన్నాయకుండు
జగన్నాటక సూత్రుండు జాగృతుండు
నిశ్చయాత్మన నిలయుండు నిర్గుణుండు
సాదువాదన శీలుండు సౌమనస్క
అంతట తానౌచు కనుల కగపడకుండు
భావ భరితుండు భక్త పరాధీనుండు
ధర్మ కర్మల కాణాచి దయామయుండు
యోగ యోగ్యుండు యోగమయుడు

తే. పుట్టు గిట్టువు లన్నియు పుడమి యందె
ప్రాణ కర్మల దేల్యాడు భవము నొంది
ఆత్మ యొక్కటె పరమాత్మ యంశ దెలియు
పాప పుణ్యాలు లేకున్న పరమునొందు

వ. అన విని వృత్రుం డమృత స్వరూపములగు భవదీయ వచనంబులు వినికింజేసి మహా త్మా! మదీయ మనము విరుద్ధిం జెందిన దీ ప్రాణమ్ములు విడిచి దివ్యపథము నొందెదు అనుట యు, ధర్మరాజు వృత్రు జిజ్ఞానేశ్ఛయువిష్ణు మహిమాన్వితమగు భక్తియు నింత యొప్పునేయని మెచ్చుకొని, వృత్రాఖండలుల యుద్ధ ప్రకారము వినిపింపవే యని అడుగుటయును దేవనదీ తనయుం డిట్టులను–

ఇంద్ర వృత్రాసురుల యుద్ధము

క. ఇంద్రుని పై దనుజేంద్రుడు
సంద్రమ్మున దేలియాడు సాధన విధులన్
మంద్ర నగంబై ద్రచ్చున

ఇంద్రుం డతి భీతి జెంద యిడుమలు బాపన్

వ. బృందారక గురుండైన బృహస్పతి యతనిం దేర్ప తన యోగ శక్తి ప్రభావమ్మున త్రిమూ ర్తులం ఆత్మగతుండై ప్రార్థింపం రా వారలకా–

క. దనుజేంద్రుని జూపుచు
ఒరులెవ్వరు దీనిగావ నోపుదు రనగా
సుర రాజేంద్రుడు వేచియు
పరుగిడెనా దైత్యు జంప భండన భూమ్మిన్

వ. అప్పట్టున దేవ గురు మునిపుంగవు లెల్లరును దివిజేంద్రుని పెంపునకై హరిహరుల పూజింప వచ్చిన వారలగుటయు, అరువది వేలేంద్ర తపోబలమ్మది అజుడిచ్చిన వర దర్పమది.

క. హరిహర తేజం బిరుగడ
తరముగ నా వృత్తు దాక దీప్తిత మౌచుం
జ్వరమై ప్రజ్వలి వృత్రా
సురు తనువున ఆవహించి స్రుక్కగ జేయన్

క. దేవతలాడిరి పాడిరి
ఆవేదన తీరజావ అసురుం డటులన్
దేవేంద్రు నంట నగునని
భావించి బ్రహ్మ హత్య బాపుటకొఱకై

వ. పద్మభవుని ప్రార్థింప ఆతండాలోచించి యింద్ర శాపము నాతని నుంచివై దొలంగ ఆత్మ విధి రావించిన్.

తే. అగ్ని నోషధి తృణ వృక్ష అతివ జలము
పావు పావుగ నీ హత్య పాతకమ్ము
పంచి కొనగను జేసెనా బ్రహ్మ యపుడు
యింద్ర జేయను యీ రీతి యిష్ట గతుల

వ. అనవిని యా అగ్ని యోషధి తృణవృక్ష అతివ జలములందు కియ్యకొని, మాకు నిష్కృతి యెట్టిదని వేడటయును, దివ్య చింతనుండై విధాత వారలకు క్రమగతిన అగ్ని రగుల్గొల్పక హవిః ప్రదానము జేయువారలయందును, సర్వ కాలంబుల భవచ్ఛేదనము చేయువారలయుందును, రజస్వలగాకుండు వారితో సురక్రీడ లాచరించువారల యందును, స్నాన పానాది కృత్యముల నదులలో మలమూత్ర శ్లేష్మమ్ములు విడుచు వారలయందునను మీకడ గల్గిన బ్రహ్మ హత్యా

పాతక మంటగల దనుచు నిర్దేశించి దానికి ప్రియంబందిరా వర్గములు నల్గురగుటయును, అశ్వమేధము గావించి శతమఖుండు పాప నిర్వృతుం డగుటయు, నాకలోక పాలనాది జయండునై వెలింగె నని పల్కుటయును–

తే. వృత్రు రుధిరమ్ము ధరదూలి వ్రయ్యలయ్యు
పుట్ట గొడుగుల రూపాన పుడమి బుట్టె
భోజ్య వస్తువు గాగను భూజనాళ్కి
వేద విహితమ్ము గాదాయె విప్ర జాత్కి

వ. అనుచు మరియు–

క. ఆ వాసపు చందమ్మున
ధీ విభవా పాండవాన్వ య ధీధిత చరితా
పావనమౌ అశ్వ యజన
భావనువై వర్ధిలు మనె భాసుర కీర్తిన్

క. ఇది విన చదివిన వారల
మది పాపము దొలగు నిజము మహిమాన్వితమై
పది మందికి సుహితుండగు
వదలును రాక్షసుల బాధ వసుధా కలిలోన్

వ. అనిన ప్రీతుండై ధర్మతనయుండు తాతా! వృత్రు జర్వమునొంది శక్తి హీనుండై అసువుల బాసెగదా? ఆ జ్వర పుట్టు పూర్వోత్తరము లెరిగింప వేడుటయును–

జ్వర పుట్టువు గతి వివరంబు లెరింగించుట

క. ఆదిన దక్షుం డనియెడు
ధీదిత ప్రజ్ఞా విభూతి తేజో నిధియున్
వేదాధ్యయనుండు యశుడు
బీదల పాలిట పరోక్ష వీక్షణ పరుడున్

క. గ్రహ తారక గణ మలరగ
అహహా యన భూత కోటి అబ్బురపడగా
ఇహపర సాధక జనములు
సహజోత్సుక రాగ దెంచ సంభ్రమ గతులన్

క. దక్షుం డధ్వర ముడుపను

వీక్షణులై దేవ ఋషులు వేవేల్గములై
పక్షేంద్ర దివిజ సన్నిభు
లక్షుల దిలకింప నేగ నందరి తోడన్

క. యక్షులు గంధర్వాది
ద్రక్షులు కిం పురుష సిద్ధ దుందుభి నాదుల్
దక్షాధ్వర వార్త వినుచు
సాక్షీ భూతులరు గావ సరగున బోవన్

క. చూచిన యా దాాక్షాయణి
వేచని రుద్రాభినేత్రి వేసరి మదిలో
నోచగనౌదే బోవను
మీ చనవున బోవుదాన మేలౌ గాకన్

క. అన విని యా హరుడనె నీ
వనునది నావలన గాదు వాసవి దివిజుల్
దినునా హవి భాగము నా
కనునదిగా పిలువ నైరి కర్తయు భోక్తల్

క. తన పతి సర్వేశ్వరు డల
జన నేరక యుండ గాంచి జనకుని పోకం
మనమున దలచుచు మౌనత
అనగా నటు మాట నూనె అభిమాన్వతియా

వ. దక్షుని సుత దాక్షాయణిం జూచుచు ఆమె భావమెరింగిన వాడుగా భవుండు ప్రమథ గణముల రావించి దక్షుడు జేయు–

తే. యాగ విధ్వంస మొనరింప యాజ్ఞ యిడగ
ప్రమథ రుద్రాది గణమూక పరవశించి
దక్షు యాగోత్సవమ్మును దగ్ధ పరుప
రక్త మాంసాది పిశితమ్ము రాశిబోయ

తే. గగన మార్గాన చరియించు కాకిమూక
గృధ్ర మార్జాల సింహికా కౄర మృగము
పెల్లు విరియుచు బారనై రెల్ల జనులు

నాల్గు దిక్కుల వారలు చాల్గ వెరచి

తె. రుద్రు నక్షుల జ్వరాగ్ని రూప మొకటి
బుట్టి మడియింప యాగమ్ము మట్టి గలుప
సురలు మునులును ఋషి వర్గ సూరి జనులు
పిక్క బలిమిని తమతమ దిక్కుబార

వ. అంతనా బ్రహ్మ ఆ యింద్రాది దేవతల తోడం గూర్చుకొని యరుగు దెంచి యాగాదు లం దలి హవిరిర్భాగమ్ము నీకునుం అనుమతింత్రు. శాంతింపుమన, పరమ దయాళుండైన సర్వేశ్వ రుండు ప్రసన్నుండగుటయు, శతానందుండనువాడు యిందుశేఖరుని వంక జూచి దేవా! నీఅక్షు లం బుట్టిన జ్వరాగ్ని రూప ఉగ్రుండు ఏక ముఖమ్మున నుండ పృథ్వి దుర్భరంబగు, దానింబహు ముఖములుగా విభజింపవేయన నగ్గిరీశుండు దానిని కరులయందు శిరస్తాడనముగను, పాము లందు కుబుసమ్ముగను, గోవులందు గొరిజ వ్యాధిగను, తురగమ్ములందు పార్శ్వశోషనంబుగను, మయూరములందు పత్రోచ్ఛేదనముగను, కోకిలయందు నేత్ర పటలముగను, అజగరంబుల చిత్త భ్రమగను, శార్దూలమ్ము లశ్రమముగను, మునుజులందు జననమరణముల యెడ వేదనా వేశముగను విభాగించెనిది జ్వర ప్రకారమునుపరమేశ్వర తేజమ్ము గావున సర్వాదరణ అనుభవ మాననీయమునై యుండు. యీ కధ వినిన వారలు భయాందోళనలు దొలగి ఆరోగ్య ప్రదము గూరునన విని–

శాస్త్రము తెలియని వారొనరింపనగు విధము దెల్పుమన

క. తిరు విధు లెరుగని జనములు
గురు పూజన వృద్ధసేవ గోపూజనమున్
కురుకుల భారత కథలను
తిరమగు మది వినుట లెస్స తీరును బాధల్

క. భారత పంచమ వేదము
సారము సర్వార్థ శాస్త్ర సంచయమగుటన్
నేరమి జనముల కొరకై
భారతము రచియింప బడియె పారశ్యునిచేన్

క. సత్యము నీతియ ధర్మము
అత్యవసర బోధసేయ అవనీ జనికిన్
నిత్యాచరణపు కధనము

పత్యం బీ భారతమ్ము పాపాహరమున్

వ. ఈ భారత కధన కధలు వినుట వలన పండితులకే కాదు పశుత్వ మానవ పక్షి జంతు సంజాతము లెల్లను మోక్షగామి వర్తనము నొందగలనగుపూర్వేతిహాస విదితము. భారతము సర్వోత్తమోద్ధరణరచన. దివ్యకధనము.అంతర్గత గీతా ప్రబోధనము. మానవ జీవన గతులను విధివిధానములను తేటతెల్లము జేయు ఆశాజ్యోతి అని పల్కుటయును–

అనిష్ట నేమియను ముని సగరున కుపదేశించిన ధర్మ ప్రకారము

క. ఎవ్వడు తిరుడై మనమున
యౌవ్వనము గల్గు గతులు యెలమని దలచో
ఎవ్వండీ తనుజగములు
నివ్వటిలం జేయువాడు నెరుగునొ మనముల్

తే. నీది నాదను భావమ్ము నెంచకుండ
నేలతల్పము నొకటిగా నెంచ నౌచు
ఉన్న లేకున్న నొకటిగా నుత్సహించు
ముక్తి నొందును ఆయాత్మ మోదమలర

తే. భూత తరి పుట్టి పెరుగుట బొలియుటయును
యెవ్వ డెరుగను నాతండు యోగు మోక్ష
గతి యెరుగ లేని చిత్తమ్ము గాంచ నవడు
జన్మ లెత్తుచు నుండును జగతియందు

క. తను భావము యెద దలపని
జన జీవన పరుడెరుంగు జగదోద్ధారున్
తనుభావము తనదేయను
మనుజన్ముడు కాంచ నవడు మాధవు తోవల్

వ. ఇది నారదోపదేశమున అనిష్ట నేమియను ముని సగర చక్రవర్తి కుపదేశించిన ముక్తి దాయక ధర్మ ప్రబోధకము. అభిమతార్థ సిద్ధి పొందనగు మార్గము. ఇవి అన్నీ శరతల్ప గతుం డయ్యున్న భీష్ముండు ధర్మరాజున కెరింగించిన సుబోధకములు.

భార్గవునకు శుక్ర నామము గల్గిన విధంబెట్టు లనిన

వ. భర్గు తనయుండు భార్గవుండు. తొల్లి తన యోగ మహిమ ధన దుని ధనమెల్ల గొనగ నొచ్చి పురమర్దనుతోడ చెప్ప, కన్నుల నిప్పులురా, దుర్వార కోపభరమ్మున శూలముగ్రత దాల్చం,

గడగడ వడకుచు భార్గవ తుప్పల దూలం, అచట గూడ చిత్తమాకులి బొందం, త్రిపురాంతకు హస్త మందు దొరుగై భర్గుడు మిగలం.

ఆ. కడుపు జొచ్చు వాడు కలకల మొందెగా
తనువు దార్లు మూసి తల్లడింప
బైట పడగ నెంచు భార్గవుండు
శిశిన దారి బుట్టె శిశ్నజుండు

వ. వానిం జూచుచు ముక్కంటి రుద్రుం డగుటయు అర్ధనారీశ్వరి అభయార్తి శివునిగాంచి–

ఆ. తనువు బుట్టి నట్టి తనయుండు కాడొకో
చెరుపు రాదు వీని చెడ్డ జేసి
అనగవినియు నాలి అర్ధాంగి భర్గుండు
కనులు ముడిచి జూచె కరుణ మదిని

వ. అట్లు శిశ్న మార్గజన్ముండు గాన శుక్రనాముండని పల్కె భవుడు.

జనకునకు పరాశరు డుపదేశించిన ధర్మ మార్గములు

- తాజేసిన మంచి చెడ్డలు సుఖ దుఃఖములకు హేతువై కుడుపక మానవేరికైన
- త్రికరణ శుద్ధ్యాత్మకముగా జేసిన పనులు ధర్మసమ్మతమై త్వరిత ఫలముల గూర్చు
- శమదమాది సత్య హింసలే ధర్మ మార్గములు
- ఇంద్రియ హయగతి దుష్పథమున జనకుండ, మనో కళ్లెములం బిగియ బట్టినమానవుడు శక్తిమంతుడగును
- పొందిన ఆయువు పాపవృత్తుల యందుకాక, మంచిగా వినియోగించినవాడు యోగ్యుడు
- దురితములు గావించి మంచిని గోరుట మురికినీటి స్నానము వంటిది
- ధర్మార్థము వెచ్చిన ధనము మంచిని గూర్చును
- సమదర్శి ఆత్మయోగి జ్ఞాని భగవంతుని దర్శించగలడు
- వేదాధ్యయనము వలన గురు జన ఋణమును. యజ్ఞ యాగాదులచే దేవ ఋణమును, పూజనార్చన విధుల అతిథి ఋణమును, శ్రాద్ధక్రియన పిత్రవ్యదేవ ఋణములను, రంజనీయ కార్యముల వలన మానవుల ఋణములు దీర్చనగు. యియ్యది నారదాది ముని ముఖ్యులు ముఖతా వినినదిగా యెరింగించుటయును.

క. హరి కథనము దైవ స్తుతి
పరహిత కార్యాచరణము భవభయ హరమున్

దరిజేరవు దురితమ్ములు
నర జన్మము దుస్తరమ్ము నారద విదితం

క. ఆహిత యజ్ఞము పుణ్యము
జాహ్నవి స్నానంబు సమము జగతీ జనికిన్
ఊహించ తల్లిదండ్రులు
స్నేహోన్నతి గూర్చు అగ్ని సేమం బరయన్

క. ధన దాహము జన పోషయు
విన గూడని పాపకలన విడనాడ నగున్
మనమున మంచిన యెంచెదు
ధన అధికుల కొలువు సేత ధర్మం బగునే

క. హితవుం గూర్చును ధర్మము
హతముం దా గూర్చు కొనును అన్యాయపరుం
డది బోయెడు పాపాత్ముడు
ధృతి దూలుచు నేల కొరుగు దుర్నయుడగుచున్

క. ధర్మేతర దక్షత్వము
నిర్మలమై యుండ నవదు నీతియ కాదొ
కర్మల చెడు వాటిల్లెడు
నిర్మల హృదయుండౌధర్మ నిరతుం డ్డెలియన్

తే. అంతొ యింతైన జాలు ధర్మార్జనమ్ము
కోటి రెట్ల పాప మధర్మ కూడు దినుట
దాన ధర్మాలు జేయని ధనమదేల
క్రూర కర్మల పాల్జేసి కూలనేయ

తే. ధరణి పాలనా ధర్మమ్ము దలచు రాజు
నీతి మార్గమ్ము గరపెడు నియత మతులు
జాతి జనరక్షణార్థమ్ము జనుచు నుంద్రు
ఇహపరమ్ముల నాశించి ఈశ్వరాజ్ఞ

వ. తపము త్యాగమ్ము దానమ్ము దాసత్వ గుణములు. బ్రహ్మ క్షత్రియ వైశ్య శూద్ర జాతుల ధర్మములు.

తే. జాతి ధర్మము దప్పిన నీతి చెడును
యుగ యుగాలకు ధర్మాలు యుర్వి మారు
ఆత్మ రక్షణె ముఖ్యమ్ము అన్ని కంటె
అర్ధ మాన్యార్ధ హేతువై అవని యెరుగు

తే. సార సంసార కార్యాల సమత బాయ
దేహ యాత్రల జీవుండు ధీర చిత్త
యోగ విద్యా ప్రభావన యోగ్య తెరిగి
శాంతి కాముకుడౌటది సాధనమ్ము

తే. లోభ గుణమది మనుజుల లొంగదీయు
స్వార్ధ బుద్ధిని పెంచి నిస్వార్ధు జేయు
ప్రాణ హానియ కూర్చును పుత్ర కలిన
అగును అర్ధమ్మె సద్ధర్మ మన్నికంటె

తే. యెంత జేసియు ధర్మమ్ము కొంత నిలిచి
జ్ఞాన బుద్ధుల వలన, నజ్ఞాన మణిగి
కామితార్థము లొడగూర్చు కాలగతుల
సత్య ధర్మాలు వెలుగొందు ప్రత్యయాన

వ. అన విని జనక విభుండు మరల నాతని నహింసను గూర్చి దెల్పుమన–

పరాశరుండు జనకునకు వివరించిన హింసాహింసల ప్రకారము

క. జీవాధారము హారము
జీవికి జీవే దినగను జీవింపంగాన్
జీవికి ఆ పరమాత్ముడు
జీవింపను హార మగును జేజే పరతన్

క. హింసాహింసలు వేవల
హింసకునకు దిన నహింస అగుటది దెలియన్
హింసాత్ముడు పాపాత్ముడు
హింసించియు దినకయుంట హింసయె సుమ్మా!

వ. హింస రెండు విధములు. శారీరక మానసికములు. శారీరక హింసశిక్ష మానసిక హింస పాపము లేదా శిక్షణము. హింస అని దలంచుచు ఆ పని జేయుట మహాపాపము. హింస

నుండి కాపాడుట ధర్మోద్ధరణము. బలవన్మరణము లేదా ఆత్మహత్య మహాపాతకము. అసత్యము నకు అధర్మమునకు పాల్పడుట తనను దాను హింసించుకొనుటయే. యితరులకు హానిజేయుట హింసాత్మకము. యితరులకు మేలొన గూర్చు హింస హింసకాదు. ఆత్మ క్షోభుని యెట్లు కాపాడి రక్షించినను హింసగాదు. శమదమ రాహిత్యము హింసకు దారి జూపు.కావున హృదయమునకు శమదమాది సద్గుణము లలవర్చుట అహింసకు దోహదకారి అగు. ధర్మ యుద్ధమున పాల్పంచు కొనుట అందు జంపుట, జచ్చుట, హింస, అధర్మము కానేరవు. ఆత్మ రక్షణకేమి జేసినను ధర్మ మును అహింసయునగు. తల్లికొట్టవచ్చు. దిట్టవచ్చు. దైవము దండించనగు. గురువు శిక్షంచ నగు. ఇవి ధర్మ సమ్మతము. హింస కానేరదు. మాటలచే బాధించినను హింసయే. దైవమును దూషించుట అనునది మహాపరాధము. అధర్మము. అజ్ఞానము. అన్యాయము. మహాపాపము. తను దాను హింసించు కొనుట అజ్ఞానము. అమాయకుల జంపుట పాపము ధర్మము. ఉల్లా సమునకై హాని జేయు టధర్మము. యజ్ఞాదుల బలిదానమ హింస కాదు. ఇయ్యది మమయని యెడు నా తండ్రి వలన ఆదరమున వినిన నారదాదిమహామునుల ధర్మాధర్మ విషయ విజ్ఞాన ము మతముగా భగవానుడు నుడివినట్లు ధర్మరాజునకు పితామహ భీష్ముడు దెల్పుటయును, విని యింకను ధర్మోపదేశములు జేయుమని అడుగుటయును–

హంసగీత

క. ఒక్కెడ నళిన భవుండల
చక్కని రాయంచ రీతి సరసున యీదన్
మక్కువ జూచిన సాధ్వులు
ఒక్కుమ్మడి దరికి జేరి ఓరగ నిలువన్

వ. ఆ నీట విహరించు వాడా మరాళ రాజు వారల వంక రానవుచు–

క. మీరలు సాధ్వులు కారా
యీ రాకడి కేమి కతన యిత్తటి కడకున్
దూరము వస్తిరి నాకై
కారణ మదిలేక రారు గంధర్వ సముల్

వ. అని నప్పుడు వారలా పక్షి రూపధర నళిన భవుతో మహాత్మా!

క. తగ జేస్తివి సృష్టి జగతి
తగు దిట్టవు నీవకావె ధర్మ విచారా

నగు మోమున మము గనవా
తగనీతియ నీదుమాట తథ్యము వినగన్

వ. అన విని అదియేమో దెలుపు డనగా వార లాతనితో యిట్లనిరి.

క. ఉత్తమ మెయ్యది యిద్ధర
ఉత్తమ గతి నొందనగును యుర్వీ జనికిన్
జిత్తము అలరం దెల్పవె
ఉత్తమ మోక్షమ్ము గూరు యుద్ధతి తెరగుల్

వ. అనిన వారల నాదరించి విరించి యిట్లను–

సీ. అన్ని జన్మల కంటెను ఆధ్యమీ మనుజ జన్మ
ఉత్తమం బైనది యుర్వి మీద
వేద్విద జ్ఞానమ్ము వేదోక్త వర్తన
ఉత్తమ మార్గమ్ము యూహ దెలసి
ధర్మార్థ కర్మమ్ము దేవతా పూజన
బ్రహ్మ పథము గూర్చు భవములేక
చన్నీటి స్నానమ్ము సద్గురు సంసేవ్న
పాపముల్ తొలగంగ పరము గొల్పు

తే. మంచి బుద్ధియు నడవడి మాన్య మౌను
నీతి లేనట్టి మనుజ జన్మ లేతి గాదె
ఆత్మ చింతన పరమాత్ము నందజేయు
పరమ పదమును గొనుమయ్య భవ్య జనుడ

వ. క్షమ, దయ, శమ, దమములు మరియు సత్యధర్మములు మానవునకు ఉత్తమగతులు కల్గించును. సత్పురుషులు సత్యములు కానట్టి పనుల జోలికి పోరు. మర్మపు మాటలు నయవంచన అధర్మ వర్తనము నిష్టురోక్తులాడుట పరదూషముల జోలికి బోరు. వినరు. మాటాడరు. జ్ఞాని సంసార సాగరముల నీదులాడుచున్నను తామర కంటని నీటి బొట్టువలె విశుద్ధిగనును. పాప చింతన పర ధనాపహరణము నరకబాధలు కల్గించును. మంచివాడు చెడ్డవారికి గూడను మంచినే జేయుచుండును. ఒరులను బాధింపడు. తాబాధ పడడు. కష్టమైనను సుఖమైనను దైవఫలములుగా భావించు వాడు ముక్తుడగును. నిర్మల మనస్సు సత్పురుషుల సాంగత్య ము జీవకారుణ్యము. ఆత్మ విశ్వాసము దైవచింతనము ఆనందమునుకల్గించును. వేదసారము సత్య

ము సత్యసారము దమము శమదమములు ముక్తి దాయకములు. పాపము తలపకున్న భయము దరిజేరదు. పిల్లల యెడలను వృద్ధుల యెడలను దయతో వర్తింపుము. దైవ దూషణము చేయుట దారిద్ర్య హేతువు. అసత్యమాడుటకంటె, నోరు మెదపకుండుట మేలు. హాని దలప కూడదు.

భీష్ముడు ధర్మరాజునకు యోగతంత్ర ప్రకారము దెల్పుట

క. యోగము సాంఖ్యము రెండును
సాగగు నాముక్తి మార్గ సాధన పరతన్
యోగము కర్మోపాసన
ఆగదు ప్రాణకర్మ అంతర్గతులన్

క. శాస్త్ర సమన్వయ సాధన
విస్తృతమౌ సాంఖ్య పథము విద్వజ్జనిచే
ప్రస్తాదిత యోగక్రియ
ప్రస్తుతి పాత్రమ్ము ముక్తి భాజన పథమౌ

క. దోవలు వేరై యున్నను
తావలమౌ ధ్యేయమొకటె తథ్యము దెలియన్
కేవల మా దైవగతియ
భావమ్మున యేక మగుట భగవాన్తోడన్

క. యోగము దైవానుభవము
యోగము కర్మానుభవము యోగ్యత నొందిన్
యోగము సిద్ధించనగును
యోగించుటనునది దైవ యోగము సుమ్మా

క. యోగము మహదానందము
యోగము సర్వార్థ సిద్దియోగమె దైవం
యోగక్రియ గురుముఖతా
యోగ్యులౌ గురుల వద్ద పొందగ వచ్చున్

వ. యోగాభ్యాసునకు ఆత్మశుద్ధి ఏకాగ్రత తదేక దీక్ష నిశ్చల చిత్తము కావలయును. నిద్రాహారములను సైతము లె క్క గొనరాదు. పంచ భూతోద్భుతులకు చలించరాదు. అప్పుడే యోగ సిద్ధి కల్గును.

తే. యోగ సిద్ధియ దైవమ్ము రాగమయుడు
సర్వ శక్తిమయుండైన సాదుచిత్త
దైవతమ్మంచు దలపనా దివ్యశక్తి
నంద నందనుండౌను ఆనందమయుడు

తే. వలయు చోటికి బోగల వాడుకాదె
వాయు గమనుండు తృటిలోన వాలగలడు
మూడులోకాల పరిధిలో ఆడుకొనుచు
జనుల జాగృతి పరువనా సాగుచుండు

తే. ఆత్మ నెంచిన వారల నాదు కొనును
ప్రాణ దానము శక్తియు భద్ర పరచు
భావ సంయోజనా యోగభాజ నుండు
దేవ దేవుని అనుయాయి దీప్తయశుడు

తే. సత్యసంధత తనదైన చతుర చిత్త
పలికి నట్టిది సర్వమ్ము బ్రహ్మవాక్కు
పాప పంకిల మనునది పడదు మదిని
ఉత్తమోత్తమ భాజన ఉత్తముండు

తే. బాబ బాబజీ అవతార బాజనామ
యోగరాజాఖ్య యోగాత్మ యోగ గురుడు
సాదు జీవన సాంగత్య సమత జీవ
పరమ పావన సత్కీర్తి పాపహరుడు

తే. అనిన తాతను యెంతయో అభినుతించి
యోగ భాజన జీవన యోగ్య గతుల
సాంఖ్య యోగము దెల్పనా సమత గూర్ప
అనిన వానికి తా భీష్మ డనియె నిట్లు

సాంఖ్య యోగ స్వరూప వివరణము

వ. దృఢ జ్ఞానము వలన మానసిక విషయేంద్రియ వాసనా విషయములెరింగి తిర్య జ్మనుష్టా మర పితృ స్థిర వివిధ గణ పరిధుల విలసిల్లనగు తెరగులు వేద విజ్ఞానమున అవగత మొనరిం చుకొని, అనుమతంబగు బుద్ధిన కామక్రోధాది అరిషడ్వర్గముచే నెరయకుండ, నావలద్రోసి,

ఆయు వింతియేయని, కాలగత కర్మలిట్లను సుఖదుఃఖాలు పొందరాదు. కావున లో నడంచుచు గుణ వైరాగ్యుండయి, కర్మేంద్రియ వ్యాపార కలితుడుగాక యుండ, అర్థాపేక్షయు లోభ గుణ వివర్జితుండునై, సమాన బుద్ధిందవులుట సాంఖ్యమ్ము నాబడు. ప్రకృతి యందలి పదునారు వికారగుణములకు ఆత్మ మూలస్థానము. ఆత్మ ప్రకృతి వికృతి భావముల నొందక మధ్యస్థ సమతా భావ నిరూధన మున యేకత్వ సిద్ధినొంది వెలుగుచుండు నదియ, పంచవాయుసమ్మిళితమైన వాయువు (ప్రాణము) నిశ్చలత నొందించనగు నా యాత్మ అంతరంగస్థ పరమాత్మ యందు కేంద్రీకృతము కాగలదు. ఆ స్థితియందు సుఖదుఃఖములుగాని, జన్మ వ్యధయు కాని, పురాకృత పాపక్లేశముల బెడద గాని యుండదు. శుద్ధ తత్త్వంబరయ నగు. దేవ పితృమానష తిర్య కీటక జ్ఞానములు (తెలియబడక) లేకయుండు, మనను నిర్మలత్వము నొంది మెదడుకు పనియుండదు. హాని వృద్ధులు తెలియబడక (లేక) అలరునాత్మ. అన విని అయ్యుధిష్ఠిరుం డమితానంద మగ్నుండయి, దేహ దోషమ్ము లెరుగం బల్కువేయన, దేవవ్రతుం డిట్టులనియె–

క. కామము లోభము కోపము
లీమానవ దేహనైజ మీప్సిత బుద్ధిన్
యీ మానవు లామాయా
సామాన్యత దవిలి నాత్మ సతమత పరచున్

వ. క్షమ వలన క్రోధము, సంకల్ప వర్జనమున కామము. దయా గుణమువలన లోభము, సత్యా లోచన వలన నిద్రయు, లఘు భోజనము వలన నిశ్వాసమును అపనయించ నగు తపో వివేకుడీ పరిచయమున విష్ణు మాయా విలసనముల తెలియనగుచు బుద్బుదప్రాయ సామ్యమౌ యీ మనుజ జీవికాల మందు మోక్షకామియైన వాడు సాంఖ్యమున బుద్ధి దవిలి పరమపథమ నొందు–

భీష్ముడు పరమ పద ప్రాప్తి ప్రకార మెరింగించుట

క. యోగము సాంఖ్యము నెరిగితి
సాగెడు మోక్షైక సిద్ధి సముచిత భంగిన్
ఆ గురు నేమర కుండుము
యేగుము నీ దారి బట్టి యే మరకుండన్

వ. యీ సాంఖ్యము ప్రకారము, బహిస్ఫురణము యోగి దండము కమండలము దర్భాసనము యిత్యాదులు తొలంగినను జడియక, ఆచరించెడు సాధకుండు ప్రజ్ఞా కర్ణ ధారసామర్థ్యమ్మున దుఃఖోపశమనమును వ్యాధి మృత్యు మనోగ్రాహంబును భయోరగసహితమ్మును హింసా

వేగమ్మును రాగ పంకమ్మును, దృష్టావర్తనమ్మును నానా ప్రీతిరత్నంబును సత్యతీరమ్మును అను సంసార సాగరము నుత్తరించు, తత్ సుకృతి కతమ్మున సూర్యరశ్మివలన తటాకోదకము లు ఆవిరియైనట్లు భౌతిక కర్మాను భవములు కరిగి వాయు రూపము నంది నభమ్ము చేరు. ఆ రశ్మిరజో సత్త్వముల దాటి పరమగతిని ఆ పరము నారాయణుని యందు యేక కృతమ్మగు తన్మయత్వమున యమృతత్త్వ సిద్ధింజేరుననిపల్క, పాండవాగ్రజుండు, ఆనందాతిరేక విస్మయుం డగుచు, అయ్యమృత తత్వుండు, మహాత్మా! తన పూర్వ వృత్తాంతముల నెరుంగునో, నెరిగియు తలంపకుండునో, నిశ్చయముగా పల్క సాధ్యమా? అతి గుహ్యమ్మగుటయు, వితర్కించి పల్కను నీవకాక ఈ లోకమ్మున నొండురులకు సాధ్యంబే? అనుటయునజ్జన పతికి జాహ్నవీ తనయుం డిట్లనం–

క. నీ పశ్నయు కడు మిన్నయ
విప్రోత్తమ బ్రహ్మ యొకడె వివరింప నగున్
నీ ప్రశ్నకు తావెక్కడ
అప్రతి భావాత్మ కాదె అడుగుట కైనన్

వ. బాహ్యేంద్రియ వివర్జితంబైన యోగాత్మ తదాత్మ్యమ్మొందియుండు. అప్రతి భావనా సదృ శము. అచేతనము. రాయినందుండు ప్రాణము వంటిది. అచేతన స్థితికి తలం పెక్కడిది. సుప్త స్థితికి యేయెరికయు నుండుననిగాని,యుండదనిగాని ఏమానవుడు చెప్పగలడు? అందుచే నీ ప్రశ్నమునకు యిక్కడ తావేలేదు.

తే. నిశ్చలాత్మన మహిమమ్ము నెరగు డెద్ది
భావ భావన భాసమ్ము పరమ పదము
నిర్వికారక శుద్ధాత్మ నిర్గుణంబ
అమృత తేజోమయానంద అద్భుతమ్ము

క. పునరావృత జనరహితము
మన నిజమౌ భావనాత్మ మహిమాన్వితమౌ
తను భావము విషయేచ్ఛలు
అనునవి లేవందు గాంచ ఆనందమయం

క. యోగము దైవ సమానము
యోగాత్మకు లేదు భయము. యోగము చెడినన్

యోగ్యత కొలదిం మరలా
సాగును యీ జనన మరణ సద్గతు లిలలోన్

వ. ఇయ్యది శ్రీమన్నారాయణప్రతిపాదిత వేదాత్మన అక్షర విదితం బెరుగుము. యోగాత్మన ధర్మజాతకుడైన ధర్మరాజునకు భీష్ముండు దెల్పెనని వైశంపాయనముని ధర్మజ పౌత్రుండైన జనమే జయ మహారాజునకు వినిపించుటయును. అనునిది.

శ్రీశ్రీ వాణీ వరప్రసాదలబ్ధ సుకవి జనప్రియ సాధుజన విధేయ శ్రీశ్రీ కవిత్రయ స్ఫూర్తి ఆర్వేల నియోగి బ్రాహ్మణ మండపాక వంశోద్భవ వీర్రాజు పౌత్ర సూర్యప్రకాశం సత్యనారాయణాంబాతనయు ప్రణీతంబైన –: శ్రీమదాంధ్ర మహాభారత శాంతి పర్వ పంచమాశ్వాసము :–

శ్రీమదాంధ్ర మహాభారతము
శాంతి పర్వ – షష్ఠాశ్వాసము

శ్రీ నిలయా ధర్మ నిరత
ధీనిధి సర్వాత్మకుండ తేజోమయుడా
భూనాయక ఆత్మ మయ
యా నియతోద్ధారకుండ హరిసమ బావా!

భీష్ముడు ధర్మజునకు అక్షర, క్షర విషయము లెరింగించుట

వ. దేవా! వైశంపాయనుడు జనమేజయున కనినట్లు యోగసాంఖ్యములను పరమపధనిధానములను లెస్సగా దెలుప వినినవాడై పాండవాగ్రజుండు దేవవ్రతు నెంతయుం గొనియాడి, మహాత్మా! నీవలనగాదె యిన్నిన్ని ధర్మాధర్మాంతర్ లంతర్ధర్మ విషయంబులెరింగిన వారమైతిమి. నీవు అంతటి వేదాంతవేదివి కావున తెల్పగల్గితివి. నీవుగాక యింకెవ్వరీ సర్వధర్మమ్ములు దెలుపంగలవారలు. దక్షిణాయన దినమ్ము లిక కొన్నియే గలవు. నీయంతటి వారలు మాకింకెవ్వరు మమ్ము ప్రబోధింప, మరల యీ కురువంశమున ప్రభవింపవలెను కదా? అక్షరం బెద్దియో క్షరము యెద్దియో వినం బల్కు మనుటయును, విను. జనక–వశిష్ట సంవాదమనుయితిహాసమున నీ యడిగిన విషయము తేటపడగలదని యిట్లు పలికె.

వశిష్ఠ – జనక సంవాదము

క. అక్షరు డాపరమేశ్వరు
డక్షయుడీ ఆత్మమయుడు అంతర్జ్యోతై
రక్షించు కొనుచు నుండును
నిక్షిప్తుడు సర్వజీవ నిలయుం డగుచున్

క. కనులాద్యవయవ రూపములతో
ఆద్యంత రహిత మక్షర మనగా

వినవౌ నిర్ద్వంద్వ మహిమ

మనునా పరమాత్మ తత్త్వ మది అక్షరమౌ

వ. అదియే శాశ్వతమైన ఓంకార శబ్దబ్రహ్మము లేదా పరమాత్మ. ఇది అక్షయము. అక్షరమును కూడా. ఇందుండి ప్రకృతి, అవ్యక్తము, మహస్సు,అహంకారము అనునవియు అందలి అహంకారము నుండి పంచభూతములు, శబ్దాది విషయపంచకము, దశేయంద్రియములు పుట్టినవి. ఇవి అన్నియు మనస్సు నిదానత్వమునజనించు. ఈ ఇరువదినాల్గును క్షరము (క్షరములే)లనంబడును. ఇందుండి బుట్టిన 24 తత్త్వములును విజ్ఞాన గోచరములు.ఈ తత్త్వములు అక్షరములు. అవి జ్ఞేయము, అవ్యయము , అకలంకము, అనామయము, అమృతములు. అక్షర పరమాత్మ తత్త్వములు. ఈతత్త్వము లైదును సత్త్వ రజస్తమో త్రిగుణాత్మక దోహదముగా తనకే ప్రబోధము, ప్రమేయము లేకున్నను లీలా వినోదముగా గుణాత్మక సంయోగ సంగతమున అనేకానేక యోనీ గత జనకము లొందుచు క్రీడించుచుండు. అందు వెలసిన ఆసంకలిత తత్త్వము (అపర తత్త్వము) తనను తాను గ్రహించనవకఆ గుణములే తానుగా భావావేశము నొందుచుండు. ఇయ్యది తన నిజాత్మ స్థితి కర్మగతి కిల్మిషములనొంది, దివ్య మానుష తిర్యగ్జంతు పక్షి వృక్ష క్రిమికీటక, అ చరాచరానీకానేకాత్మన తత్త్వ సుఖ దుఃఖముల నరకయాతన లనుభవవించుచుండు. శుక్లము ప్రకృతి మయమున నీలలోహిత కృష్ణ వర్ణమున అక్షరత నొందును. త్రిగుణాత్మన సమ్మిశ్రమునై వికృతమై ఆత్మానుగుణ మయ్యె తనువులందు ఆమలంకార గుణత్వముల నొందు. ఆ గుణములు తొలగినంతన మరల నిర్వికార దీప్తితమై వెలుంగు అమృతమయ మగు నాత్మ మృత కారక గుణ సమ్మిశ్రితమై మమతకు లోనగు పట్టు పురుగు తాగూటిని నిర్మించుకొని ఆ తంతువులయందు చిక్కువడి సతమతమవునట్లుగా (మృత తత్త్వ మిళితమౌయాత్మ) తనకు తా ఈ భవబంధన డోలికలయందు కొట్టు మిట్టాడుచుండు. కాలగతిని అందుండి బయట పడగనే పదునారుకళల పూర్ణ శశిభాతి ప్రకాశమానమై విరాజిల్లుచుండు. ప్రకృతీ పురుష సంయోగమున జీవాత్మన రూపమేర్పడును. స్త్రీ వలన తను చర్మముల మాంసము రక్తమును, పురుషుని వలన మజ్జాస్తి స్నాయువులు సిద్ధించును. ఇయ్యది సమస్థ తిర్యగ్ జంతు జాతుల యందును సమానము. అనవిని–

క. వేదవిదార్థద వినుపుమ
సాదర వనితా పురుషల సంయోగమునన్
సాధింపం దగు నెద్దియ
యేదో నా కవగతము కాదు యేర్పడ జెపుమా।

క. అని వేడిన ఆ జనకున
కనెనా వశిష్ఠ విశిష్ఠ కవగతమౌలా
వినిచెను అక్షర తత్త్వము
వనితా సంయోగజనిత పరమార్థమ్ముల్

వ. అని సాదరముగా–

క. వేదమునం ద్విదితమ్మని
నీదగు శాస్త్రార్థ విద్య నేమనవచ్చున్
కాదుర అక్షరముల చదువ
కాదగు భావార్థ యుక్తి కావలయుమదిన్

క. యోగము సాంఖ్యములనునవి
బాగుగ యెరుగంగనైన భావార్ధ గతిన్
యేగురు వక్క రలేక యె
వీగును సంశయము లెల్ల విఖ్యాత్పరుడా

వ. సావధానుండవై వినుమని యిట్లను. ముక్తి ప్రదవేదమయ పరమాత్మ అమృతత్త్వ మలింగుడు. సర్వ సమానత్వము. కాని సరాగ రంజిత పరాంగ మన్మధ ప్రకృతి స్త్రీ పురుష నపుంసక లింగ సమన్వయము.

క. విను బీజమునం బీజము
తనుభావ స్త్రీల యందు తాత్త్వత జెందిన్

అనురూపత జనియించును
మనుగడ జెందుచును సృష్టి మరలం మరలన్

వ. ఈ జగత్తు భవబంధ సుఖదుఃఖ భాజన సంతుష్ఠాంతరంగము. పరమాత్మతత్త్వము నిర్గుణంబగుట. దానికి సుఖదుఃఖములు లేవు. ఆత్మ స్వయముగాతానే పనియు చేయజాలదు.రాగరంజిత తత్వేంద్రియములచే చేయంబడు కర్మఫల సుఖదుఃఖములు, పాపపుణ్యములు. ఆ దేహములకే గాని పరమాత్మ నొందనవదు.

క. పరమాత్మ సంకల్పిత
ధర ప్రకృతి అస్థిరమ్ము తగులము మాయా
పరికల్పిత శాశ్వతమిది
చరమౌ భవబంధనమ్ము చర్విత చరణన్

క. క్షరమౌ ప్రాకృతి కాత్మలు
తరతమమౌ కర్మ వశత ధార్మిక బుద్ధిన్
పరమాత్మను జేరుకొనును
తిరమది యాశుద్ధ తత్త్వ తేజము నెరుగన్

వ. ప్రకృతి జడజీవన వృక్షాదులందు పరాగ పర పరాగ స్వరాగ సంపర్కమునై ఋతుకాలములం యిగురు చిగురు పుప్పొడి పుష్పఫలాది సూచక ప్రదమైన మూర్తి ప్రకాశము నొందుచుండు. కావున ప్రకృతి యెవ్విధి విధానముగా నైనదియును సర్వేశ్వరు మహిమాన్విత తత్త్వభాజనమై వెలుగొంద నగుచునుండు. అక్షర క్షర వివేచన మన్నింట బొరయు చుండు. ప్రబుద్ధులగువారలు దీనిని దెలియగలరు. పరమాత్మ మాయా మహిమమనుచు.

తే. అదియె నానాత్వ యేకత్త్వ మాత్మ కలన
అదె నవిద్యయ విద్యయు నంద్రు బుధులు
క్షర మక్షర మపవర్గ వర్గ మనగ
తెలియనగుగాదె పరబ్రహ్మ దేవు మహిమ

తే. యోగ మనగను ధ్యానంబు ఒక్కటదియె
ప్రాణయామమ్ము పరచింత భావనదియె
మనసు యేకాగ్రతా వృత్తి మసలుటదియె
అన్ని కర్మలు పరమాత్మ నందుకొరకె

వ. తదనుష్ఠాన ప్రకారము దెల్పెద వినుమని–

తే. సంధ్యా సమయము లందున అంతరంగ
భంగములు కాని అనువగు భద్రగతుల
శుచియు శుభ్రముగల చోట్ల చెరువుగట్ల
ఆత్మ సంయమ్ము శుభ వేళ లభ్యసించు

వ. మనస్సుచి కాని వేళల, మలమూత్ర సమయము లందు, అన్నము తిన్న వెంటనే, అలసట నొందినప్పుడు కోపతాపము లొదవి నప్పుడు అనుష్ఠానము తగదు. మరియును–

క. అడి యాకలి అగు వేళల
కడుపన్నము అరుగుదనుక కరచరణమ్ముల్
బడుగై లేవక యున్నను
కుడిచిన వెనువెంట నిద్ర కూరెడువేళన్

వ. రాత్రు లందున అన్న మరిగిన వెనుక అంతరంగము యోగక్రియ కారాట పడువేళల అభిమత బుద్ధి కల్గినప్పుడు ఆత్మసంయమన మభివృద్ధి చెందును. లక్ష్యసిద్ధి కల్గును. విద్య యవిద్య అనునది వేదాత్మక అక్షర క్షర తత్త్వమెరుంగుట. క్షేత్రము తనువు, ప్రకృతి, అనబడు. క్షేత్రజ్ఞుడు పూరుషుండు. ఆత్మయు నిర్గుణుండు. జీవుడు తనలోతన్నుదాన జూడంగల్గిన కైవల్యముసిద్ధించు. పునరావృతిపధము – క్షరము. యిది యెరిగిన వారలు నిశ్చితాత్ములు మరియు నిర్భీత జనులు.

విద్య అవిద్య ప్రకారము

క. కర్మేంద్ర్యా జ్ఞానేంద్రియ
మర్మంబులు మనసు కెరుక మహనీయగుణా!

దుర్మతి కర్మది దుఃఖము
నిర్మల కార్యాను వర్తనీతియ సుమ్మా!

వ. విద్య అనునది మనో బుద్ధ్యహంకార తత్త్వములవ్యక్త మొనర్చుకొనుట. వేద విజ్ఞానియగుట. అవిద్య అనునది పంచేంద్రియ కార్య కలిత విషయ తనుసంగత వేదార్థ తత్త్వ జ్ఞాన మెరుంగ కుండుట. మరియు క్షర మవిద్యగను నక్షర జ్ఞానము విద్యగను పరిగణింపనగు.

తే. ఆత్మ అక్షర మనుటది అభవు మాట
క్షర మౌనదీ ప్రకృతియ గాన వినుము
పాంచ బౌతిక దేహమ్ము బాయనగును
దేహి అనబడు ఆత్మయే దివ్యశక్తి

తే. పుడమి బుట్టిన దెల్లను బుగ్గి యగును
ఆత్మ యొక్కటి నిత్యమ్ము అనుట దెలియు
దేహ దేహాత్మ తత్త్వమ్ము తిరము గనుము
ఇహపరమ్ములు దెలియుమా యిద్ధ చరిత

తే. అహము మమ కారమంటుటం ఆత్మయందు
యెన్ని యెన్నెన్ని జన్మలో యిహము బుట్ట
ప్రకృతి మయజీవ్న మంటుచుం పాప పుణ్య
వేద విజ్ఞాన మెరుగక విద్యయనగ

వ. ఇట్లు క్షరాక్షర, వ్యక్తా వ్యక్తన, గుణ నిర్గుణం, ప్రకృతీ పరమాత్మ, మిధ్యా తధ్య, జ్ఞానాజ్ఞాన వివేచనాకలిత పరమ ప్రబోధనంబొనరించి, వెండియు–

క. దృశ్యా దృశమగు జీవన
దృశ్యము పొడగాంచ వినిచి తద్దత్వములన్
ఆశయ సిద్ధి కలుంగను
నిశ్శేష శిక్షితుగ జేసె నిర్ద్వంద్వ విధిన్

వ. నిర్గుణ బ్రహ్మము ప్రకృతి తత్వమయంబునం దవిలి జీవాత్మగా నెగడు. జీవాత్మ ప్రకృతి తత్త్వముల విడనాడిన, పరతత్త్వములను మరల గ్రహించగలడు. ఇట్టిది పురుషునకునుసంవిధానము కాగలదు. అనగా యేకత్వతత్త్వండైన కేవలుడు ప్రకృతింగూడి నానాత్మనాత్ముండై యొప్పు ననిదెల్ప–

క. సర్వ మెరింగించితి విను
నిర్విణ్ణుడ నీతి దవిలి నిశ్చల బుద్ధిన్
నుర్వీజన సద్బుధులను
సర్వజ్ఞుల జేయ దగుదు సన్మతి పాత్రన్

వ. పరమ పద బ్రహ్మమును సదాశివమును సనాతనమును అగు నీ యోగ విద్యను, తొలుత బ్రహ్మ వశిష్ఠునకు, ఆతడు నారదునకును వాని నుండి నాయాత్మకును నానుండి నీకును తెలియ నాయె. అభ్యసించి కృతార్థత నొందుమని, మరియు నిట్లను.

తే. కోప తాపము లుడుపను కోర్కె దీరు
గర్వ మతిశయాడంభ్రతన్ ఖ్యాతి దొలగు
శాంత చిత్తత సత్వతం సమత గూరు
దుఃఖ ముల్‌బాయు సద్బుద్ధి తొందనగుచు

వ. ధృతి లేకం గాదె మహాభిషుండు త్రివిష్టపము నుండి తొలంగనాయె. ధృతి మంతుడైన యయాతి విఖ్యాతి నొందుటయును అని పల్క ఆనందాతిరేకుండై ధర్మజుండు మందాకినీ నందనునితో, సనాతనమును అవ్యయంబును అక్షరమ్మును శివమ్మును మృత్యు రహితమ్మును అగుదానిని దెల్పుమని ప్రార్థించుటయును.

యాజ్ఞవల్క – జనక సంవాదము

యాజ్ఞవల్కుం డిట్లను ప్రకటనముగ. తొలుత బ్రహ్మ పంభూతాత్మక బ్రహ్మాండ మండలమున సర్వభూతములను(ప్రాణులను) సృజియించి దానికి జీవనముగా యోషధీ లతా గుల్మ వృక్ష సంతానములను సమృద్ధముగా సృజియించె. విషయ విజ్ఞానమును గ్రహించుటకు చెవి, ముక్కు,

కన్ను మొదలుగా జ్ఞానేంద్రియముల కల్పించె. మనకులేక అయ్యయా గ్రాహికములు ఆత్మ నంటవు. అటులనే మనను అచేతమైన యింద్రియ గ్రాహక విషయ మాత్మకు బోధకము గాదు. కావున మూలమౌ మనసునరికట్టుట అట్టి సమయమున యోగునకవసరము.

<u>ప్రళయ కాలంబున:</u> భూతచయములు ప్రజ్వరిల్లు. పృధ్వి జలమయంబగు. జలమగ్నిచే (ఆవిరి)గాలి రూపమొందు. గాలి, ఆకాశంబున, ఆవహించు, ఆత్మ భూతత్త్వంబులయిదును మహత్తత్త్వంబును పొందు. అదియే పరమాత్మ సంవిధాన ఆత్మతత్త్వము. అది విని ఆధ్యాత్మ భూతాధి దైవత ప్రకారములు దెల్పుట.

అధ్యాత్మములు	**ఆధ్యాత్మ భూతములు**	**అధాత్మ దైవతములు**
పాదపయూపము,	వధ (గంతవ్యము),	విష్ణుమిత్ర,
పాచి,వాక్కు	దానము (విసర్గము)	ప్రజాపతులు
	మాట (ఆనందము)	చక్రు పావకులు
చక్షు,జిహ్వా,ఘ్రాణ,	రూప,రస,గంధ,	సూర్య,జల,మహి,
త్వక్,శ్రోత్ర	స్పర్శక,శబ్దము	వాయు,దిశలు
మనస్సు	చెప్ప బడలేదు	చంద్రుడు
బుద్ధి	బోద్ధవ్యము	క్షేత్రజ్ఞుడు
అహంకారము	అభిమానము	రుద్రుడు
చిత్తము	చేతన, భావన	బ్రహ్మ

ఈ విధముగా తెల్పనగునిది బ్రహ్మవాక్కుగా ఆగమములందు చెప్పబడినది.ఇక ప్రకృత పురుష ప్రకారము వినిపింపుమని ధర్మరాజు భీష్ముని అడుగుటయు, ప్రకృతి పురుష ప్రకారము వినుట సహజ మనో నిర్వకారత్వ కారణం బైనను అధర్మము కాజాలదనుచు వినబల్క ఇట్లను–

క. జగతీ మనుగడ కెంతయు
తగునీ ప్రకృతీ పురుషుల తాత్మ్యతయెంతో
అగునని అర్ధాంగియతో
అగపడుగా పరమశివుడు అధ్యాత్మనుడై

క. అడది ప్రకృతి తానై
క్రీడించుకు పరవశించి గేహాత్మనయై
వీడక పురుషార్థినియై
ఆడిం బాడిం దనువున అనురాగ రతిన్

క. స్వర్గము తానే యగుచును
నిర్గుణ జీవైక్య తత్త్వ నివహా జగతిన్
వర్గాపవర్గ శోభన
దుర్గుణములు యెంచ బోక దోహద యగుచున్

తే. పరవశింప జేయుచు రతిం భద్రగతులు
తనదు జాతది ప్రభవింప ఇదియ జగతి
ప్రగతి జీవన ప్రదయై యుపరతి యాత్మ
గుణము అణువణువునను సాక్షాత్కరింప

ఉ. దీపమునం దనూహ్యమగు దీపము లుద్భవ మొందగు క్రియన్
ఆ పరమాత్మ మీ జగతి అచ్యుతమై వెలుదొందనౌ విధిన్
రూపరకించనై ప్రకృతి రూప మనేకము సంగమించుచున్
దీపన దీప్తమై వెలగ దివ్య భవోన్నతి యాత్మ పొందగను

తే. ప్రకృతి దానిచ్చు రమియించు వృద్ధి పొంద
పురుష కాంత జీవాత్మ పరవశింప
సంగమింపను మనసౌగ సత్త్వ గుణము
నవని బండింప ప్రకృతాత్మ నవ్య శోభ

తే. కలికి తనమున కాలమ్ము గడ్డు కాగ
అహము పెరుగుచు భోగేచ్ఛ అవధి మీర

మోహ పరవశ తెంతయుం మోసులెత్త

ధూర్త తమమౌను యీ ధాత్రి దుఃఖ భాజ్న

క. ప్రకృతి కనుగుణాత్మ యదియ

వికృతము లందనుపజీవ విలసన పరతన్

సుకృతి బాయుచు కాల్గతి

అకృత్యముల నాచరించు ఆత్మత మరచిన్

క. పురుషుడు చైతన్యాత్ముడు

సరి ప్రకృత చేతనమ్ము సద్గుణ రహితమ్

మురిపించును నవశోభల

భరితమ్మో పరిమళాల పరవశ మొందన్

వ. పురుషత్త్వ చైతన్యము తననంటి ఆత్మ పరాగమ్మున అభిరామమై ప్రకృతి తాను పరవశించి ఆత్మైక జీవ ప్రకృతిని పండింప జేసి పరిఢవిల్లు. జీవాత్మ సత్త్వ రజస్తమోగుణ భాగగతుల తానా చరించు పనులవలన దైవత మానుష రాక్షస స్థితులనుభవించు టెరింగియు, తత్ గుణ భావ ములచే ఆవరింపబడి (మరుగున పడి) పర తత్త్వమును యెరుగకుండు, మరియు అవ్యక్తాత్మా నుభవుండైన జీవుడు ధృఢ మనస్కుడై క్షీణ దశలనొందక అక్షర వికాసమాను డగుచునుండు.

క. అన విని యా జనకుండల

మునివర పురుషా ప్రకృతుల మొదటిది చేత్నా

వనియై, రెండవది జడము

గనుయుండం కారణమది గమనించితిరా?

వ. అని ప్రశ్నించుటయును, యాజ్ఞవల్కుండప్పుడు వినుమని సగుణ ప్రకృతి నిర్గుణ బ్రహ్మము తెరగెరుగడు. కావ అది జడము. అచేతన. నిర్గుణపరమాత్మ సకలప్రకృతి గతులం దెలియు.

పురుషుడు చైతన్య స్వరూపముసరియగు బోధ (శక్తి) లేక ప్రకృతి పురుషునికల రూపెరుంగ నవదు. ప్రకృతికి పరములేదని పురుషుడెరుంగు. సమ్యక్భావనులైనమునులకీ విషయము తెల్లమని. వెండియు–

ఆ. నీటిలోన బుట్టి నీటిలో చెరిగియు
నీరమంట నవదు నీరజాత
ప్రకృతి తానెయౌచు ప్రకృతిం అంటదు
ఆత్మ తేజుడైన ఆత్మవిదుడు

వ. ఇది సాంఖ్యమ్ము.

తే. సాంఖ్య యోగమ్ము లీ రెంట్కి సమమ దేది?
ధ్యేయ మొక్కటె రెండింటి తీర్లు వేరు
వేరు వేరని యెంచనౌ వెఱ్ఱి జనుడు
ధ్యాన యోగమ్ము నందునం ధ్యాసలేక

క. ప్రాణాయామము సల్పుము
పాణిం దండలుగ గట్టి పద్మాసనుడై
వేణూదండము కదలని
దిణ్ణాణత భృకుటి జూపు తిరముగ మదిలోన్

క. ఏకాగ్రత బుద్ధి నిలుప
చేకూరును యాత్మశుద్ధి చేయం జేయన్
సాకల్యత సిద్ధి యొనరు
యేకీకృత మౌచు నాత్మ యేమర కుండన్

వ. ప్రాణాయామము జేయుట వలన (జీవున కేయిబ్బందియు బడయకుండ) యోగ సిద్ధికల్గు.

తే. ఇంద్రియమ్ముల మనసు నందిమడ జేసి
అహ మహంకార మమకార మణగ జేయ

విమల మాత్మన సంయోగ వీలుకల్గు

ధ్యాన తత్పర ఆధ్యాత్మ ధ్యాస కలన

వ. ఉచితయోగన బోధనా యుక్తిపరు డుద్దీపన ఆత్మ ప్రదీప్తన మగుచునుండు శ్రమయు దుఃఖమ్ము లేకుండ శమదమాదులొంది. అంతరంగము నిశ్చలతమెందు వార్ధక్య జాడ్యంబు పొడజూపదు. వికార స్థితులు దరిజేరవు. విషయేంద్రియములు శమించు శబ్దసంవేదన లడంగు. తొణకడు బెణకడు. ఆత్మ గత ధ్యానుండగుట కతన, శ్రద్ధామతి క్రియాయోగ సిద్ధుడు. కృతార్థుండగు. మరియు అరిష్టముల తెరంగెరింగింప వలయు గావున దెల్పె దాకర్ణింపుమని యిట్లను.

మరణ సూచనములు దెల్పుట

తే. ఖగ తలాన్నున్నరుంధతి కానకున్న

ముక్కులో ప్రక్క లెండినం మోమువాయ

కంటి కాంతియ నశియింప కాయమదర

మరణ మాసన్నమైనట్లు మానవేంద్ర

వ. ఏ కారణము లేక ఎడమకంట నీరు ద్రవించను. ముక్కు మెత్తబడి వాల బడిన, నడినెత్తి నుండి సెగలు పొగలు ప్రజ్వలించను, మృత్యు వాసన్నమైనయట్లు.

తే. యోగి యెరుగుచు దుర్దశ యోగయుక్తి

అచల మానస మగ్నుడై ఆత్మశక్తి

మరణ కాలాన్ని తనదైన మహిమ వలన

అవల దోయుట దెలియుమా అంతరాత్మ

వ. అని పల్కి యాజ్ఞవల్కుండు నీవడిగిన పరముం దేటపరతు వినుమని యిట్లను.

క. పరమది సంకల్పాత్మయ

పరమది వేరుగాదు పరికింప మదిన్

పరమది ని న్నీ వెరుగుట

పరమావధి ఆత్మ యోగ భాజను డగుటే

క. ఇహమనునది యీ ప్రకృతియ
సహజీవను డగుచు నాత్మ సంభవు డగుటన్
మహిమాన్విత మగుచు చెలగు
అహహా యీ జీవజగతి అద్భుత మయమౌ

క. యోగము సిద్ధింప నయిన
యోగియె ఆ బ్రహ్మ యగుచు యోగ్యత కొలదిన్
జేగీయము పరమాత్మన
దాగొను జీవాత్మలందు తాత్మ్యత నొందన్

వ. మహనీయక తపోవిభవమ్మున ఆత్మసంయోగము నందియుండ, ఆ పరబ్రహ్మ ప్రత్యక్షముగా మనమ్మున నా భావమెరిగిన పరమాత్మ మా పరబ్రహ్మ, నీనోట సరస్వతివెలయు, సర్వవేదమయ సారజ్ఞత నీవలన జగమ్ములం బ్రాకునని వరప్రసాదనుడగుటయు, మహాభిజ్ఞుండనై మరల ఏకాత్మన తపోమగ్నుండనైయుండ విశ్వావసుడను గంధర్వపతి నాకడకువచ్చి ఆత్మబోధ గావింపుమని ప్రార్థింప, నేనా సరస్వతిని ద్యానింప, నా బ్రహ్మాణి తానుగా నా నోటినుండి పరాత్పర విద్యావిద్య జ్ఞానాజ్ఞాన, ధర్మాధర్మ సత్యాసత్య, యోగాయోగ సాంఖ్యమ్ముల, వేదోత్కటమ్ముగ వెలయం జేసిన ప్రమోదాత్మనుండై విశ్వావసుండు సభక్తికమ్ముగా ప్రదక్షిణ నమస్కారములు జేసి, అనుగ్రహింపవే యని సెలవొంది నిజావాసమ్మున కేగుటయును, వినిచిన దేవవ్రతునికి ప్రణామమ్ము లాచరించి మరల యిట్లను. గృహస్థ ధర్మము పరిత్యజింపక మోక్షము వడయనగునేయని అడుగుటయును, ఆ విషయము లెరుంగనగు నీ విషయము యెరుంగుమని ధర్మరాజునకు భీష్ముడు-

జనక – సులభా సంభాషణము వినిపించుట

క. వెనుకటి కల సులభాభిధ
జనకుని మనమెరుగ నెంచి చయ్యన జనియెన్
జన పాలుని నిజ యోగ్యత
మనమున వీక్షింపనెంచి మహనీయతయా

వ. దివ్య జ్ఞాన, జితేంద్రియ, విదేహపతియొద్దకుంజని ఆతిధ్యమ్ములొంది సుఖాసమ్మున నున్న యవసరమ్మున అపురూప స్త్రీ జనోత్కంఠ విదితమ్మగు మణిమయానంద దీప్తనములౌ దృక్కుల ప్రసరింప జేయ జూచుడు మందస్మితానుండై అజ్జనక విభుండు–

క. ఎందులకీ పరిశోధన
ఎందులకీ భావ జనిత మేమిది లలనా
పొందం గోరెడు తనువుల
పొందంగు ఆత్మవిభుని పూనిక తోడన్

క. మహనీయాత్మన శిష్యుడ
మహనీయోగాత్మ విద్య మనసగు బుద్ధిన్
సహజోద్ధతి పల్క తగదె
ఇహపర సంసేవనుండ యెంచ్నగు సుగతిన్

క. ప్రక్కృతి గుణనీయ ముడుగం
సత్కృతుడా నిర్గునాత్మ సంభవ మవదే
నిష్కృతి గాంచుము జన్మల
దుష్కృత భావమ్ము వీడు దురితము వాయన్

క. నిర్ద్వందత వెలయు మనసు
ఆర్ద్రంబగు ఆత్మయందు అహమది తొలగున్
సార్ధకత నొందు బతుకు
వార్ధక్యము లేకనుండు వయసది బెరుగన్

క. వేషము మార్చిన దగదుర
భాషణ భావమ్ము నాత్మ పదిలము లేకన్
కాషాయము ధరియించిన
ధూషితమౌ మనసులేని దుష్ప్రద బుద్ధుల్

క. జంగమ వేషము దాల్చిన
అంగము మెరియంగ బూది అలదిన తనువున్
సంగతము లేని మనసుల
లింగడు తదాత్మ్యమవడు లేదుర ముక్తిన్

క. వేద వివేకా ధ్యాయివి
లేదా భావము మనసున లేవడి తనమా?
నీదగు భర్తను కానే
సాధన పరచింతనుండు సద్గురు బోధన్

వ. భావ స్వతంత్ర్యవునై నీ వలనం జనించు అవినయంబున యేమి వాటిల్లినను అది నీ యందే యుండు.

క. తెలియనె నీ కల్కి తనము
తెలియ పోరాదు నన్ను తెలియగ రావే?
తెలిసియు పల్కుట తగునే
తెలియు నీ ఆత్మ భవుని నీధితు వౌచున్

క. రాగము వీడుము నాయను
రాగము పొందం దగుదల రాజిత కీర్తిన్
భోగము లొందెదు మగువా
రాగోద్భవ మొందనాత్మ రంజిల నగుచున్

క. చూపుల నావల దోయుము
కాపురుషవి కాకనుండు కరుణా దృష్టిన్
చూపుము నాదెస అమలత
యేపుమెయిం సద్గుణాఢ్య యెంచుచు పరమున్

వ. అని పల్కుచు తన ఆత్మ దృష్టిని, వైరాగ్యతను, బోధనా మహత్త త్వ విఖ్యాతిని, సద్గుణ,

భావ పరత్వమును, ఘటింప వెరగందియు అప్పొలందియ–

క. తగునా యిటు పల్క నవుచు
నగుమోమున గాంచనెంచునా వినుమనుచున్
జగతీవర పరమ పురుష
మగధీరా రాజ జనక మహనీయ భవా।

క. మనసే మూలం బాత్మకు
మనసే సంగమము నొందు మన్మధ మగుచున్
మానస యోగమె ఆత్మన
తనగాదన తగునె నీకు ధర్మంబగునే

వ. అదియునుం గాక ప్రకృతి సిద్ధమైన జీవాత్మ తను సంయోగ సంగమముల యందు–

క. ఆత్మ కసంఖ్యాక కలిత
జాత్మన సంయోజనమ్ము జాగృతమౌటన్
ఆత్మాభిరామ రమ్యత
ఆత్మకు దోషమ్ము కాదు అవయవ యోనిన్

క. మనసొప్పెడునది విధివిధ
తనుయోగము ధన్యతొందు ధరణియు వెలుగన్
జననం బొందుచు నుండును
మన సాత్మన యేక తొంది మహిమోన్నతమౌ

తే. ఎవరి కెవ్వరు యీ యుర్వి యేమనందు
ఆత్మ తత్త్వము ఊహింప అధిపయెరుగు
నీవు నేనను భావమ్ము నిక్కమరయ
వీడు మదిలోన శుద్ధాత్మ వింత తెరగు

తే. నీవు నీయందు నిను గను నియత బుద్ధి
యొరుల యందున గానంగ యెరుగ దగదొ
అన్ని జీవుల నొకటిగా ఆత్మజూచు
సన్ను తాంగను నన్గావ సమతజూప

వ. శూన్య మానసమున నునికి ముక్తికి గర్తవ్యమగుట సమాశ్రితనై జొచ్చితి ముక్తి లేమి యగుట తప్పయ్యె, అట్లుంగాకయు–

క. కాలుం జేతులు మొదలౌ
నాలింగిత నౌట లేదు నాయంగములన్
ఆశింపుము నాదు పలుకు
సాలోక్య సమన్వయాధ్య సద్భవ జనకా।

క. మంచిని మంచిగ గనుటయు
అంచిత మౌ ముక్తిమార్గ లందరు నొకటౌ
టెంచం దగు మార్గ మరయ
సంచిత పుణ్యంబు కాదె సద్గుణ శీలా

వ. మనము ముక్తులము గాకున్నను సాంగత్యము గల్గుట నింద్యంబు గాదె ట్లంటేని–

క. బుట్టితి నృప పరకులమున
అట్టిట్టన యోగ విద్య అభ్యస నైతిన్
మెట్టన లేదింత వరకు
దిట్టడ సరియగుచు నీవ దెలియగ వస్తిన్

క. దాపగ వలవదు యిప్పుడు
దాపున యా ముక్తి కలదొ దవ్వై జనునో
నోపని మనమున వస్తిని
భూపకులా జనకరాజ పోతరి నగుచున్

క. వినవిని యా జనక విభుడు
అనియెను ఆత్మ యోగవతితొ, అతివా కనుమీ
మనసది సంయోగమవుట
తను దానుగ తనువు నాత్మ తాత్మ్యతె ముక్తౌ

క. అనవిని యా సమభావన
జనవర నీ భాషణముల చరియించు నిజమ్
విన విందాయెను మనసున
తను వాత్మయు ఒక్కటైన తథ్యము పరమున్

తే. అగ్ని వెచ్చనో చల్లనో అనుచు మదిని
భగ్గుమనం దివ్యాగ్ని బట్టి కుదుప
స్రగ్గియున్నట్టి యోగాగ్ని సంభవుండ
నిగ్గ దీసిన దాన నీ నిజము గనగ

క. అనుచు గొనియాడ నందరు
వినుచు సులభను గొనియాడి వీనులలరన్
మనసు రంజిల నెంతయు
జనక విభుతొ నాత్మ నయత చాలగ దలచిన్

వ. మరునాడజ్జనపతి అనుమతి వడసి, అమ్మహానుభావ నిజేచ్ఛం జనియెనని పల్కిన ప్రమోగాత్ముండై కుంతిమా పెద్ద తనయుండు శుకున కెవ్విధమ్మున వైరాగ్య మొదవెనన శాంతనవుం డాతని కిట్టులనియె–

వేదవ్యాసుడు శుకున కుపదేశించిన వైరాగ్య ప్రకారము

తే. జనన మరణాది సంపర్క జనితమైన
జగతి జీవన భ్రమలొంది జాగృతెంచ్క

అలమటించుట తగదంచు ఆత్మదృష్టి
వినుతి కెక్కిన వ్యాసుండు విమల మతిన

వ. తన ఆత్మ యా శుకునితో వినిచెనిట్లు.

క. రాగము భోగము నిరతము
సాగదు యీ భవము నందు సద్గుణ శీలా।
సాగుము వైరాగ్య గరిమ
జేగీయుడ భూసురాత్మ్న జేజేపరుడా!

క. మానవ జన్మల బ్రాహ్మణ
జన్మది ఉత్తమము అంద్రు జగతి జనముల్
కానల తాపసు వౌచును
ధీనుత వైరాగ్య వృత్తి తీరున జనుమా।

క. కామము కోపము వీడుమ
సామమునం దమము తపము సల్పుము శుచువై
నీమము వీడదు మనమున
ఆమనిగా ఆత్మగతుల అధ్యయవిదువై

క. తను త్రాణము దీర నవగ
అనువగు ఆహార సలిల మాత్మన బుద్ధిన్
గొనుటది యోగమ్ము కతన
తనువందలి ఆత్మమయుని దర్శింపనవున్

క. ధర్మ మహింసయు సత్యము
నిర్మల మతి ఆచరించు నియతోద్ధతువై
మర్మము వీడును మనమున
కర్మది నిన్నంటబోదు కారణ విధులన్

క. పంజర చిలుకయ జీవుడు
సంజనితా కర్మ వశత సమకూర్ తనువుల్
భంజనువై కర్మగతుల
కంజజు పథమంటనవుదు ఘనయోగనువై

క. క్రమగతి కర్మాను సరణి
అమరత్వము నొందనవును ఆత్మన జీవా!
సమరోధృతి హింసగతియ
కమనీయము యోగ పథము ఘనకోవిదమున్

క. తలపకుమీ జన్మజగతి
తొలగన్నీ కర్మగతులు దుస్తరమగుటన్
అలవడుమీ ఆత్మమెరుగ
జలజాసను పథమునొంద చతురత వెలయన్

క. సారము సంసారమిలను
కారణమౌ జన్మ జన్మ కారక విధులన్
దూరము కైవల్య గతియ
భారము సంసార చక్ర భవబంధనముల్

వ. ఈ సంసారము యెంతో సారమైనది. మరియు యోగ్యమైనదియు కూడను. కామ్యకారణ జనకమౌజగతి తను జీవన క్రమగతి చతుర్విధ ఆశ్రమ విధి విధాయక వృత్తుల సాయుజ్యము పొందనగుట లెస్స. సత్యధర్మయుత సమ్మతము దేహపంజరమున యీ జీవాత్మ సంసార సాంగత్య సౌఖ్యమ్ముల–

క. కామాదుల తృప్త జీవను
డేమరునో ముక్తి పథము యేయై యెడలన్

భామామణి సురత దవుల
సామాన్యమె ముక్తుడౌట సంశయ మాత్మన్

తే. జనన మరణాలు తపసుని ఛాయ గతుల
జీవ జీవాత్మ వెన్నంటి జరుగు కలన
చేయుమా మంచి జాప్యమ్ము చేయ నవక
మళ్ళి యెల్లెంచు దలపకో మదిని జీవ

తే. ఆశపెంచుకో వలవదు ఆలుబిడ్డ
బంధు భావన మిత్రులన్ భ్రమలు వీడు
జీవమున్నంత వరకె నిర్జీవమైన
కాటి కాపరి గతుడవై కాలనవుదు

క. లోకము కాలోచితమై
సాకల్యత నొంద జేయు సమ్మతి వౌచున్
పోకుము మిధ్యా గతులను
చేకూర్చుకొ ఆత్మదృష్టి చెలగుము బుద్ధిన్

క. భోగము లొందెడు జీవు డ
భాగ్యుడు సౌభాగ్య మొందు పథముల కెడమై
సాగన్ స్త్రీజన సౌఖ్యత
భోగించుచు కాలగతుల పోవిడు ముక్తిన్

క. భవము చాలిన యెంతన ప్రాణముడుగ
యెవరికెవ్వరొ దెలియరా దీజగాన
ఆత్మ భవుదెరుగంచును అనగ నవదు
ఆత్మ తనుభావ మొందుచు అణగి యుండ

తే. జనన మరణ క్రమాగత జగతి జీవ
ముక్తి సాధన కాకున్న మోదమగునె
ఎన్ని జన్మలు యెత్తినా యేమి ఫలమొ
ఆత్మ విద్య ప్రబోధనా ఆత్మమయుడ

వ. అని ఉపదేశించిన తండ్రి మాటను తలదాల్చి యా తనయ శుకుడు–

తే. తపమె తానౌచు ధ్యానైక తత్పరుండు
వేద వేదాంగ సారాంశ విద్య దెలసి
జగతి జన్మలు కడమైన జనుడుకాన
ఆత్మ సంయోగ నా పరమాత్మ మయుడు

వ. అని దేవతటీ నందనుండా కుంతీ తనయాగ్రజునితో పల్కవిని, ఆ శుకయోగీంద్రుని పూర్వ గాథ వినుపింపుమని ప్రార్థించుటయును.

శుకయోగీంద్రుని గాథా వృత్తాంతము

తే. మాట మాత్రన తనయుడా మహిత శుకుడు
ఆత్మ సంకల్పమానైక ఆత్మయోగ
వ్యాస ఘృతాచి అప్సరో భాసమాన
వీర్య రేతస్సమోద్భూత విబవు డతడు

వ. అది యెట్లంటేని, తొల్లి మేరునగ కైలాస శిఖరమ్మునం గల కర్ణికార వనాంతర తటి నీతలమ్మున–

క. హిమతనయా పరమశివులు
కమనీయోల్లాస నృత్య కలితోద్భాసుల్
అమరేంద్రాద్యుని ముఖ్యుల
సముచిత సంసేవలొంది సత్కృతులౌటన్

వ. భవుడు వారల నందర సముచిత భాషణముల సంభావించుచు కృష్ణ ద్వైపాయనుం

కనుంగొని, అనఘా! నీతపమ్మునకు మెచ్చితి. నీ యోగ సిద్ధికి నూరు వాజపేయమ్ములును అశ్వ మేధమ్ములును సరిగావు. అంతటి తపస్సంపన్నుడవు. యేమి కోరినం యీయందగు. నీ యిచ్చ వచ్చిన వరంబిచ్చెద వేడు మనిన, మహదానందమగ్నుండగుచు నా పరాశరాత్మజుండుభవునకు నమస్కృతులాచరించి, కైలాస వాసా! కరుణాంతరంగా! ముల్లోకపాలా! ముక్కంటి దేవా! నీవాన తీయ నేకాదందునా! అటులనే యనుచు–

తే. బ్రహ్మ విశ్వావిశారదు బ్రహ్మమయుని
శుక సుభాషలు వెలయించు శుద్ధనాత్మ
వేద విద్యాధికుండు నా యోగివర్యు
పంచ భూతాత్మశక్తుడై ప్రబలు వాని

తే. ఆత్మసంభవు బ్రహ్మజ్ఞు నడిగెనంత
అటులె కానౌను శుకనాము డగును వాడు
జనకు నంతటి వాడౌను జన నుతుండు
అనుచు పచియించె నా భవుడాత్మ మెచ్చి

వ. ఇట్లు లబ్ధ వరుండగుచు సాత్యవతేయుండు, అరణి తన కరంబునంబూని అగ్ని రగు ల్గొల్ప నవుచు నుండ ఘృతాచి యను అప్సరోజాత యొకతె–

తే. కామ సంజన భావనా కలిత యుక్తి
మన్మధావేశ చేష్టలన్ మౌని యొడిన
శుకము రూపనౌ సంభాష్ణ శోభనాంగి
అండ మొక్కటి గురిసెంతొ యాడి బాడ

వ. అంత నా పరాశరాత్మజుండును, మన్మధ మదనుం డగుచు తనదు–

తే. శుక్ల కణజాల శోణితా శోభవెలయ
అరణి గర్భాన దాచుండ నంతనంత

ఉద్భవించెను బాలుండు యుర్వి వెలుగ
దేవ మునిముఖ్య తేజుడా దీప్త శుకడు

వ. అపుడు మందాకిని సస్వరూప నాంగియై అవతరించి, ఆ బాలకునకు మంగళకర స్నానాది కములు నిర్వహించె. ఆ బాలుడద్భవించిన ముహూర్త మెట్టిదియో కాని–

తే. దిక్కు లన్నియు కాంతిమై తేజరిల్లె
దేవ దుంధుభులెగసెను దివిజు లలర
ఆడి బాడిరి శుక శోభ అప్సరసలు
పూల వానలు గురిసెను పుడమి వెలుగ

వ. మృగపక్షి జంతు చరాచర జగత్ జీవతతు లెల్లను పరవశించె. సువాసనలతో పవనుడు పరవశించె. అంబాసమేతుడై పరమశివుడు ఉపవీతముగావించె వాన్కి. ఇంద్రాదులు పులిచర్మా సన కమండలము లాదిగా సమర్పించిరి. వేదమాత జేరగావచ్చి శుకునిగారవించె. ఇట్లన్నారణే యుండు వేదాంతార్థ నిపుణుండై తోడి ఆశ్రమ బిడ్డలతోడి సామాన్య సాంగత్యము నొల్లక తండ్రి కడకు నిజాశ్రమంబునకుం జేర రా నా సాత్యవతేయుండు వానికి సాంఖ్య యోగము లభ్యసింప జేయుటయును.

తే. తొలగె దేహాభి మానమ్ము తీర్థ సేవ
ఆత్మసంయమ యోగేచ్ఛ అధికమగుడు
మోక్ష కామన బుద్ధియ మోసులెత్త
కాన తపసునం కాలమ్ము గడవ నెంచ

తే. తనయు రావించి వ్యాసుండు ధర్మయుక్తి
జనుము మిథిలేశు ఆత్మజ్ఞు జననుతుండు
ఆత్మ జ్ఞానము బోధించు అతడు నీకు
యోగ యుక్తుడు నిస్వార్థ యోగమయుడు

వ. అని యాశీర్వదించి పంపుటయును.

క. కడువది కొండలు యేళులు
నడవులు దాటుకొని శుకుడు నాజనకు పురిన్
అడుగిడిన వాని దెలిసియు
వడివచ్చియు మ్రొక్క జనక వావిరి జనముల్

క. పడిపడి పాదము లంటుచు
కడు భక్తిన పూజ లిడిరి ఘనుడా శుకుడున్
వడి నెత్తియు నొత్తి జనకు
కడు యాప్తత తనదు యెదను గౌరవపదుడై

వ. జనకరావిభుడు తోడ్కొన వెనువెంట సకల రాజన్య మంత్రి పురోహితబంధు వ్రాతమ్ములు దండిగొల్వరా రాజ మార్గమ్ముల బారులు దీరిన మిధిలాపురీ జనులు అంజిలించుచు దారి పొడవునను పూలపాన్పుగా పుష్పములతో పాద పూజలొనర్చ, నా రాజ జనక గురుతనయ్యుండు శుకుడు,అమృతోపమానమ్ముగా కరసంజ్ఞల నాదరముగా వారల ఆశీర్వదించుచూ కతిపయ తోరణ ద్వారములు దాటి రాచనగరు ప్రవేశింప–

మత్త. రాగరంజిత రూపవిభ్రమ రమ్యకాంతులు జిమ్ముచుం
మూగి ముందుకు ముద్దుగుమ్మలు ముగ్ధ మోహను జూచుచుం
సంగతించుచు అంగనామణి సామ వేదము పాడుచుం
వంగి ముందుకు హారతిచ్చియు భావబంధుర చేష్టలన్

వ. రమ్య రమణీయ మనోహర ప్రశాంత మార్గమ్ముల గొనిపోవ జనక మహారాజుతో సాటిగా–

తే. అచల చిత్తుడు వారలం ఆదరంబ
సంస్థనీయత జూడ్కులం శాంత పరచి
నిశ్చలాత్మన ప్రేమైక నిర్వికార
భక్తి భావన మోక్షైక భవ్య దీప్తి

తే. పారమార్థిక తత్త్వైక భాష లెసగ
ఉన్నతాసన మందుంచి యూసు లెసగ
విన్న వింపుడు యిటు రావ యెన్న దగును
కారణం బేమి మహనీయ కరుణ తోడ

వ. అనవిని ఆ శుకయోగి యా మిథిలేశు జనకుతో అనియె నిట్లు.

తే. తండ్రి పంపున దానిట్లు తరని వస్తి
మోక్ష మార్గము నీ చెంత మోద మలర
తెలియ గలవాడ పరమార్థ తీరు కనగ
శిష్ట శిక్షితు జేయుమా చెవులు పండ

జనకుడు శుకునకు దెల్పిన మోక్ష ధర్మ ప్రకారము

క. భూసురు డాశ్రమ గతులను
భాసించుచు ముక్తి నొంద భావ్యం బగుడున్
వేసరక గృహస్తాదు లు
పాసింపకనే జననగు పరముం బొందన్

వ. ఎట్లంటేని, జ్ఞానము ముఖ్యము. పరమును బొందం గురుతర గురుబోధల వలన సుజ్ఞాని యైన విశిష్టులు గురూపదేశ యాదేశానుసారము కొందరు నేరుగా సన్యాసమును స్వీకరించనై మోక్షపథమ్మును బొందగలరు. సామాన్యుల కొరకు విధివిహిత లోకాచారక్రమమున ఆశ్రమవిధుల పూర్తిగావించుచు లోక కల్యాణార్థము పూర్వమునులు పాటించుచు వత్తురు. పూర్వ జన్మ జన్మ కృత పుణ్యఫల సిద్ధిన కొందరు ఆ బ్రహ్మచర్యాశ్రమముననే కొందరు ముక్తినొందుదురు. అట్లుకానినాడు ఒకొక్కప్పుడు పురుషుడు, గార్హస్య,వానప్రస్తముల యందును మోక్ష పథము నొందుచుండనగు. వినుము.

క. పరిపూర్ణ సిద్ధ యోగులు
విరమించం దగును తొల్లి వివిధాశ్రమముల్

పరమాత్ముని కృప గల్గిన
చిరజన్ములు మోక్షధామ చరితార్థు లనన్

వ. ప్రతి యాశ్రమము నందున తదనుయుక్తములగు ప్రయోజనములు గలవు. క్రమగతి బ్రహ్మ చర్య గృహస్తాశ్రమముల తమోరజగుణ నివర్తనము, వాన ప్రస్థమున సత్త్వగుణ ప్రాప్తియు, అది యైన పిదప సన్యాసమున, నిష్కామ్య నిర్ద్వంద్వ నిశ్చయాత్మన నరుడు తదాత్మ్యముగా ప్రకృతి యందు తనను తనయంగాను ప్రకృతిని సమానముగా గాంచగలడు. ఈ విషయమునం గల యయాతి వాక్యములం వినుమని యిట్లనె.

ఆ. సర్వసంగ బుద్ధి నిర్వికారజ్ఞత
శాంతిదాంతి పథము సమతగూరు
ఆత్మ జ్యోతి గనగ నర్హుడాత్మన యోగి
కాని జనుల కెట్లు కాంచ నగును

ఆ. ఎవడు నిర్భయుండు నెల్ల భూతములందు
హితము గూర్చనగు నహింస పరత
మంచి యెంచు నెపుడు మాననీయుండగు
పరమపదము నొందు భవ్యగుణుడు

క. నిందాస్థుతులం దొలయక
యెందును కోర్కెయను నదియు యేర్పడ కుండన్
మందుడు పో భావమ్మున
సందియ మెరుగకయు నాత్మ సద్గతినొందున్

వ. అని పల్కి యివ్విశేషము లన్నియు నీయందున్నవి గాన–

క. సందియ మెందుకు గురుసుత
ఎందును నీయట్టివాని యెరుగను వినుమా

అందెదువా పరమపదము
ముందుకు సాగుము మనసున మోదంబొందన్

శుకుడు హిమవంతమున నున్న తన తండ్రి వ్యాసుని కడకు వచ్చుట

క. విని శుకుడా వ్యాసు కడకు
ముని జన సందోహ శిష్య ముఖ్యుల తోడన్
వనగిరి లోయలనున్నా
మనసా ఆ హిమనగోర్వి మహిమోన్నతమున్

క. మనసున నెంచుచు దివ్యత
తనువుల పులకించనైన తరు పూభరతన్
మునిజన సందోహ నిరతి
వనవాసుల వానప్రస్థ పరతంత్ర భువిన్

వ. శోభాయ మానమై, వెల్గనై జాలువారు గలగలస్వన బహుశీతల సలిల ప్రవాహ రమణీయ తను నయనానందపరత్ గాంచుచు, చెవుల పండుపజేయుఅనేకానేక జంతు పక్షి కిసలయ కిల కిలారావ సందోహ నివహమ్మును సుర గరుడ గంధర్వ సిద్ధ సాధ్య విద్యాధర కిన్నెర కింపురుష దివ్యఅప్సరో విహార సంశోభితమును, మరియు అనిర్వచనీయ మహిమాన్వితమునైన ఆ హిమవన్నగమ్ము–

సీ. రతిరమ్య రమణీయ రాగాభిశోభిత
రాజశేఖరుమౌళి రమణిగూడి
తాండవకేళులం తత్త్వంబు బాడనా
పూజలొందెదు దివ్య పుణ్య భూమి
దివిజ గంగావారి తిరముగా భువి బిడ్డ
తీర్థరాజమ్ముల దీప్తి శిఖరి
మునిజన సందోహమేరు శిఖరి తోడ

ముక్తిదాయక దివ్యమౌ నగమ్ము

తే. మహిత మాన్ససరోవరా మహిమ మెన్న
పరమహంసల విహార పద్మసరము
కనులశోభన కైలాస ఘనవిహారి
దేవ దేవులు విహరించు దివ్యనగము

వ. అందు మున్ను వచ్చి శిష్యులైన సుమంతు, వైశంపాయన, జైమిని, పైలనామధేయుల తోడం వేదాధ్యయనంబు జేయించుచుండు కడకు భానునిభకాంతి ప్రసరంబున వెలుంగు నయ్యారణేయుండు తన యోగబలిమి కలిమి అనేకములైన నగ గిరి నదనదీ వనవిహారార ణ్యంబులం గడచి యెందునుం దగులు వడక సిద్ధ హస్తు కార్ముక ముక్తబాణము పగిదివచ్చి చేరుటకుం తనకు పాదములకు నమస్కరించువానిని లేవనెత్తి సాత్యవతేయుండు అభినందించి, అటనున్నాసనమున నునిచ్ొని, జనక భూపాలయోగీంద్రు కడ వేదవిజ్ఞాన విషయమ్ము లెరింగి అభిమతార్థ సిద్ధండవైతి వనుచు కొనియాడి సుఖాశీనుండై యుండు నెడ–

తే. శిష్యు లేతెంచి గురునితో శిష్టజనుడ
వేదవేత్తల మము జేస్తి్వ వేదమయుడ
మాదు సుకృతం బేమన మాకు గాక
యితరు లెవ్వరు నేర్వని యింత చదువు

వ. అని కొనియాడ వేదమయ వ్యాసుడప్పుడు తన శిష్య గణమున కిట్లనియె.

తే. ఎరుగ నైతిరి మీరింత యేమనందు
బ్రహ్మముఖమైన వేదమ్ము బ్రాహ్మణునకు
విధియొసంగును సహృదయ వేదవిద్య
యెల్లవారలు సుఖియింప నెరుగ నగుచు

వ. పురుషార్థ సంపన్నులై తరియింప వలయుగాదె.

తే. నుడు వారలు గురునితో అనిరి యిట్లు
వేడుకొందుము మాకునై వేదవిద్య
జగతి బొగడొంద దెలియనై జనగ బంప
మాకు మీకును కొనియాడ మాన్యజనులు

వ. అనుచు సెలవొంది అధ్యాపన యాజన విశేషంబుల త్రిభువన దేశమ్ముల నలంకరింప నేగుటయును, నారద మహర్షి వచ్చి, వ్యాసాశ్రమమును గలయం జూచుచు బ్రహ్మముఖ వేద నాదంబు వినంబడమి–

తే. కేమి కారణ మేమయ్యె యేమనంచు
అనుదు శిష్య సంఘమ్మది అవని దిరుగ
నేగనైయుంట అనగనా యేమిమీర
లిర్వురుండంగ జాలరోయుర్వి వెలుగ

తే. అనిన నారదు వాక్యాల కలరి యెంతో
బ్రహ్మముఖ వేదనాదమ్ము ప్రజ్వలింప
వాయుజృంభణ చెలరేగి భయత గొల్ప
యేమిదంచును తనయుండు యెరగ నడుగ

వ. తన తనయుతో వ్యాసుండు తదధ్యయనంబు వారించి వినుమని దేవయానమ్మున విష్ణుండును, బితృయానమ్మున భానుండును, ఊర్ధ్వధోగమన పర్యాయ రూపమ్మున ప్రవర్తి ల్లుదు రది, పవనాలంబన కలితమ్మై చెల్లుపవనుల దెల్పెద వినుము. పవనుండు దైవత సంఘ సంభవుండతనికి, ఉదాన, వ్యాన, అపాన, బ్రాణుండులు, క్రమగతి జనియించి జగమ్ముల సంవ్యాప్తమ్ములైయుండు. మరియు బ్రవహ, ఆవహ, ఉద్వహ, సంవహ, వివహ, ఉపవహ, పరావహు లనం సప్తసంఖ్యల దితి పుత్రులఖిల భువనవ్యాప్తులై చరియింత్రువారు. సమానాది వాయు పంచక మహితాత్ములు. వారల వలన వర్షమ్ములకుం ప్రవర్తన నిర్వర్తనములు గల్గు. దైవత విమానయానంబును ఆవహిల్లు, ఒక్కొక్కెడ విష్ణుని నిశ్వాసము మహా వేగమ్ము. ఆ

పవనము లనేకతంబ గలచిన యిట్టి మహావాయు విజృంభణము చెలరేగు. దీనం మహా మహి మోన్నత హిమ శైలములు సహితము చలించనగు కావున–

క. చదువందగ దిప్పట్టుల
చదివిన చేటగును జగతి జాగృతి పడగా
చదువుట మంచిది శుభ కర
సదమల పవనంబు వీవ సౌఖ్యం బెసగున్

వ. అని వ్యాసుండు స్నాన సంధ్యా కాలమయ్యెనని ఆకాశగంగా ప్రపాత దేశమ్మున కేగ, విష్ణు నిస్వన వాయు మహా వీవన ముపశమింప, పరాశరాత్మజుండు మరల బ్రహ్మానాదమ్ము పఠియించుచుండ. నారదుండా అధ్యయన శుకమౌని వద్దకు వచ్చి మెచ్చి నీయిచ్చ వచ్చినది కోరుమన, యీలోకంబున పుట్టిన వానికి హితంబెయ్యది. దానిం జెప్పవేయన. అమ్మహాత్ముండు తొల్లి సంయములకు సనత్కుమారుండుపదేశించిన వాక్యములు సమహితంబగుట జెప్పెద విను మని యిట్లనె.

నారదుడు శుకున కుపదేశించిన తత్త్వ ప్రకారము

ఆ. జ్ఞాన బుద్ధియైన జనవరుం డజ్ఞాన
మహిమ రాగ బంధ మమత లెగయ
సత్య శాంత కలిత సత్వ విదుడు కాక
ముక్తి గాంచనౌనె ముందు యెందు?

తే. మనుజ జన్మంబు అన్నింట మహితమగుడు
యిందు గాకున్న మనుజుండు యెందు ముక్తి
బడయ నేరదు సత్యంబు పరహితార్థ
కామియై నట్టి పురుషార్థ కామనుండు

తే. పంచభూతాత్మకంబైన భవము నొంది
జీవ ఆత్మన జీవుండు జేరు పరము

రాగ అనురాగ భవబంధరాగ విముఖ
తత్త్వ విదుడైన జీవైక్య తత్త్వవేత్త

తే. సత్య ధర్మ మహింసాది సత్త్వ గుణుడు
నిగ్రహించును అజ్ఞాన నిర్గుణాత్మ
రాగ వైరాగ్య భావన రమ్యు డగుచు
ముక్తినొందును తెలియుమా ముందుముందు

తే. కామ క్రోధాదు లన్నియం కడకు ద్రోచి
శాంత చిత్తుడు గానున్న సత్య బుద్ధి
ఆత్మ పరమాత్మ యందున అలరజేయ
మోక్ష మరచేతి ఫలమౌను మోదమలరు

వ. అని పల్కి వెండియు జీవ జన్ముడు–

తే. దార పుత్రాది బంధుర కారణాల
కర్మ బంధుర వలయాన దుర్మలాత్మ
సార సంసార కలితుడై సంయనుండు
భోగభాగ్యాల పరవశ భోగియగుచు

వ. జన్మ జన్మ పరంపరా వలయాల జిక్కువడును. జ్ఞానవంతుడు నిస్సంగ నిర్మలాత్మన నిర్గుణ నిశ్చితార్థ పరత తామర యందలి నీటి ముత్యము వలె ప్రకాశించు.

క. అనవిని సంశయ ముడిగియు
ముని నారదు కరుణ బోధ ముక్తి ప్రదమౌ
అను నా నిశ్చయ బుద్ధిం
జనకుండా వ్యాసమౌని చరణము లంటిన్

వ. తన నిశ్చయ మెరింగించిన నుత్సహించుచు నా తండ్రి పంపున–

తే. వాసవాదుల కైనను బడయరాని
ముక్తి పథ గామియై జనె మౌని శుకుడు
కేశవ బ్రహ్మ కైలాస కీర్తి గిరికి
వెడల నడచెను సత్కీర్తి వెలుగ జగతి

వ. గరుత్మంతుని భంగి ఆకాశమార్గంబున నెగురుచుం బోవు వానింజూచుచు అమరు లాశ్చర్యమగ్ను లగుటయు, వానిపై పూల వాన గురియించుటయును ఆ సమయమ్మున–

తే. శుద్ధ జలకమ్ము లాడునా ముద్ద రాండ్రు
నగ్న వస్త్రలై యప్సరో నయను లంత
శుకుని జూడంగ నేతెంచి శుద్ధ సత్త్వ
నిర్గుణాత్మను నిశ్శంక నియత మతులు

వ. సత్యవతీ తనయుండు తనయుని వెనుక యోగ మార్గమ్మున నేగుదెంచ నా అప్సరసలు సిగ్గు నగ్గలమై అంబరములు ధరియించి రంత. వెలుగు దీపింప నయ్యారణేయుండు వాయు పథం బతిక్రమించి సర్వభూతాత్మకుండగుచు అంతర్హితుం డగుటయు. ఆత్మ వేదనా వేదమూర్తి, శుకుని ముక్తతయును, తనదు సక్తతయును దలంచి నిర్విణ్ణుడై యుండునంత, కైలాసనాథుం డేగుదెంచి–

క. నెవ్వగ నొందకు మనుచును
అవ్వరొ నీయట్టి యతికి అగునే వగవన్
నువ్వల ముని కోరుటెరుగు
పువ్విల్తు జయించు నట్టి పుత్రకు నిడగాన్

క. ఇచ్చితి మెచ్చియు నటులే
సచ్చరితా వేదవేద్య సద్భవ శుకునిన్
అచ్చెరు వొందకు మదిలో
నిచ్చల కైవల్య గతుడు నీ సుతుడగుటన్

వ. వాడును మత్ర్పభావమ్మునను భవత్తపో విశేషమ్మునను బ్రహ్మ తేజోమయుండై దేవతల కుం అందరాని అనన్య తేజోవిరాచితంబైన పరమపద ముం పాప్తించె. మోదంబందనగు. విషా దమ్ము వీడుమని–

తే. వసుధ ఆకాశ మగ్నియు వాయు గంగ
లుండునం దాక చిరకీర్తనంబ, శుకుని
తోడ నీదగు కీర్తియు దోచు దిశల
యెల్లవారలు కొనియాడ యెలమితోడ

వ. అని నిర్దేశించి, విశ్వేశ్వరుండు నిజేశ్ఛం జనుటయును, నారద మహర్షి వలన దెలియం గలవాడనైతినని. మరియును–

క. ఇది చదివిన వినినం మన
మది దివ్యత్వమును బొందు మహదైశ్వర్యం
బది తాగూరుచు వచ్చును
పదిలంబౌ జీవితేశ్ఛ బడయుదు రిలలోన్

వ. అని పలుక విని జనమేజయుండు వైశంపాయన మునికిట్లను. ఉత్తమసిద్ధిం గోరు వారేదైవతము నారాధించనగునని యడిగినప్పుడు వాని కిట్లనియెనిట్లు.

భీష్ముండు ధర్మరాజునకు నారద నారాయణ సంవాద మెరింగించుట

సీ. ముల్లోక పూజన మునిగణసేవిత
రాజీవ మౌని నారాయణుండు
భక్తజనుల తోడ, బదరికాశ్రమవాసి
పరమపావనమూర్తి భవ్యచరిత
భక్తి గొల్వను వచ్చె పదునాల్గు భువనాల
నవలీల ద్రిమ్మరు నారదుండు
అభ్యాగతుండౌచు ఆదరపూర్వక

ఆత్మ శోధన జేయు అవని జనులు

తే. సిద్ధి బొందుట కావ్యార్థ సేవ్యమాన
దివ్య కీర్తను దెల్పుమా తేట పడగ
అనగ నా మౌని నారాయణాత్మభవుడు
అభవు డన్నింట తానౌచు అలరు దానె

తే. ఔచునాయను సద్ధర్మ ఔత్సుకుండు
పరమ పావనమూర్తియా పాపహరుడు
ఆత్మగోచర సుస్సూక్ష్మ ఆత్మమయుడు
తానె తనుదానె సర్వాత్మ తన్మయుండు

తే. అజుడు రుద్రాది దివిజుల కాద్యుడౌచు
శ్రీకి నిలయుండు చిద్రూప శేషశయన
అంబుజోదర సబ్రహ్మ అంతరాత్మ
దివ్య మంగళ తేజస్వి దీన రక్ష

వ. అని పల్కిన యంతన అప్పద్మ భవభవుండు వెండియు ఆతనిం–

తే. ఈశ లోకేశ సర్వేశ యిద్ధ చరిత
మూర్తి గోచర సర్వాత్మ మూలరూప
సొంపుచూడగ నాకౌనె జూప నడుగ
ఆత్మ శోధన పరమాత్మ ఆత్మ మయుడ

వ. అని వేడుకొన్న, భక్త పరాధీనుండైన అమ్మనుభావుండు కరుణించి నారదునితో నిట్లను.

తే. కాంతి రూపుడ వైరమ్ము కన్నులలర
శ్వేత ద్వీపమ్ము నందున స్నిగ్ధ మునుల
తోడ జూడను రాగద తోయజాక్షు
మూలమెరగంగ నగు నీవు మోదమలర

వ. అనిన ఆ దివిజ ముని వియన్మార్గమ్మున జని కనకశైలంబుపై నియతాత్ముండై పెక్కు తపం బొనరించి దుగ్ధార్ణవంబున కుత్తర భాగ్య దిశగా శ్వేత ద్వీపమును జేరి యందు నిరాహారులు, యింద్రియ వృత్తి రహితులు,అస్వేద సుగంధ శ్వేతాంగులునై యున్న పురుషులం గాంచెనని విని ధర్మనందనుండు యివ్విశేషములు ముక్త లక్షణములుగా నున్నవి. ఇప్పురుషుల తెరంగెరింగింపవే యని అడుగుటయును, శంతన నందనుం డాతని కిట్లనియె.

క. వినియుంటిని మా తండ్రికి
మునిముఖ్యుడు దెల్పవింటి ముచ్చట గొల్పన్
విను ముపరిచర వసు నృపుడు
మును పాలించెం యిల, శమము దమము తానై

తే. నియమ నిష్ఠుండు సద్ధర్మ నియత బుద్ధి
భక్తి భావన విష్ణుండు పరము నొందు
ముక్తి కామన యిష్టుండు శక్తి మయుడు
భూసురాగ్రుల పోషించు పూజ నీయ్డు

వ. అమ్మహనీయుండు విష్ణు భక్తి భావ నియుక్తుండై సర్వ రాజ్య సంపదలు త్యజించి ఏక తంబ అడవులకుం జని దపంబు సలుప, యింద్రుండుమెచ్చి,ఆతనికడకు వచ్చినెచ్చెలువై యుండ నంగీకరించి, తన వద్దకు వచ్చుచు బోవుచుం నుండుటకై నొక దివ్యవిమానమును అతనికిబహూ కరించిన, నాతడు దానం ఉపరితల ఆకాశ మార్గమ్ముల చరియించు వాడుగావున ఉపరిచర వసు వనుపేర ప్రఖ్యాతి నొందుటయును, మరియు నొక్క విశేషమ్ముగలదు. కల్పాది యందు మరీచి, యత్రి, అంగిరసుడు, పులహుండు, పులస్త్యుండు, క్రతువు. వశిష్ఠుడు అనుదేవమునులు (సప్త ఋషులు)ను, చిత్ర శిఖండి నామధేయులును, స్వాయంభువుండను మనువుం, అనేక వర్షములు విష్ణుని గురించి తలంబొనర్చుటయును, ఆతడదృశ్య రూపంబున వారల కిట్లనియె.

తే. జగము వెలుగొంద మీకునై జనుల యందు
శాస్త్ర ధర్మాలు అన్నియు శ్రావ్య మగుడు

అంగిరసుకు బృహస్పతి అవతరించు
ఉపరిచర నృప మద్భక్తు డుర్వి బుట్టు

వ. వాడు మద్భక్తుడు. మీకు సంభావనీయుండు. ధర్మశాస్త్ర ద్రష్ఠ. బృహస్పతి విదిత మార్గమ్మున చరించునని అదృశ్య రూపంబున పల్కి చనిన వాడగుటయు.

తే. ఉపరిచరు డశ్వమేధమ్ము ఒనర జేయ
సప్తఋషి వాసవేంద్రాది సర్వ పాత్రలు
ఋత్వి కరణమ్ము లన్నియుం రూఢి సలుప
సంతసంబాయె జగమెల్ల సన్నుతింప

వ. ప్రజాపతి పుత్రులైన యేకత, ద్విత, త్రివతు లను ముని సత్తములు సదస్యులై వెలుగొందె నదియు, నందు అహింసకుండగుట అన్నరేంద్రుండు పశు బలి సమర్పణకు మారుగా విష్ణుమోద్దీప్తన విభవైక నారికేళ ఖండ సమర్పణము జేయ–

క. కరుణాంతరంగ వైభవ
చరితార్థత గొనియె విష్ణు సవనా హవిసుల్
అరమరికలు లేకేకత
ఒరులెరుగక నుండుటదియ ఓర్వనివాడై

వ. దివ్య ధిషణుండగు ధిషణుండు విష్ణుండు తన కగోచరుండై హవిర్భాగముల్గొని నేగుటకు కుపితుండై యుగ్గడించిన, యుపరిచరుండు విన మిత వాక్యంబుల వాని ననునయించె. సదస్యులు సంభ్రమమ్ము లేని యన్నాకేశుమంత్రితో నిట్లనిరి

ఏకత ద్విత త్రితతులు బృహస్పతికి విష్ణు మహిమలు దెల్పుట

తే. అలుక జెందనౌనె మనకు అమిత దయతొ
హవిసు భాగమ్ము తానుగా హరియు గొన్న
అతని దర్శింప మన బోటి కగునె వినుము
ఎంత భాగ్యమ్ము కాదొకో ఎరుగ నౌదె

వ. బ్రహ్మ మానస పుత్రులమైన మేము తొల్లి–

తే. హరిని నిజరూప గాంచనై అమిత భక్తి
వేల వేలేండ్లు తపసున వెడల నంత
కాంతి మంతుని శ్రీహరి కనుల గాంచ
నేత్ర పటలమ్ము జిట్లదో నిజము దెలియ

వ. అని ఆకసమ్మున అశరీరవాణి పల్కుటయును. మరియు వినుడని, అగుపడు నా హరి క్షీరాబ్ధి శ్వేత ద్వీప మందు సితాసిత వర్ణ దేహుల శ్వేదులింద్రియ నివృత్తు లధిక నియతాత్ములా హార రహిత హరిపరాత్పర సురభిరూప నరులు గలరు. వారికి–

తే. జూపు శ్రీహరి తేజమ్ము జూడనైన
వెడలు డచటికి వేడ్కతో విమల మతిని
అనిన వినునంత మందర మచటి వారి
తోడ ఆ హరి రూపమ్ము జూడ నేగ

తే. అందు గల యట్టి వారల నెందు గనము
కాంతి మయశోభ శోభిల్లు కర్మ నిరత
శాంతి దాంతులు సద్ధర్మ సత్య నియత
అమిత మానస జపములు ఆత్మ మయులు

వ. ఇంత యేకాంతిక జనుల కెంత భాగ్యమ్మొ నంచు దలచుచుండం

తే. భానుకోటి ప్రభాసము భవ్య దీప్త
తేజ మొక్కటి గగనాబ్ధి తేజరిల్ల
భవ్య దీప్తన తేజస్సు భక్తి మొక్కి
రెల్ల వారలు దీపింప యేకకంఠ

తే. హే పరంథామ పరమాత్మ పాపహరణ
పుండరీకాక్ష మాధవ పూజనీయ

పరమ పావన శ్రీధర పరమ పురుష
భక్త జనపాల గోవింద భవ్య రూప

వ. అనుచు ఆ తేజోద్దీప్తుని కీర్తించుచుండ మా కనులు ఆ దివ్య తేజస్సును జూడనలవి కానంత మిరుమిట్లుగొల్పి కనుల చీకట్లు క్రమ్మినట్లగుటయును, మనమ్మున–

క. హరి విష్ణుని గాంచి నటుల
నిరుపమ ఆనంద దీప్తి నిలయుం డనుచున్
సరిలే దెద్దియు జగముల
పరమాత్ముం డాత్మమయుడు భవభయ హరుడున్

క. అని నీవలుగం దగదని
వినిపించిన వారమగుట విద్వజ్జనుడా
జననుత పురుహూత గురుడు
తను దానన ఉపశమించె తత్త్వం గతుడై

వ. ఇట్లు ఏకత ద్వితత్రితతుల వలన హరిమహిమ లన్విత దీప్తి గనుచు
ప్రశాంత చిత్తుండై అయ్యాగమ్ము సప్రయోజనముగా చెల్లించి, విషుపద
ధ్యానుండై యుండ విష్ణుండు విహగ పతిం బుత్తెంచి ఉపరిచర నృపుని
బ్రహ్మలోక పరుం గావింప సంభావించిన ప్రమదమ్మున వెలింగె నతడు.

తే. అతుల భక్తిని నారదుం డచటి కేగి
భక్తి సంస్తుతి బాడుచు పరమ పురుషు
ఊర్ధ్వ బాహత నిర్నిద్రహార యుక్తి
విష్ణు ఓంకారు మెప్పించె వినయ శీలి

శ్వేత ద్వీపవాసియగు నారాయణుండు నారదున కుపదేశించిన తత్త్వము

వ. నారాయణుండాతని అనంత యేకాందిక భక్తికి మెచ్చి, అనన్య సామాన్య సదృశ మహనీయ నిజరూపదర్శనము ననుగ్రహించి యిట్లను.

క. వినయుడ అనహంకారుడ
జననుత సద్భక్తి వినుత జగదోద్ధరణన్
అనవరత దైవ కీర్తన
వినిపింతువు జనులకెల్ల వెన్నుని కథలన్

క. నను గన నెవ్వరికో విను
మనమున యేకాంత వాస మహనీయులకున్
అనుభవ యోగైకపరుల
కెనయగు నీ యట్టి మదీయ కీర్తన మునికిన్

వ. అని పల్కి మద్దర్శన భాగ్యుండవు. వరంబిచ్చెద కోరుకొమ్మన, దేవా! భవద్దర్శనము కంటె వేరు భాగ్యమ్ము లుండునా? అనిన యంత నారాయణుండాతనితో-

సీ. ఇంద్రియా తీతుడై యెల్ల భూతమ్ములు
తెగిన నంతను గదా దెగక యుండు
యేకాంత కాత్ముండై యెల్ల ప్రాణమ్ముల
సాక్షీ భూతుండౌచు సంచరించు
కర్మజీవుల పాలి కరుణార్ద్ర యుక్తుండు
ఆద్యంత రాహిత్య అవ్యయుండు
వేదాది శాస్త్రజ్ఞ విజ్ఞాన రూపుండు
అంటి అంటక యుండు ఆత్మమయుడు

తే. ఇతడె కారణుం డంచు తన్నెవ్వ డెరుగు
సర్వ జీవుల భరునౌచు సమత తోడ
నియత నిష్ఠన పరమాత్మ నేనె, దెలియ
రారు యిజ్జగ జీవన రహితు లవక

తే. ఎవడు సద్ధర్మ చారుడై యిలను మనునొ
ఎవడు తనయందు పరమాత్మ నెరుగ గలడొ
ఎవడు ముక్తి కి తానంచు యెరుగ నౌనొ
వాడె మద్భక్త జనుడౌచు బడయు ముక్తి

వ. ఇనుడాది నవగ్రహ తారకాదిక్రతులు మరుద్వసు రుద్రాది గణము లెల్లఅంబుజాసను లాదిగా అమరవేద చయములెల్ల మదాత్మక గాదె సకలజగద్రక్షక శక్తి యుక్తులగుచు అశేష గౌరవ సంభావ్య లగుచు నుంట–

క. ఏనివృతి నిశ్చలాత్మన
ఆనంద మయుండ నౌదు అభినుత గుణ స
మ్మానిత యేకాంత శయన
మానస భావనల దేలి మహిమము గొనటన్

వ. మరియు నొక్కొక కాలంబుల జన్మ కర్మంబుల జనుచు ఆది పరాహణుండనై హిరణ్యాక్షు ద్రుంచి ధరా రమణిందేల్చి, నారసింహుండనై హిరణ్య కశిపు బరిమార్చి భక్త ప్రహ్లాదు గాచినాడ. భృగువంశ జామదగ్నుండనై క్షతముగావించి నట్టి యక్షాత్ర తేజు, దశరధ రామునై ధూర్తధరాసు రాసుర రావణ కుంభ కర్ణాది రాక్షసు దునుమాడినాడ. దేవకి గర్భోదయుండ నాయాదవ యశో దా నందనందనుండనుపేర కృష్ణమాయగ దుర్వార కంసరాక్షసులను ద్రుంచి పురుహూతు నంద న నరుని సాయంబున భారతావని ధర్మ బద్ధతి జేయ క్రూర రాక్షస యంశ కౌరవాదులనెల్ల కడ తేర్చనెంచినధార్మికుండ. లోక రక్షణ నాదైన లోచనుండ. ఎక్క డధర్మమ్ము పెరుగునో అక్కడ నవత రింతు. పరమేష్ఠి నందనా! నీవు నాయందు సద్భక్తి కీర్తనుండ వగుట నీక గోచరంబై నా తెరం గింత పల్కినాడ. దివిజ తత్త్వజ్ఞ తీర్థాభిముఖుడ వగుదు లెమ్మన, నారదుం డమందానంద హృద యార విందుండగుచు అన్నారాయణాభిజ్ఞునకు పునఃపునః ప్రణామమ్ము లాచరించుచు ఆకాశ గమనుం డగుటయు–

తే. అభవు బాడుచు నభసీమ అంతరంగ
భావ భావన సత్యంబు భవ్య శక్తి
దేవ దేవుడా శ్రీహరి దీప్తి మహిమ
మూడు లోకాల విరియనై ముదము తోడ

వ. బ్రహ్మ సభ కేగి అబ్జజు పాదారవిందములకు నమస్కరించి విష్ణు మాయావిలాసములు తా కన్నది విన్నది విన్నవించ. విననయా సభాసదులైన దివ్యమునులు, ఆ భవుకీర్తించి తరియించెరాత్మయందు. అని విని జనమేజయునకా వైశంపాయనుండని భీష్ముండు తన మనుమడు ధర్మనందనునకు దెల్పి నీవును కృష్ణభక్తుండుగమ్మని పల్కుటయును. దేవతలు మాకునెద్ది కర్తవ్యంబని అడుగుటయును, అందరకును ఆ మహావిష్ణువే ఆనతీయ గలడని వారల అందరి తోడన పాలకడలికి బోయి తపం బొనరింప నద్దేవదేవుండు–

అదృశ్య రూప విష్ణుండు బ్రహ్మాది దేవతలకు పల్కిన దివ్య వాక్కులు

క. ఎరుగుదు నేనెల్ల విధము
యెరుగుదు యాగాలు జేయ ఎరుగరో నాకుం
సరిభాగము పంచియిడుట
ఎరుగుదు వేదార్ధ విధుల యెట్టెటు జనుటో

వ. అనవిని ఆకాశవాణి పల్కిన విధమ్మున బ్రహ్మానుమతమ్మున వైష్ణవమను మహాయాగమును నిర్వర్తించి సంప్రీతితో సరిభాగ మా విష్ణున కొంసంగుటయును అదృశ్యుడై వారలతో నిట్లను.

క. మీ జేసిన యాగ ఫలము
నేజెప్పెద జగతి జనులు నియతోద్ధతులై
తాజేసిన యాగ ఫలము
భోజ్యంబై దివిజ శక్తి పోతర మగుటన్

వ. మరీచి, యంగిరసు, దత్రి, పులహు, పులస్త్య, క్రతువు, వశిష్ఠులను వీరలు బ్రహ్మ మానస

పుత్రులు. మహనీయ వేదాచార్య సంపన్నులైన వేద విదులైన బ్రహ్మణ్యుల అధ్వర్యంబుల జరుగు బృందాంక భాగమ్ములొందువారని, సనత్, సనక, సనందన సనాతనులైన కపిలసనత్కుమారులు పరమేష్ఠి నిర్మితులు, సహజ విజ్ఞాన వేదాంతులు నివృత్తి పరులు సాంఖ్యయోగ సంవిదులుగా ప్రవర్తిల్లుచుందు రనియు, మోక్ష ధర్మంబులు గాపాడ, గురు జనక తుల్యురుగా వర్తిల్లువారని యు, దిక్పాల సదృశుండైన ఫాలాక్షుండు సర్వలోకారాధ నీయుండనియు, వరప్రదుండనియును, కృతాది ధర్మ యుగమ్ముల యాగాదుల యందు బలి సమర్పణ విది విహితంబనియుహింసంబు కాదనియు, సంశయములేదనియు నిర్దేశించుటయునువిని కైమోడ్పులుసమర్పించుచు విష్ణునకు–

క. దివిజులు మునులుం బ్రహ్మయు
సువిదిత సుజ్ఞాన భరిత సుస్థిర మతులై
భవి తవ్య మనో భావన
జవసత్వాలు నగుచు జనిరి జగదభి నుతులై

వ. తమ తమ నెలవులకుం జనుటయు, నిలకడగా నిలచియున్న అవ్విరించిచూచుచు వేద యజ్ఞ మయుండును, సర్వాంతర్యామియు, జగన్నాథుండును అయిన అన్నారాయణుండు యీ సృష్టి భారం బంతయు నీ యందుంచినాడ. సర్వ ధర్మ గురుండవు. సకలాభీష్ట సిద్ధిదాయకుడవు వరదుడవు నీవే. నీకేది ధర్మం బనిన అట్లు జేయనగు. నా భార మెల్ల నీయందుంచినాడ. సుఖం బుండు వాడ. నీ కెప్పుడేని కడింది భారమని తోచిన యప్పుడే నే నవతరించి పునీతము గావిం తునని యా విష్ణుండు అంతర్హితుండగుటయు వినిపించిన పరాశరాత్మజుశిష్యునకు నమస్కరించు చు జనమేజయుండు మనమ్మున నారాయణుని స్మరించుకొనుచునుండ వెండియు వైశంపాయన ముని అతనితో యిట్లను.

క. ఇది విన మేలగు జనులకు
విదితమగు విష్ణు పథము విభవము గూరున్
పదిమందిలొ కీర్తి కలుగు
యెదురేమియు లేక నుండు యీ భవమందున్

భగవన్నామ నిర్వచన ప్రకారము

వ. అన విని జనమేజయుడా విష్ణు నామ సంకీర్తన వినవల తుననిఅడుగుటయు, నా వైశం పాయను డాతనితో ముసు నరునకు కృష్ణుడు వివరించిన నిజనామకీర్తన యిదియని వివరించె నిట్లు.

తే. నరుడు నారాయణుండను పరమ దైవ
మునుల మిర్వుర దెలియుమా ముదిత యశుడ
అప్పుడప్పుడు అవతార మందగలము
అఖిల జగములు పొగడొంద అవసరాల

వ. గూఢమ్ములగు మదీయ నామమ్ములు దెలియ పరతు. వినుమని–

క. నారములం క్షీరాబ్ధిని
నారితో వసియింప నౌత నారాయణుడన్
పేరం బరగతి ఆదిన
భూరమణియ నన్ను గొల్వు భూజన యుతయై

క. వసుదేవకి సుతు నగుట
వసు రుద్రులు వాసుదేవ భవభయ అనరే
అసహాయుడ అభవ విభవ
పసజూపనె కంసు నణచి బాధలు యెలుపన్

క. పరమాత్మా! పురుషోత్తమ
పురుషార్థత ముక్తి నొసగు పురుషు కావే
నరులను సద్భక్తి కొలది
నరనాయక నారసింహ నాముడ కాదో

క. ముల్లోక విజయ విక్రము
లెల్లరు కొనియాడుటెరుగు యేకతజనముల్

అల్ల త్రివిక్రము డనరె
ఉల్లంబుప్పొంగ జగతి యుద్ధతి గొనగాన్

క. సిరి ధరియించిన వాడను
యెరుగవె శ్రీధరు డనంగ యేమది విజయా
సరి మధుసూదన దానవ
మురిపపు నామముల బిల్వ ముచ్చట కాదే

క. మాయా వైష్ణవ కుశలత
ఆయాయా యుగము లందు అద్భుత లీలల్
జేయం విజయో విష్ణుని
ఓయని కొనియాడ నెల్ల యుగముల జనముల్

క. గో పరి పాలక రక్షణ
గోపాలక జనుల తోడ గోవుల గాయన్
గోపిక గోవిందు డనరె
గోపకులా గృహిణులంత గోముగ నన్నున్

క. మాయగు లక్ష్మీ సతితో
మాయా మోహనుడ నగుదు మాయా జగతిన్
పాయక మాధవు డన నగ
నాయను లోకోత్తర విభవ నవనిధి పతినై

క. ఇనరశ్మి చంద్ర కాంతులు
అనిలాగ్నులు కేశ శోభ నలరారంగా
విన కేశవు నౌదు జగతి
జనవాక్యము చొప్పడంగ జగముల నెల్లన్

క. నాభిని పద్మము బుట్టుట
శోభిత నాభుండ పద్మ సుందరు డనగా
ఈ భువనము తన్ను బొగడ
ఆభూతుడ సర్వజగతి అభినందింపన్

క. పదునాలుగు భువనమ్ములు
ఒదిగియునా ఉదరము ఉండుట కతనన్
పదుగురు దామోదరు డని
విని తమ్ముగ బిల్వ నగదు విభుధుల వలనన్

క. అనిరుద్ధా అచ్యుతుడని
జను లందురు జనార్ధ నంచు జగతులు బాడన్
వినవొదున హరియన గురు
జన జీవుల పాపహరణ జననుతు నొచున్

వ. అనియు నింకను నరసఖ, అప్రమేయ ఆది మద్యాంత రాహిత్య ఆదిదేవహిరణ్య గర్భ శివకేశవ మొదలుగా సహస్రనాముండనని పల్కుటయనుపార్థుడు శివకేశవ ప్రణయకోప ప్రకారమెరుగ దెల్పుమని అడుగుటయును.

శివకేశవుల ప్రణయ కోప ప్రకారము

తే. కరుణ పరిపూర్ణ పురుషుండు కనులు మూస్కు
గంధ మాదన గిరియ నుగ్ర తపమందు
ఆత్మ సంస్తితుడై యుండ అమిత ఉగ్ర
కోప భరణుండు కాలాంత్క ఘన యశుండు

తే. దక్ష యజ్ఞంబు విధ్వంస ధర్మ చిత్త
భయత నొందిన వాడెపో బారదెంచి

రక్షణార్థము దాకంగ అక్షి జూడ్క
పరశు నామాఖ్య ఖడ్గమ్ము బరుప నంత

తే. తుముల మాయెను మామధ్య దుఃఖ పడగ
దివిజ దిక్పాల గణములు దిగులు పడగ
దిక్కు తోచక మునులతో దివిజ పతియు
మూడు లోకాల జను లెల్ల మొకరిల్లి

తే. ఈశ పరమేశ మీరిద్ద రిట్టి తెరగు
వింత దోచెడు మాకేది సుంత సుఖము
భువన కోటులు అల్లాడిపోవు గాదె
శివ కేశవ బేధన స్థితులు కారె

వ. విష్ణు రూపాయ శివే, శివరూపాయ విష్ణవే, అని గాదె వేదవిధ బుధ ప్రవచనము.

క. నారాయణ పరమేశ్వర
ధీరోద్ధతి గుద్దులాడ తీరునె మాకుం
తీరని ఎగ్గగు జగతికి
మీరలు శాంతింప వేడ్డ మెల్లర మొకటన్

క. మీరలు కాదే మా కా
ధారము జీవింప సుఖత ధర్మోద్ధరణుల్
వారని తగవిది తెలియరొ
ఈ రీతిని తగవులాడ యేమంద్రు జనుల్

వ. మమ్మెల్లర గావ మీరీ వారణము వీడ ప్రార్థింతు మని వేనోళ్ల బ్రస్తుతింప,నంత ఆ శివ కేశవులు బ్రహ్మాది ముజ్జగ జనుల ప్రార్థనముల నాలించి–

క. అర మరిక లేక మనముల
తరియింపను దివిజు లంత ధర్మోద్ధరణుల్

మరచిరి పోరది యెదలం

తరతమ బేధమ్ము వీడి తమలోతామై

వ. శివుడు శ్రీవత్సమును శూలమున ధరించుటయును విష్ణు సమ్మతినిశ్రీకంఠుడై పరమ శివుడు విల్లసిల్లుటయును దెలియందగు. జయముగూరుట నీకుంపార్థాయని నారాయ ణుండు తెల్పె నన విని జనమేజయుండు తదుపరి సల్లాపంబులు దెల్పుమన త్రిలోక సంచారియైన నారదుండు–

నరనారాయణ నారద సల్లాప ప్రకారము

క. అరుదేరియు నారదు డల

నరనారాయణుల గాంచి నమ్రత మ్రొక్కన్

దరిజేర్చుకు ఆతిధ్యత

మురిపమ్ముల దేర్చి యడుగ ముని వారలతోన్

క. తిరుగుచు ద్వీపాంతరునై

దరియన్నా శ్వేత ద్వీప దారిన బోవన్

వరదుం డచ్యుతు గాంచితి

సరియౌగా కాంతిశోభ సరి మీకగుటన్

వ. అక్కడి వారెల్లరును కాంతిమయ యింద్రియ వర్జిత చేతస్కులును యేకాంతిక శాంతి స్వరూపులును, అందు సూర్యచంద్ర ప్రభావాయు సంచారములు కాన రాలేదు.

క. వారా తేజోమూర్తిని

జేరం జని యుండు వారు జేజే పరులున్

తారా జ్యోతిర్మయమౌ

సారూప్యత దివ్యశోభ సంభవ జనముల్

వ. నన్నుం జేరి గడప వచ్చిన వారలు లేరగుట నవ్విభుండు కరుణించి వీడుకొలుప మీ కడకు వచ్చితి. కరుణామయుడా అని పల్కుటయును వారలతని కిట్లనిరి.

తే. ప్రీతి పాత్రుండ వౌదు సత్ప్రీతిపరత
దివ్యకీర్తను బొగడనా దేవు మహిమ
దేవదేవుని దర్శన దీప్తు వైతి
భక్తి భావన గొనియాడ రక్తి గొనగ

వ. అనిన యెంతయు సంతసిల్లి వారల సన్నిధి నా గంధమాదన పర్వతమున నారదు డెంతో కాలము తపం బొనరించి నిలచె. అచట నుండి బృందారకాది మునిముఖ్యులును ప్రమదగణ సంసేవితుండునుఅగు పరమశివుని దర్శింపనా హిమ వన్నంగంబున కేగెనని దెల్పవినిచి వెండి యు వైశంపాయనుండు–

క. తరియింతురు నారద ముని
నరనారాయణుల గాధ నాయని వినినం
జర భారముడిగి భక్తిని
నరజన్ములు శాంతి దనరి నభ సీమలలో

హయగ్రీవ మహాత్మ్యము

వ. ప్రళయ కాల సమయమ్మున సత్త్వ దృష్టి శ్రీమహావిష్ణుండు–

తే. యోగనిద్రందు మునిగుండ యెరుగ కుండ
మధు కైటభు లను దాన్వ మహిత బలులు
వేద విజ్ఞాన చయమెల్ల వీతపరుప
అవని పాతాళ మందున అణచి దాచ

వ. కమలోద్భవుండు విహ్వాలుండగుచు సృష్టి కార్యము ఒనగూర్ప యెట్టులనుచు అమ్మహా విష్ణుని ప్రార్థింప, ఆత్మచింతన పరతంత్రు డభవుడపుడు, మధుకైటభుల మడియింప కమల నాభుండు–

తే. మహిత మహనీయ హయ శిరో దేహతాత్మ
రూప ధారణుండయి బోయి రోష కలిత

దైత్య సంహార మొనరించి ధైర్యమూని

వేదచయముల తాదెచ్చి వేధ కిడగ

వ. విధాత నిర్విఘ్నమ్ముగ మరల సృష్టి కార్యము నొనగూర్చుటయును నానుండియు హయ గ్రీవుండు సత్త్వ సంపన్నుండని దెల్పవిని జనమేజయుండు ఏకాంతికత్వము అన్నిటికంటె యెక్కు డని యందురు గాదె అని అడుగుటయును అయ్యది సాంఖ్యయోగ సారమని మున్ను వింటి. గాండీవికి కృష్ణుండు దెల్పిన విధం బనుచు–

వైశంపాయన ముని జనమేజయునకు యేకాంతిక తత్త్వ ముపదేశించుట

క. అతి గోప్యము యేకాంతిక

తతి నిర్మల హృదయ ధర్మతత్త్వంబరయన్

మతి మంతులు నిష్ఠ పరులు

ధృతిమంతులు సాంతి దాంతి ధర్మార్థ విదుల్

వ. యెరుగం దగు నిద్దాని దయామయుండును కరుణా సముద్రుండును ఐన నారాయ ణుండు తొల్లి దక్షునకు నెఱింగించిన నాతడు తన దౌహిత్రుండాజగచ్చక్షు కు నా సవిత్రుడు మనువున కాతడు యిక్ష్వాకున కతని వలన సజ్జన బుధ నృపు లనేకులు దెలియ నైరి నారా యణునిచే విని నారదుడున్ ఇటుల నిది యెంద రెందరో మహనీయ శిష్యకోటుల యోగ్యత లనుబట్టి ప్రశస్తంబై యిజ్జగమ్ముల వెలుగొందె. దుష్కృతులకు ప్రాప్తించనట్టి ధర్మము. దీనికి మూల మహింస. ధర్మము, అహింస యీ రెండును శ్రీహరి ప్రీతి పాత్రములు. ఈ యేకాం తిక ధర్మ తత్త్వము అనేక విధములుగా ఆయా పురుషుల చిత్త వృత్తుల ననుసరించి ప్రాప్తంబ గుచునుండు. శాంతిధర్మ పరిరక్షకుల కీయే కాంతిక ధర్మము కరతలామలకమ్ము.

క. ఏకాంతుల నా శ్రీహరి

లోకజ్ఞత మెచ్చుచుండు లోకోద్ధరణన్

లోకజ్ఞులు ఆ హరిలో

ఏకత్వము పొందనవగ నెంతురు మదిలోన్

తే. సత్త్వ శాంతత నా హరి సత్త్వ మయుని
పొందనగుగాదె. దుష్కృతు లొందలేరు
తమస రాజస ప్రదకులు తమక వృత్తి
సాంఖ్య యోగులు దెల్పిన సత్యమరయ

వ. ఇది నాగురుండు పరాశరాత్మజుండు దెల్పిన వేదమయముఅనుచు నా కృష్ణ ద్వైపాయన బాదనారాయణు ధ్యానపరుండయి కొంతవడికి తేరి, వినుము. వేదమునకు మద్గురుండువ్యాసుండును, సాంఖ్యమునకు కపిలమునియు, యోగమునకు హిరణ్య గర్భుండును, పాశుపతమునకు శివుండును, పాంచరాత్రమునకు వైష్ణవుండును, ప్రవర్తకు లన విని వ్యాసునకు నారాయణత్వం బెట్లు వచ్చెనని అడుగుటయును–

వ్యాసునకు నారాయణత్వము కలిగిన ప్రకారము

తే. ఆదియందున విష్ణుండు అబ్జనాభ్డు
సృష్టిగావింప వేదజ్ఞు దృష్టి నిలిపి
వ్యాసు భావించి పీఠాన వ్యాస రమ్ము
వేదచయమది లోకాల వెల్లి విరియ

తే. జేయదగు దీపు చరితార్థ చెన్ను మీర
వ్యాస నారాయణుండన వసుధ యందు
ఆత్మ సంసిద్ధత విజ్ఞాన ఆత్మదృష్టి
ఒసగి యుంటిని అనివార్య మౌట నీకు

వ. అనిపల్కి అలఘు అపాంతరతముండనియెడు చిత్తభవున కానతిచ్చి, ఉత్తరోత్తర కాలాల లోకోత్తముండవయి పరాశరాత్మజువుగా పుట్టగలవని నీ వలన కలుగు కురుక్ష్మా రమణులు సోదర విద్వేషులై రణసేవనమున కులము చెరతురని నిర్దేశించి పల్కుటయును, నారాయణత్వ సిద్ధి తెరంగిదియగా దెల్పి వెండియు యిట్లను.

ఇంద్రునకు నారదుండు దెల్పిన భృగు నామక విప్రుని చరితము

క. నారద సంచారుం డల
దారింజని యింద్ర సభను దర్శన మీయన్
ఆరగ సత్కార మిడియు
మీరలు గన్నద్భుతములు మేదిని కొల్లల్

వ. ఆనంద దాయకమును ధర్మ సమ్మతమును రమణీయమును యైన దెద్ది యుందెల్పుమని అడుగుటయును, వానికా సంయమముని యిట్టులనియె.భాగీరధికి దక్షిణ దేశమ్మున మహాపద్మం బనుపురంబున భృగుండను శ్రేష్ఠుండు గలడు. ఆతడు–

తే. నియత ధర్ముండు విజ్ఞాని నీతి మంతు
అఖిల శాస్త్రార్థి సంవిదు డమల భక్తి
శాంత చిత్తుండు సత్కృపాసాదు శీలి
ఆదరభిమాన గుణనీయు డతిథి పరత

వ. ఇట్లుండ కొండొక సమయంబు నాడు–

తే. అతిథియై వచ్చె బ్రాహ్మణుం డతని యింటికి
అర్ఘ్య పాద్యాధి విధులవ్వి యైన పిదప
దైవదత్త ప్రసాదాల దేర్చి మిగుల
సావ సాధన గూర్చున్న సమయ మందు

తే. సరస సంభాషణా దివ్య సారమతివి
తీర్థ సందర్శనా భాగ్య దీప్త యశుడ
మిత్ర భావనా కథ లెల్ల మేలు వినియు
హితము బోధించు హరికధామృత హితుండ

తే. అనుచు వేడ, నా బ్రహ్మజ్ఞు డనియె భృగుతొ
ఆత్మమయ రూపు సన్నిధి నధివసింప

యేను నీవలె కొట్లా ద్దయామయుండ
నీతి నియతాత్మ వర్తన నియమ నగుచు

తే. భక్తి రక్తిని కొందరు ముక్తి గొనగ
సత్త్వ దాంతులకగు ముక్తి శాంతి మయత
బ్రహ్మ చర్యాన గార్హ స్త్యపరత గూడ
ముక్తి నొందరె యెందరో మున్ను ముందు

తే. తల్లి దండ్రుల సేవయే దైవ మనుచు
అన్య చింతన లేనట్టి అవని జనులు
యోగ నిష్క్రియా గురుభక్తి యోచనాల
పుణ్య కార్యాల ముక్తు వై ధన్యు లవరె

వ. ఇటు లనేక మార్గ లనేక ద్వారమ్ముల తమ కనువగు రీతుల ధర్మార్థ మోక్ష పదస్థితుల రగుట సత్యము. అడిగితివిగాన యుపదేశింతు. ఆకర్ణింపుమని–

తే. పద్మడను నాగు వసియించు పద్మసరసి
నయమిశారణ్య వనసీమ నయన శోభ
సమ్మతం బొంద బోధించు సమత గూర
ఆలసింపకు నే బోదు ననగ భృగువు

వ. మహాత్మా! పొద్దువాలుటకు కొన్ని ఘడియలే తడవున్నది కావున యీ దిన శేషమును రాత్రియు మా యింటనే ప్రీతిపూర్వక భాషణంబుల దేలింపుమన. అట్లనే గడపి. వేకువన వేచి నేగెడు బ్రాహ్మణుని సాగనంపి ఆతడు చెప్పిన చొప్పున.

భృగు నామక బ్రాహ్మణుండు పద్మ డను సర్పరాజుం గనవచ్చుట

తే. పద్మ సరమున యున్నయా పద్మనాగు
ధర్మ నార్థమ్ము యేగె తా ధరణి సురుడు

కష్ట సాధ్యమ్ము గానెంప్క నిష్ట నిలిపి
ఆత్మ వేదితా పరతంత్ర మరయ నెంచి

వ. యెంతయుం శ్రమకు నోర్చి నైమిశారణ్య వనమున గోమతీ తీరమున నున్న మహా పద్మ నాగు గృహమ్ము బ్రవేశించి, ఆ నాగ గృహిణి వలన అతిథి మర్యాదలొంది పద్మనాగుని దర్శింప వచ్చిన వాడనని పలుక, ఆపుణ్య నాగ యిట్టులనియె.

క. దిన నాధుని తేరు పనిగ
జన నాయెను నాదు భర్త జాగగు రావన్
విన దెల్పుడు యేమి పనిగ
జననుత నా శక్తి కొలది జరుపుదు సేవల్

క. అనుటయు నాతని జూచుటె
మనమున యోజించి వస్తి మాన్యుని జూడన్
తను రావచ్చిన దనుకను
వనమున వసియింప నౌదు పన్నగు బూషన్

క. కరుణామయి నీ కాంతుడు
అరుదేరిన తోడ చెప్టవా పద్మునితో
అరుదెంచి నాడ నేనని
పరహిత కార్యార్థి ననుచు పల్కం దగుదో

వ. అని గోమతి నదీ తీర వటమూలమ్మున జపనియతుండై కూర్చుండి మూ న్నాళ్లయినను ఆతిధ్యము దినక యున్నవాడని నాగపత్ని తనపతి పద్మనాగునితో వచ్చిన వానింజూచి పల్కుడను టయును, నాగపతి యించుక అలసి యున్న వాడగుటయును మహనీయుండగుటయు నించుక దర్పమెలర్ప యిట్లను నామెతో–

క. కార్యార్థని వచ్చె నతని
నార్యుండ నే నేగి జూడ నా విన పలుకన్

ఆర్యులు మెత్తురె వానికి
మర్యాదగున నచటికి మాకుగ నేగన్

వ. అని పలికిన మతిమంతియ నాగ సతి యించుక–

క. పతి మాటకు యెదురాడక
అతి వినయత అనునయ పరతన్
మతి మంతావిప్రోత్తము
డతి ఆప్తితొ నున్నవాని నట గన నవదే

క. కార్యార్థుడు పరమార్థత
ఆర్యుడు మూణ్ణాళ్ల నుండి అశనము లేకన్
ధైర్యోజ్వల జపతత్పరు
మర్యాదగ చూచుటదియ మంచిది అగుగాన్

క. పరమార్థత యెంచు నతని
పరికించ్క నిరాశ పరుప పాపము కాదో
పురుషార్థత అవదు దెలియ
చిర కీర్తియు చెడును కాదె చేరం జనుమీ

తే. మూడు దినముల నుండియు ముని వరుండు–
అన్న మన్నది యెరుగక అడవి యందు
నీదు రాకకు జూచెడు నియత బుద్ధి
చాతకము వాన గోరెడు చంద మరయ

వ. అనవిని యా భుజగ రాజు మనం బెరయ భార్యం జూచుచు–

క. నీయట్టి బుద్ధి యాలిని
తోయజ ముఖి బడసి యుంట తొలగదొ అఘముల్

నాయను సుకుమార పతికి

సాయంబుగ ధర్మబోధ సంభవ పరుపన్

వ. అనుచు నామె నక్కున జేర్చుకొని సంతసంబున–

పద్మనాగుండు భృగుడను విప్రుని జూడవచ్చుట

క. అడవిని కనుగొన విప్రుని

కడ కేగెను పద్మనాగ కరుణా కలితుం

డెడ నున్నాడో యనుచుం

వడివడి తన కొరకు జూచు పారుని జూచిన్

వ. ఆలింగనము గావించుకొని ఆనంద ముట్టిపడ నయ వినయ గాత్రుండగుచు భృగునామ విప్రవరుతో పద్మనాగ విభుం డిట్టులనియె.

క. నన్నుం కనుగొన వచ్చిన

నిన్నుం జూడంగ నవుత నిజమూహింపన్

వెన్నుని కన్గొన్నట్టుల

నున్నది నా మానసాన ఉత్సవ మగుడున్

వ. అననా నాగపతితో భృగుండు ధర్మారణ్యము నుండి నిన్నుంజూడ వచ్చినాడ. నీవింట లేకుండుటయు, అర్కకులాతీతంసుండాసూర్య భగవానుని పనిగా వెళ్లుటయు, నీరాకకై వాడిన చేనివాడు వాన కెదురు చూచునట్లు నియత తపో వృత్తి నున్నాడ, నా మనఃక్లేశమ్ము బాప తగుదు వీవన–

క. అనవిని విప్రోత్తముతో

విన దెల్పుమ నీదు కోర్కె విభవోజ్వలుడా

అనుటయు నా నాగ విభుడు

అనఘా యిది దెల్పు ముందు ఆవల కోర్కుల్

వ. అనుటయు, నయ్యురగపతి యేమది దెల్పుమనుటయు భృగువతని కిట్లను. రవి రథ

ముని నడుపు నప్పుడు నీ గనిన యట్టి ఆశ్చర్యకర విషయములేమైన వివరింపు మనుటయు నాతండావిప్రున కిట్లను.

క. అంతా అద్భుత మయమే
వింత గదా యేక చక్ర విలసన రధమున్
సుంతయు ఆగని పయనం
బెంతన ఆకాశ గమన మేమన వచ్చున్

ఆ. జగతి జీవతతులు జనియించి పెంపెక్కు
భూత కోటి యెల్ల పూతమౌచు
గాలి కదలు చుండ గాఢమౌ వేడిచే
నీరు ఆవిరగుట నినుని మహిమ

ఆ. అండ పిండ జీవి కాధార మెవ్వడు
యెండ వాన గురియు టెవని మహిమ
ప్రాణి కోటి కెవడు ప్రత్యక్ష దైవమ్ము
తపసి జనుల కెవడు తత్త్వ మయుడు

తే. నిత్య సత్యు డమల తేజ నియతు డినుడు
అగ్ని తేజము గురిపించు హరియతండు
అంది అందని ఆకాశమందు నిలచు
సర్వ సాక్షియు భూతాత్మ సాత్వికుండు

వ. అని వెండియు భృగువుతో నిట్లను.

ఉంఛ వృత్తి మహిమము

క. యీతడు యాచించు నదియు
చేతో మోదమ్ము గూర్చు చింతలు బాపిన్

జాతికి సత్యము ధర్మము

పోతరికము గూర్చు కర్మ పురుషార్థతయే

క. ఇను మధ్యాహ్నపు వేళను

తనుగా ఒక విప్రవరుడు ధగధగ మెరియన్

తను శోభల దీపించుచు

యిన కిరణములంటి దాహ మిమ్మని వేడెన్

వ. అట్టి యెడ నేజూచితి నిది నిజము వినుము ఆ–

క. తను శోభల ధగధగ నా

కను చీకటు లొందనాయె కరణం డెవడో

మనమున సందియ మగుటయు

అననేటికి యిద్దరొకటె అనగా తగదో

వ. ఐనను నా మనంబెరుగ ఆ విప్రుం డెవరని ఆ సూర్యభగవానుని అడుగుటయు నాతో నీతడు–

క. నీకడ కొచ్చిన యాతడు

యేకస్థులు అగుట దెలియ నేరవు అనుచున్

ఆకలి దప్పిక లెరుగని

సాకల్యుడు సర్వమయుడు సర్వేశ్వరుడే

వ. అని పలుక యిటు తిరిగి చూచుత, నా ప్రక్కనయున్న యాతడంతర్హితుం డగుటయు ఆ దేవదేవ సర్వేశ్వరుని మహిమ లనంతములు. ఆశ్చర్యంబులు అని వినుతించుకొనుచు, మనంబున ఆతనితో యేకస్థుడ నగుచు ఉంఛ వృత్తి మహనీయతను యెరింగిన వాడనగు టయు, నను యీ పుణ్యకథను జనకుడు నారదున కెరిగించుటయు, ఆతనివలన ముల్లోక విదితముగా యెల్ల రెరుంగుటయును, ఇహమున సకల సంపదలతో పాటు పరమున బ్రహ్మ పథము నొందగల్గుటయును.

అనునిది.

శ్రీశ్రీ వాణీ వరప్రసాదలబ్ధ సుకవిజనప్రియ సాధుజన విధేయ శ్రీశ్రీ కవిత్రయ స్ఫూర్తి ఆర్వేల నియోగి బ్రాహ్మణ మండపాక వంశోద్భవ వీర్రాజు పౌత్ర సూర్యప్రకాశం సత్యనారాయణాంబా తనయు ప్రణీతంబైన

–: శ్రీమదాంధ్ర మహాభారత శాంతి పర్వ షష్ఠాశ్వాసము :–



రచయిత : మండపాక చినజోగిరాజు

పుట్టిన స్థలము : వడ్డాది, విశాఖ జిల్లా, ఆంధ్రప్రదేశ్
పుట్టిన తేది : 01 – 10 – 1930
ఉద్యోగము : టీచర్
అభిరుచులు : గ్రంధ రచన, సత్సాంగత్యము, చిత్రలేఖనము, చదరంగము, సమస్యాపూరణ, ఆశువు
బిరుదులు : కవిరాజు, శ్రీ, మహాకవి

ఇతర రచనలు

సూర్యస్థుతి (నక్షత్రమాల)
వేంకటరమణా శతకము (శ్రీనివాస కళ్యాణము)
కళ్యాణ వెంకటేశ (గీత శతకము)
భువనవిజయము (పద్య నాటకము)
రామాయణము (కంద పద్య కావ్యము)
శ్రీ కృష్ణ లీలా తరంగిణి (మహాభాగవత పూర్వార్ధము–పద్య గ్రంధము)
ఉత్తర హరివంశము (మహాభాగవత ఉత్తరార్ధము–పద్య గ్రంధము)
భగవద్గీత (పద్య గ్రంధము)
కుమార సంభవము (పద్య కావ్యము)
రాఘవ పాండవీయము నకు (రామాయణార్ధము మరియు భారతార్ధము)
జీవబ్రహ్మైక సిద్ధి (తత్వ విచారణ)
రంగ రంగ (శ్రీ పాండు రంగ) శతకము
కాళీస్తవము (పద్యములు)
ఉపనిషద్సారము
కరోనా ప్రహసనము
ఆత్మ ప్రబోధము
దుర్గా స్థుతి
భద్రకాళీ వీరభద్ర పరిణయము
Still Alive (An Immortal)